ANDHRA PRADESH
India's Sunrise State

ఈనాడు

సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల సదస్సు 2018
24-26 ఫిబ్రవరి 2018
APIIC గ్రౌండ్, హార్బర్ పార్క్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్

కరీంనగర్ 5-2-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 176

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

భారత్ నుంచి వెళ్లిపోయిన కుబేరులు 7000 మంది

దిల్లీ: భారత్‌కు చెందిన అత్యంత సంపన్నులు (నికర ఆస్తుల విలువ మిలియన్ డాలర్లు లేదా అంతకన్నా ఎక్కువ ఉన్నవారు) ఏడువేల మంది గత ఏడాది దేశాన్ని వీడి వెళ్లిపోయారు. గత ఏడాదికి సంబంధించి ఈ సంఖ్యలో చైనాది అగ్ర స్థానం కాగా భారత్ రెండో స్థానంలో నిలిచింది. ఈ నివేదికను న్యూ వరల్డ్ వెల్త్ రూపొందించింది. 2016లో భారత్ నుంచి తరలి వెళ్లిపోయిన అత్యంత సంపన్నుల సంఖ్య 6వేలు. 2015లో ఈ సంఖ్య 4వేలు. 2017లో చైనా నుంచి తరలివెళ్లిపోయిన కుబేరుల సంఖ్య 10వేలు.

భారత్ నుంచి ఎక్కువగా అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌కు తరలి వెళ్లగా చైనావాసులు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాకు తరలివెళ్లారు. అయితే భారత్, చైనా నుంచి తరలి వెళ్లిపోయిన కుబేరుల కన్నా అక్కడ కొత్తగా అవతరిస్తున్న కుబేరులే ఎక్కువ మంది అని నివేదిక వెల్లడించింది.

ఫేస్‌బుక్‌లో 20 కోట్ల నకిలీ ఖాతాలు!

★ భారత్‌లోనూ ఈ సంఖ్య ఎక్కువే..

హైదరాబాద్: ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌లో గతేడాది ముగింపు నాటికి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 20 కోట్ల నకిలీ/అదనపు ఖాతాలున్నాయి. ఇలాంటి ఖాతాలను అధిక సంఖ్యలో కలిగి ఉన్న దేశాల్లో భారత్ కూడా ఒకటి. ఈ విషయాలను స్వయంగా ఫేస్‌బుక్ తమ తాజా వార్షిక నివేదికలో వెల్లడించింది. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే.. భారత్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్ వంటి వర్ధమాన దేశాల్లో నకిలీ ఖాతాల శాతం ఎక్కువగా ఉన్నట్లు తెలిపింది. 2017 డిసెంబరు 31 నాటికి ప్రపంచవ్యాప్తంగా మొత్తం 213 కోట్ల మంది నెలవారీ క్రియాశీల వినియోగదారులు(ఎంఏయూ) ఫేస్‌బుక్‌కు ఉన్నట్లు పేర్కొంది. 2016 చివరినాటితో పోలిస్తే ఈ సంఖ్య 14 శాతం అధికమని చెప్పింది. నెల రోజుల వ్యవధిలో కనీసం ఒక్కసారైనా తమ ఖాతాను వినియోగించేవారిని ఎంఏయూగా పరిగణిస్తారు. మరోవైపు, ప్రతిరోజూ ఫేస్‌బుక్ చూసే వారి(డీఏయూ) సంఖ్య 2016 చివరి నాటికి 123 కోట్లుగా ఉండేదని.. 2017 డిసెంబరు 31 నాటికి వారి సంఖ్య 140 కోట్లకు చేరుకుందని తెలిపింది. భారత్, ఇండోనేసియా, బ్రెజిల్‌లలో డీఏయూల సంఖ్య బాగా పెరిగినట్లు వెల్లడించింది.

ఒక్కరోజులో 980 విమానాల రాక

★ తన రికార్డును తానే అధిగమించిన ముంబయి విమానాశ్రయం

ముంబయి: ఒకే ఒక్క రన్‌వేను కలిగి ఉన్న అత్యంత రద్దీ అయిన విమానాశ్రయంగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన ముంబయి విమానాశ్రయం మరో అరుదైన రికార్డు సృష్టించింది. గత నెల 24న ఈ విమానాశ్రయంలో 980 విమానాలు ల్యాండ్ అయ్యాయి. దీంతో ఒక్కరోజులోనే 974 విమానాలను ల్యాండ్ చేయడంతో గతేడాది డిసెంబరు 6న తమ పేరిటే నమోదైన రికార్డును అధిగమించినట్లు విమానాశ్రయ అధికార ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

మేడారానికి 11 లక్షల ప్రయాణికులు

★ ఆర్టీసీ ఎండీ రమణరావు

ఈనాడు, హైదరాబాద్: మేడారం జాతరకు అత్యధిక ప్రయాణికులను సురక్షితంగా తీసుకెళ్లడంలో టీఎస్ఆర్టీసీ సిబ్బంది ఘనత ఎంతో ఉందని ఆ సంస్థ ఎండీ రమణరావు అన్నారు. మొత్తం 11 లక్షల మందిని జాతరకు తీసుకెళ్లారని ఆయన కితాబునిచ్చారు. జాతరకు తీసుకురావడం నుంచి తిరిగి వారిని ఇళ్లకు చేర్చడంలో ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు వహించిన సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. మేడారం జాతర ప్రాంతంలో ఏర్పాట్లను ఆదివారం పరిశీలించి అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులతో రమణరావు మాట్లాడారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రద్దు నాటి ఊపు లేదు

డిజిడల్ చెల్లింపులు!

డిజిటల్ చెల్లింపుల్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. ఎప్పటికప్పుడు లక్ష్యాలను నిర్దేశించుకుంటూ పోతోంది. రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. డిజిటల్ చెల్లింపులు పెంచాల్సిన ఆవశ్యకతను తాజా బడ్జెట్‌లోనూ నొక్కిచెప్పింది. ఇన్ని చర్యలు చేపడుతున్నా..ఇవి అనుకున్నంత ఊపందుకోలేదు. ఏడాదికాలంగా జరిగిన డిజిటల్ చెల్లింపులే దీనికి ఉదాహరణ. 2016 నవంబరు 8న పెద్దనోట్ల రద్దు తర్వాత దేశంలో తీవ్ర నగదు కొరత ఏర్పడి.. ఓ నాలుగైదు నెలల పాటు డిజిటల్ లావాదేవీలు బాగానే పెరిగాయి. కానీ కరెన్సీ కష్టాలు తీరుతున్న కొద్దీ జనం మళ్లీ నోట్ల చెల్లింపుల వైపు వెళ్లిపోయారు.




మొత్తమ్మీద ఏడాదిలో డిజిటల్ లావాదేవీలు పెరిగింది: 13%

డిజిటల్ లావాదేవీలు

నోట్ల రద్దుకు ముందు

2016 నవంబరులో: రూ.94 లక్షల కోట్లు



నోట్ల రద్దు తర్వాత..

2017

మార్చిలో: రూ.149 లక్షల కోట్లు

జులైలో: రూ.107 లక్షల కోట్లు

ఆగస్టులో: రూ.109 లక్షల కోట్లు

అక్టోబరులో: రూ.99.28 లక్షల కోట్లు

లావాదేవీల సంఖ్య

2016 డిసెంబరులో: 95.75 కోట్లు

2017 అక్టోబరులో: 86.39 కోట్లు



మొబైల్ వ్యాలెట్ల ద్వారా జరిగిన లావాదేవీలు

ఎప్పుడు	లావాదేవీల సంఖ్య	లావాదేవీల మొత్తం
2016 అక్టోబరులో	9.96 కోట్లు	రూ.3,385 కోట్లు
2017 మార్చిలో	26.17 కోట్లు	రూ.8353 కోట్లు
2017 ఆగస్టులో	22.54 కోట్లు	రూ.7262 కోట్లు

'డిజిటల్'తో ప్రయోజనాలు: వాడటం సులువు, సమయం ఆదా, చెల్లింపు సౌలభ్యం, నగదు తస్కరణ భయం ఉండదు, ఖర్చుపై నియంత్రణ, రాయితీలు పొందే అవకాశం.

డెబిట్/క్రెడిట్ కార్డుల చెల్లింపులూ అంతంతే..

దేశంలోని ప్రతి ఇంటికీ డెబిట్ లేదా క్రెడిట్ కార్డు ఉన్నప్పటికీ.. డిజిటల్ చెల్లింపులు మాత్రం అరకొరే. ఎక్కువమంది డెబిట్ కార్డును ఏటీఎం కోసమే వాడుతున్నారు.

డెబిట్ కార్డుల ద్వారా

2016 ఆగస్టులో

చెల్లింపులు రూ. 2,38,013 కోట్లు

లావాదేవీలు 88.72 కోట్లు

2017 ఆగస్టులో

చెల్లింపులు రూ.2,70,609 కోట్లు

లావాదేవీలు 98.18 కోట్లు



మొత్తం డెబిట్ కార్డులు 80 కోట్లు

క్రెడిట్ కార్డులు 30 కోట్లు

దేశవ్యాప్తంగా పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మిషన్లను రెట్టింపు (15 లక్షల నుంచి 30 లక్షలకు) చేసినప్పటికీ.. డిజిటల్ లావాదేవీల్లో తిరోగమనమే కనిపించింది. డిజిటల్ ప్లాట్‌ఫాంల వినియోగం క్రమంగా తగ్గుతూ వస్తోందనే అర్థమవుతోంది.

• భారత జాతీయ చెల్లింపుల కార్పొరేషన్(ఎన్‌పీసీఐ) గణాంకాల ప్రకారం

ఇతర రాష్ట్రాల పంట ధర కీలకం!

- రైతులకు 'మద్దతు'గా నిలుస్తున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం
- పంటను మార్కెట్‌లో ఎంతకైనా అమ్ముకోవచ్చు



మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన మక్కలు

ఈనాడు, హైదరాబాద్: పంటలకు మద్దతు ధర ఇచ్చేందుకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల ధరలనూ పరిగణనలోకి తీసుకునే విధానం దేశమంతా ఆకర్షిస్తోంది. ఈ పథకం అమలు ఆసక్తికరంగా ఉందని కేంద్రం పరిశీలిస్తోంది. తెలంగాణలో దీన్ని అమలుచేస్తే ఎలా ఉంటుందని పరిశీలించేందుకు మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారుల బృందాన్ని మంత్రి హరీశ్‌రావు పంపారు. ఈ బృందం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని, ఇండోర్, భోపాల్ వ్యవసాయ మార్కెట్లకెళ్లి పథకం అమలును పరిశీలించింది. సీఎం కేసీఆర్‌కు మార్కెటింగ్‌శాఖ నివేదిక రూపంలో అందజేసింది. ముఖ్యాంశాలు..

ఆరురకాల పంటలకు ప్రయోగాత్మకం: మధ్యప్రదేశ్‌లో ఆరురకాల ఆహార, నూనెగింజల పంటలకు మద్దతు ధర ఇచ్చేందుకు 'భవంతర్ భుగ్టన్ యోజన' పథకాన్ని గతేడాది అక్టోబరు 1నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. రూ.4 వేల కోట్లను పథకం అమలుకు ఈఏడాది కేటాయించింది. సోయాచిక్కుడు, మొక్కజొన్న, వేరుసెనగ, సెనగ, కంది, పెసర. ఈ ఆరుపంటలు సాగుచేస్తున్న రైతులు ముందుగా మార్కెట్లలో లేదా పంచాయతీ, వ్యవసాయ సహకార సంఘంలో పేరు, పంట విస్తీర్ణం వివరాలు నమోదు చేయించాలి. పంటను వ్యవసాయ మార్కెట్‌లో ఎవరికైనా అమ్ముకోవచ్చు. ధర, పంట వివరాలను వ్యాపారి రసీదులో నమోదు చేయాలి. రైతులకు రూ.10 వేలు నగదు వ్యాపారి చెల్లించాలి. మిగిలిన సొమ్మును అతని ఖాతాలో వెంటనే వేయాలి. ఈవివరాలను మార్కెట్ కమిటీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

సగటు కనీస ధర నిర్ణయం ఇలా..: ప్రతిరోజూ సాయంత్రం ఆరు పంటలకు రాష్ట్రమార్కెట్లలో ఎంత ధర పలికిందనే గణాంకాలు సేకరించి 'సగటు కనీస ధర'(బేస్ మోడల్ ప్రైస్)ను మధ్యప్రదేశ్ మార్కెటింగ్‌శాఖ నిర్ణయిస్తుంది. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకన్నా ఏఎస్పీ తక్కువగా ఉంటే.. ఎంత అంతరం ఉందో అంత మేర సొమ్మును రైతుల బ్యాంకు ఖాతాలో 15 రోజుల్లోగా ప్రభుత్వం జమచేస్తుంది. సోయాచిక్కుడు అమ్మకాలను తెలంగాణ బృందం పరిశీలించినరోజు మద్దతు ధర రూ.3050 కన్నా సగటు కనీస ధర రూ.470 తక్కువగా ఉన్నట్లు గుర్తించింది. ఈసొమ్మును రైతు ఖాతాలో వేస్తామని మధ్యప్రదేశ్ మార్కెటింగ్‌శాఖ ప్రకటించింది. మినుములకు రూ.2400, మొక్కజొన్నలకు రూ.235, పెసరకు రూ.1455, వేరుసెనగకు రూ.730 తక్కువగా ఉన్నట్లు తేల్చి ఇస్తామని తెలిపారు. నవంబరు వరకూ రైతులకు రూ.888 కోట్లు చెల్లించారు. బీబీవైకి చెల్లిస్తున్న సొమ్ములో 50% భరించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం కేంద్రాన్ని అడిగింది.

బీబీవై అమల్లో లోపాలు: ఈపథకంలో లోపాలున్నట్లు రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ తెలిపింది. రైతు మద్దతు ధరకన్నా తక్కువకు అమ్ముకుంటేనే ఈపథకం వర్తిస్తుంది. ఓరైతు మొక్కజొన్నలు నాణ్యమైనవి రైతు మార్కెట్‌లో అమ్మగా వ్యాపారి క్వింటాకు రూ.1400కు కొన్నారు. ఈ పంట మద్దతు ధర రూ.1425 కావడంతో సదరు రైతుకు మిగిలిన రూ.25 మాత్రమే చెల్లించింది. మరో రైతు అంతగా నాణ్యతలేనివి తేవడంతో క్వింటాకు రూ.1300 ధర వచ్చింది. అతనికి ప్రభుత్వం నుంచి రూ.125 వచ్చింది. బీబీవై తెలంగాణలో అమలు చేయదలిస్తే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సిఫార్సు చేసింది.

లాభం వచ్చింది..'తేజ'ం రాలింది!

- ఎద్దుల అమ్మకాన్ని జీర్ణించుకోలేక తల్లీకొడుకుల ఆత్మహత్యాయత్నం
- కుమారుడి మృతి, తల్లి పరిస్థితి విషమం

పేరుకలపూడి, న్యూస్‌టుడే: ఎద్దులను అమ్మవద్దని వారిస్తున్నా వినకుండా తండ్రి వాటిని అమ్మేయడంతో తల్లడిల్లిపోయాడు. ప్రేమతో కూడిన ఆ బాధ ఆ బాలుడిని ఈ లోకానికి దూరం చేసింది. బాలుడి అమ్మను మృత్యువుతో పోరాడేలా చేస్తోంది. పల్లెటూళ్లలో మూగజీవాలను తమ కుటుంబసభ్యుల్లా ఎంత ఇష్టంగా చూసుకుంటారనేదానికి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పేరుకలపూడిలో జరిగిన ఈ సంఘటన దర్పణం పడుతోంది. పేరుకలపూడిలో ఎద్దులు ఎక్కువ. ఒక్కపూట అన్నమైనా మానేస్తారు కానీ వాటిని చూడకుండా గ్రామస్థులు ఉండలేరు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన నలగొర్ల సాంబశివరావు తన ఇంట్లోని ఎడ్లను అమ్మేందుకు బేరం పెట్టారు. ఎడ్లతో ఎక్కువ మమకారంగా ఉండే పెద్ద కుమారుడు తేజ(12) వాటిని అమ్మవద్దని వారించాడు. లాభం వస్తున్నందున వాటిని అమ్మేసి మళ్లీ కొత్తవి కొందామని భావించిన సాంబశివరావు ఎడ్లను అమ్మేశాడు. దీంతో కుమారుడు వద్దన్నా అమ్మేశాడని సాంబశివరావు భార్య మాధవి కూడా కలత చెందింది. ఆదివారం సాయంత్రం శీతలపానీయంలో విషగుళికలు కలిపి తల్లీకుమారులు తాగేశారు. ఇది గమనించిన బంధువులు ఇద్దరినీ ఆటోలో తెనాలి తరలిస్తుండగా మార్గమధ్యంలో తేజ మృతిచెందాడు. మాధవి తెనాలిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగా మారింది.

ఒప్పంద కార్మికులకు రైల్వే రక్షణ కవచం

- పూర్తి వివరాలతో సమగ్ర సమాచార నిధి
- చట్టాలను పాటించని గుత్తేదారులపై వేటు
- అమల్లోకి కొత్త వ్యవస్థ

దిల్లీ: రైల్వేలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికుల వివరాలతో సమాచార నిధి (డేటాబేస్)ని తొలిసారిగా రూపొందించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. పరిశుభ్రత, కన్సల్టెన్సీ, శిక్షణ తదితర సేవల్ని అందిస్తున్న గుత్తేదారుల వద్ద పనిచేసే కార్మికుల హక్కుల పరంగా ఏమైనా ఉల్లంఘనలు జరుగుతున్నాయేమో పరిశీలించడం దీని ప్రధానోద్దేశం. వంతెనలు, భవనాల నిర్మాణం, పట్టాల మార్పిడి వంటి పనులు చేసే గుత్తేదారులకి; వివిధ సేవలు అందించేవారికి వేర్వేరుగా నియమ నిబంధనలు ఉండాలని రైల్వేబోర్డు చేసిన సిఫార్సుల్ని మంత్రిత్వశాఖ ఆమోదించింది. 'ఒప్పంద కార్మికుల డిజిటల్ యాజమాన్య వ్యవస్థ' పేరుతో కొత్త విధానం రూపొందింది. గుత్తేదారులంతా దీనిని అమలు చేయడం తప్పనిసరి.

మాతృత్వ సెలవులూ ఇవ్వాల్సిందే

కార్మికుల వ్యక్తిగత వివరాలు, పోలీసు నివేదిక, వైద్య బీమా, భవిష్యనిధి నమోదు, హాజరు పట్టీ, విధుల సమయాలు, వేతనాలు తదితర వివరాలన్నీ దీనిలో ఉంటాయి. వారు పనిచేసే స్థలం వివరాలు, వేలిముద్రలతో గుర్తింపు పత్రాలు జారీ అవుతాయి. రెండేళ్లలో మూడు సార్లు కార్మిక చట్టాలను ఉల్లంఘించే గుత్తేదారులు ఆ తర్వాత ఇక ఏ పనుల్లోనూ పాల్గొనకుండా అనర్హులవుతారు. వేతనాలు చెల్లించకపోవడం, సదుపాయాల లేమి, లైంగిక వేధింపులు, కార్మిక చట్టాల ఉల్లంఘన వంటివాటిపై ఎవరైనా... తమ పేరు చెప్పాల్సిన అవసరం లేకుండా ఫిర్యాదుల్ని ఫోను ద్వారా రికార్డు చేయడానికి సహాయవాణిని కూడా ఏర్పాటు చేయనున్నారు. సంఘటిత రంగం మాదిరిగానే మాతృత్వ సెలవుల్ని మంజూరు చేయడం వంటివి తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది.

ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థ కావాలి

- ట్రంప్‌నకు మద్దతుగా వందల మంది భారతీయుల ర్యాలీ

వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించిన ప్రతిభ ఆధారిత వలస వ్యవస్థకు మద్దతుగా భారత్‌కు చెందిన పలు వందల మంది శనివారం ర్యాలీ నిర్వహించారు. శ్వేత సౌధం వద్ద నిర్వహించిన ర్యాలీలో వీరితో పాటు వీరి జీవిత భాగస్వాములు, పిల్లలు కూడా పాల్గొన్నారు. ఇందుకోసం కాలిఫోర్నియా, టెక్సాస్, షికాగో, ఫ్లోరిడా, న్యూయార్క్, మసాచుసెట్స్ తదితర ప్రాంతాల నుంచి దేశ రాజధాని వాషింగ్టన్ డీసీకి తరలి వచ్చారు. వీరంతా వారి వారి రంగాల్లో అత్యంత నైపుణ్యం ఉన్న వారు. ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు. కొన్ని దశాబ్దాల నుంచి అమెరికాలో నివసిస్తున్నారు. వీరి గ్రీన్‌కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రీన్‌కార్డుల జారీలో దేశాల వారీ కోటా ఎత్తివేయాలని ర్యాలీలో అభ్యర్థించారు. 'గ్రీన్‌కార్డు బ్యాక్‌లాగ్ తగ్గించాలి', 'ప్రతిభ ఆధారిత వ్యవస్థ కావాలి', 'దేశాల వారీ కోటా ఆపేయాలి', 'చట్టబద్ధమైన డ్రీమర్లకు మద్దతు ఇవ్వాలి', 'ట్రంప్‌నకు మా మద్దతు' వంటి నినాదాలున్న ప్లకార్డులు, పోస్టర్లు చేతబూనారు. ట్రంప్ ప్రతిపాదించిన వలస వ్యవస్థకు మద్దతుగా శ్వేతసౌధం వద్ద నిర్వహించిన అరుదైన ర్యాలీల్లో ఇదొకటి. తంజావూర్‌లో పుట్టి, అమెరికాలో పెరిగిన అక్షిత అనే 13 ఏళ్ల విద్యార్థిని ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఏడాదిన్నర వయస్సు ఉన్నప్పుడు తండ్రి వెంట అమెరికా వచ్చానని, తాను పెరిగిందంతా ఇక్కడేనని, 21 ఏళ్ల వయస్సు వచ్చిన తర్వాత నువ్వు విదేశీయురాలివి, ఇక్కడ ఉండొద్దు అంటే ఎలా అని ప్రశ్నించింది. తాను భారత్‌లో పుట్టినా అక్కడెప్పుడూ పెరగలేదని, తన సంతోషం, తన విజయం అన్నీ ఇక్కడే అయినప్పుడు ఇక్కడి నుంచి వెళ్లిపోమనడం అన్యాయం కాదా అని ప్రశ్నించింది. తాను చట్టబద్ధమైన హెచ్4-డ్రీమర్‌నని స్పష్టం చేసింది. ప్రస్తుత విధానం ప్రకారం తన తల్లిదండ్రులకు మరికొన్ని దశాబ్దాల వరకు గ్రీన్ కార్డు రాదంది. రిపబ్లికన్ హిందూ కొలియేషన్ లెక్కల ప్రకారం భారత్ నుంచి చట్టబద్ధంగా వలసవచ్చిన వారి పిల్లలు-అక్షిత లాంటి వారు 2లక్షల మంది ఉన్నారు. వారెప్పుడూ చట్టాన్ని అతిక్రమించలేదని, కానీ 21 ఏళ్లు వచ్చేసరికి స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుందని ఆ సంస్థ పేర్కొంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ ఏడాదికి నాలుగు శాతం చొప్పున వృద్ధి చెందాలంటే ప్రతి ఏటా అదనంగా 4లక్షల మంది అత్యంత నైపుణ్యవంతులైన సిబ్బంది కావాలని ర్యాలీ నిర్వాహకుల్లో ఒకరైన అనిల్ శర్మ చెప్పారు.



శ్వేత సౌధం ఎదుట ర్యాలీ చేపడుతున్న భారత సంతతి వృత్తి నిపుణులు

గోమూత్రంతో మరిన్ని ఔషధాల తయారీకి ప్రోత్సాహం!

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

లఖ్‌నవూ: ఔషధాల్లో గోమూత్ర వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా దృష్టి సారించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. కాలేయ వ్యాధులు, కీళ్లవాతం, రోగనిరోధకశక్తి లోపం వంటి అనారోగ్యాలకు చక్కటి స్వస్థత చేకూర్చే ఎనిమిది రకాల మందులను గోమూత్రంతో ఆయుర్వేద విభాగం తయారు చేసింది. ఆయుర్వేద విభాగం సంచాలకులు డాక్టర్.ఆర్.ఆర్. చౌధరి ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించారు. తమ విభాగానికి లఖ్‌నవూ, పిలిభిత్‌లలో రెండు ఔషధశాలలున్నట్లు తెలిపారు. వాటితో పాటు కొన్ని ఇతర ప్రయివేటు సంస్థలు కూడా గోమూత్రం, పాలు, నెయ్యిని వినియోగించి రకరకాల మందులను తయారు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. బందా, ఝాన్సీ, ముజఫర్‌నగర్, అలహాబాద్, వారణాశి, బరేలీ, లఖ్‌నవూ, పిలిభిత్‌లలో ఆయుర్వేద వైద్యకశాలలున్నాయనీ.. వీటిల్లో ఆయుర్వేదవైద్యంలో డిగ్రీకోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఆదివారం ముంబయిలో కళాకారుడు వాలీ షిండే లోహపు బంతులతో తీర్చిదిద్దిన ట్రక్కు నమూనా. ముంబయిలో వలస కార్మికుల పరిస్థితులను తెలియజేసేందుకు రూపొందించాడు

ముంబయిలో బాలికపై అత్యాచారం

ముంబయి: మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన తొమ్మిది మందిలో ఆరుగురు యువకుల్ని ముంబయి పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడాది క్రితం వీరిలో ఒకడు ముంబయి శివార్లలోని విలే పార్లేలో తొలుత బాలికపై అత్యాచారం చేశాడు. పైగా కొన్ని ఫోటోలు, వీడియోలు తీసుకున్నాడు. వాటిని బయటపెడతామని బెదిరించి ఇతర 8 మందీ వేర్వేరు సందర్భాల్లో గత ఏడాది కాలంలో ఆమెపై అత్యాచారం చేశారని పోలీసులు తెలిపారు. శనివారం ఎట్టకేలకు బాలిక తన పరిస్థితిని తల్లికి చెప్పడంతో ఆమె తమకు ఫిర్యాదు చేసిందని వివరించారు. వెంటనే స్పందించి ఆరుగురిని అరెస్టు చేసి, మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. వీడియో దృశ్యాలను స్వాధీనం చేసుకోవాల్సి ఉందన్నారు.

వివక్ష లేని సమాజమే లక్ష్యం

- స్వేరోస్ జ్ఞాన మహాసభలో వక్తలు

ఈనాడు డిజిటల్, మహబూబ్‌నగర్: నిరక్షరాస్యత, వివక్ష లేని సమాజ నిర్మాణానికి అందరూ నడుం బిగించాలని రామన్ మెగసెసె అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్ పిలుపునిచ్చారు. తెలంగాణ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి, స్వేరోస్ వ్యవస్థాపకుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలోని అలంపూర్ చౌరస్తాలో జ్ఞాన మహాసభ నిర్వహించారు. విల్సన్ మాట్లాడుతూ సమాజంలో ఇంకా కొన్ని కులాలు అణిచివేతకు గురవుతున్నాయన్నారు. జ్ఞానం విశ్వాంతరాళాలకు వెళ్లే రోజులు వచ్చినా పేదల స్థితిగతులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్షరాస్యతను పెంచి అట్టడుగు వర్గాల ప్రజల్లోని ప్రతిభను వెలికితీసే దిశగా స్వేరోస్ ద్వారా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. స్వేరోస్ ఆధ్వర్యంలో గురుకులాల విద్యార్థులు అసాధారణ ప్రతిభ చాటుతున్నారని, దీన్ని ఎవరూ అణచివేయలేరన్నారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు మాట్లాడుతూ చలనం, అభివృద్ధి, జ్ఞానం అనే లక్ష్యంతో స్వేరోస్ ముందుకు సాగటం అభినందనీయమన్నారు. దళితులను పైకి రావొద్దని ధనికుడు చూస్తాడని, వారి కబంధహస్తాల నుంచి బయటపడాలని కోరారు. మాజీ డీజీపీ ప్రసాదరావు మాట్లాడుతూ స్వేరోస్ నెట్‌వర్క్ అన్ని పల్లెల్లో విస్తరించి నిరక్షరాస్యతనే అజ్ఞానాన్ని తొలగించాలన్నారు. అందరితో సమానంగా అట్టడుగు వర్గాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీసీ భరత్‌భూషణ్, పైడిపెల్లి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.



జ్ఞానయోగ, గురుకులాల విప్లవం పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, విల్సన్, ప్రసాదరావు, కాకి మాధవరావు

ఆప్ ఎమ్మెల్యేల వ్యాజ్యాన్ని కొట్టివేయాలని కోరిన ఈసీ

దిల్లీ: తమపై అనర్హత వేటు వేయడాన్ని సవాలు చేస్తూ ఆప్ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేయాలని ఎన్నికల కమిషన్ (ఈసీ) దిల్లీ హైకోర్టును కోరింది. లాభదాయక పదవుల్లో ఉన్నందువల్ల తమను అనర్హులుగా ప్రకటించాలంటూ ఎన్నికల కమిషన్ చేసిన సిఫార్సు చెల్లదంటూ ఎమ్మెల్యేలు కోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై రాష్ట్రపతి నిర్ణయం తీసుకున్నందున, ఇక తమ సిఫార్సులు అంటూ ఏమీ లేవని, అందువల్ల పిటిషన్‌కు విచారణార్హత లేదని ఎన్నికల కమిషన్ వాదించింది. ఎమ్మెల్యేలు రాష్ట్రపతి ఉత్తర్వులను సవాలు చేయడం లేదని, కేవలం తమ సిఫార్సులనే ప్రశ్నిస్తున్నారని తెలిపింది.

ఎలక్ట్రానిక్ ఆధారాలకు ధ్రువీకరణ తప్పనిసరి కాదు

సుప్రీం కోర్టు స్పష్టీకరణ

దిల్లీ: న్యాయస్థానాల్లో ఎలక్ట్రానిక్ ఆధారాలను పరిగణనలోకి తీసుకోవడానికి ధ్రువీకరణ పత్రం తప్పనిసరి కాదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఈ మేరకు భారత సాక్ష్యాధారాల చట్టంలోని సెక్షన్ 65బిపై స్పష్టత ఇచ్చింది. కోర్టు ఇచ్చిన తాజా ఆదేశాల ప్రభావం.. ఫోన్‌కాల్ వివరాల రికార్డులు, సీసీటీవీ దృశ్యాలు, మొబైల్ వీడియో రికార్డింగ్‌లు, సీడీలు వంటివాటిపై ఆధారపడే క్రిమినల్ విచారణలపై ప్రభావం పడనుంది. ఎలక్ట్రానిక్ రికార్డులను కోర్టు విచారణ సమయంలో ఆధారాలుగా స్వీకరించాలంటే.. దాన్ని సంబంధిత అధికారి ధ్రువీకరించాల్సి ఉంటుందని సెక్షన్ 65(బి) చెబుతోంది. తాజాగా దీనికి భాష్యం చెబుతూ.. ఎలక్ట్రానిక్ ఆధారాలను సమర్పించే వ్యక్తి ఇలాంటి ధ్రువీకరణ పత్రాన్ని కూడా తీసుకురాగలిగే పరిస్థితిలో ఉన్నప్పుడు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుందని జస్టిస్ ఎ.కె.గోయెల్, జస్టిస్ యు.యు.లలిత్‌తో కూడిన ధర్మాసనం స్పష్టంచేసింది. ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురాలేని వ్యక్తికి దీన్ని వర్తింపచేయరాదని పేర్కొంది. అలా చేసే అధీకృత సాక్ష్యం కలిగిన వ్యక్తికి న్యాయాన్ని నిరాకరించినట్లవుతుందని తెలిపింది. ఈ అంశంలో కోర్టు సహాయకులుగా వ్యవహరించిన నలుగురు సీనియర్ న్యాయవాదుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ధర్మాసనం ఈ మేరకు స్పష్టత ఇచ్చింది. న్యాయ ప్రయోజనాల పరిరక్షణ దృష్ట్యా సమంజసమని భావించినప్పుడు ధ్రువీకరణ పత్రాల ఆవశ్యకత నిబంధనను కోర్టు సడలించవచ్చని పేర్కొంది.



ఎల్ఈడీ దీపాల కాంతుల్లో పెరుగుతున్నవి సంకరజాతి కూరగాయల మొక్కలు కావు.. దేశవాళీ రకానికి చెందిన పూల మొక్కలు.. రైతులకు నారు రూపంలో విక్రయించేందుకు ఇలా ప్రత్యేక పరిస్థితుల్లో వీటిని అభివృద్ధి చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం రషీద్‌గూడ గ్రామపరిధిలోని ఎక్కువమంది అన్నదాతలు ఈ తరహా సేద్యంలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం బంతి, చామంతి నారులను పెంచి విక్రయిస్తూ లాభాలు గడిస్తున్నారు. ఉదయం, సాయంత్ర వేళల్లో 2 గంటల చొప్పున విద్యుత్ దీపాల వెలుగుల్లో ఈ మొక్కలను పెంచుతుండటంతో.. 90 రోజుల వరకు మొగ్గ తొడగకుండా లేతగా ఉంటాయని స్థానిక రైతులు పేర్కొంటున్నారు. తోటల్లో నాటిన అనంతరం 45 రోజుల్లోనే సంబంధిత యజమానులకు అధిక పూల దిగుబడి లభిస్తుందన్నారు. వీటిని తీసుకెళ్లేందుకు పరిసర జిల్లాలు సహా కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో కర్షకులు వస్తున్నారని వివరించారు. – ఈనాడు, రంగారెడ్డి జిల్లా

ప్రపంచంలోనే బుల్లి రాకెట్ ప్రయోగించిన జపాన్

టోక్యో: ప్రపంచంలోనే అత్యంత బుల్లి రాకెట్‌ను జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ (జాక్సా) విజయవంతంగా ప్రయోగించింది. సూక్ష్మ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టే సామర్థ్యం దీనికి ఉంది. ఒక విఫల ప్రయత్నం, పలుమార్లు వాయిదాల తర్వాత ఈ ప్రయోగం జరిగింది. చౌకైన ఈ రాకెట్ పొడవు 10 మీటర్లు కాగా.. వ్యాసం 53 సెంటీమీటర్లు. కగోషిమా ప్రిఫెక్చర్‌లోని ఉచినోరా అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం జరిగింది. టోక్యో విశ్వవిద్యాలయం రూపొందించిన 3 కిలోల ఉపగ్రహాన్ని ఇది కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. భూ ఉపరితలాన్ని ఫొటో తీయడానికి ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ప్రైవేటు రంగం నుంచి గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో చౌకలో సూక్ష్మ ఉపగ్రహాలను ప్రయోగించే తన సామర్థ్యాన్ని చాటడానికి జపాన్ ఈ ప్రయోగం చేపట్టింది.



ఈనాడు



కరీంనగర్ 5-2-2018 సోమవారం సిటీ సంపుటి 44 సంచిక 176
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 5-00. పేజీలు 16+16 www.eenadu.net
Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఆరోగ్య రక్ష

రోగ నిర్ధారణ పరీక్షలు ఉచితం

- 53 రకాల రక్తపరీక్షలూ, ఎక్స్‌రేలు
- అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్ వంటి ఖరీదైనవి కూడా..
- 50 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రయోగాత్మక పరిశీలన
- మార్చిలో హైదరాబాద్ మహానగరమంతా ప్రారంభం
- దశల వారీగా పాత జిల్లా కేంద్రాల్లో అమలు
- ఆన్‌లైన్‌లో ఫలితాలు పొందే వెసులుబాటు



ఈనాడు - హైదరాబాద్

సర్కారు వైద్యంలో చికిత్స పొందినా.. నిర్ధారణ పరీక్షలను ప్రైవేటు కేంద్రాల్లో చేయించాల్సి రావడంతో నిరుపేద రోగిపై పెనుభారం పడుతోంది. ఇక ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే అడ్డగోలు పరీక్షలు, ఇష్టానుసారం ధరలతో రోగి ఆర్థికంగా కోలుకోలేని పరిస్థితి. తెలంగాణలో తలసరి అదనపు జేబు ఖర్చు రూ.2,834 అని ఇటీవల విడుదల చేసిన జాతీయ ఆరోగ్య వ్యయ నివేదిక కూడా స్పష్టం చేసింది. నిరుపేదలకు వైద్యసేవల్లో అదనపు ఆర్థిక భారాన్ని తప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ నిర్ధారణ పరీక్షల పథకం (టి-డయాగ్నోస్టిక్స్)' పేరిట కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ముందుగా హైదరాబాద్ మహానగర పరిధిలో ప్రారంభించనున్న ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షిస్తోంది. 15 రోజులుగా జీహెచ్ఎంసీ పరిధిలోని 50 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తనమూనాల సేకరణ, ప్రయోగశాలలో పరీక్షలు, ఆన్‌లైన్‌లో ఫలితాల వెల్లడి ప్రక్రియ విజయవంతంగా నడుస్తోంది. మరో మూడు, నాలుగు వారాలు నిశితంగా గమనించి, లోటుపాట్లను చక్కదిద్ది వచ్చే నెలలో ఈ పథకాన్ని హైదరాబాద్ మహానగరమంతా విస్తరించేలా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇక్కడ విజయవంతమైన తర్వాత దశలవారీగా రాష్ట్రంలోని (మిగతా 2లో)

(మిగతా 2లో)

అధునాతన ప్రయోగశాల

హైదరాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) ఆవరణలో ప్రస్తుతమున్న ప్రయోగశాలకు అదనంగా సుమారు రూ. 4 కోట్లతో మరో అధునాతన నిర్ధారణ పరీక్షల కేంద్రాన్ని నెలకొల్పారు. హైదరాబాద్ మహానగర పరిధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులన్నీ దీని పరిధిలోకి వస్తాయి. రోజుకు కనీసం 10 వేల నమూనాలను పరీక్షించడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం 50 పీహెచ్‌సీల నుంచి రోజుకు 200-300 వరకూ నమూనాలను సేకరించి, పరీక్షించి, ఆన్‌లైన్‌లో ఫలితాలు వెల్లడిస్తున్నారు. ఇందులో పనిచేయడానికి మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ వైద్యనిపుణులను ఒప్పంద ప్రాతిపదికన నియమించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నియమితులైన ల్యాబ్ టెక్నీషియన్లలో కొందరిని ఈ ప్రయోగశాలలో వినియోగించుకుంటున్నారు.

ముఖ్యమైన జబ్బులన్నింటికీ..

- ఈ పథకం కింద ముఖ్యమైన జబ్బులన్నింటికీ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు.
- సుమారు 53 రకాల రక్తపరీక్షలనూ చేస్తున్నారు.
- సాధారణ రక్త, మల, మూత్ర పరీక్షలతో పాటు టైఫాయిడ్, డెంగీ, మలేరియా జ్వరాల నిర్ధారణకు, కాలేయం, మూత్రపిండాలు, థైరాయిడ్ పనితీరును తెలుసుకోవడానికి, రక్తంలో కొలెస్ట్రాల్, రక్తంలో మూణ్నెళ్ల సగటు చక్కెర స్థాయి.. తదితర ఖరీదైన పరీక్షలనూ ఉచితంగా అందిస్తున్నారు.
- జీహెచ్ఎంసీ పరిధిలోని 13 పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరికరాలను ఏర్పాటు చేశారు.
- హైదరాబాద్‌లోని నాలుగు ప్రాంతీయ ఆసుపత్రుల్లో సీటీ స్కాన్ పరికరాలనూ, జిల్లా ఆసుపత్రిలో ఎంఆర్ఐ పరికరాన్ని అందుబాటులోకి తేనున్నారు.

కొలువుల కూత



నిరుద్యోగులకు ఓ చక్కని అవకాశం. రైల్వేశాఖలో 26 వేల ఉద్యోగాల భర్తీకి ఆర్ఆర్‌బీ దరఖాస్తులను ఆహ్వానించింది. అసిస్టెంట్ లోకోపైలట్, టెక్నీషియన్ కొలువులు వీటిలో ఉన్నాయి. ఆర్ఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌లో మార్చిలోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

- పూర్తి వివరాలు 'చదువు' పేజీలో

ఆవులకు ఆధార్



మనుషులకే కాదు... ఆవులకూ ఇక ఆధార్ సంఖ్య ఉంటుంది. దేశంలోని 4 కోట్ల పాలిచ్చే ఆవులకు ఆధార్ జారీ చేస్తారు. ఇందుకోసం తొలివిడతగా కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించింది. ఆవుల వయసు, జాతి, ఎత్తు వివరాలతో మార్పు చేయడానికి వీల్లేని ట్యాగ్ తగిలిస్తారు.

2లో


శునకానికి నిరుద్యోగ భృతి



శునకానికి నిరుద్యోగమేమిటి? భృతి ఎందుకు? అని ఆశ్చర్యపోకండి. అమెరికాలో అధికారులు నిజంగానే ఓ జాగిలానికి భారత కరెన్సీలో రూ. 23 వేల నిరుద్యోగ భృతి కేటాయించారు. 20 వారాలపాటు చెల్లిస్తామని లేఖ రాశారు. ఆనక అసలు విషయం తెలిసి నాలుక్కరుచుకున్నారు

2లో

చేపలకు నాణ్యత పరీక్ష



చేపల అమ్మకాలలో ఇకపై మోసాలకు పాల్పడలేరు. రసాయనాలు కలిపి వినియోగదారుల కళ్లుగప్పనూలేరు. ఎందుకంటే అలాంటి మోసాలను కనిపెట్టే కిటుకును శాస్త్రవేత్తలు కనిపెట్టారు. దీనిద్వారా మత్స్యశాఖ అధికారులు మార్కెట్లలో చేపలను పరీక్షిస్తారు.

2లో



రెవెన్యూ, పంచాయతీరాజ్, పురపాలక, వైద్య, ఆరోగ్య శాఖలపై ప్రగతి భవన్‌లో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. హాజరైన మంత్రులు జగదీశ్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, హరీశ్‌రావు, కేటీఆర్, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఇతర ఉన్నతాధికారులు

బడ్జెట్ సమావేశాల్లోనే పంచాయతీ బిల్లు

- కొత్త చట్టం రూపకల్పన
- సత్వరమే పాస్‌పుస్తకాల ముద్రణ
- హైదరాబాద్‌లో అటవీ ప్రాంత అభివృద్ధి
- మూసీ రివర్ ఫ్రంట్ వద్ద నడకదారి
- మూడు నెలల్లో ఉచిత నేత్ర వైద్యశిబిరాలు
- సమీక్షలో సీఎం కేసీఆర్ ఆదేశాలు

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలో మార్చి నెలలో జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో పంచాయతీరాజ్ చట్టంపై బిల్లు పెట్టాలని నిర్ణయించామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. దీనికి అవసరమైన సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే బడ్జెట్‌లో పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు నిధులు కేటాయించాలని సూచించారు. సేవ్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా నగరం, చుట్టుపక్కల అడవుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని నిర్దేశించారు. ఆదివారం ప్రగతిభవన్‌లో సీఎం.. పంచాయతీరాజ్, రెవెన్యూ, పురపాలక, వైద్యఆరోగ్య, అటవీ శాఖలపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల, జూపల్లి, కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎంపీలు సీతారాం నాయక్, సుఖేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్ మాట్లాడుతూ 'పంచాయతీరాజ్ బిల్లు రూపకల్పన సన్నాహాలను వెంటనే పూర్తి చేయాలి. గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ, ఆర్థిక సంఘం, బడ్జెట్, ఆస్తి పన్నుల వసూళ్ల ద్వారా నిధులను సమకూర్చేందుకు విధివిధానాలను రూపొందించాలి. కొత్తగా ఏర్పాటు కాబోతున్న పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధుల సమీకరణపై అధ్యయనం చేయాలి. మార్చి 11న పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని నిర్ణయించినందున వెంటనే వాటి ముద్రణ పూర్తి చేయాలి. ధరణి వెబ్‌సైట్‌ను సత్వరమే రూపొందించాలి. ఐటీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. రోజురోజుకూ విస్తరిస్తున్న హైదరాబాద్ నగరాన్ని, దాని పరిసరాలను సంరక్షించుకోవాలి. పర్యావరణంపై దృష్టి (మిగతా 2లో)

కొత్త పార్టీతో వస్తున్నా



తెఐకాస ఛైర్మన్ కోదండరాంను భారీమాలతో సన్మానిస్తున్న అభిమానులు

- ఉద్యమ ఆకాంక్షల సాధనకు రాజకీయ ప్రవేశం తప్పనిసరి
- పార్టీ పేరు, విధివిధానాలు త్వరలో ఖరారు -2లో
- సమాంతరంగా ఐకాస ఉద్యమం
- రైతాంగ సదస్సులో తెఐకాస ఛైర్మన్ కోదండరాం వెల్లడి

> 'ఆస్తుల కోసమో.. కమీషన్ల కోసమో రాజకీయ అరంగేట్రం చేయడం లేదు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నేటికీ నెరవేరలేదు. ఐకాస ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు చేశాం. ప్రభుత్వం నుంచి స్పందన లేదు. అందుకే ప్రత్యక్ష రాజకీయాలు తప్పనిసరయ్యాయి'
> - తెఐకాస ఛైర్మన్ కోదండరాం



నెహాల్‌ను అభినందిస్తున్న మంత్రి హరీశ్‌రావు, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి

అయిదేళ్ల అబ్బురం


నీటిపారుదల శాఖ ప్రచారకర్తగా చిన్నారి నెహాల్

ఆ పిల్లాడి వయసు అయిదేళ్లే.. కానీ తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులపై ఆ చిన్నారికున్న అవగాహన అమోఘం. వాటి గురించి అనర్గళంగా వివరించిన తీరు సాక్షాత్తు మంత్రి హరీశ్‌రావునే ఆకట్టుకుంది. వెంటనే నీటిపారుదల శాఖకు నెహాల్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. -3లో

పార్లమెంటు వేదికగా పోరాటం

వెల్‌లోకి వెళ్లి ఎంపీలు నిరసన ప్రకటించాలి

- కేంద్రంపై దశలవారీగా ఒత్తిడి
- స్పందించకుంటే తీవ్ర నిర్ణయాలు
- తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నిర్ణయం -9లో
- ప్రజల ఆకాంక్షలే ముఖ్యమన్న చంద్రబాబు
- ముఖ్యమంత్రికి రాజ్‌నాథ్‌సింగ్ ఫోన్
- మరోసారి ప్రధానిని కలవాలని సూచన



కువైట్‌లో బాధితులకు సాయం

- క్షమాభిక్ష కింద రాష్ట్రానికి రప్పిస్తాం
- విమాన టికెట్లు కొనలేనివారినీ ఆదుకుంటాం
- తెలంగాణ ప్రవాసులశాఖ మంత్రి కేటీఆర్

2లో

యూరోపియన్ కమిషన్ ఏఎన్ఎంల వేతనాల పెంపు

- ఇకపై నెలకు రూ.21 వేలు చెల్లింపు
- దస్త్రంపై సీఎం కేసీఆర్ సంతకం




ఇదీ సంగతి!



రిపోర్టు ఇవ్వమని ఎవరడిగారు, విచారణకు ఆదేశించాను, విచారణ జరుపుతూ వెళ్లండి. అంతే!

ఔషధ నగరికి భాగ్యనగర పరిశ్రమలు

- ఏడేళ్లలో తరలింపు పూర్తి
- కొత్తవాటికి ఇక్కడే అనుమతి
- 19,333 ఎకరాల్లో ప్రాజెక్టు నిర్మాణం
- 8 వేల ఎకరాల్లో మొదటి దశ
- రూ.64 వేల కోట్ల పెట్టుబడులు అంచనా
- కేంద్రానికి తెలంగాణ సర్కారు నివేదిక



ఈనాడు, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో ఔషధనగరి నిర్మాణం తర్వాత హైదరాబాద్‌లోని ఔషధ పరిశ్రమలన్నింటినీ అందులోకి తరలించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఏడేళ్ల లోపు ఈ ప్రక్రియను ముగిస్తుంది. ఔషధనగరిని ప్రారంభించాక కొత్త పరిశ్రమలను విధిగా ఇక్కడే స్థాపించాలని, బయట చేపట్టేందుకు అనుమతించరాదని భావిస్తోంది. ఈమేరకు రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. దీని వల్ల కాలుష్య సమస్యలకు శాశ్వత పరిష్కారం కలుగుతుందని నివేదించింది. హైదరాబాద్ ఔషధనగరి తొలిదశను 8వేల ఎకరాల్లో ప్రారంభిస్తామంది. ఇందులో 7414 ఎకరాలను (మిగతా 2లో)

అది కమీషన్ల ప్రభుత్వం

- సులభతర వాణిజ్యం గురించి కాకుండా సులభతరహత్యల గురించి చర్చలు
- కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టిన ప్రధాని
- కాంగ్రెస్ జల్లే బురద నుంచి వందల కమలం పువ్వుల వికాసం
- మోదీ స్పష్టీకరణ

ఈనాడు - బెంగళూరు

కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వంపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. అవినీతి వ్యవహారాల్లో కొత్త రికార్డులు సృష్టించిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగడానికి కౌంట్‌డౌన్ ప్రారంభమయిందని అన్నారు. ఆదివారం సాయంత్రం బెంగళూరు రాజమహల్ మైదానంలో జరిగిన నవ కర్ణాటక పరివర్తన యాత్ర ముగింపు బహిరంగ సభలో భారీ ఎత్తున హాజరయిన ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కేవలం ఒక్క అవినీతే కాదు నేరాలు జడలు విప్పి నృత్యం చేస్తున్నాయని ప్రధాని విమర్శించారు. ఇక్కడ శాంతి భద్రతలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం నీడన నేరగాళ్లు రాజ్యమేలుతున్నారని ఆరోపించారు. తన ప్రభుత్వం సులభతర వాణిజ్యం గురించి మాట్లాడుతుంటే రాష్ట్రంలో మాత్రం సులభతర హత్యల గురించి చర్చిస్తున్నారని, హత్యాకాండలను సులభతరం చేస్తున్నారని దుయ్యబట్టారు. పాతిక మంది హిందు కార్యకర్తలు హతమైనా హంతకులకు శిక్ష పడేలేదని అన్నారు. తనకు ఎదురు తిరగే వారిని అంతం చేయటం ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని అన్నారు.

రాష్ట్రంలో భాజపా గాలి వీస్తోందని ప్రధాని చెప్పారు. "సిద్దరామయ్య ప్రభుత్వ పతనానికి క్షణాల లెక్కింపు ఆరంభమైంది. ఇందుకు ఇక్కడ కాషాయ వర్ణమైన భారీ బహిరంగ సభే గీటురాయి. రాజకీయ జీవితంలో ఇప్పటి వరకూ ఇంతటి జనసాగరాన్ని వీక్షించలేదు. కన్నడ నాట ఏ ప్రభంజనం వీస్తోందనేందుకిది సూచిక. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం నుంచి వైదొలగేందుకు నిష్క్రమణ ద్వారం వద్ద నిలబడి ఉంది" అని పేర్కొన్నారు.

"దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు మేము ప్రతి ఒక్కరినీ కలసికట్టుగా తీసుకెళ్దామనుకుంటున్నాం. కర్ణాటకలో కాంగ్రెస్ జల్లే బురద నుంచి వందల కమలం పూవులు వికసిస్తాయి. భాజపా ఇక్కడ భారీ విజయం సాధిస్తుందన్న విశ్వాసం నాకుంది." అని అన్నారు.

కాంగ్రెస్ విముక్త రాష్ట్రంగా చేయాలని, కాంగ్రెస్ సంస్కృతిని వదిలించుకోవాలని ప్రజలు నిర్ణయించుకున్నారని ప్రధాని చెప్పారు. "కాంగ్రెస్ ప్రభుత్వమంటే పదిశాతం కమీషన్ ప్రభుత్వం. ఇక్కడ పదిశాతం కమీషన్ లేనిదే ఏ పనీ జరగదు. ప్రభుత్వానికి ఇదే గుర్తింపు అయితే అంతకన్నా సిగ్గుచేటు మరొకటి లేదు." అని విమర్శించారు. కాంగ్రెస్ విముక్త ప్రభుత్వమంటే వారసత్వ పాలన నుంచి, అవినీతి, దోపిడీ, ఆశ్రిత పక్షపాతం నుంచి విముక్తి అని అన్నారు.

ఇటీవల ఇద్దరు రాష్ట్ర మంత్రుల నివాసాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారుల సోదాల గురించి ప్రస్తావించారు. ఒక కాంగ్రెస్ నేత నివాసాల్లో చేసిన సోదాలతో బినామీ ఆస్తుల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ఉక్కు మాఫియా, ఇసుక మాఫియా, బదిలీల మాఫియా ఉన్నాయన్నారు. ఉక్కు వంతెన పేరుతో రూ.కోట్లు దండుకోవడానికి కొంత మంది కుట్ర పన్నారని, ప్రజాగ్రహం, భాజపా నిరసనతో ప్రాజెక్టు రద్దయిందని గుర్తుచేశారు. పేదలు, మధ్య తరగతి కుటుంబాల్ని ఆదుకునేందుకు కేంద్రం అందిస్తున్న సహాయ హస్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా సద్వినియోగం చేసుకోవటం లేదని విమర్శించారు.

కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ముస్లిం మహిళల హక్కులను కాలరాసేందుకు కాంగ్రెస్ మరోసారి ఓటు బ్యాంకు రాజకీయాలకు దిగిందన్నారు. ముమ్మారు తలాక్ బిల్లుకు అడ్డుతగులుతోందన్నారు. వెనుకబడిన వర్గాల కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించకుండా కూడా కాంగ్రెస్ అవరోధం కలిగిస్తోందంటూ ధ్వజమెత్తారు.

తాము రైతులకు ప్రాధాన్యమిస్తున్నామని చెప్పారు. తమ అగ్ర (ఆంగ్ల అక్షరాల్లో టాప్-టీవోపీ) ప్రాధాన్యం టమాటా, ఉల్లి(ఆనియన్), ఆలూ (పొటాటో) అంటూ 'టాప్ ప్రయార్టీ'ని పునర్నిర్వచించారు. ఈ పంటలను సాగు చేసే రైతులను దృష్టిలో ఉంచుకునే 'ఆపరేషన్ గ్రీన్స్' పేరుతో పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. రైతు నాయకుడైన బి.ఎస్.యడ్యూరప్ప ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో సాగునీటి పారుదల వ్యవస్థను మెరుగుపర్చడానికి రూ.లక్ష కోట్లు కేటాయిస్తారని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రులు ప్రకాశ్ జావడేకర్, పీయూశ్ గోయల్, మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఎం. కృష్ణ, భాజపా కర్ణాటక అధ్యక్షుడు యడ్యూరప్ప తదితరులు సభలో పాల్గొన్నారు.



ప్రధానమంత్రి నరేంద్రమోదీని సన్మానిస్తున్న భాజపా నేతలు. చిత్రంలో కేంద్ర మంత్రి అనంతకుమార్, యడ్యూరప్ప తదితరులు

శునకానికి నిరుద్యోగ భృతి!

- పప్పులో కాలేశామని తెలుసుకొని రద్దు చేసిన అధికారులు
- అమెరికాలో అవాక్కయ్యే ఘటన

వాషింగ్టన్: ఉపాధికి దూరమైన పౌరులను ఆర్థిక సహాయంతో ఆదుకోవడం చాలా దేశాలు చేస్తున్న పనే! అగ్రరాజ్యం అమెరికాలోనూ ఈ తరహా విధానం అమల్లో ఉంది. అయితే, అక్కడి మిషిగన్ నిరుద్యోగ బీమా సంస్థ(యూఐఏ) ఇటీవల మంజూరు చేసిన నిరుద్యోగ భృతిని చూసి అంతా అవాక్కయ్యారు. ఔరా..! అంటూ ముక్కున వేలేసుకున్నారు. ఎందుకో తెలుసా.. ఆ భృతి మంజూరైంది ఓ శునకానికి. అవును.. మైఖేల్ హడాక్ అనే వ్యక్తి పెంచుకుంటున్న జర్మన్ షెపర్డ్ జాతి శునకం 'రైడర్'కు వారానికి సుమారు రూ.23 వేల నిరుద్యోగ భృతిని మంజూరు చేస్తూ యూఐఏ లేఖ పంపింది. రెస్టారెంట్‌లో ఉద్యోగం కోల్పోయినందుకుగాను రైడర్‌కు 20 వారాలపాటు ఈ సహాయం అందజేయనున్నట్లు అందులో పేర్కొంది. దీంతో మైఖేల్ ఆశ్చర్యానికి లోనయ్యారు. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు యూఐఏను సంప్రదించారు. విషయం తెలుసుకొని.. సంస్థ అధికారులూ నిశ్చేష్టులయ్యారు. రైడర్ పేరిట మంజూరైన భృతిని రద్దు చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశించారు.

ఆవులకూ ఆధార్!

- తొలి విడతలో రూ.50 కోట్ల కేటాయింపు

ఈనాడు, దిల్లీ: ఆవులకూ ఇకపై ఆధార్ లాంటి విశిష్ట గుర్తింపు సంఖ్య ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జాతీయ గోకుల్ మిషన్ కింద పశుసంజీవని ప్రాజెక్టులో భాగంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. దేశంలోని 4 కోట్ల పాలిచ్చే ఆవులకు ఇది వర్తిస్తుంది. తొలి విడతలో 2018-19 సంవత్సరానికి రూ.50 కోట్లు కేటాయించింది. ఇందుకు అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇప్పటికే సేకరించింది. ఆవు వయసు, జాతి, ఎత్తు, దానిపై ఉండే మచ్చల వివరాలతో మార్పులు చేయడానికి వీల్లేని పాలీయురేథేన్ ట్యాగ్ ఇస్తుంది. ఇందుకు రైతుల నుంచి రూ.10 వసూలు చేస్తుంది. దేశవాళీ ఆవుల సంతతిని పెంచడానికే కేంద్రం పశుసంజీవని పథకాన్ని రూపొందించింది. దేశవాళీ ఆవు పాలులో బలవర్ధకమైన ఏ2 అల్లేలే ఆఫ్ బీటా కాసియిన్ అనే ప్రొటీన్లు అధికంగా ఉంటాయి. కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా ఈ జాతులను పెంపొందింపచేయడానికి ప్రభుత్వం రూ.200 కోట్లను కేటాయించడం విశేషం.

ఎంఎంటీఎస్‌కు నిధులు లేనట్లే!

- తెలంగాణ ప్రాజెక్టులకు రూ.1,850 కోట్లు?
- నేడు కేటాయింపుల వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

కీలకమైన ఎంఎంటీఎస్ రెండోదశ నిర్మాణ పనులకు ఈ దఫా కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగలేదని సమాచారం. 816 కోట్ల రూపాయల అంచనా వ్యయానికిగాను ఇప్పటివరకు 470 కోట్ల రూపాయల వరకు ఖర్చుచేశారు. గత సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో హైదరాబాద్ ఎంఎంటీఎస్ రెండో దశకు రూ.100 కోట్లు కేటాయించగా.. ఈ దఫా కేటాయింపులు జరగలేదని తెలిసింది. మరోవైపు తెలంగాణలోని వివిధ ప్రాజెక్టులకు గత బడ్జెట్‌లో రూ.1,729 కోట్లు కేటాయించగా.. ఈ దఫా రూ.1,850 కోట్లు కేటాయించినట్లు సమాచారం. దక్షిణ మధ్య రైల్వే సహా.. తెలంగాణ రాష్ట్రానికి ప్రాజెక్టుల వారీగా జరిగిన కేటాయింపులపై సోమవారం పింక్‌బుక్ విడుదల కానుంది.


రాష్ట్ర వాటా ఇవ్వకపోవడం వల్లేనా?

హైదరాబాద్ ఎంఎంటీఎస్ రెండో దశ పనులకు తెలంగాణ ప్రభుత్వం మూడింట రెండు వంతులు, రైల్వే శాఖ ఒక వంతు నిధులను భరిస్తున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరగకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించకపోవడమే కారణమని కేంద్రమాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. రైల్వే వాటా నిధులు మొత్తం ఖర్చుచేశారని ఆయన పేర్కొన్నారు. '2018-19 బడ్జెట్‌లో ఎంఎంటీఎస్‌కు నిధుల కేటాయింపులు జరగకపోయినా ఇబ్బంది ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన తన వాటా నిధులు విడుదల చేస్తే పనులు కొనసాగుతాయి.' అని రైల్వే అధికారి ఒకరు తెలిపారు.

జిహ్వా 'చేప'ల్యం చంపుకోనక్కర్లేదు!

- ఫార్మాల్డిహైడ్, అమ్మోనియాల వాడకాన్ని ఇట్టే కనిపెట్టొచ్చు
- కిట్ రూపొందించిన కేంద్రీయ మత్స్య పరిశోధన సంస్థ

ఈనాడు - హైదరాబాద్



మాంసాహార ప్రియులకు చేప ఇష్టమైన ఆహారం. పులుసు, ఇగురు, వేపుడు.. రుచి ఏదైనా లొట్టలేసుకుని లాగించేయాలన్న కోరిక ఉన్నా.. అవి తాజావో కాదోనన్న సంశయం జిహ్వ చాపల్యాన్ని కాస్తా చంపేస్తుంది. ముఖ్యంగా పెద్దపెద్ద నగరాల్లోని వినియోగదారులకు ఇలాంటి అనుభవాలు ఎక్కువగానే ఉంటాయి. అలాంటి అనుమానాలకు తావు లేకుండా చేపల నాణ్యతను, వాటిలోని రసాయనాలను గుర్తించేందుకు కొచ్చిన్‌లోని కేంద్రీయ మత్స్య పరిశోధన సంస్థ(సిఫ్ట్) ఓ కిట్‌ను రూపొందించింది. దాన్ని ఇటీవల కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్ సింగ్ ఆవిష్కరించారు.

దేశంలోని విపణిలో విక్రయించే చేపల నాణ్యతకు, శుభ్రతకు ఎలాంటి పూచీ లేదు. వాటి నాణ్యతను పరిశీలించే యంత్రాంగమూ లేదు. రోజూ వందల క్వింటాళ్ల చేపలు అమ్మే హైదరాబాద్, విజయవాడ, వరంగల్‌లాంటి నగరాల్లో పరిశుభ్రమైన చేపల మార్కెట్లే లేవు. ముఖ్యంగా నగరాలకు చుట్టుపక్కల వందల కిలోమీటర్లలోపు చేపల పెంపకం చాలా తక్కువగా ఉంటోంది. ఉదాహరణకు హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లకు ఏపీలోని భీమవరం, కర్ణాటక ప్రాంతాల నుంచి చేపలు రవాణా అవుతున్నాయి. కోల్‌కతా, రాంచీ వంటి పట్టణాలకూ ఏపీ నుంచే లారీల్లో ఎగుమతి అవుతున్నాయి. ఈ క్రమంలో పట్టిన చేపలు విపణిలోకి వెళ్లేందుకు ఒక్కోసారి 2, 3 రోజుల సమయం పడుతోంది.

రసాయనాలతో మాయ

అంతసేపు అవి తాజాగా ఉండాలంటే శీతల గదులున్న ప్రత్యేక వాహనాల్లో తరలించాల్సి ఉన్నా.. అలాంటి ఏర్పాట్లు ఎక్కడా లేవు. 'ప్రత్యామ్నాయంగా దేశంలోని చిల్లర వ్యాపారులు చేపలు చెడిపోకుండా ఉండటానికి ఎక్కువగా విషపూరిత ఫార్మాల్డిహైడ్ రసాయనాన్ని వాడుతున్నారు. ఈ రసాయనం శరీరంలోకి వెళితే క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ముప్పు ఉంటుంది. మరికొందరు చేపలను ఐస్ పెట్టెల్లో ఉంచి రవాణాచేస్తున్నారు. ఆ ఐస్ కూడా నాణ్యమైనది కాదు. కొన్ని ప్రాంతాల్లో అమ్మోనియా వాడకమూ అధికంగా ఉంటోంది. అమ్మోనియాతో నిల్వ చేసిన చేపలను తినడం వల్ల గొంతునొప్పి, కడుపునొప్పి, నోటిలో పుండ్లు వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయి.' అని సిఫ్ట్ వెల్లడించింది. అందుకే వినియోగదారులు చేపల్లో రసాయనాలను సులభంగా గుర్తించేందుకు వీలుగా రెండు రకాల కిట్‌లను రూపొందించినట్టు పేర్కొంది.

ఎలా వినియోగించాలంటే...

ఈ కిట్‌లో 25 చిన్నచిన్న స్ట్రిప్‌లు(కాగితాన్ని పోలినవి), ఓ రసాయనం ఉంటుంది. కొనే సమయంలో స్ట్రిప్‌ను చేపపై కొన్ని క్షణాలపాటు రుద్దాలి. అనంతరం దానిపై కిట్‌లోని రసాయనాన్ని చుక్కలుగా పోయాలి. తర్వాత కూడా స్ట్రిప్ రంగు మారకుండా తెల్లగానే ఉంటే రసాయనాలు వాడలేదని అర్థం. అది ముదురు నీలిరంగులోకి మారితే కచ్చితంగా రసాయనాలు కలిపినట్టే. 'ఈ విధానాన్ని ఎవరైనా సులువుగా వినియోగించవచ్చు. వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.' అని సిఫ్ట్ పరిశోధకులు వెల్లడించారు. ఒక చేపను పరీక్షించడానికి రూ.5 వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు.

మేమూ పరీక్షిస్తాం

తెలంగాణ చిల్లర మార్కెట్లలో ఇలాంటి రసాయనాలు వాడుతున్నట్లు ఇంతవరకూ తమ దృష్టికి రాలేదు. అయినా ముందు జాగ్రత్తగా సిఫ్ట్ నుంచి కిట్‌లు తెప్పించి నమూనాగా కొన్ని మార్కెట్‌లలో చేపలను పరీక్షిస్తాం.

- సువర్ణ, మత్స్యశాఖ కమిషనర్

ఔషధ నగరికి భాగ్యనగర పరిశ్రమలు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే సేకరించామంది. భూయజమాని సమ్మతి లేకుండా భూములను సేకరించబోమని పేర్కొంది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఔషధనగరిని నిర్మిస్తామంది. దీనిద్వారా 5.6 లక్షల మందికి ఉపాధి కలుగుతుందని వివరించింది. పర్యావరణ అనుమతులకు ఔషధనగరి నిర్మాణ ప్రణాళికను రూపొందించింది. రంగారెడ్డి జిల్లాలో రూ.16784 కోట్లతో 19,333 ఎకరాల్లో ఔషధనగరిని నిర్మించాలని నిర్ణయించామని, మొత్తం ప్రాజెక్టు విస్తీర్ణం 78.33 చదరపు కిలోమీటర్ల మేరకు ఉంటుందంది. ఇందులో అటవీ ప్రాంతం ఉండదని తెలిపింది.

నివేదికలో ఇతర అంశాలు

- తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా దీనిని ప్రకటించి, నిర్మాణం చేపడుతోంది. జాతీయ ఆరోగ్య విధానం-2017 ప్రమాణాలకు అనుగుణంగా దేశీయంగా ఔషధాల ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా ఔషధనగరి నిర్మాణం. స్థానికంగా పెద్దఎత్తున ఔషధాలను తయారు చేయడంతో పాటు విదేశాలకు ఎగుమతులకు ప్రోత్సాహం. కాలుష్య సమస్యలను నివారించి, మరిన్ని పరిశ్రమలను స్థాపించడం, దీనికి అనుగుణంగా రాయితీలు, ప్రోత్సాహకాలతో పాటు జీడీపీలో వాటా పెంచడం లక్ష్యాలు.
- రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల్లో నిర్మిస్తున్న ఔషధనగరిలో రూ.64 వేల కోట్ల పెట్టుబడుల అంచనా. ఇందులో 30 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు.
- ఎగుమతులు రూ.59 వేల కోట్ల లక్ష్యం.
- పర్యావరణ పరిరక్షణ, శిక్షణ, పరిశోధన సంస్థ(ఈపీటీఆర్ఐ) ద్వారా పర్యావరణ ప్రణాళిక తయారీ.
- రైతులకు అత్యంత మెరుగైన పరిహారం, పునరావాస, సహాయక చర్యలు.
- స్థానికులకు ఉపాధి, భూములు కోల్పోయిన వారికి ప్రాధాన్యం. నైపుణ్య శిక్షణ
- ప్రాజెక్టులో 33శాతం హరితహారం. మొక్కల పెంపకం.
- వంద శాతం వ్యర్థాల శుద్ధి. కేంద్రీకృత వ్యర్థాల శుద్ధి కేంద్రం(సీఈటీపీ) నిర్మాణం.
- ఔషధనగరికి రోజుకు రెండువేల కిలోలీటర్ల మేరకు నీటి అవసరం. మిషన్ భగీరథ ద్వారా పంపిణీ.
- ప్రాజెక్టుకు 985 మెగావాట్ల విద్యుత్ అవసరం. మీర్‌ఖాన్‌పేటలోని 400/220 కేవీ సబ్‌స్టేషన్ ద్వారా సరఫరా. ఔషధనగరిలో 435 మెవాగాట్ల మేరకు సౌరవిద్యుత్ ఉత్పత్తి ప్రణాళిక. వాననీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణం.

ఆరోగ్య రక్ష

(మొదటి పేజీ తరువాయి)

పాత జిల్లా కేంద్రాలన్నింటిలోనూ విస్తరిస్తారు.

అమలు ఇలా..: రోజూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేకరించిన నమూనాలను మధ్యాహ్నం ఒంటి గంటలోపు సమీపంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు చేరవేస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3 గంటల్లోపు ఐపీఎంలోని ప్రయోగశాలకు చేరుస్తారు.

- ప్రతి ఆరోగ్య కేంద్రానికి గుర్తింపు సంఖ్య, పాస్‌వర్డ్ ఉంటుంది.
- రోగి నుంచి నమూనాలు సేకరించినప్పుడే వారికి ఈ-మెయిల్ ఐడీ ఉంటే తీసుకుంటారు.
- అధునాతన పరికరాల్లో రక్తనమూనాల సమాచారాన్ని ముందే పొందుపర్చుతారు. పరికరమే ఆన్‌లైన్‌లో రోగికి, పీహెచ్‌సీకి ఫలితాలుఇస్తుంది.
- ఎక్కువ ఫలితాలు అదే రోజు సాయంత్రానికి వెల్లడిస్తారు. కొన్ని పరీక్షల ఫలితాలు మర్నాడు ఉదయం చెబుతారు.
- పట్టణ పీహెచ్‌సీల్లో సిబ్బంది తాము పంపించిన నమూనాల ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ప్రస్తుతానికి ఒక షిఫ్టు నమూనాలనే సేకరిస్తున్నారు. మున్ముందు మూడు షిఫ్టుల్లోనూ పనిచేసేలా తీర్చిదిద్దనున్నారు.

కువైట్‌లో బాధితులకు సాయం

- తెలంగాణ ప్రవాసులశాఖ మంత్రి కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

కువైట్‌లో ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ కార్మికులను ఆ దేశ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్ష పథకం కింద స్వరాష్ట్రానికి రప్పించేందుకు అవసరమయిన అన్ని చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర ప్రవాసుల వ్యవహారాల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. అక్కడి నుంచి తిరిగి వస్తున్న వారికి అవసరమైన సాయం అందిస్తామన్నారు. కొంత మంది విమాన టికెట్లు కొనలేని దుస్థితిలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారందరినీ మానవతా దృక్పథం కింద ఆదుకుంటామని చెప్పారు. కువైట్‌లో క్షమాభిక్ష పథకం గురించి ఆదివారం కేటీఆర్ సమీక్షించారు. కువైట్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర అధికారులతో మాట్లాడారు. ''కువైట్ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్ష పథకం కింద పర్మిట్, వీసా లేకుండా అక్రమంగా నివసిస్తున్న వారిని తెలంగాణ రప్పిస్తాం. ఏడేళ్ల తర్వాత అక్కడి ప్రభుత్వం ఇచ్చిన క్షమాభిక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్మికులను కోరాం. రాయబార కార్యాలయాన్ని ఎప్పటికప్పుడు సంప్రదిస్తున్నాం. ఇక్కడి అధికారులు వారితో సమన్వయం చేసుకుంటూ ముందుకెళతారు. తెలంగాణ కార్మికుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు.

ఈ విషయంలో తెలంగాణకు సహకరించాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌ను కోరాం. టికెట్లు కొనలేని స్థితిలో ఎంత మంది ఉన్నారనే వివరాలను వెంటనే అధికారులు సేకరించాలి. వారికి టికెట్ల కోసం ఎంత మేరకు నిధులు అవసరమో అంచనా వేస్తే ప్రభుత్వం వెంటనే మంజూరు చేస్తుంది. కువైట్‌లోని తెలంగాణ పౌరులు ఎవరికైనా సాయం అవసరమయితే వెంటనే తెలంగాణ ప్రవాస వ్యవహారాల శాఖను సంప్రదించాలి. సంబంధిత అధికారితో 9440854433 నెంబర్‌లో మాట్లాడవచ్చు. లేదంటే మా శాఖ ఈ మెయిల్ sonri@telangana.gov.inలో వివరాలు తెలపాలి. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్ల ద్వారా కూడా సంప్రదించేందుకు ఒకటి రెండు రోజుల్లో సౌకర్యం కల్పిస్తాం'' అని కేటీఆర్ వివరించారు.

22 మంది భారతీయులతో వెళ్తున్న చమురు ట్యాంకర్ అదృశ్యం

- బెనిన్ తీరంలో ఘటన

ముంబయి, దిల్లీ: పశ్చిమ ఆఫ్రికా దేశమైన బెనిన్ తీరంలో 22 మంది భారతీయులతో వెళ్తున్న చమురు ట్యాంకర్ ఒకటి అదృశ్యమైనట్లు నౌకాయాన శాఖ ఆదివారం వెల్లడించింది. ఆ ప్రాంతంలో సముద్రపు దొంగతనాలు ఎక్కువగా జరుగుతుంటాయంది. డబ్బు డిమాండ్ చేసేందుకు ట్యాంకర్‌ను, సిబ్బందిని బంధించినట్లు ప్రస్తుతానికి నివేదికలేవీ అందలేదంది. దాదాపు నెల రోజుల క్రితం బెనిన్ తీరంలోనే 22 మంది సిబ్బందితో నౌకను సముద్రపు దొంగలు తమ అధీనంలోకి తీసుకున్నారు. నాటి బందీల్లో అత్యధికులుభారతీయులే. డబ్బు వసూలు చేసి.. వారందరినీ దొంగలు విడిచిపెట్టారు.

కొత్త పార్టీతో వస్తున్నా

- రైతాంగ సదస్సులో తెఐకాస ఛైర్మన్ కోదండరాం వెల్లడి

ఈనాడు - హైదరాబాద్, తుర్కయాంజాల్ - న్యూస్‌టుడే

తెలంగాణలో కొత్త పార్టీతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెడుతున్నట్లు తెఐకాస ఛైర్మన్ కోదండరాం ప్రకటించారు. పార్టీ పేరు, విధివిధానాలనూ త్వరలో ఖరారు చేస్తామన్నారు. కొత్త పార్టీ ఏర్పడినా రాష్ట్రంలో ఐకాస కొనసాగుతుందనీ, ఐకాస ఆధ్వర్యంలో సమాంతరంగా రాజకీయ, సామాజిక ఉద్యమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్‌లోని ఓ కల్యాణమండపంలో నిర్వహించిన 'రైతాంగ సమస్యలపై ఉద్యమ కార్యాచరణ'లో కోదండరాం ఈప్రకటన చేశారు. వివిధ జిల్లాల ఐకాస ప్రతినిధులు, రైతులు హాజరైన సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ 3432 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం 798 మంది ఆత్మహత్య చేసుకున్నారనడం బాధాకరమని పేర్కొన్నారు. 31 జిల్లాల్లో రైతు అధ్యయన యాత్రలతో ఐకాస ప్రతినిధులు పర్యటించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలపై నివేదికలను సిద్ధం చేశామనీ, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. రాజకీయ ఐకాస ఎన్నో ఉద్యమాలు చేసి నిశ్శబ్ద విప్లవానికి తెరలేపుతున్న నేపథ్యంలో తనవంతుగా పాటనై మీవెంట వస్తానని ప్రజాగాయకుడు గద్దర్ అన్నారు. సన్న, చిన్నకారు రైతులకు రక్షణగా సమగ్ర వ్యవసాయ విధానాన్ని ప్రవేశపెట్టాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని పలు తీర్మానాలను సదస్సు ఆమోదించింది. ఐకాస నేతలు రఘు, పురుషోత్తం, ఖాజా మొహినుద్దీన్, రవీందర్, వెంకటరెడ్డి, భైరి రమేష్, సంధ్య, డీపీరెడ్డి పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైనవారిని ఉద్దేశించి ప్రసంగిస్తున్న టీజేఏసీ ఛైర్మన్ కోదండరాం

టీజేఎస్సా? టీఎస్‌జేపీనా?

కొత్త పార్టీ పేరుపై కసరత్తు జరుగుతోందని ఐకాస వర్గాలు తెలిపాయి. 'తెలంగాణ జన సమితి(టీజేఎస్)' లేదా 'తెలంగాణ సకల జన పార్టీ(టీఎస్‌జేపీ)' ఉండవచ్చునని తెలుస్తోంది. రైతులు, నిరుద్యోగులు, ఉద్యమకారులు, వలసలు.. ఈ నాలుగు అంశాలు ప్రధానంగా ఉండేలా పతాకాన్ని, గుర్తునూ తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం.

బడ్జెట్ సమావేశాల్లోనే పంచాయతీ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

సారించాలి. హైదరాబాద్‌లో అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి. నగరంలో పచ్చదనం పరిఢవిల్లాలి. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసి, కేబీఆర్ పార్కు మాదిరే నడకదారి (వాక్‌వే)ని నిర్మించాలి. నగరానికి అన్ని వైపులా 50 నుంచి 60 కిలోమీటర్ల విస్తీర్ణంలో లక్షన్నర ఎకరాలకు పైగా అటవీభూమి ఉంది. దీన్ని కాపాడుకుంటూ ఆరోగ్యకరమైన గాలిని పీల్చుకునేలా అటవీ ప్రాంతాలుండాలి. పురపాలక, అటవీ శాఖల మంత్రులు, సీఎస్, ఉన్నతాధికారులు, సీఎంవో అధికారులు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని అటవీ భూములను సందర్శించి, అధ్యయనం చేయాలి.

మూడు నెలల్లోనే నేత్ర వైద్యశిబిరాలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాల ద్వారా వైద్యపరీక్షలు, చికిత్స, ఉచితంగా కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని మూడు నెలల్లో పూర్తి చేయాలి. దీనిపై వెంటనే విధివిధానాలను రూపొందించాలి. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ఆసక్తి ఉన్న వారందరికీ భాగస్వామ్యం కల్పించాలి. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, కార్యదర్శి, కమిషనర్ దీనిపై వ్యూహాన్ని ఖరారు చేయాలి. వైద్య, ఆరోగ్య అంశాలకు సంబంధించి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యపరిచేందుకు పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి' అని సీఎం ఆదేశించారు.

యూరోపియన్ కమిషన్ ఏఎన్ఎంల వేతనాల పెంపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో యూరోపియన్ కమిషన్ కింద 2003 నుంచి పనిచేస్తున్న 710 మంది ఏఎన్ఎంల వేతనాల పెంపుదలకు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. వారి నెలవారీ వేతనాన్ని రూ.10 వేల నుంచి రూ.21 వేలకు పెంచేందుకు ఆదేశించారు. దీనికి సంబంధించిన దస్త్రంపై ఆదివారం రాత్రి ఆయన సంతకం చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి, ముఖ్య కార్యదర్శి శాంతికుమారిల వినతి మేరకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. రెండో ఏఎన్ఎం వేతనాల పెంపుదలపైనా సీఎం సానుకూలంగా స్పందించారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

గ్రహం అనుగ్రహం

5-2-2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
పంచమి: మ. 12-23 తదుపరి షష్ఠి
హస్త నక్షత్రం: మ. 2-36 తదుపరి చిత్త
అమృత ఘడియలు: ఉ. 8-36 నుంచి 10-12 వరకు
వర్జ్యం: రా. 10-44 నుంచి 12-22 వరకు
దుర్ముహూర్తం: మ. 12-35 నుంచి 1-20 వరకు
తిరిగి మ. 2-51 నుంచి 3-36 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-35; సూర్యాస్తమయం: సా.5-52

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	8.6	33.0
మెదక్	10.9	35.6
రామగుండం	14.3	33.0
తిరుపతి	14.5	30.6
మహబూబ్‌నగర్	14.6	33.4
హైదరాబాద్	14.9	32.0
కరీంనగర్	15.0	32.0
హన్మకొండ	16.0	34.0
నిజామాబాద్	17.0	30.0
ఖమ్మం	18.0	35.0
సూర్యాపేట	21.0	31.5

సీట్ల పెంపూ లేదు.. పొత్తూ ఉండదు

- 119 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాలకు అమిత్‌షా సిద్ధం కమ్మన్నారు
- కాంగ్రెస్‌కంటే మేమే ముందున్నాం
- విలేకరులతో ఇష్టాగోష్ఠిలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఈనాడు, హైదరాబాద్: "తెలుగు రాష్ట్రాల్లో సీట్ల పెంపు ఉండదని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా స్పష్టంచేశారు. 119 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో పోటీకి సిద్ధం కమ్మన్నారు. కాంగ్రెస్ కంటే మేమే ముందున్నామని పార్టీ సర్వేల్లో వెల్లడైంది. జూన్ తర్వాత భారీ సభలతో పెద్దఎత్తున ప్రజల్లోకి వెళతాం" అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఇటీవల అమిత్‌షాతో లక్ష్మణ్ సహా పార్టీ రాష్ట్ర ముఖ్యనేతలు సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారమిక్కడ లక్ష్మణ్ విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "మార్చి మొదటివారంలో తెలంగాణలో అమిత్‌షా పర్యటన ఉంటుంది. కేంద్ర మంత్రులు రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు చేసిన వ్యాఖ్యలతో కొంత గందరగోళం నెలకొంది. ఈ విషయాన్ని అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లాం. రాజకీయ విధానం వేరు, ప్రభుత్వ నిర్ణయాలకు మద్దతు వేరని ఆయన చెప్పారు. నోట్లరద్దు వంటి ఒకట్రెండు అంశాల్లో తెరాస మద్దతు ఇచ్చినంతమాత్రాన తెరాస మిత్రపక్షం ఎలా అవుతుంది? మనం పోరాడాల్సింది తెరాసపైనేనని స్పష్టతిచ్చారు. ఒడిశా, తెలంగాణ, పశ్చిమబెంగాల్ భాజపా తదుపరి లక్ష్యాలని అమిత్ షా చెప్పారు. అనేక మంది ఇతర పార్టీల నేతలు మాతో టచ్‌లో ఉన్నారు" అని లక్ష్మణ్ పేర్కొన్నారు.

ఎంతో ఇస్తే ఏం ఇవ్వలేదంటారా?


- తెరాస, తెదేపా దుష్ప్రచారం తగదు: దత్తాత్రేయ

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు ఎన్నో నిధులిస్తే, ఏమివ్వలేదంటే ఎలా? అధ్యయనం చేయకుండా కాంగ్రెస్ మాదిరిగా తెరాస, తెదేపాలు దుష్ప్రచారం చేయడం తగదని కేంద్ర మాజీమంత్రి దత్తాత్రేయ అన్నారు. అవసరమైతే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దిల్లీకి వెళ్లి ప్రధానిని కలవాలని.. ఆవేదన ఉంటే తెలపాలని, కావాల్సిన నిధులు అడగాలని సూచించారు. తమ తప్పుల్ని కప్పిపుచ్చుకునేందుకే తెలంగాణ ప్రభుత్వం కేంద్రంపై బడ్జెట్ విషయంలో విమర్శలు చేస్తోందన్నారు. పార్టీ కార్యాలయంలో దత్తాత్రేయ ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ, ఏపీలకు అన్యాయం చేసే ఉద్దేశం కేంద్రానికి లేదన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణంపై అనుమానాలు అక్కర్లేదని.. భాజపా దీనికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ప్రాజెక్టుల నిర్మాణాల్లో నాణ్యతపై రాజీవద్దు

- మేధోమథన సదస్సులో మంత్రి హరీశ్‌రావు
- నీటిపారుదల శాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా ఐదేళ్ల నెహాల్

ఈనాడు - హైదరాబాద్



జలసౌధలో జరిగిన కార్యక్రమంలో.. 'మిషన్ కాకతీయ - సుస్థిర గ్రామీణాభివృద్ధి' సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి, ఈఎన్‌సీ మురళీధర్‌రావు, బెవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్ తదితరులు

నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించి నాణ్యత విషయంలో రాజీపడొద్దని ఆ శాఖ మంత్రి హరీశ్‌రావు ఇంజినీర్లను ఆదేశించారు. ఆదివారమిక్కడ ప్రాజెక్టులపై నిర్వహించిన మేధోమథన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు ఇంజినీర్లు ఇచ్చిన సూచనలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రాజెక్టు నిర్మాణాల నాణ్యత పర్యవేక్షణ(క్వాలిటీ కంట్రోల్ బోర్డు) బాధ్యతలను ఈఎన్‌సీ(పరిపాలన) నాగేందర్‌రావుకు అప్పగిస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు 40కి పైగా నిర్మాణంలో ఉన్నాయని, రాబోయే ఏడాది కాలం నాణ్యత పర్యవేక్షణ విభాగానికి అత్యంత కీలకమైనదన్నారు. నిజాయితీగా 16 గంటల పాటు పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు ఇచ్చి ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. ఆకుపచ్చని, రైతుల ఆత్మహత్యలు లేని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములవుతున్నందున నీటిపారుదల శాఖకు చెందిన అన్నిస్థాయిల్లోని ఇంజినీర్లు గర్వపడాలని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపుతో సాగునీటి రంగం అభివృద్ధికి మూడంచెల వ్యూహం అనుసరిస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వాలు ప్రారంభించి అనేక సమస్యల కారణంగా గాలికి వదిలిన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం, కొన్నింటిని రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా పునరాకృతిలో చేపట్టడం, గతంలో శిథిలమైన సాగునీటి వ్యవస్థలను ఆధునికీకరించడం, గ్యాప్ ఆయకట్టును సాగులోకి తేవడమనే బృహత్తర లక్ష్యాలతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఈపీసీ పద్ధతిలో అన్ని పనులను ఏజెన్సీలకే అప్పగించిందని, ప్రభుత్వ ఇంజినీర్ల సామర్థ్యాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ నీటిపారుదల శాఖను బలోపేతం చేసి ఈపీసీని రద్దు చేసిందన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ మురళీధరరావు, సీఈలు సునీల్, హరిరాం, ఖగేందర్‌రావు, సురేశ్, శ్యాంసుందర్, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

నెహాల్ విద్యాభ్యాసం వ్యయాన్ని భరిస్తాం

తెలంగాణ నీటిపారుదల పథకాలు, సీఎం కేసీఆర్ పునరాకృతి చేసిన ప్రాజెక్టుల తీరును నెహాల్ అనే ఐదేళ్ల బాలుడు అనర్గళంగా వివరిస్తున్న తీరు అబ్బురపరుస్తోందని మంత్రి హరీశ్ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పందిళ్లపల్లికి చెందిన నెహాల్ తండ్రి హనుమంతరావు హైదరాబాద్‌లోని షాపూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు సంస్థలో చిరుద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం ఇంజినీర్ల సమావేశానికి బాలుడిని తెరాస నాయకులు తీసుకురాగా తన మేధాశక్తితో నెహాల్ అద్భుత ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నాడు. తెలంగాణ నీటిపారుదల శాఖకు బ్రాండ్ అంబాసిడర్‌గా బాలుడిని నియమిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. విద్యాభ్యాసానికయ్యే వ్యయమంతా నీటిపారుదల శాఖ భరిస్తుందన్నారు. తనకు ముఖ్యమంత్రి కేసీఆర్ తాతను చూడాలని ఉందని నెహాల్ మంత్రిని కోరగా త్వరలోనే కోరిక నెరవేర్చుతానని హామీ ఇచ్చారు. చిన్నారితోపాటు తల్లిదండ్రులకు కాళేశ్వరం ప్రాజెక్టును చూపాలని అధికారులకు సూచించారు.



తెలంగాణ నీటిపారుదల శాఖ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితుడైన ఐదేళ్ల బాలుడు నెహాల్‌తో తల్లిదండ్రులు

మోదీపై భ్రమలు తొలగుతున్నాయ్

- ప్రజా ఉద్యమాలతోనే సామాజిక న్యాయం
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

ఈనాడు - నల్గొండ



అభివాదం చేస్తున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, నేతలు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, మల్లు స్వరాజ్యం తదితరులు

వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టే ప్రజా ఉద్యమాలతోనే సామాజిక న్యాయం జరుగుతుందని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. ఎవరి రాజకీయ లబ్ధి కోసం మోదీ ప్రభుత్వం "ఒకే దేశం- ఒకే ఎన్నిక' అంటుందని ప్రశ్నించారు. దేశంలో రోజురోజుకూ ఆర్థిక దోపిడీ, సామాజిక దౌర్జన్యం పెరుగుతోందని.. ప్రజా ఉద్యమాలతోనే వీటి నిర్మూలన సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఇటీవల ప్రకటించిన బడ్జెట్‌తో దేశప్రజల్లో మోదీపై ఉన్న భ్రమలు తొలగుతున్నాయన్నారు. సీపీఎం తెలంగాణ రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఆదివారం నల్గొండలో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఏచూరి ప్రారంభోపన్యాసం చేశారు. 'దేశవ్యాప్తంగా భాజపా పాలిత రాష్ట్రాల్లో మతోన్మాద, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు దళిత, మైనార్టీ, గిరిజన, వెనుకబడిన కులాలపై దాడులు చేస్తున్నాయి. వీటిపై అలుపెరగని పోరాటం చేయాల్సిన బాధ్యత వామపక్ష, ప్రజాసంఘాలదే. తెలంగాణలో 93 శాతం ప్రజలు వెనుకబడిన, ఎస్సీ, ఎస్టీ కులాల వారే ఉన్నారు. ఫలాలు మాత్రం మిగిలిన ఆ ఏడు శాతం ప్రజలకే అందుతున్నాయని' వివరించారు. దేశ ప్రజలకు గత ఎన్నికల్లో ఏ హామీలు ఇచ్చి భాజపా అధికారంలోకి వచ్చిందో వాటినే నాలుగేళ్ల తర్వాత మళ్లీ చేస్తోందని విమర్శించారు. రైతు ఆత్మహత్యలను నియంత్రించి.. వారిని రుణ విముక్తులను చేయటానికి చట్టం చేయాలని సూచించినా పట్టించుకోవటం లేదన్నారు. అధికారంలోకి వస్తే ప్రతి వ్యక్తి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ ఏడాది చివర్లో భాజపా పాలిత రాష్ట్రాలు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న ఎన్నికల్లో ప్రజావ్యతిరేకతను అధిగమించడానికే ఎన్డీఏ ప్రభుత్వం జమిలీ ఎన్నికలను తెరమీదకు తెస్తోందని అభిప్రాయపడ్డారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా బలహీనవర్గాలపై దాడులు పెరిగాయన్నారు. వీటిని ఐక్యంగానే ఎదుర్కోవాలని. . తెరాస సర్కారు భాజపాతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకోవడం వల్లే ఇలాంటి దాడులపై ఏం మాట్లాడటం లేదని ఆరోపించారు. కేంద్ర కమిటీ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు మల్లు స్వరాజ్యం మాట్లాడుతూ.. రాజ్యం చేస్తున్న దోపిడీని వ్యతిరేకిస్తూ గ్రామగ్రామాన ఎర్రజెండా పండుగ నిర్వహించాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. మాటల గారడీతో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలను మభ్యపెడుతున్నారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో నాయకులు వెంకట్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహాసభల ప్రారంభానికి ముందు నల్గొండలో సీపీఎం కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. సుమారు 5వేల మంది 5కి.మీ మేర ర్యాలీ చేపట్టారు.

ప్రాజెక్టులను అధ్యయనం చేయండి

- అధ్యాపకులకు ఘంటా చక్రపాణి సూచన

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా సాగునీటి రంగంలో జరుగుతున్న కార్యక్రమాలు, విజయాలను అధ్యయనం చేయాలని రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల సామాజిక శాస్త్రాల అధ్యాపకులకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ ఘంటా చక్రపాణి సూచించారు. ఆదివారం కాకతీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు టి.శ్రీనివాస్ సంపాదకత్వం వహించిన 'మిషన్ కాకతీయ- సుస్థిర గ్రామీణాభివృద్ధి' సంకలనాన్ని మంత్రి హరీశ్‌రావుతో కలిసి చక్రపాణి ఆవిష్కరించారు. కాళేశ్వరం, మిషన్ కాకతీయ పథకాల అమలు తీరును మేధావులు అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మిషన్ కాకతీయను అమెరికాకు చెందిన రెండు విశ్వవిద్యాలయాలు అధ్యయనం చేస్తున్నాయని, మన విశ్వవిద్యాలయాలు ఎందుకు ఆ పనిచేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తూర్పు దేశాలతో అనుసంధానంలో నీతి ఆయోగ్ కీలకపాత్ర

గువాహటి: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'తూర్పు దేశాలతో కలిసి నడిచే (యాక్ట్ ఈస్ట్) విధానాని'కి నీతి ఆయోగ్ చోదకశక్తిగా వ్యవహరించనుంది. ఆసియాన్; బీబీఎన్ (భూటాన్, బంగ్లాదేశ్, నేపాల్) దేశాలతో ఈశాన్య రాష్ట్రాలకు సంబంధాలు మెరుగుపరుస్తామని నీతి ఆయోగ్ సీఈఓ అమితాబ్ కాంత్ చెప్పారు. ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు సందర్భంగా ఆదివారం ఇక్కడ జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. యాక్ట్ ఈస్ట్ విధానం అమలులో ఈశాన్య రాష్ట్రాలదే ప్రధాన భూమిక అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేసిన విషయాన్ని గుర్తుచేశారు.

సీపీఎస్ రద్దు కోసం ఉద్యమాలు

జన్నారం, న్యూస్‌టుడే: కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం(సీపీఎస్) రద్దు కోసం పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి తెలిపారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడలోని శ్రీలక్ష్మీదేవీ ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం వల్ల ఎందరో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ నెల 22 నుంచి మండల స్థాయిలో ఉద్యమాలు ప్రారంభమవుతాయని.. జూన్‌లో 70 వేల మందితో హైదరాబాద్‌లో ధర్నా ఉంటుందని వెల్లడించారు. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుశాఖలో బదిలీలకు రంగం సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: పోలీసుశాఖలో బదిలీలకు రంగం సిద్ధమైంది. పెద్దఎత్తున జిల్లా ఎస్పీలతోపాటు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారికి స్థాన చలనం కలిగే అవకాశం ఉంది. మహేందర్‌రెడ్డి డీజీపీ అయిన తర్వాత మొదటిసారి జరగబోతున్న ఈ బదిలీల్లో తన మార్కు కనిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ కమిషనర్‌గా ఉన్నప్పుడు అనేక సంస్కరణలు చేపట్టిన మహేందర్‌రెడ్డి వాటిలో విజయవంతమైన వాటిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే యోచనతో ఉన్నారు. ఇందుకు తగ్గట్టుగానే పోస్టింగులు ఇవ్వవచ్చని భావిస్తున్నారు. అనేక మంది అధికారులు వెయిటింగ్‌లో ఉండటం, కొన్ని జిల్లాల్లోని, కమిషరేట్ల అధికారులకు రెండేళ్ల కాలపరిమితి ముగిసిపోవడం, మరి కొందరి పనితీరు అంచనాలకు తగ్గట్టుగా ఉండటం లేదని భావిస్తున్న నేపథ్యంలో భారీస్థాయిలోనే బదిలీలు ఉండే అవకాశం ఉంది. కేంద్ర సర్వీసుల నుంచి డిప్యుటేషన్ పూర్తిచేసుకొని తిరిగి రాష్ట్ర క్యాడర్‌కు వచ్చిన అదనపు డీజీ సంతోష్ మెహ్రా, ఐజీలు అనిల్‌కుమార్, చౌహాన్‌లు దాదాపు మూడు నెలలుగా వెయిటింగ్‌లోనే ఉన్నారు. ఆదివాసీలు, లంబాడీలకు మధ్య జరిగిన ఘర్షణల నేపథ్యంలో బదిలీ చేసిన కరీంనగర్ డీఐజీ రవివర్మ, ఆదిలాబాద్ ఎస్పీగా పనిచేసిన శ్రీనివాస్‌ల పరిస్థితి ఇదే. ఇక ఆబ్కారీశాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సంచాలకులుగా పనిచేస్తున్న అకున్‌సబర్వాల్ కాలపరిమితి ఈ నెలాఖరుతో ముగిసిపోతుంది. ఆయన మళ్లీ పోలీసుశాఖకు వచ్చే అవకాశం ఉంది. వీరందరినీ సర్దుబాటు చేయాలి. ప్రస్తుతం సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేస్తున్న సందీప్‌శాండిల్యకు అదనపు డీజీగా పదోన్నతి రాబోతోంది. దాంతో ఆయన పోస్టు ఖాళీ అవుతుంది. మహేందర్‌రెడ్డి డీజీపీ అయిన తర్వాత హైదరాబాద్ కమిషనర్‌గా ఎవర్నీ నియమించలేదు. అదనపు కమిషనర్ శ్రీనివాసరావుకే ఆబాధ్యతలు అప్పగించారు. దీన్ని భర్తీచేయాల్సి ఉంది. ఐజీ సజ్జన్నార్ దాదాపు ఐదేళ్లుగా ప్రత్యేక ఇంటెలిజెన్స్ విభాగంలోనే పనిచేస్తున్నారు. ఆయనను మార్చాల్సిఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే జిల్లాల్లో కొంతమంది ఎస్పీల పనితీరుపై ప్రభుత్వం తీవ్ర అసంతృప్తితో ఉంది. అధికారుల కొరత కారణంగా అర్హతలేకపోయినా అవకాశం ఇస్తే అంచనాలను అందుకోలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆదిలాబాద్‌లో ఆదివాసీలు, లంబాడీల మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు సరిగా వ్యవహరించలేదన్న కారణంగా ఆదిలాబాద్ ఎస్పీ శ్రీనివాస్‌ను మార్చారు. తాజాగా నల్గొండ వివాదంనేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారుల బదిలీలు ఉండవచ్చని సమాచారం.

నల్గొండ ఎస్పీపై బదిలీ వేటు!

ఈనాడు, నల్గొండ: సంచలనం సృష్టించిన నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్య కేసుకు సంబంధించి నల్గొండ జిల్లా ఎస్పీపై బదిలీ వేటు పడే అవకాశం ఉంది. రాజకీయంగా దుమారం రేపిన ఈకేసులో మొదటి నుంచీ పోలీసుల వైఖరిపై ఆరోపణలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. దీనికి తోడు కేసు దర్యాప్తు చూస్తున్న సీఐ వెంకటేశ్వర్లు అదృశ్యం మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. ఈ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు విమర్శనాత్మకంగా మారింది. ఈనేపథ్యంలో జిల్లా ఎస్పీతోపాటు దర్యాప్తులో పాలుపంచుకున్న అధికారులనూ మార్చవచ్చని తెలుస్తోంది. శ్రీనివాస్ హత్య జరిగినప్పటి నుంచీ నకిరేకల్ తెరాస ఎమ్మెల్యే వేముల వీరేశంపై ఆరోపణలు వస్తున్నాయి. హత్యకు గురైంది కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అనుచరుడు కావడంతో రాజకీయంగా ఇది దుమారం రేపుతోంది. నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టినపుడు విలేకర్ల ప్రశ్నలకు జిల్లా ఎస్పీ, ఇతర అధికారులు సరిగా సమాధానం ఇవ్వలేకపోయారు. ఈ కేసుకు సంబంధించి ప్రజల్లో ఉన్న అనుమానాలపై ప్రశ్నలు అడిగినపుడు మౌనమే పోలీసుల సమాధానమైంది. కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు అజ్ఞాతంలోకి వెళ్లి రెండు రోజుల తర్వాత వచినా ఈకేసులో ఒత్తిళ్లకు తట్టుకోలేకే సీఐ ఇలాచేశారని ప్రచారం జరిగింది. వీటన్నింటి ప్రభావం అటు పోలీసుశాఖ, ఇటు రాష్ట్ర ప్రభుత్వంపై పడింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీని మార్చవచ్చని భావిస్తున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సర్కారు విఫలం

- ప్రాణహాని ఉందని తెలిసినా రక్షణ కల్పించలేదు
- బొడ్డుపల్లి శ్రీనివాస్ సంతాప సభలో కాంగ్రెస్ నేతలు

ఈనాడు - నల్గొండ



బొడ్డుపల్లి శ్రీనివాస్ మృతికి సంతాపం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో తెరాస సర్కారు విఫలమైందని.. ప్రతిపక్ష పార్టీల కార్యకర్తల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. నల్గొండ పురపాలిక ఛైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్‌కు ప్రాణహాని ఉందని.. రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరినా స్పందించలేదన్నారు. హత్య కేసులో అధికార పార్టీకి చెందిన నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం ప్రధాన పాత్ర పోషించారని.. వాస్తవాలు తెలియాలంటే కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నల్గొండలో నిర్వహించిన శ్రీనివాస్ సంతాప సభలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కుంతియా, సీఎల్పీ నేత జానారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. కాల్ డేటా ఆధారంగా కేసును విచారించాలని పోలీసులను కోరినా స్పందించలేదని ఉత్తమ్ అన్నారు. ఎస్పీని తక్షణం సస్పెండ్ చేయాలన్నారు. బలహీనవర్గాలపై జరుగుతున్న దాడులపై త్వరలోనే రాష్ట్రపతి, కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. కుంతియా మాట్లాడుతూ రాహుల్‌గాంధీతో మాట్లాడి కేసును సీబీఐకి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. జానారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాలను అణిచివేసే విధంగా తెరాస సర్కారు వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస్ హత్య కేసు విచారణ సక్రమంగా జరగడం లేదని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని పోలీసు వ్యవస్థ తెరాస నాయకత్వం కోసమే పనిచేస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భట్టివిక్రమార్క ఆరోపించారు. ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడే వారికి బెయిల్ రాకుండా అడ్డుకుంటున్న ఈ ప్రభుత్వం.. కాంగ్రెస్ నాయకుడిని చంపిన వారికి మాత్రం 5 రోజుల్లోనే బెయిల్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, వీహెచ్, మధుయాష్కి, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీనివాస్ భార్య లక్ష్మి, కుటుంబసభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలు హాజరయ్యారు.

పురుషోత్తమ్ ఎక్కడున్నావ్..?

- అవినీతి అధికారి కోసం అనిశా బృందాల ముమ్మర గాలింపు
- కుమార్తె పేరిట ఉన్న బ్యాంకు లాకర్లు నేడు తెరిచే అవకాశం

ఈనాడు, హైదరాబాద్: హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం సంచాలకుడిగా పనిచేసి సస్పెండైన పురుషోత్తమ్‌రెడ్డి ఆచూకీ కోసం అవినీతి నిరోధక శాఖ బృందాలు గాలింపు ముమ్మరం చేశాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో చిక్కుకున్న ఆయన గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్నాడు. అనిశా దాడులకు ముందే సెలవుపై వెళ్లి అదృశ్యమైన ఆయన కోసం బంధువులు, సన్నిహితుల వద్ద వాకబు చేస్తున్నారు. ఆయన కుటుంబసభ్యులతోపాటు బినామీగా భావిస్తున్న బావమరిది శ్రీనివాసరెడ్డి కూడా కనిపించకుండా పోయారు. ఈ క్రమంలో బోయిన్‌పల్లిలోని పురుషోత్తమ్‌రెడ్డి కుమార్తె, హబ్సిగూడలోని స్నేహితుడు యాదవరెడ్డి, మంచిరేవులలోని వియ్యంకుడు రాధాచరణ్‌రెడ్డి, కూకట్‌పల్లి ఎల్లమ్మబండలోని డ్రైవర్ ఆగమయ్య అలియాస్ రాజు ఇళ్లలో అనిశా అధికారులు ఆదివారం సోదాలు చేశారు. ఏదైనా సమాచారం లభిస్తుందా..? అని ఆరా తీశారు. యాదవరెడ్డి ఇంట్లో చాలా సేపు ఉన్న అనిశా డీఎస్పీ అశోక్‌కుమార్ బృందం పలు విషయాలపై ఆరా తీసింది. డ్రైవర్ ఇంట్లో కీలక సమాచారం లభించినట్లు తెలుస్తోంది. బంధువులు, సన్నిహితులపై ఒత్తిడి పెంచడం ద్వారా పురుషోత్తమ్‌రెడ్డి లొంగిపోయేలా చేసే ప్రయత్నాల్ని అనిశా ముమ్మరం చేసినట్లు సమాచారం. అయితే, రాజకీయ నేతల్ని ఆశ్రయించి కేసు తీవ్రత తగ్గించుకునే దిశగా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మరోవైపు పురుషోత్తమ్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయన బ్యాంకు లాకర్లను తెరిచే అవకాశం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో ఆయన కుమార్తె విధితారెడ్డి పేరిట ఉన్న లాకర్లను సోమవారం తెరిచే అవకాశాలున్నట్లు ఓ అధికారి వెల్లడించారు.



పురుషోత్తమ్‌రెడ్డి డ్రైవర్ ఆగమయ్య ఇంటి వద్ద ఏసీబీ అధికారులు

ఈనాడు

బాల్య వివాహాల బలిపీఠం

'జీవితాల్ని తీర్చిదిద్దుకొనే హక్కు పురుషులకు ఎంత ఉందో మహిళలకూ అంతే ఉంది'- ఈ సమున్నత ఆదర్శానికి గొడుగు పట్టింది జాతిపిత మహాత్మా గాంధీ. సహస్రాబ్దాలుగా పురుషాధిక్య భావజాలం ఊడలు దిగి విస్తరించిన భారతావనిలో- దేశ జనావళిలో దాదాపు సగంగా ఉన్న స్త్రీజాతి హక్కు దిక్కులేనిదే అవుతోంది. అమ్మగర్భంలో ఊపిరి పోసుకొంటున్నప్పటి నుంచే 'ఆడ'పిల్ల పట్ల కనబరుస్తున్న సామాజిక దుర్విచక్షణ- కౌమారప్రాయం రాగానే ఓ అయ్యచేతిలో పెట్టేసి బాధ్యత దులపరించేసుకొనే బాలికా వధువుల మహా జాడ్యమై దేశ ప్రగతికి శాపంగా పరిణమించింది. బాల్య వివాహాల వల్ల ఎంతోమంది బాలికలు హక్కులు కోల్పోతున్నా, వారిని ఆదుకోవడానికి ఎలాంటి పథకాలూ లేవంటూ పదకొండు మంది బాధితులు రాసిన లేఖను ఉమ్మడి హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా విచారణకు స్వీకరించింది. శారీరకంగా, మానసికంగా పరిపక్వం కాని వయసులో వివాహాల వల్ల బాలికలు తీవ్ర అనారోగ్య సమస్యల పాలవుతున్నారని, ప్రసూతి మరణాలూ సంభవిస్తున్నాయని, ఆ గండం గడిచి గట్టెక్కినా పుట్టిన పిల్లలు బలహీనంగా, తల్లులు అనారోగ్య పీడితులుగా ఉంటున్నారనీ అర్జీదారులు చెప్పినదాంట్లో వీసమెత్తు అసత్యం లేదు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు బాల్యవివాహాల బాధితులకు వర్తించడం లేదంటూ వారికి రక్షణ గృహాల ఆశ్రయమూ లేకపోవడాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. బాధిత బాలికలకు విద్యాసంస్థల్లో అయిదు శాతం రిజర్వేషన్, వృత్తిశిక్షణ గరిపి స్వయంఉపాధి అవకాశాలూ కల్పించాలని, బాల్య వివాహాలు చెల్లబోవని ప్రకటించాలనీ వారు అభ్యర్థిస్తున్నారు. 2006 నాటి బాల్యవివాహాల నిషేధ చట్టం ఆచరణలో చట్టుబండలైందనడానికి దేశవ్యాప్తంగా ఏటా లక్షల సంఖ్యలో జరుగుతున్న పెళ్ళితంతులే రుజువు. ఇండియాలో సగటున రోజూ 3,600 బాల్య వివాహాలు నమోదవుతున్నాయని, వాటి కట్టడిపై రాష్ట్రాలు ప్రత్యేకంగా దృష్టి సారించాలని జాతీయ మానవ హక్కుల సంఘం నెల రోజులనాడు చేసిన హెచ్చరికకు మన్నన దక్కితీరాలిప్పుడు!

సతీ సహగమనం, బాల్య వివాహాల వంటి అనాచారాలు భారతీయ సమాజాన్ని అనాగరికంగా మార్చేసి జాతి నీతినే ప్రశ్నార్థకం చేసిన వేళ- రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి వంటి సంస్కరణోద్యమ సారథులు పుట్టుకొచ్చారు. విధవా పునర్వివాహాలను విప్లవీకరించారు. వధూవరుల వయోభేదాలు నేడు గణనీయంగా తగ్గినా, బాల్య వివాహాలకు మాత్రం తెరపడింది లేదు; కోట్లాది బాలికల కన్నీటి ఘోష తెరిపిన పడిందీ లేదు! పద్దెనిమిదేళ్లలోపు బాలికలు ప్రతి ముగ్గురిలో ఇద్దరికి బాల్య వివాహాలతో బంగ్లాదేశ్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలిచి అప్రతిష్ఠ మూటకట్టుకుంటే, దాని వెన్నంటి భారత్, నేపాల్, అఫ్గానిస్థాన్లు ఉన్నాయని 'యునిసెఫ్' అధ్యయనం 2014లో నిర్ధారించింది. భారత్‌లో తొమ్మిదేళ్ల వ్యవధిలో కోటీ 53 లక్షల మంది బాలికలుగానే పెళ్ళిపీటలెక్కారని, ఆ కాలంలో వివాహితుల సంఖ్యలో వారు 20 శాతంగా ఉన్నారని 2011నాటి జనాభా లెక్కలు చాటుతున్నాయి. ఈ మధ్య విడుదలైన జాతీయ కుటుంబ ఆరోగ్య నాలుగో సర్వే- పశ్చిమ్ బంగలో జరిగిన మొత్తం వివాహాల్లో 40.7 శాతం, బిహార్‌లో 39.1 శాతం, ఝార్ఖండ్‌లో 38 శాతం, రాజస్థాన్‌లో 35.4 శాతం బాల్య వివాహాలేనని కుండ బద్దలుకొట్టింది. పదేళ్ల కాలావధిలో పంజాబ్ 61.42 శాతం, కేరళ 50.65 శాతం బాల్య వివాహాల్ని తగ్గించగలిగాయన్న సమాచారం స్ఫూర్తి రగిలించేదే. కర్ణాటక మాదిరిగా బాల్య వివాహాలేవీ చెల్లబోవంటూ, 2006 నాటి సంబంధిత చట్టాన్ని సవరించి తీరాలన్న డిమాండ్లకు మన్నన దక్కాల్సిందే! జాతీయ నేరాల నమోదు సంస్థ గణాంకాల ప్రకారం 2015లో 293, 2016లో 326 మాత్రమే బాల్య వివాహాల కేసులు నమోదయ్యాయి. 2015-16లో ఆంధ్రప్రదేశ్‌లోనే లక్షా 71 వేల పైచిలుకు బాల్యవివాహాలు జరిగాయని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే స్పష్టీకరించిన నేపథ్యంలో- చాపకింద నీరులా ఆ మహా జాడ్యం ఎలా చొచ్చుకుపోయిందో గమనించాలి. సామాజిక, ఆర్థిక మూలాల్లోకి వెళ్ళి విరుగుడు మంత్రం వెయ్యాలి!

ఏడేళ్ల వయసులో తనకు పెళ్ళి కావడాన్ని సవాలు చేస్తూ రాజస్థాన్ జైసల్మేర్‌కు చెందిన పాతికేళ్ల మహిళ మీనాక్షి బిష్ణోయ్ హైకోర్టును ఆశ్రయించారు. బీఈడీ చేస్తున్న తాను ఉపాధ్యాయురాలిగా ఎదగాలనుకొంటుంటే, నిరక్షరాస్యుడైన భర్త ఇంటిపట్టునే ఉండమని వేధించడాన్ని సహించలేక ఆమె చేసిన ఫిర్యాదును మన్నించి కుటుంబ న్యాయస్థానం- మొన్ననే ఆమె బాల్యవివాహాన్ని రద్దు చేసింది. బాల్య వివాహాల ఉరవడి అత్యధికంగా ఉన్న ఒడిశా, అసోం, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, పశ్చిమ్ బంగలలోనే కాదు- రజస్వల అయిన వెంటనే ఆడపిల్లను చదువు సంధ్యలు మాన్పించి పసుపుతాడు పేరిట మెడకు పలుపుతాడు తగిలించే అన్నిచోట్లా- పెళ్ళి పీటలు అక్షరాలా ఆడపిల్లల బలిపీఠాలే అవుతున్నాయి. 15-18 ఏళ్లలోపు వయసున్న భార్యతో శృంగారం నేరం కాదంటున్న చట్టాన్ని నాలుగు నెలలనాడు అడ్డంగా కొట్టేసిన సుప్రీంకోర్టు- ఐపీసీ 375వ సెక్షన్‌లో ఇచ్చిన ఆ మినహాయింపు బాలికల శారీరక గౌరవానికి, భద్రతకు భంగకరమని; స్వేచ్ఛ సమానత్వ సూత్రాల్ని ఉల్లంఘిస్తోందనీ స్పష్టీకరించింది. పరిపూర్ణ మహిళగా ఎదగకుండానే బిడ్డలకు జన్మనిస్తున్న తల్లులు, వారి పిల్లలు ఎంత దుర్బలంగా ఉంటున్నదీ నిరుడు నవంబరులో వెలుగుచూసిన అంతర్జాతీయ పోషకాహార నివేదిక వెల్లడించింది. బాల్య వివాహాల్ని సమర్థంగా నిరోధించగలిగితే ఆరోగ్య భారతావనికి అది తొలిమెట్టు కాగలుగుతుంది. పద్దెనిమిదేళ్ల వయసు దాటేదాకా ప్రతి ఆడపిల్ల నిర్బంధంగా చదువుకోగలిగిన వాతావరణాన్ని కల్పించి, సామాజిక అపోహల్ని దూరం చేసే జనచేతన కార్యక్రమాలతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కదం తొక్కినప్పుడే- చిన్నారి పెళ్ళి కూతుళ్ల వ్యథలకు శాశ్వతంగా చెల్లుచీటీ!

పథకాలు పనిచేస్తేనే... ఆయుష్మాన్ భవ



బడ్జెట్లో ప్రకటించిన 'ఆయుష్మాన్ భారత్' దేశ ఆరోగ్య రంగంపై గణనీయ ప్రభావం కనబరుస్తుంది. అందులో ప్రతిపాదించిన 'మోదీ కేర్' (జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం) ప్రజారోగ్యానికి పూర్తి స్థాయి భరోసాగా నిలుస్తుందన్న మాట వినిపిస్తోంది. అనేక సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న బడ్జెట్లలో ఆరోగ్యరంగం అత్యంత నిరాదరణకు గురైందన్నది నిర్వివాదం. ప్రపంచంలో అనేక దేశాలు తమ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)లో కనీసం రెండు శాతం మేర నిధుల్ని ఆరోగ్య రంగానికి కేటాయిస్తున్నాయి. ఆ ప్రకారం చూస్తే 'ఆరోగ్యం'పై భారత్ చేస్తున్న వ్యయం చాలా తక్కువ. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, రక్షిత మంచినీరు, పారిశుద్ధ్యం వంటి రంగాలకు కలిపి ఉమ్మడిగా కిందటేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేవలం రూ.2.30 లక్షల కోట్లు వ్యయపరచాయి. దేశ జీడీపీలో అది కేవలం 1.4 శాతం. ఆరోగ్యంపై భారత్‌లో ప్రజలు చేస్తున్న ఖర్చు వారి ఆదాయాల్లో 65శాతంగా ఉంటోంది. ఇదంతా వారు సొంతంగా తమ జేబుల్లోంచి తీసి చేస్తున్న ఖర్చు. ప్రపంచంలో మరే దేశంలోనూ ఆరోగ్యం పేరిట ప్రజలు సొంతంగా చేసే ఖర్చు ఈ స్థాయిలో లేదన్నది నిష్ఠురసత్యం. ఈ వ్యయభారం వల్ల ఏటా ఆరుకోట్ల మంది భారతీయులు దారిద్ర్యరేఖ దిగువకు చేరుకుంటున్నారు. జీడీపీలో ఆరోగ్యరంగ వాటాను 1.4శాతం నుంచి 2.5 శాతానికి పెంచాలని; కేంద్ర వాటాను ఇనుమడింపజేయడంతోపాటు రాష్ట్రాలూ తమ బడ్జెట్లలో 2020నాటికి ఆరోగ్యం రంగం కేటాయింపుల్ని ఎనిమిది శాతానికి పెంచాలని జాతీయ ఆరోగ్య విధానం నిర్దేశించింది. ఈ సమస్యకు పరిష్కారంగానే బీమా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. నేటికీ దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో 86 శాతం, పట్టణాల్లో 82 శాతం ప్రజలకు ఎలాంటి బీమా సదుపాయం లేదు. ఎన్డీయే ప్రభుత్వం 2016లో రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన పేరిట ఓ పథకం ప్రారంభించింది. ఆ బీమా మొత్తం రూ.30 వేలు. దాన్ని కేవలం 10 శాతం ప్రజలకే వర్తింపజేయడంతో అది అనుకున్న ఫలితాలను సాధించలేదు. ఇక పలు రాష్ట్రాలు స్వతంత్రంగా పథకాలు తీసుకొచ్చాయి. తెలుగు రాష్ట్రాల్లోనూ రెండు లక్షల రూపాయలతో ఆరోగ్య బీమా అమలవుతోంది. అయినా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనేకానేక సమస్యలు తిష్ఠ వేయడంవల్ల ప్రజలు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ నెలకొని ఉన్నాయి.

స్థానికంగానే చికిత్స

కేంద్ర ప్రభుత్వం నిరుడు జాతీయ ఆరోగ్య విధానం ప్రకటించింది. అనేక సమస్యలకు అందులో పరిష్కారం చూపారు. అమృత్ పేరిట 500 పట్టణాలకు రక్షిత మంచినీటి సౌకర్యం, పారిశుద్ధ్య పథకాలు ప్రారంభించింది. రూ.9,000 కోట్లతో జాతీయ పోషకపదార్థాల మిషన్ ప్రారంభించింది. తాజా బడ్జెట్లో క్షయ రోగుల కోసం రూ.500 కోట్లతో నెలవారీ నగదు సాయం ప్రకటించింది. ఇవి ఇప్పటికే అమలవుతున్న మిగతా పథకాలకు అదనం. జాతీయ ఆరోగ్య విధానంలో ప్రకటించిన లక్ష్యాలకు అనుగుణంగా 'ఆయుష్మాన్ భారత్' కింద రెండు అత్యంత ప్రభావిత పథకాలను కేంద్రం ప్రవేశపెట్టింది. ఆరోగ్య సంరక్షణ కేంద్రాల ఏర్పాటు అందులో ఒకటి. దాదాపు లక్షన్నర కేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య సేవల కోసం ఏర్పాటు చేయనున్నారు. దీనికి ప్రభుత్వంతోపాటు ప్రభుత్వేతర సంస్థలనుంచీ నిధులు అందుతాయి. ఈ కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తే 70 శాతం జబ్బులు స్థానికంగానే నయమవుతాయి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ఉచిత మందులు, పరీక్షల వంటి సేవలు అందజేస్తారు. ప్రసవాలు, చిన్న పిల్లల వైద్యం, జీవనశైలి వ్యాధులు, అంటురోగాలు కాని జబ్బులకు ఈ కేంద్రాల్లో ప్రాథమిక వైద్యం అందిస్తారు. ఈ కేంద్రాలు ఎంత సత్వరం అందుబాటులోకి వస్తే అంత వేగంగా గ్రామీణ భారతంలో ప్రజారోగ్యం మెరుగుపడుతుంది. కానీ, ఇంత కీలక పథకానికి కేవలం రూ.1,200 కోట్లు కేటాయించడం సరికాదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్ల హాజరీ నామమాత్రం అన్నది బహిరంగ రహస్యం. దీనికి విరుగుడుగా కొన్ని రాష్ట్రాలు పరిమిత వైద్య కోర్సుల వంటి ప్రత్యామ్నాయాలతో ముందుకువచ్చాయి. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన జాతీయ వైద్య కమిషన్ చట్టరూపం దాలిస్తే ఈ సమస్యకు కొంతమేర పరిష్కారం దొరుకుతుంది. అందులో ప్రతిపాదించిన 'బ్రిడ్జ్ కోర్సు'ల ద్వారా సమస్యకు పరిష్కారం కనుక్కోవచ్చు. 'మోదీకేర్'గా ప్రచారం పొందుతున్న జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం 'ఆయుష్మాన్ భారత్'లో మరో కీలకాంశం. ఈ పథకం సక్రమంగా అమలైతే దేశంలో దాదాపు 45 నుంచి 50 కోట్ల మంది ప్రజలు గుండెలమీద చేయి వేసుకొని ప్రశాంతంగా నిద్రపోవచ్చు. తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ ఆరోగ్య పథకాలతో ప్రజలకు కొంత మేర ఊరట దక్కుతోంది. అయితే దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఆరోగ్య బీమా పథకాలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన అయిదు లక్షల రూపాయల బీమా పథకం వల్ల కుటుంబంలో ఎవరికైనా పెద్దజబ్బు వచ్చినా, ఒకరికన్నా ఎక్కువమంది అనారోగ్యం పాలైనా డబ్బు సర్దుబాటు గురించి ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. పథకాల అమలులో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమించాలన్న దానిపై ఇప్పుడు ప్రభుత్వం దృష్టి సారించాలి. అవినీతిని నిరోధించాలి. నిఘా పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమానికి రాష్ట్రాల చురుకైన మద్దతు చాలా అవసరం. పథకాలను సమర్థంగా అమలు చేయగల వ్యవస్థలను రాష్ట్రాలు ఏర్పాటు చేసుకోవాలి. మరీ ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్, బిహార్, ఈశాన్య భారతంలో ఈ పథకాల సమర్థ అమలు ఓ పెద్దసవాలు. ప్రభుత్వ ఆసుపత్రులను తొలుత బలోపేతం చేసి, ఆ తరవాత ఈ తరహా పథకాలను ప్రవేశపెడితే సత్ఫలితాలు ఉంటాయి. ప్రైవేటు వైద్యం ఎల్లెడలా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలను ప్రభుత్వ ఆసుపత్రుల వైపు మొగ్గేలా చేయడం ఎంతో అవసరం. ఆ మేరకు సర్కారీ దవాఖానాల్లో ఎప్పటినుంచో తిష్ఠ వేసిన సమస్యలను పరిష్కరించి, ప్రజా విశ్వాసం చూరగొనాలి. 'ఆయుష్మాన్ భవ' కార్యక్రమ అమలుకు నిధుల లభ్యత చాలా కీలకం. ప్రస్తుతం అయిదుగురు సభ్యులున్న కుటుంబానికి అయిదు లక్షల రూపాయల బీమా కల్పించేందుకు ప్రైవేటు బీమా సంస్థలు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు ప్రీమియం వసూలు చేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంతో కోట్ల సంఖ్యలో ప్రజలకు ఊరట దక్కుతుందనడంలో సందేహం లేదు. అయితే ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అటుఇటుగా ప్రీమియంలో సుమారు 60శాతం వాటా భరించాల్సి వస్తుందనుకుంటే- మొత్తంగా కేంద్రానికి రూ.10వేల కోట్లనుంచి రూ.25వేల కోట్ల మేర వ్యయం అవుతుందని అంచనా. ద్రవ్యలోటు కట్టడి కష్టంగా మారుతున్న తరుణంలో ఈ డబ్బును ఏ రకంగా ప్రభుత్వం సమకూరుస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పుడున్న మన వ్యవస్థ- ప్రైవేటు రంగంలో ఆసుపత్రులను నిర్మించగలదేమోగానీ- ఇప్పటికిప్పుడు డాక్టర్లను, నర్సులను తయారు చేయలేదు. వైద్య సిబ్బంది సమస్యను పరిష్కరించాలంటే పార్లమెంటులో ఇప్పటికీ ఆమోదానికి నోచుకోకుండా నానుతున్న జాతీయ వైద్య కమిషన్ బిల్లును ఆమోదించి చట్టంగా మార్చాలి.

కేంద్ర బడ్జెట్‌లో ప్రజారోగ్య పద్దు

జాతీయ వైద్య కమిషన్ బిల్లు- ముఖ్యాంశాలు

- భారతీయ వైద్య మండలి స్థానే పాతికమంది సభ్యులతో కూడిన జాతీయ వైద్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. అందులో మెజారిటీ సభ్యులు వైద్య వృత్తికి చెందినవారే ఉండాలి. వారిలో అయిదుగురు సభ్యులు ఎన్నికవుతారు.
- అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్, రేటింగ్‌లు, కళాశాలల ధ్రువీకరణకోసం నాలుగు స్వతంత్ర సంస్థలను ఏర్పాటు చేయాలి.
- ప్రస్తుతమున్న తనిఖీ విధానం బదులు రేటింగులతో కళాశాలలకు గుర్తింపు ఇవ్వాలి (దీంతో 'ఇన్‌స్పెక్టర్ రాజ్' ఉనికిలేకుండా పోతుంది).
- కోర్సు పూర్తయిన విద్యార్థులకు దేశవ్యాప్తంగా ఉమ్మడి తుది పరీక్ష నిర్వహించాలి. వైద్య వృత్తిలోకి ప్రవేశించడానికి ముందు ఈ పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి.



- ఈ పరీక్షలో వచ్చిన ఫలితాలను బట్టి దేశవ్యాప్తంగా వివిధ కళాశాలల నాణ్యత బోధపడుతుంది. దాన్నిబట్టి 'రేటింగ్స్' సైతం ప్రభావితమవుతాయి.
- 'ఆయుష్'లోని డాక్టర్లకు అల్లోపతి వైద్య విధానం నేర్చుకోవడానికి 'బ్రిడ్జ్' కోర్సు ద్వారా అవకాశం కల్పించాలి.
- మొత్తం వైద్య సీట్లలో 40శాతాన్ని క్రమబద్ధీకరణ రుసుముతో కేటాయించాలి. మిగిలిన 60 శాతం సీట్లకు సంబంధించి ఫీజు నిర్ణయాధికారం కళాశాలలదే!
- గుర్తింపు పొందిన వైద్య విద్యా సంస్థలు అదనంగా సీట్లు పెంచుకోవడానికి, కొత్తగా పీజీ కోర్సులు ప్రారంభించుకోవడానికి 'కమిషన్'తో పని లేదు. (దాంతో సీట్ల సంఖ్య మార్కెట్‌కు అనుకూలంగా పెరుగుతుంది)

సమన్వయంతో సత్ఫలితాలు

భారతీయ వైద్య మండలి వైద్యవిద్యను సమర్థంగా పర్యవేక్షించే క్రమంలో పూర్తిగా విఫలమైంది. జాతీయ అవసరాలకు అనుగుణంగా డాక్టర్లను తయారుచేయడంలో, మెడికల్ సీట్ల పారదర్శక కేటాయింపులో ఘోర వైఫల్యం చెందింది. ఏటా సీట్ల కేటాయింపు కుంభకోణాలు, వైద్య కళాశాలల పర్యవేక్షణలో అవకతవకలు పరిపాటిగా మారాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే అలహాబాదు హైకోర్టు జడ్జిపైనా తీవ్ర అభియోగాలు వెలువడటం గమనార్హం. భారతీయ వైద్య మండలికి ఎన్నికల ద్వారా బోర్డు సభ్యులు ఎన్నికవుతారు. అందులో భారత వైద్య సంఘం (ఐఎమ్ఏ) కీలకపాత్ర పోషిస్తుంది. వాస్తవానికి దేశంలో రిజిస్టరయిన డాక్టర్లలో పాతిక శాతమైనా ఐఎమ్ఏలో చురుకైన సభ్యులుగా లేరు. ఇది ఓ వ్యవస్థీకృత స్వార్థ సంస్థగా తయారయింది. దీనిపై అధ్యయనం చేసిన రెండు కమిటీలు సంస్కరణలను ప్రతిపాదించాయి. రంజిత్ రాయ్ కమిటీతోపాటు పార్లమెంటు స్థాయీసంఘం పూర్తి వివరణలతో నివేదికలు సమర్పించాయి. ఈ నివేదికల ఆధారంగానే నీతి ఆయోగ్ జాతీయ వైద్య కమిషన్ బిల్లును రూపొందించింది. గ్రామీణ ప్రాంత ప్రజలు అధికంగా ఉన్న భారతదేశంలో ప్రాథమిక దశలోనే రోగాన్ని గుర్తించి చికిత్స అందించడం అత్యవసరం. దీనివల్ల ప్రజలకు ఆరోగ్యంతో పాటు, డబ్బు ఆదా అవుతుంది. అందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలు ఎంతగానో అక్కరకు వస్తాయి. కార్యక్రమాల అమలులో చిత్తశుద్ధి లోపించి, అలసత్వం ప్రబలితే పథకాల స్ఫూర్తి నీరుగారుతుంది. ప్రభుత్వ యత్నాలతోపాటు స్థానిక సంస్థలు, పౌరసంఘాలు, ప్రజల భాగస్వామ్యం పెంచడం ద్వారా ఆరోగ్య పథకాలు మెరుగైన ఫలితాలు అందజేసేలా ప్రభుత్వం సకల జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం.

- రామ్

లెక్కలు తేలుతున్నాయి...

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అసోమ్‌లోని అసలైన భారత దేశ పౌరులను గుర్తించే ప్రక్రియలో మొదటి దశ పూర్తయింది. డిసెంబరు 31, 2017న పౌరుల జాతీయ రిజిస్టర్ (అసోం) ముసాయిదా ప్రతిని విడుదల చేశారు. ప్రస్తుత అసోం రాష్ట్ర జనాభా 3.29 కోట్లు. ప్రాతిపదిక తేదీగా మార్చి 24, 1971ని నిర్ణయించారు. ఆ తరవాత రాష్ట్రంలోకి వచ్చినవారిని (స్వదేశీయులు మినహాయించి) అక్రమంగా వలస వచ్చినవారిగానే పరిగణిస్తారు. ముసాయిదాలో 1.9 కోట్ల ప్రజల వివరాలను మాత్రమే విడుదల చేశారు. పేర్లు లేనివారు ఆందోళన చెందవద్దని, మరో దఫాలో వివరాలు సేకరించి ఈ నెల లేదా మార్చిలో ప్రకటించనున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. పౌరుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి ఈ ఏడాది చివరినాటికి వివిధ సవరణలతో పూర్తి జాబితా విడుదల చేయనున్నారు.

బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు అక్రమ వలసలు ఎప్పటినుంచో కొనసాగుతున్నాయి. దానివల్ల ఒక రాష్ట్ర ప్రజలు తమ స్వరాష్ట్రంలోనే మైనారిటీలుగా మారే స్థితి అసోమ్‌లో ఏర్పడింది. ప్రపంచంలోని అత్యంత పేదరిక దేశాల్లో ఒకటైన బంగ్లాదేశ్‌తో భారత్‌కు దాదాపు నాలుగు వేల కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉంది. నిఘా లోపించడం, ఓటు బ్యాంకు రాజకీయాలు, అవినీతి అధికారగణం... తదితర కారణాల వల్ల భారత్‌లోకి బంగ్లాదేశీయుల అక్రమ వలసలు కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి పశ్చిమ్ బంగ, ఈశాన్య రాష్ట్రాల్లో అక్రమంగా వలస వచ్చేవారి సంఖ్య కోట్లకు చేరుతోంది. ఇప్పటికీ భారత్‌లో ఎంతోమంది బంగ్లాదేశీయులు అక్రమంగా తిష్ఠ వేశారన్న అంశంపై సరైన గణాంకాలు లేవు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బంగ్లాదేశీయులు విస్తరించి ఉన్నారన్నది నిఘావర్గాల సమాచారం.

ఓటుబ్యాంకు రాజకీయాలతో చేటు

అసోం బ్రహ్మపుత్ర నదీలోయ పరిధిలో ఉండటంతో సారవంతమైన భూములకు కొదవలేదు. అదే సమయంలో బంగ్లాదేశ్‌లో అధిక జనాభా సమస్యతోపాటు పేదరికం తాండవిస్తోంది. దీనివల్ల లక్షలాదిమంది జీవనోపాధి కోసం భారత్‌కు వస్తున్నారు. 1980 ప్రాంతాల్లో బంగ్లాదేశీయుల అక్రమ వలసలను వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఆసు) నాయకత్వంలో భారీ ఉద్యమాలు నిర్వహించాయి. ఆ ఆందోళనలతో రాష్ట్రం అట్టుడికిపోయింది. 1985లో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ సారథ్యంలో అస్సాం ఒప్పందం కుదిరింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోకి మార్చి 25, 1971న గాని, అనంతరం వచ్చిన వారిని గుర్తించి వారిలో బంగ్లాదేశీయులు ఉంటే వెనక్కు పంపించేయాలని నిర్ణయించారు. 1951లో రాష్ట్రంలో తొలిసారిగా పౌరుల వివరాలను నమోదు చేశారు. వాటినే ప్రాతిపదికగా తీసుకుని తాజాగా వివరాలు సేకరించడం సముచితమైన నిర్ణయం అవుతుందని జాతీయ భద్రతా నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ చర్యలు ఎప్పుడో తీసుకోవాల్సింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేయడంతో సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోయింది. 2005లో ఆసు, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రం మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశాల్లో ఈ అంశం చర్చకు రావడంతో రెండేళ్లలో పౌరుల వివరాలు సేకరించాలని నిర్ణయించారు. ఆపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కేంద్రంలో యూపీఏ, రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఉన్నా సమయాన్ని సాగదీశారు. లక్షలాది బంగ్లా వలసవాదులకు రాష్ట్రంలో ఓటుహక్కు కల్పించడంతో వారు వివిధ రాజకీయపక్షాలకు ఓటుబ్యాంకులుగా మారారు. 2009లో జరిగిన సమావేశంలో విద్యార్థి సంఘం ఈ అంశాన్ని మళ్ళీ లేవనెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా పౌరుల వివరాల నమోదు కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. 2010లో బార్పేట, చాయగావ్‌లో సర్వే నిర్వహించారు. దీనికి వ్యతిరేకంగా ఆల్ అస్సాం మైనారిటీ స్టూడెంట్స్ యూనియన్ చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపేశారు. దాదాపు రెండున్నర దశాబ్దాలపాటు అత్యంత కీలకమైన ఈ అంశాన్ని ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ధుబ్రి, గోల్‌పర, బార్పేట, మోరీగావ్, నాగౌన్, ధెమాజీ, కచార్, కరీంగంజ్... తదితర జిల్లాల్లో అక్రమ వలసలు యథేచ్ఛగా సాగడంతో జనాభా స్వరూపమే మారిపోయింది. 2009లో అక్రమ వలసల అంశంపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్‌లు దాఖలయ్యాయి. 1951 నాటి పౌరుల రిజిస్టర్ వివరాల మేరకు, 1971ను ప్రాతిపదిక సంవత్సరంగా నిర్ణయిస్తూ తాజా వివరాలను నమోదు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో కదలిక వచ్చింది. 2014 లోక్‌సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కొలువుతీరడంతో కేంద్ర న్యాయశాఖ సూచనలతో కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్‌ను జారీచేసింది. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా సీనియర్ అధికారి ప్రతీక్ హజేల నియమితులయ్యారు. జనవరి ఒకటి, 2016 కల్లా ముసాయిదాను ప్రచురించాల్సి ఉండగా ప్రతీక్ అభ్యర్థన మేరకు న్యాయస్థానం రెండేళ్ల గడువును పొడిగించింది. ముసాయిదా ప్రతి విడుదల సందర్భంగా ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదు. జాబితాలో ఒకే కుటుంబంలోని కొందరి పేర్లు ఉండటం, మరి కొందరివి లేకపోవడం గందరగోళానికి తావిచ్చింది. అలాంటి తప్పులను తదుపరి జాబితాల్లో పరిహరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ప్రజలకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది.



అసోమ్‌లో వలసలకు కళ్లెం

వేటుతప్పదు

అసోమ్‌లో అసలైన పౌరులను గుర్తించేందుకు సుప్రీం పర్యవేక్షణలో అధికార యంత్రాంగం భారీ కసరత్తు చేస్తోంది. పరిశీలనకు 5.5 లక్షల పత్రాలు వచ్చాయి. వాటిలో 1.5 లక్షల పత్రాలను పరిశీలించారు. ఈ ప్రక్రియ పూర్తి చేయడానికి అధికారగణం తీవ్రంగా శ్రమిస్తోంది. ఏడాది చివరి నాటికి తుది జాబితా విడుదల చేయాల్సి ఉంది. జాబితాలో లేనివారిని అక్రమంగా వలస వచ్చినవారిగా గుర్తిస్తారు. వీరిలో బంగ్లాదేశీయులు ఉంటే వారిని స్వదేశానికి పంపించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇది కేంద్రానికి సహజంగానే పెద్ద సమస్య అవుతుంది. తమ దేశం నుంచి భారత్‌లోకి ఎవరూ అక్రమంగా ప్రవేశించలేదని బంగ్లా వాదిస్తుండటమే అందుకు కారణం. ఈ అంశంపై బంగ్లాదేశ్‌తో చర్చలు జరపాలని 2014లో కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. బంగ్లాదేశ్ తన పౌరులను వెనక్కు తీసుకోకపోతే ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై స్పష్టత లేదు. ఇప్పటికే అసోమ్‌లోకి వలస వచ్చిన బంగ్లాదేశీయులను అక్రమ చొరబాటుదారులుగా ట్రిబ్యునళ్లు నిర్ధారించాయి. వీరిలో వేలాదిమంది ఇతర రాష్ట్రాలకు పారిపోయారు. వారంతా ఎక్కడ ఉంటున్నారన్న విషయమూ తెలియకపోవడం ఆందోళన కలిగిస్తున్న అంశమే. ప్రత్యామ్నాయంగా అక్రమంగా వలసవచ్చిన బంగ్లాదేశీయులకు 'పర్మిట్లు' ఇచ్చి పౌరసత్వానికి సంబంధించిన అన్ని హక్కులను తొలగించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. జాతీయ రిజిస్ట్రార్‌లో అసోమ్‌కు సంబంధించిన లెక్కలే కాకుండా, ఇతర ఈశాన్య రాష్ట్రాలతో పాటు పశ్చిమ్ బంగ రాష్ట్రంలోనూ లెక్కలు తీయాలని నిపుణులు సూచిస్తున్నారు. మిడతల దండు లాగా వచ్చి పడుతున్న బంగ్లాదేశీయులతో ఈశాన్యంలో ఆందోళనకర వాతావరణం నెలకొంది. మరో వైపు బంగ్లాదేశ్ నుంచి వచ్చిన హిందువులకు పౌరసత్వ హక్కులు కల్పించి బంగ్లా ముస్లిములను అక్రమ వలసదారులుగా తిప్పి పంపాలన్న భాజపా ప్రతిపాదనపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. అసోమ్‌లో ఉంటున్న బంగ్లాదేశీయులు అందరిని వెనక్కు పంపాలన్న అంశంపై రెండో అభిప్రాయానికి తావు లేదని రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షమైన అసోం గణ పరిషత్ ఇప్పటికే స్పష్టీకరించింది. దీంతో ఈ వ్యవహారం రాష్ట్ర సర్కారుకు కత్తిమీద సాముగా మారింది.

2011 జనాభా లెక్కల ప్రకారం అసోం జనాభా 3.12 కోట్లు. జాతీయ రిజిస్ట్రార్ 1951, ఓటర్ల జాబితా 1971 ప్రకారం రాష్ట్రంలో కచ్చితమైన లెక్క తేలనుంది. ఈ జాబితాల్లో ఉన్నవారు, వారి సంతతికి చెందినవారు భారత పౌరులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. భవిష్యత్తులోనూ ఇలాంటి సమస్య తిరిగి ఉత్పన్నం కాకుండా సరిహద్దుల్లో పటిష్ఠమైన పహరా నిర్వహించేందుకు అధునాతన నిఘాసామగ్రిని భద్రతాదళాలకు అందించాలి. బంగ్లాదేశ్‌తో కలిసి సంయుక్తంగా గస్తీ నిర్వహిస్తే అక్రమ వలసలకు కళ్లెం వేసినట్లవుతుంది!

- కొలకలూరి శ్రీధర్

అంతర్యామి

ధైర్య గుణం

పుట్టుకతోనే ఎవరూ ధైర్యసాహసాల్ని వెంట తెచ్చుకోరు. పరిస్థితులు, అనుభవాలే మనిషిని అలా తీర్చిదిద్దుతాయి.


నెపోలియన్ అంతటి యోధుడూ మొదట్లో పలు సమస్యల్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ తరవాత వాటన్నింటినీ అధిగమించాడు. జీవితంలో ధైర్యంగా ఉండటాన్ని అభ్యసించాడు. సాహస ప్రవృత్తిని అలవరచుకున్నాడు. అది మనిషికి ఎంత గొప్ప శక్తినిస్తుందో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు.

మహాభారతంలో- కురుక్షేత్ర యుద్ధం గెలిచిన అనంతరం అర్జునుడికి వేల ఏనుగుల బలం కలిగింది. గీతాచార్యుడి విశ్వరూప దర్శనంతో, ఆత్మజ్ఞానానుభూతి పొందాడు. మానవ సంబంధాలకు అర్థం, పరమార్థం దైవశక్తేనని తెలుసుకున్నాడు. అదే తన వెంట ఉండి నడిపించిందని సంపూర్ణంగా గ్రహించాడు. ధైర్యానికి ఒక కొత్త నిర్వచనం కనుగొన్నాడు.

ప్రతి మనిషీ ధైర్యాన్ని అభ్యసించి అభివృద్ధి చేసుకోవాలి. సాహసించి ముందడుగు వేయాలి. అతడు తనకు తాను స్ఫూర్తి పొంది, నిర్భయంగా ముందుకు సాగితే అందరూ మెచ్చుకుంటారు. పిరికివాళ్లను ఎవరూ పట్టించుకోరు, ఎన్నటికీ గౌరవించరు. ధైర్యం ప్రదర్శిస్తే, మానవుడు శక్తిశాలిగా వెలుగొందుతాడు. తన అపార పటిమతో అవతలివారిని ఆశ్చర్యచకితుల్ని చేయగలుగుతాడు.

ఆంజనేయస్వామి వేగం, సాహసోపేత నిర్ణయాలు ఎవరికీ అంతుపట్టేవి కావు. ఆయన ఆత్మసంయమనం ఎవరి మేధకీ అందేది కాదు. రాముడి పట్ల నిరంతర భక్తితత్పరత, వినయ సంపన్నత కనబరచేవాడు. ఆ మధుర భాషణం రామచంద్రుణ్ని మంత్రముగ్ధం చేసింది. సీతాన్వేషణ సందర్భంలో, ఆ తరవాత యుద్ధసమయంలోనూ మహా పరాక్రమశాలిగా విజృంభించిన మారుతిని చూసి లంక సమస్తం గజగజలాడింది. ఆయన ధైర్యసాహసాలు శత్రువుల్ని ఆసాంతం వణికించాయి.

మనిషి కొన్నిసార్లు ఉత్తర కుమారుడిలా ప్రవర్తిస్తాడు. విపరీతమైన పిరికితనం ప్రదర్శిస్తాడు. అందరూ తనను ఇష్టపడాలని కోరుకునే మానవుడే, సాహస కార్యాలు చేయాల్సి వచ్చినప్పుడు వెనకడుగు వేస్తుంటాడు. ఏం చేస్తే ఏమవుతుందో అని ఎప్పుడూ భయపడుతుంటాడు. ఇంకొకరు తన గురించి ఏమనుకుంటారో అని జంకుతూనే ఉంటాడు. అలాంటి భయసంకోచాలు వీడినప్పుడే- అతణ్ని విజయం వరిస్తుంది.



ధైర్యవంతుల్ని ఎవ్వరైనా ఆరాధిస్తారు. వారితో ఎప్పుడూ సాన్నిహిత్యాన్ని కోరుకుంటారు. అటువంటి ఆత్మవిశ్వాసం తమకూ ఉంటే బాగుంటుందని అనుకుంటారు. ఏ మనిషికైనా ధైర్యం లోపలి నుంచి రావాలి. అలాగని కొంతమంది మాత్రమే ధైర్యవంతులని అనుకోరాదు. ధైర్యసాహసాలు పుట్టుకతోనే వస్తాయని భావించకూడదు. మంచి పనులు చేసేవారికి సహజంగానే ధైర్యం ఉంటుంది. ఉండాలి కూడా. మంచిచేసేవారికి దైవ ఆశీర్వచనమే ధైర్యం రూపంలో లభిస్తుంది. దానికి సాహసం జతపడితే, జీవితంలో అద్భుతాలు జరుగుతాయి. ధైర్యంచేస్తేనే విజయం లభిస్తుందని పురాణ గాథలు చెబుతాయి.

ఇతరులెవరూ చేయలేనిది చేయడమే ధైర్యం! తాను నమ్మినదానిమీద నిలబడాలంటే, మనిషికి ధైర్యగుణం ఉండి తీరాలి. మానసిక ధైర్యం అన్నింటికంటే గొప్పది. అదే నిజమైనది. దేశరక్షణ కోసం- కుటుంబసభ్యులకు దూరంగా, ఎండలో వానలో చలిలో సరిహద్దుల వద్ద విధులు నిర్వర్తిస్తారు వీరసైనికులు. వారి సాహసం తిరుగులేనిది. దాన్ని తలచుకుంటూ, అందరూ ధైర్యంగా ఉండాలి. ధైర్యమే జీవితమని తెలుసుకొని మసలాలి!

- ఆనందసాయి స్వామి



కొల్లేటిలో సర్కారు సీమంతం

ఎక్కడి నుంచో వస్తాయి. గుంపులుగా వస్తాయి. గంపెడాశతో వస్తాయి. సమూహంగా వచ్చినా ఇక్కడికి చేరే వరకూ ఒంటరి పక్షులే! కొల్లేటి సరస్సుకు చేరుకోగానే.. వీటికి సరసం పుట్టుకొస్తుంది. జోడిని చూసుకుంటాయి. పద్ధతిగా గూళ్లు కట్టుకుంటాయి. పొందికగా సంసారం చేస్తాయి. గుట్టుగా గుడ్లు పెడతాయి. ఒద్దికగా పొదుగుతాయి. పురిటికి పుట్టింటికి వచ్చిన ఆడకూతురు.. చంటిబిడ్డతో మళ్లీ అత్తారింటికి పోయినట్టు.. పసిపక్షులకు రెక్కలొచ్చాక మళ్లీ అత్తారింటికి వెళ్లిపోతాయి. ఇదీ కొల్లేటి సరస్సుకు వలస వచ్చే పెలికాన్ పక్షుల సంగతి.

పేరుకు విదేశీ అతిథులైనా..

అన్నీ ఇక్కడ పుట్టినవే! అందుకే ఈ విహంగాలు రాగానే కొల్లేరు కోలాహలంగా మారిపోతుంది. నీటిపై వీటి విన్యాసాలు చూసేందుకు అందరూ ఆసక్తి చూపిస్తుంటారు. ఈ సంబరాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'పెలికాన్ ఫెస్టివల్'గా నిర్వహిస్తోంది. ఆదివారం మొదలైన పక్షుల పండగ మరో రెండు రోజులు అలరించనుంది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల సరిహద్దుల్లోని కొల్లేరు సరస్సు పెలికాన్ (గూడబాతు) విన్యాసాలకు వేదికగా నిలుస్తోంది. ఇక్కడి ఆటపాక సంరక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న పెలికాన్ పండగను సంతానోత్పత్తికి తరలివచ్చిన విదేశీ విహంగాలకు సీమంతంగా అభివర్ణిస్తారు.

పొడవాటి ముక్కు..

అందమైన రెక్కలున్న పెలికాన్ పక్షుల్లో చాలా రకాలున్నాయి. స్పాట్‌బిల్డ్, డాల్మేషియ్, పింక్ బ్యాక్డ్, ఆస్ట్రేలియన్, పెరువియన్ ఇలా బోలెడు. సైబీరియా, ఆస్ట్రేలియా నుంచి ఎక్కువగా వస్తాయి. అమెరికన్ వైట్ పెలికాన్‌లు అరుదుగా విచ్చేస్తాయి. అక్కడ వేసవిని భరించలేక వేల కిలోమీటర్లు దాటి వచ్చి.. ఇక్కడ శీతాకాలాన్ని ఆస్వాదిస్తాయి.



నవంబర్-డిసెంబర్ మధ్య ఇక్కడికి వచ్చే పెలికాన్లు... మార్చి-ఏప్రిల్ వరకూ ఉండి పిల్లలను కని స్వస్థలాలకు వెళ్లిపోతాయి.

కూడు.. గూడు..

మగ పెలికాన్ కొల్లేరులో రెక్కలు చాచుకొని రాజసంగా తిరుగుతూ ఆడపక్షిని ఆకర్షిస్తుంది. అలా జట్టుకట్టిన పక్షులు ముందుగా కొల్లేరులోని మట్టి దిబ్బలపై ఓ గూడు నిర్మించుకుంటాయి. మగ పక్షి పుల్లలు, ఆకులు, తీగలు తీసుకువస్తే ఆడ పక్షి గూడు అల్లుతుంది. జతకట్టిన వారం, పది రోజుల్లో మూడు నుంచి ఆరు గుడ్లు పెడతాయి. రెండు పక్షులూ కలిసి 30 నుంచి 36 రోజులు గుడ్లను పొదుగుతాయి. రక్షణగా ఒక పక్షి ఎప్పుడూ గూట్లోనే ఉంటుంది. ఇంకో పక్షి ఆహారం సేకరించి తెస్తుంది. గూడు నుంచి గుడ్డుగానీ, పిల్లగానీ జారి కిందపడిందా.. వాటిని మళ్లీ చేరదీయవు. అలాగే వదిలేస్తాయి. పిల్లలు పుట్టాక 25 రోజుల పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటాయి. ఆరు నుంచి ఎనిమిది వారాల వయసులో చిట్టి పక్షులు ఈదడం నేర్చుకుంటాయి. మూడు నెలల్లోగా పక్షులకు రెక్కలు పూర్తిగా రావడంతో సమూహంలో కలిసిపోతాయి.

ఎం. రామకృష్ణ, కృష్ణాడెస్క్

సరస్సులో సందడి



మా చిరునామా: వారెవ్వా! ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

varevva@eenadu.in

ఎంతున్నా... అంతస్తే!



కట్టు'బాట'

అనగనగా ప్రకాశం జిల్లాలోని ఓ ఊరు...

ఆ ఊర్లో ఓ నృసింహాలయం...

అయితే ఏంటి... చాలా ఊర్లలో ఆలయాలుంటాయిగా అనంటారా...

ఆ స్వామి కొలువైనందున ఆ గ్రామంలో కొన్ని నియమాలు పాటిస్తారు...

ఆ నియమాలే ఆ గ్రామాన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి...

ఆ ఊరి పేరు పాత సింగరాయకొండ. ఇదో ప్రఖ్యాత లక్ష్మీ నృసింహ క్షేత్రం. ఇక్కడ చాలామందికి తెలియని ఓ వింత ఆచారం ఇక్కడ అమలులో ఉంది. ఒకటి కాదు... రెండు కాదు... వందల ఏళ్ల నుంచి అది అమలులో ఉంది. కోరిన కోర్కెలు తీర్చే ఆపద్బాంధవుడిగా నృసింహ స్వామిని ఇక్కడి ప్రజలు కొలుచుకుంటారు. స్వామి సేవలో తరించేందుకు శతాబ్దాల క్రితం ఇక్కడ పాత సింగరాయకొండ గ్రామం ఏర్పడింది. కొండపై వెలసిన ఈ స్వామిని పూజిస్తూ చుట్టూ ఉన్న అడవిని బాగు చేసుకొని పొలాలుగా మార్చి పంటలు పండించడం ప్రారంభించారు. క్రమంగా గ్రామంలో ప్రజల ఆదాయం పెరిగింది.

కానీ...

ఇక్కడ మనం ఎంత వెతికినా డాబాలు మాత్రమే కనిపిస్తాయి. అంతస్తుల మేడలు లేనేలేవు. రెండో అంతస్తు వేస్తే స్వామి కంటే ఎత్తులో ఉంటామని దీని వల్ల స్వామి అనుగ్రహం తమకు కలగదని వారి నమ్మకం. స్వామి దయ ఎల్లప్పుడూ తమపై ఉండాలనే కోరికతో ఒక్క స్లాబ్‌తో మాత్రమే ఇంటిని నిర్మిస్తారు. ఎంతటి ధనవంతులైనా కేవలం సాధారణ ఇళ్లలోనే ఉంటారు. సుమారు 400 ఏళ్ల క్రితం గ్రామం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఇదే సంప్రదాయం కొనసాగుతోంది.

గ్రామంలో వివాహాలన్నీ లక్ష్మీనృసింహుని సన్నిధిలో జరగాల్సిందే. లక్ష్మీ నృసింహ స్వామికి స్థానికంగా తాత స్వామి అని, తాతయ్య దేవుడని పిలుచుకుంటారు. అందుకే గ్రామంలో ఇంటికో పేరైనా తాతయ్య, నరసింహ అని ఉండి తీరాల్సిందే.

– బుర్రా మల్లికార్జునరావు, న్యూస్‌టుడే, సింగరాయకొండ



అది జూబ్లీహిల్స్‌లో ఉండే 'గెట్ ఆన్ బోర్డ్ కేఫ్'.. లోపలికి అడుగెడుతూనే మాటలు, అరుపులు, కేకలు.. ఒకరికొకరు చురకలేసుకుంటున్నారు. నవ్వుల గలగలలూ వినిపిస్తున్నాయి. విచిత్రమేంటంటే అక్కడ గేమ్స్ ఆడే వారిలో ఎక్కువ మంది యువతే. వాళ్లెవరూ స్మార్ట్‌ఫోన్లను పట్టించుకోవట్లేదు. వాట్సప్ బీప్ సౌండ్స్, ఫేస్‌బుక్ లైక్స్, ఇన్‌స్టాగ్రామ్ షేరింగ్స్‌ను మర్చిపోయి బోర్డు గేమ్స్ ఆడుతున్నారు. కాఫీలు తాగుతూ, రైస్‌బౌల్ తింటూ ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఏకాగ్రతగా ఆటలాడుతున్నారు. వారిలో కొందరు స్నేహితులున్నారు. కొత్తగా పెళ్లయిన ఓ రెండు జంటలున్నాయి. అరవై ఏళ్ల అమ్మమ్మతో కలిసి ఇరవై ఏళ్ల మనవరాలు ఆడుతోంది. డిజిటల్ కాలుష్యానికి దూరంగా.. ఆటలకి దగ్గరగా కాలాన్ని ఖర్చుచేస్తున్నారు. నగరంలో ఎక్కడెక్కడో ఉన్న వారిని ఒకచోటకి చేర్చుతున్న గెట్ ఆన్ బోర్డు ఆ క్షణంలో 'బంధాల్ని కట్టి ఉంచే దారం'లా కనిపించింది.



అక్కడికి వెళితే 700 ఆటలు

బోర్డ్ గేమ్స్ అంటే... మన క్యారమ్స్, చెస్ లాంటివే. ఒక బల్లపైన ఆడుకునేవి అని అనుకోవచ్చు. సీక్వెన్స్, డ్రాగెన్ ఉడ్, స్ప్లెండర్ తదితరాలు ఈ కోవలోకి వస్తాయి. అమెరికా, యూరప్‌లాంటి దేశాల్లో 1995 నుంచి బోర్డ్ గేమ్స్ సంస్కృతి ఊపందుకుంది. 'కెటాన్' ఆట గేమింగ్ ప్రపంచంలో ఓ విప్లవాన్నే తీసుకొచ్చింది. ఈ ఆటల డిజైనర్స్‌తో పాటు గేమ్స్‌ను అందంగా తీర్చిదిద్దే ఆర్టిస్టులకూ ఉపాధి లభిస్తోంది. వీటిని సులువుగా నేర్పించే గేమ్ గురువులు పుట్టుకొచ్చారు.

మనకు అష్టాచెమ్మా, పులిగీతం, పరమపద సోపానం, చెస్, క్యారమ్స్.. ఇంట్లో కూర్చుని హాయిగా ఆడుకునే ఆటలు తెలుసు. అయితే జూబ్లీహిల్స్‌లోని 'గెట్ ఆన్ బోర్డ్ కేఫ్'లోకి అడుగెడితే మాత్రం.. కళ్లెదురుగా ఏడు వందలకి పైగా బోర్డు గేమ్స్ పలకరిస్తాయి. మొదట ఆశ్చర్యంగా ఉన్నా, ఆ తర్వాత ఏ గేమ్ ఆడాలనే గందరగోళానికి గురి చేస్తుంది ఆ వాతావరణం. 'దేశంలోనే అత్యధిక ఆటలు ఉండే బోర్డ్ గేమ్ కేఫ్ మాది. ఎవరైనా సరే ఇక్కడికొచ్చి వాటిని చూస్తే చాలు.. బాల్యంలోకి వెళ్తారు. ఆడుతూ సమయాన్నే మర్చిపోతారు' అంటారు గెట్ ఆన్ బోర్డ్ కేఫ్ యజమాని భుజంగరావు. విశేషమేంటంటే ఆయన భార్య శిరీష బెహరా కూడా గేమ్ లవరే. ఈ ఇద్దరే ఈ కేఫ్‌ను నడిపిస్తున్నారు.

సరదాకి ప్రారంభమై..

బోర్డు గేమ్స్‌కు అమెరికా, యూరప్, రష్యాల్లో డిమాండ్. ఆర్నెళ్ల పాటు మంచు పడుతుంది కాబట్టి వీటిపై వాళ్లు ఆసక్తి చూపుతారు. అమెరికాలో ఈ గేమ్స్‌కి పెద్ద మార్కెట్ ఉంది. రాజమండ్రికి చెందిన భుజంగరావు, వైజాగ్‌లో పుట్టి పెరిగిన శిరీషకి చిన్నప్పటినుంచీ బోర్డు గేమ్స్ గురించి తెలీదు. పెళ్లయ్యాక ఉద్యోగ నిమిత్తం అమెరికా వెళ్లారు. అక్కడే వారికి ఇవి పరిచయమయ్యాయి. 'మా ఆయన ఓ సారి సరదాగా 'టికెట్ టు రైడ్' గేమ్ నేర్పించారు. చిన్నప్పటి నుంచీ



ఎందుకో గేమ్స్ అంటే పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. బోర్డు గేమ్స్ ఆడటం మొదలయ్యాక ఆసక్తి పెరిగింది. శని, ఆదివారాల్లో మేం ఇంట్లో కూర్చుని బోర్డు గేమ్స్ ఆడుకునేవాళ్లం. మమ్మల్ని చూసి మా స్నేహితులు ఇంటికి వచ్చినపుడు వాళ్లతో గేమ్ ఆడించేవాళ్లం. అలా మేముండే ప్రాంతంలో అందరికీ పరిచయమయ్యాం. విదేశీయులూ మా ఇంటికి వచ్చి గేమ్స్ ఆడేవారు. మాకోసం కొన్ని గేమ్స్ బహుమతిగా తెచ్చేవారు. కొత్తవాళ్లు కూడా మమ్మల్ని వాళ్ల పార్టీలకు ఆహ్వానించేవాళ్లు. మేం అక్కడికెళ్లి వాళ్లతో బోర్డు గేమ్స్ ఆడించేవాళ్లం. చివరికి మా పరిస్థితి ఎలా తయారయ్యిందంటే.. వీకెండ్స్ వస్తే చాలు.. స్నేహితులు ఇంటికి వచ్చేవారు. రెండు రోజులు గేమ్స్ ఆడుకుని వెళ్లిపోయేవారు. యూరప్‌లో ఐదేళ్లున్నాం. అక్కడా మా పరిస్థితి అంతే' అంటూ శిరీష గేమ్స్ జ్ఞాపకాల్ని గుర్తు చేసుకుంది.

అనుబంధాల్ని కట్టిపడేసి..

బోర్డ్ గేమింగ్ ఫీల్డ్‌లో భుజంగరావు, శిరీషలకు పదిహేనేళ్ల అనుబంధం ఉంది. గేమ్స్‌తో పిల్లల ఐక్యూ లెవల్‌ను పెంచే టీచర్‌గా లండన్‌లో పని చేసింది శిరీష. ప్రముఖ బోర్డ్ గేమ్స్ కంపెనీల నుంచి సర్టిఫికెట్ కూడా పొందారామె. ఈ కేఫ్‌లో కనిపించే ఆటలన్నీ వీళ్లు సేకరించినవే. 'స్మార్ట్‌ఫోన్‌తో కాలక్షేపం చేసే యువత గేమ్స్ ఆడతారా?' అని కొందరు స్నేహితులు మాట్లాడారు. అయినా వాళ్లేమీ పట్టించుకోలేదు. హైదరాబాద్‌లో బోర్డ్ గేమ్ కేఫ్‌ను ప్రారంభించారు. ఇక్కడికి వచ్చే వాళ్ల గేమింగ్ నాలెడ్జ్‌ని బట్టి ఆటలు ఇస్తారు. జయాపజయాలు కాకుండా స్నేహపూర్వక వాతావరణం పెరిగేలా చూస్తారు. గురువుల్లాగా పని చేస్తూ మంచి వాతావరణం కల్పిస్తారు. ఖాళీ సమయాల్లో వృద్ధాశ్రమాలకు వెళ్లి కొన్ని ఆనందం పంచే ఆటలు ఆడిస్తారు. ఇక్కడ కొత్తగా పెళ్లయిన దంపతులు, ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిదిమంది సభ్యులు హాయిగా మాట్లాడుకుంటూ ఆడుకోవటం, స్నేహితులతో వచ్చిన కుర్రకారు సందడి చేయటం విశేషం.

- 'ఆట ప్రారంభానికి ముందు పబ్‌కి వెళ్లాలనుకున్నవాళ్లు సైతం గేమ్‌లో పడిపోయాక పబ్‌కి వెళ్లటం ఆపేశారు. మరో ప్రత్యేమైన విషయమేంటంటే.. ఇటీవలే ఓ ఆరుగురు అమ్మాయిలు వాళ్ల అమ్మమ్మలను ఇక్కడికి తీసుకొచ్చారు. గేమ్స్ ఆడి వెళ్లిపోయారు. జూబ్లిహిల్స్ వాకర్స్ క్లబ్‌లో ఉండే సీనియర్స్ కూడా ఆదివారంపూట బోర్డ్‌గేమ్స్ ఆడటానికి వస్తున్నారు. ఇంతకంటే ఆనందం ఏముంటుంది?' అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు భుజంగరావు.
- 'నేనో ఫ్యాషన్ డిజైనర్‌ను. ఇక్కడున్న మంచి గేమ్స్ హైదరాబాద్‌లో ఎక్కడా చూడలేదు' అంటూ అక్షిత అనే అమ్మాయి సంబరపడిపోయింది.

ఉన్న వనరులతో విజయమెలా?

మా దగ్గర ఉన్న 700 గేమ్స్ వల్ల వినోదమే కాదు...తార్కిక జ్ఞానం పెరుగుతుంది. తొలుత గెలవాలని ఆడుతారు. తర్వాత ఎదుటివాళ్లను ఓడించాలని ఆడుతారు. ఇలానే ఎందుకు ఆడాలి.. ఇంకో విధంగా ఆడకూడదా అనే సందేహం వస్తుంది. ముఖ్యంగా ఈ తరానికి ఇలాంటి బోర్డ్ గేమ్స్ అవసరం. ఎందుకంటే ఇతరులతో పోల్చుకుంటారు. చిన్నపాటి ఒత్తిడికే జీవితం అయిపోయిందనుకుంటారు. అలాంటి వాళ్లు గేమ్స్ ఆడుతుంటే అందులోని నిబంధనల్ని గమనిస్తారు. ఉన్న వనరుల్లోనే నిబంధనలకు అనుగుణంగా అద్భుతంగా ఆడినట్లే.. ఉన్న సదుపాయాల్లో ఎలా జీవించాలో అర్థమయ్యే జ్ఞానం అలవడుతుంది. ముఖ్యంగా సిగ్గరులు ఎక్స్‌ప్రెసివ్ అవుతారు. ఆత్మన్యూనతాభావంతో కొట్టుమిట్టాడేవారు ఇవి ఆడితే చాలు. వారిలో ధైర్యం వస్తుంది. ముఖ్యంగా ఆడేవాళ్లకు సహనం, భావవ్యక్తీకరణ అలవడతాయి. మానసికంగా బలపడతారు.

– భుజంగరావు, శిరీష

బామ్మ విన్యాసం

జపనీయులు అంటే పనికి పర్యాయపదం. కిమికో నిషిమొటో అనే తొంభై ఏళ్ల బామ్మ ఫొటోలను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. వాస్తవానికి ఈ బామ్మకు ఫొటోలంటే పిచ్చి. సెల్ఫీలు తీసుకోవటంలో ఎక్స్‌పర్ట్. అదే పనిగా గొలుసులతో కట్టేసిన కుక్కలా సెల్ఫీ దిగుతుంది. కప్పలు, ఉల్లిపాయ వేషాలతో కన్పిస్తుంది. ట్రాఫిక్‌లో పరిగెడుతున్నట్లు, దండేనికి వేలాడదీసినట్లు, హ్యారీపోటర్‌లా గాలిలో ఎగిరినట్లు.. ఇలా హాస్యంతో కూడిన ఫొటోషూట్స్ చేస్తుంది. దాదాపు 89 ఫొటోలను తాను నివాసం ఉండే టోక్యో నగరంలోని ఓ గ్యాలరీలో ఇటీవలే ప్రదర్శించింది. ఆమె గ్యాలరీకి అనూహ్యమైన స్పందన వచ్చింది. ఆమె హాస్యంతో కూడిన ఫొటోలను రెండు నెలల నుంచీ ఇన్‌స్టాగ్రమ్‌లో పోస్ట్ చేసింది. దీంతో నలభై ఐదువేలమంది ఆమె ఫాలోవర్లు అయ్యారు. వీరిలో యువతే ఎక్కువ. కిమికో బామ్మకు ఆరుమంది మునిమనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. వాళ్లంతా ఆమె పనిని ప్రశంసిస్తారట. 'నాకు 72 ఏళ్ల వయసులో ఫొటోగ్రఫీ మీద ఆసక్తి పెరిగింది. దీంతో మనవళ్లను అడిగి కెమెరా కొనుక్కున్నా. ఆ తర్వాత ఫొటోలు ఎలా తీయాలో నేర్చుకోవాలని ఫొటోగ్రఫీ క్లాసుకి హాజరయ్యా. ప్రమాదకరమైన విన్యాస ఫొటోలు తీయటంకంటే నవ్వు తెప్పించేవి తీయటానికి ఇష్టపడతాను' అంటోంది ఈ బామ్మ.

వి'చిత్రం'



అన్నట్లు కెమెరా పక్కన ఉంచుకుని మరీ నిద్రపోయే అలవాటుందట కిమికోకి. 'ఏదో పని చేయటానికి వయసుతో పనేముంది? నా ఫొటోలు ఆన్‌లైన్‌లో ఇంత పాపులర్ అవుతాయని కలలో కూడా అనుకోలేద'ంటుందామె. ముప్ఫయి ఏళ్లకే జీవితం అంతా అయిపోయిందని నిట్టూర్చే ఈతరం.. ఈ బామ్మను చూసి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఎంతైనా ఉంది!

వైద్య గోపాలం

అ.. అమ్మ. ఆ.. ఆవు.. దాదాపు అందరూ బడిలో దిద్దిన పదాలే! అమ్మతో అనుబంధం ఉండటంలో ఆశ్చర్యం లేదు. ఆవుపై అనురాగం కురిపించడం అందరికీ సాధ్యం కాదు. విశాఖ నగరానికి చెందిన వైద్యుడు పైడి వెంకటరమణమూర్తి మాత్రం ఇందుకు మినహాయింపు. బాల్యం నుంచి వాళ్లింట్లో ఉన్న ఆవు అంటే ఆయనకు ప్రాణం. వైద్య విద్యలో చేరడంతో ఆవుకు దూరమయ్యారు. తర్వాత కేజీహెచ్‌లో వైద్యుడిగా చేరారు. తర్వాత ఒక గోవును కొన్నారు. కొన్నాళ్లకు దానిని మరొకరికి దానమిచ్చారు. 2013లో 80 గోవులతో ఉన్న 12 ఎకరాల భూమి కొన్నారు. రెండెకరాల స్థలంలో గోవులకు షెడ్లు కట్టించారు. మిగతా భూమిలో పశుగ్రాసాన్ని పెంచుతున్నారు. పచ్చగడ్డి, మొక్కజొన్న పిండి, మినరల్ మిక్స్, గోపుష్టి ఇలా పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. గోవుల బాగోగులు చూసుకునేందుకు గోశాల ప్రాంగణంలోనే 12 కుటుంబాలకు వసతి గృహాలు కట్టించి ఇచ్చారు వెంకటరమణ మూర్తి. మరో పది మంది బయటి నుంచి వచ్చి విధులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఈ గోశాలలో 350 ఆవులున్నాయి. వయసుల

గోసేవ



వారీగా షెడ్లు నిర్మించి ఆవులను కన్నబిడ్డల్లా సాకుతున్నారు. అంతేనా.. గోవులు ప్రశాంతంగా ఉండటానికి షెడ్లలో స్పీకర్లు అమర్చి.. శ్రావ్యమైన సంగీతమూ వినిపిస్తున్నారు. గోవ్యర్థాలను ఎరువుగా ఉపయోగిస్తున్నారు. ఆవుపాలను విక్రయించి వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలకు వెచ్చిస్తున్నారు. ఏటా దాదాపు రూ.10 లక్షలు సొంత డబ్బులు వెచ్చిస్తూ.. గోశాలను నిర్వహిస్తున్నారీ వైద్యుడు.

– బీఎస్ రామకృష్ణ, ఈనాడు, విశాఖపట్నం

ఈనాడు సినిమా



అల్లు అర్జున్

సరిహద్దుల్లో... వణికించే చలిలో

సవాల్ చేసే పాత్ర ఎదురైనప్పుడు దానిపై సవారీ చేయడానికి మన కథానాయకులు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. పాత్ర కోసం ఒళ్లు హూనం చేసుకోవడం, నచ్చిన సినిమా కోసం అహర్నిశలూ శ్రమించడం అలవాటు చేసుకుంటున్నారు. ఇప్పుడు అల్లు అర్జున్ ఇదే చేస్తున్నాడు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య - నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడు. అను ఇమ్మానియేల్ కథానాయిక. ఇప్పటికే టీజర్‌తో పాటు ఓ పాటనీ విడుదల చేశారు. ఈ నెల 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మరో గీతాన్ని ఆవిష్కరిస్తారు. నిర్మాత శిరీషా శ్రీధర్ లగడపాటి మాట్లాడుతూ "టీజర్‌కీ, పాటకూ మంచి స్పందన వస్తోంది. ప్రస్తుతం భారత సరిహద్దు ప్రాంతాల్లో, మైనస్ 12 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. వాస్తవానికి దగ్గరగా ఉండడం కోసం క్లిష్టమైన ప్రాంతాల్లోనూ అల్లు అర్జున్ షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు. సంగీతం: విశాల్ - శేఖర్

ఈ దాహం తీరనిది!



తమన్నా

వాణిజ్య ప్రధానమైన చిత్రాలతోనే ఎదిగానని చెప్పుకొనే అతి కొద్దిమంది కథానాయికల్లో తమన్నా ఒకరు. పాత్ర ప్రాధాన్యం ఎంత? నటిగా నిరూపించుకొనే అవకాశం వస్తుందా లేదా అని చూడకుండా, తనకి వచ్చిన అవకాశాలతోనే సత్తా చాటిన కథానాయిక ఈమె. నటిగా అందరి దృష్టినీ ఆకట్టుకోవాలని ప్రత్యేకంగా ఎప్పుడూ ప్రయత్నించింది లేదని, నా ప్రయాణం సహజంగా సాగిందని చెబుతోంది. 'తొలినాళ్లల్లో ఆత్మవిశ్వాసం ముందుకు నడిపిస్తే, ఆ తర్వాత అనుభవం కొత్త దారుల్ని చూపించింది. నటిగా ఇలా ఈ స్థాయికి చేరానంటే అదే కారణం. అయితే ఇప్పుడున్న అనుభవానికి, తొలినాళ్లల్లోని ఆత్మవిశ్వాసం తోడైతే ఎంత బాగుంటుందో అనిపిస్తుంటుంది అప్పుడప్పుడు. కానీ నటన పరంగా నా దాహం ఇంకా తీరలేదు. అది తీరేది కూడా కాదు. అందుకే ఇంకా నా కళ్లకు సుదీర్ఘమైన ప్రయాణం కనిపిస్తోంది. భవిష్యత్తులోనూ ఇలా సహజంగానే నా దగ్గరికి వచ్చే పాత్రలకి న్యాయం చేస్తూ, ప్రేక్షకుల్ని మెప్పించడంపైనే దృష్టి పెడతా. అంతేకానీ ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని ప్రయత్నాలు చేయను" అని చెప్పింది తమన్నా. ప్రస్తుతం ఆమె కల్యాణ్‌రామ్‌తో కలిసి 'నా నువ్వే'లో నటిస్తోంది.

'పంతం' దేనికి?



గోపీచంద్

గోపీచంద్ కథానాయకుడిగా శ్రీసత్యసాయి ఆర్ట్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. మెహరీన్ కథానాయిక. కె.చక్రవర్తి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. మే 18న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రానికి 'పంతం' అనే పేరును ఖరారు చేశారు. ఫర్ ఎ కాజ్... అనేది ఉపశీర్షిక. నిర్మాత మాట్లాడుతూ "గోపీచంద్ నటిస్తున్న 25వ చిత్రమిది. ఒక మైలురాయిలాంటి ఈ చిత్రం మా సంస్థలో తెరకెక్కుతుండడం ఆనందంగా ఉంది. మంచి సందేశంతో పాటు, వాణిజ్య హంగులతో కూడిన చిత్రమిది. గోపీచంద్ పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. 'బలుపు', 'పవర్', 'జై లవకుశ' లాంటి విజయవంతమైన చిత్రాలకి రచయితగా పనిచేసిన చక్రవర్తి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విధానం చాలా బాగుంది. కథ రీత్యానే 'పంతం' అనే పేరును ఖరారు చేశాం. ఒక వ్యక్తి ఎందుకోసం పంతం పట్టాడనేది తెరపైనే చూడాలి. ఇప్పటికే కొంత టాకీ భాగం, పాట చిత్రీకరణ పూర్తయింది. పక్కా ప్రణాళిక ప్రకారం చిత్రీకరణ జరుగుతోంది" అన్నారు. పృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్.ప్రకాష్, సంభాషణలు: రమేష్ రెడ్డి, సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల.

గీతోపదేశం

పొరపాటున చేజారిన
తరుణం తిరిగొస్తుందా
ప్రతి పూటొక పుటగా
తన పాఠం వివరిస్తుందా
మన కోసమే తనలో తను
రగిలే రవి తపనంతా
కనుమూసిన తరువాతనే
పెను చీకటి చెబుతుందా

గీతం: నీ ప్రశ్నలు నీవే...
చిత్రం: కొత్త బంగారులోకం
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి
- పంపినవారు: ఆర్.నరసింహారావు, భీమవరం

మెయిల్ ఐడీ: cinema@eenadu.net

హ్యాపీ హ్యాపీగా...

సెట్లో సందడి



నిహారిక, లక్ష్మణ్, సుమంత్ అశ్విన్

మీ పెళ్లి ఎప్పుడు? అని మెగా అమ్మాయి నిహారికని అభిమానులు అప్పుడప్పుడు అడుగుతూనే ఉంటారు. మరి ఆమె పెళ్లి కబురు ఎప్పుడు వినిపిస్తుందో ఏమో తెలియదు కానీ... పెళ్లి నేపథ్యంలో సాగే ఓ చిత్రంలో నటించింది. 'హ్యాపీ వెడ్డింగ్' పేరుతో రూపొందుతున్న ఆ చిత్రంలో సుమంత్ అశ్విన్, నిహారిక జంటగా నటించారు. పెళ్లి కుదిరిన రోజు నుంచి, పెళ్లి జరిగే రోజు వరకు... రెండు కుటుంబాల మధ్య, రెండు మనసుల మధ్య ఏం జరిగిందనే విషయం ఆధారంగా సాగే చిత్రమిది. వధూవరులుగా కనిపించనున్న ఈ యువజంటకి పెళ్లిపీటలపై కూర్చుని సిగ్గులు ఒలకబోసే సన్నివేశాన్నో లేదంటే, ఇతరత్రా పెళ్లి ఘట్టాలకి సంబంధించిన సన్నివేశాన్నో వివరిస్తున్నట్టున్నాడు దర్శకుడు లక్ష్మణ్ కార్య. అందుకే ముగ్గురి పెదాలపై నవ్వులు విరిశాయి. యువీ క్రియేషన్స్ సమర్పణలో పాకెట్ సినిమా ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ నెల 14న ఈ సినిమాకి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

కలలు కన్న దేశానికి
వెళ్లాక కన్నదేశం కలలోకి
వస్తుందమ్మా.

చిత్రం: మిథునం
- పంపినవారు: మందపాటి పద్మ, గుంపాం, నెల్లిమర్ల


పంచ్ లైన్

ఒక్కటే జీవితం

నిర్మాత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఒక్కటే లైఫ్'. హ్యాండిల్ విత్ కేర్... అనేది ఉపశీర్షిక. శ్రుతియుగల్ కథానాయిక. సుమన్ ముఖ్య భూమిక పోషిస్తున్నారు. ఎం.వెంకట్ దర్శకుడు. నారాయణ్ రామ్ నిర్మాత. దర్శకుడు మాట్లాడుతూ "సాంకేతికత మాయలో పడి కొట్టుకుపోతున్న యువతరం బంధాలు, అనుబంధాలు, భావోద్వేగాలకి కూడా ప్రాధాన్యమివ్వాలని చెప్పే చిత్రమిది" అన్నారు. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామన్నారు నిర్మాత. నల్లవేణు, జబర్దస్త్ రామ్, బాబి, రిషి, శ్యామ్, దిశ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అమ్రీష్, కూర్పు: నందమూరి హరి, కళ: విజయ్ కృష్ణ, ఛాయాగ్రహణం: వై.గిరి.




జితన్ రమేష్, శ్రుతియుగల్



సుస్మితాసేన్



కంగనా రనౌత్



బిపాసాబసు



పూజా హెగ్డే



శిల్పాశెట్టి

మెరుపులే మగువలై మురిసే!

ఒకప్పటి విశ్వసుందరి సుస్మితాసేన్ ముద్దబంతిలా నవ్వుతూ వయ్యారంగా నడిచొస్తుంటే...బాలీవుడ్ 'క్వీన్' కంగనా రనౌత్ రాజకుమారిలా దర్జా ఒలకబోస్తుంటే ఆ సోయగాలు చూడటానికే ఎన్ని కళ్లు కావాలో! ఈ ఇద్దరే కాదు బిపాసాబసు ఎర్రమందారంలా మురిపిస్తుంది. పూజా హెగ్డే తెల్ల కలువలా కనువిందు చేస్తుంది. చేప కళ్ల చిన్నది శిల్పా శెట్టి అజంతా శిల్పంలా అలరిస్తుంది. వెండితెరపై సందడి చేసే భామలంతా ఇలా అప్పుడప్పుడు ఒకే చోట చేరితే దివి నుంచి మెరుపులొచ్చి మగువలుగా మురిపిస్తున్నారేమో అనిపించకమానదు. ముంబయిలో జరుగుతున్న ఓ ఫ్యాషన్ షోలో పలువురు బాలీవుడ్ కథానాయికలు ర్యాంప్‌వాక్ చేసి అలరించారు.

పల్లెటూరి గుగ్లీ...



శ్రీముఖి

మురళీకృష్ణ, శ్రీముఖి జంటగా నటించిన చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. హర్షవర్ధన్ దర్శకుడు. బోగాది అంజిరెడ్డి నిర్మాత. హైదరాబాద్‌లో చిత్ర బృందం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది. శ్రీముఖి మాట్లాడుతూ "ఇది భిన్నమైన కథతో 80వ దశకం నేపథ్యంలో సాగుతుంది. అందరినీ మెప్పించే ఓ మంచి పాత్రని పోషించా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక గ్రామంలో జరిగే కథ ఇది. గుడ్, బ్యాడ్, అగ్లీ అంటున్నామని ఆ స్వభావాలున్న ముగ్గురి మధ్య నడిచే కథ కాదిది. ఆ స్వభావాలు ఎవరిలో ఎప్పుడు ఎలా బయటికొస్తుంటాయనేది ఆసక్తికరం. నేనే స్వయంగా సంగీతాన్ని సమకూర్చా. నిర్మాత మాట్లాడుతూ "పేరు 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కాబట్టి ముద్దుగా గుగ్లీ అని పిలుచుకుంటున్నాం. ఈ నెలాఖరుకి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామ"న్నారు.

ఒకే ఒక్క పాత్రతో...



ఆదిత్య ఓం

ఆదిత్య ఓం కథానాయకుడిగా ఎమినెంట్ 5 ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. రాఘవ తిరువాయిపాటి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ నెలాఖరు నుంచి సెట్స్‌పైకి వెళ్లే ఈ చిత్రం ఒకే ఒక్క పాత్రతో తెరకెక్కనుండడం విశేషం. "పలు చిత్రాలకి సహ దర్శకుడిగా పనిచేసిన రాఘవ వినోదాన్ని పంచేలా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. 'లాహిరి లాహిరి లాహిరిలో'తో పేరు తెచ్చుకొన్న ఆదిత్య ఓంకి కెరీర్‌లో గుర్తుండిపోయే మరో చిత్రమవుతుంద"న్నాయి చిత్రవర్గాలు.

నీకూ నాకు మధ్య...

సదా, కవితా అగర్వాల్ జంటగా నటిస్తున్న చిత్రం 'దళపతి'. సదా దర్శకుడు. బాబూరావు పెదపూడి నిర్మాత. చిత్రీకరణ తుది దశకు చేరుకొంది. యాజమాన్య స్వరపరిచిన ఈ చిత్రంలోని గీతాలకి లభిస్తున్న స్పందన పట్ల చిత్రబృందం ఆనందం వ్యక్తం చేసింది. దర్శకుడు మాట్లాడుతూ "వినూత్నమైన కథ, కథనాలతో తెరకెక్కించిన చిత్రమిది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. శ్రేయా ఘోషల్, యాజమాన్య కలిసి పాడిన 'నీకు నాకు మధ్య ఏదో ఉంది...' అనే పాట ఆన్‌లైన్‌లో సందడి చేస్తోంది. మా చిత్రానికి ఈ పాటే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఈ పాట పల్లవినే పేరుగా మార్చి త్వరలోనే ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం" అన్నారు.



కవితా అగర్వాల్

'సత్య గ్యాంగ్'తో పెట్టుకుంటే



అక్షిత

సాత్విక ఈశ్వర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సత్య గ్యాంగ్'. అక్షిత కథానాయిక. ప్రభాస్ దర్శకుడు. ఆయనే సంగీతం అందించారు. మహేష్ ఖన్నా నిర్మాత. చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "సమాజంలో అనాథలనేవారు ఉండకూడదన్న లక్ష్యంతో పనిచేసే ఓ గ్యాంగ్ కథ ఇది. వాళ్లతో పెట్టుకుంటే ఏమవుతుందన్నదీ ఆసక్తికరమే. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తామ"న్నారు.

సరదాగా సెల్ఫీ దిగి.. వాట్సాప్ స్టేటస్ పెట్టడం... ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాలో ఫొటోలు అప్‌లోడ్ చేయడం... మనలో ఎక్కువమంది రోజూ చేస్తున్నదే. మంచిదే. టెక్నాలజీని వాడుకోవడం కూడా తప్పేమీ కాదు. కానీ మనకు సంబంధించిన విషయాలూ, ఫొటోలు దుర్వినియోగం అయి... మన పరిచయస్తులూ, సన్నిహితులకు కాకుండా... కొత్తవారికి తెలిసి.. బెదిరింపులు ఎదురైతేనే సమస్య. అలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ఉండాలంటే... కొన్ని జాగ్రత్తలు తప్పవు.

ఫేస్‌బుక్ కీచకులు
వాట్సాప్ రావణులు

ఉన్నారు జాగ్రత్త!



■ కీర్తి హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతోంది. ఓరోజు ఉదయం ఫేస్‌బుక్ తెరిచింది. అకౌంట్‌నుంచి పదుల సంఖ్యలో ఫ్రెండ్ రిక్వెస్టులు వెళ్లాయి. ఫొటోలు, వీడియోలు ఫార్వర్డ్ అయ్యాయి. ఫోన్ హ్యాక్ అయిందని తెలిసింది. పోలీసులు ఆరా తీస్తే క్లాసులోని రోహిత్ ఇదంతా చేశాడని తెలిసింది. కీర్తి స్నేహితురాలు జెన్నీ ద్వారా పాస్‌వర్డ్ సంపాదించటంతో అతని పని సులువైంది.

■ స్వాతికి వాట్సప్‌లో అశ్లీల ఫొటోలు, వీడియోలు విపరీతంగా వచ్చేవి. నాలుగైదు రోజుల తరువాత సైబర్ క్రైమ్ ఆఫీసుకి వెళ్లి కంప్లయింట్ ఇచ్చింది. ఆరాతీస్తే.. యూపీ నుంచి అంకిత్ అనే మైనర్ ఇదంతా చేస్తున్నాడని తెలుసుకుని హైదరాబాద్‌కి పిలిపించారు. అంకిత్ అమాయకుడు. ఇంకా తీగలాగితే.. హైదరాబాద్‌లో స్వాతి ఇంటి దగ్గర ఉండే ఒకడు అంకిత్ సిమ్ నంబర్‌తో వాట్సప్ డౌన్‌లోడ్ చేసుకుని అలా వేధించాడని తేలింది.

■ ఫుడ్ డెలివరీ కంపెనీలో పని చేసే రంజిత్ వందలమంది మహిళల ఫోన్ నంబర్లు సంపాదించాడు. వారి వాట్సప్‌లకు అసభ్యకరమైన రాతలతో పాటు.. అశ్లీల ఫొటోలూ, వీడియోలు రోజూ పంపించేవాడు. ఎవరికీ చెప్పుకోలేక.. చాలా మంది మహిళలు మానసికంగా కుంగిపోయారు. కొందరయితే సిమ్‌కార్డ్‌నే మార్చేశారు. ఓ ప్రొఫెసర్‌నూ ఇలానే వేధించాడు. ఆమె తన భర్తకు విషయం చెప్పి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసింది. కేస్ బుక్ అవుతూనే.. రంజిత్‌ను ట్రేస్ చేసి పోలీసులు పట్టుకున్నారు. అతని ఫోన్‌లో నూటయాభైకి పైగా మహిళల నంబర్లున్నాయి. 'నాకిదో హాబీ' అని రంజిత్ చెప్పుకొచ్చాడు. మరో ముగ్గురు మహిళలు రంజిత్‌పై రిపోర్ట్ చేయడంతో.. పోలీసులు పీడీయాక్ట్ ఫైల్ చేసి జైలుకి పంపించారు.

ఇవన్నీ ఈ మధ్యకాలంలో హైదరాబాద్ సైబర్‌క్రైమ్ సెల్‌కి వచ్చిన కేసులు. అదీ స్మార్ట్‌ఫోను వల్లే. మీ ఫోన్ మీ దగ్గరే ఉండొచ్చు. మీ వ్యక్తిగత అవసరాలకే వాడుకుంటూ ఉండొచ్చు. కానీ వీటి వినియోగం వల్ల ఎలా, ఎవరితో, ఏ నిమిషం.. వేధింపులకి గురికావల్సి వస్తుందో అర్థం కాని పరిస్థితి. అలాగని మహిళలు ఫోన్ వాడకుండా ఉండలేరు కదా! 'ముఖ్యంగా ఈ డిజిటల్ కాలంలో ఫోన్‌లోనే మాటామంతీ. కొంతమందైతే ఎదురెదురుగా వచ్చినా పలకరించరు. వాట్సప్, ఫేస్‌బుక్‌లో మెసేజ్ చేస్తే చాలు.. ఇట్టే స్పందిస్తారు. వీళ్లు ఎక్కువగా వర్చువల్ ప్రపంచంలోనే ఉంటారు. ఆగంతుకుల బారిన పడేవారిలో ఇలాంటివాళ్లే ఎక్కువ...' అంటారు మానసిక నిపుణులు.



మన జీవితం ఇతరులకెందుకూ...?

"కొందరమ్మాయిలు పొద్దస్తమానం వాట్సాప్, ఫేస్‌బుక్‌లో స్టేటస్‌లు అప్‌లోడ్ చేస్తుంటారు. ఫొటోను ఎవరెవరు చూశారో, ఎంతమంది లైక్ చేశారోనని పదే పదే గమనిస్తుంటారు. మరి కొందరైతే బ్యూటీ యాప్స్ కనిపిస్తే చాలు వాటి వివరాలేవీ తెలుసుకోకుండా డౌన్‌లోడ్ చేసుకుంటారు. వేధింపులకు గురయ్యేవారిలో ఇలాంటివారే ఎక్కువ. 'దాదాపు ఎనభై ఐదు శాతం మంది సైబర్ నేరగాళ్లు 18 నుంచి 35 ఏళ్ల వయసువారే. ఏ వయసువాళ్లు ఎలాంటి యాప్స్‌కి ఆకర్షితులవుతారో, ఎలాంటి మెసేజ్‌లకు స్పందిస్తారో వాళ్లకు బాగా తెలుసు. ప్లేస్టోర్‌లో ఏదో యాప్ కనపడింది కదా అని డౌన్‌లోడ్ చేయకూడదు. ముందు వాటి నియమ నిబంధనలు చదవాలి. ఎక్కువ అనుమతులు అడుగుతుంటే ఆలోచించాల్సిందే. మీ జీవితంలోని ఆనందకరమైన సమయాలూ, బాధపడ్డ సందర్భాలూ, ఇష్టాయిష్టాలూ, వెళ్లిన రెస్టారెంట్, చూసిన లేదా చూస్తోన్న సినిమా.. ఇలా ప్రతిదీ స్టేటస్‌ల రూపంలో పెట్టి.. మన వ్యక్తిగతాలు అపరిచితులకు తెలియజేయడమెందుకూ? ఒక పోస్ట్ పెడితే ప్రపంచమంతా చూస్తుంది...సరే! ఆ ప్రపంచంలో అవకాశం కోసం ఎదురు చూస్తున్న మేకవన్నె పులులూ పొంచి ఉంటాయనే విషయం ఎందుకు గుర్తించలేకపోతున్నారు. అవసరం మేరకే ఫేస్‌బుక్, వాట్సాప్‌లను వినియోగించాలి. అమ్మాయిలైనా, అబ్బాయిలైనా సోషల్ వెబ్‌సైట్స్‌లో స్వీయ నియంత్రణతో మెలగాలి' అంటారు భరోసా టీమ్ ఏసీపీ కవిత.

- రాళ్లపల్లి రాజావలి, ఈనాడు, హైదరాబాద్

ఓటీపీ సెట్ చేసుకోవాలి!

- ఫోను చేసుకోవడానికో లేదా తమ ఫోనులో ఉన్న సమస్యను పరిష్కరించమంటూ అమ్మాయిలు ఫోన్‌ని తెలిసినవారికి ఇస్తారు. అతడే సైబర్ నేరగాడు అయి ఉండొచ్చు. ఫోను తీసుకున్న వెంటనే నిమిషాల వ్యవధిలోనే ఉచితంగా దొరికే స్పై అప్లికేషన్స్‌ను అందులో డౌన్‌లోడ్ చేయొచ్చు. అదే జరిగితే మీ ఫోను డ్యాష్‌బోర్డులా ఉపయోగపడుతుంది. మీరు పంపే మెసేజ్‌లు, వాట్సప్‌తో పాటు ఫేస్‌బుక్ ఛాట్, ఫొటోలు, వీడియోలు.. అన్నీ చూడగలుగుతాడు. బ్లాక్ మెయిల్ చేసే ప్రమాదం ఉంటుంది.
- అమ్మాయిల ఎఫ్‌బీ అకౌంట్స్‌కి 'మీ ఫోన్‌ను అప్‌గ్రేడ్ చేసుకోండి, సెక్యూరిటీ ప్రాబ్లమ్స్ ఉన్నాయి' అంటూ మెసేజ్ చేస్తారు. దాన్ని నమ్మితే ఫేస్‌బుక్ హ్యాక్ కావచ్చు. మీ ఫోన్‌తో పాటు పీసీ కూడా హ్యాక్ అవుతుంది.
- ఫోన్లలో లాక్‌లు తెరిచేప్పుడు మీ వేళ్ల కదలికను బట్టి సైబర్ నేరగాళ్లు వాటిని గుర్తుంచుకునే అవకాశం ఉంటుందనీ మరవకూడదు.
- ఫేస్‌బుక్‌ను ఓపెన్ చేయాలంటే ఓటీపీ లాగిన్‌ను పెట్టుకోవాలి. సీక్రెట్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫోన్ నంబర్‌ను ఎంటర్ చేస్తే చాలు. ఎవరైనా మీ ఫేస్‌బుక్‌ను హ్యాక్ చేస్తే ఓటీపీ మీ ఫోన్‌కు వస్తుంది. అలా సులువుగా అర్థమవుతుంది. ఈమెయిల్‌కీ ఇదే వర్తిస్తుంది.
- అమ్మాయిలు ఫొటో ఎడిటింగ్ యాప్స్‌ను థర్డ్‌పార్టీవి డౌన్‌లోడ్ చేయకూడదు. కొందరు ఆన్‌లైన్ షాపింగ్ చేసేప్పుడు డెబిట్, క్రెడిట్ కార్డులు వాడుతుంటారు. ఈ థర్డ్‌పార్టీ యాప్స్ మీ కార్డుల చిట్టాను చెబుతాయి.
- ఈ మధ్యకాలంలో నేరగాళ్లు కొత్తపంథా అనుసరిస్తున్నారు. అమ్మాయిల ఫోన్ నెంబర్ తీసుకుని డీపీ ఫొటోను డౌన్‌లోడ్ చేసుకుంటారు. కొన్ని టూల్స్ ఉపయోగించి ఆ అమ్మాయితో నేరగాడు క్లోజ్‌గా చాట్ చేసినట్లు క్రియేట్ చేసి దాన్ని స్క్రీన్‌షాట్ తీసి వాళ్లకే పంపిస్తారు. అలా బ్లాక్‌మెయిల్ చేస్తారు. ఈ నియమాలు అమ్మాయిలకే కాదు స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరికీ వర్తిస్తాయి.
- ఒకవేళ ఫోను పోగొట్టుకుంటే వాట్సాప్ అకౌంట్‌ని తొలగించాలి. ముఖపరిచయం లేని వ్యక్తుల నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను అనుమతించకూడదు. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో ఫొటో డౌన్‌లోడ్ చేయకుండా సెట్టింగ్‌లు పెట్టుకోవాలి. అనుమతించే ముందు ఒకటికి రెండు సార్లు గమనించుకోవడం మంచిది. పబ్లిక్ వైఫైలు వాడకుండా స్వీయ నియంత్రణ తప్పనిసరి.

- నల్లమోతు శ్రీధర్, టెక్నాలజీ నిపుణులు

జీవక్రియ రేటు తగ్గుతుందా?

ఒక్కోసారి ఉన్నట్టుండి నీరసం.. అలసటగా అనిపిస్తుంది. అలాగని ఏదైనా అనారోగ్యం అనుకోవడానికీ ఉండదు. దానికి కారణం జీవక్రియ రేటు మందగించడమే. అందుకే జీవనశైలిలో కొన్ని ఇలాంటి పొరబాట్లు చేయకుండా ఉంటే... ఉరకలు పెట్టే ఉత్సాహం మీ సొంతం.

◆ టీ, కాఫీల్లో కృత్రిమ చక్కెర్లు వేసుకుంటారు కొందరు. అలా చేస్తే రుచి బాగుంటుంది కానీ ఆరోగ్యానికి మంచిది కాదు. వీటివల్ల శరీరంలో టాక్సిన్లు చేరుకుంటాయి. అవి జీవక్రియ రేటును తగ్గిస్తాయని పరిశోధనలు తెలిపాయి. అందుకే తేనె, బెల్లం వంటి సహజ తీపి పదార్థాలకే ప్రాధాన్యమివ్వమని సూచిస్తున్నారు వైద్యులు.

◆ జీవక్రియ రేటు తగ్గడానికి క్యాల్షియం లోపం కూడా ఒక కారణం. అందుకే పాలూ, పాల పదార్థాలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. అవి తీసుకోని పక్షంలో కనీసం వైద్యుల సలహాతో క్యాల్షియం సప్లిమెంట్లు అయినా తీసుకోవాలి.

◆ కొందరు అమ్మాయిలు ఉద్యోగం, ఇంటి పని కారణంగా సరైన ఆహారం తీసుకోరు. వేళకూ తినరు. దీనివల్ల అరుగుదల తగ్గడం, గ్యాస్ చేరడం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే సమయానికి తినడం అలవాటు చేసుకోవాలి. ఆకుకూరలూ, కూరగాయలు, పాలూ, పండ్లూ వంటివన్నీ ఉన్న సమతులాహారాన్ని



తీసుకుంటే జీవక్రియ రేటు మెరుగు పడుతుంది.

◆ రోజుకి ఎన్నిలీటర్లు నీళ్లు తాగాలన్న లెక్కపక్కనపెడితే....ముందు దాహంతో సంబంధం లేకుండా తప్పనిసరిగా ప్రతి గంటకోసారైనా ఓ గ్లాసు నీళ్లు తాగడం మంచిది. ముఖ్యంగా మసాలా ఆహారం, ఘనపదార్థాలు తిన్నప్పుడు మరింతగా నీళ్లు తాగాలి. అప్పుడే ఆహారం జీర్ణమై జీవక్రియలు సరిగా ఉంటాయి.

◆ బరువు తగ్గాలనుకునే వారు పచ్చి కూరగాయలు ఎక్కువ మోతాదులో తీసుకుంటారు. పచ్చివి త్వరగా అరగవు. అందుకే వాటిని తక్కువ తీసుకుని, ఉడికించిన కూరగాయల్ని కొంచెం ఎక్కువ తీసుకోవడం మంచిది.

◆ ఇంటా, బయట పనులు ఒత్తిడిని పెంచేస్తాయి. ఇది జీవక్రియల పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. అందుకే పక్కా ప్రణాళికతో పనులు పూర్తి చేసుకోవాలి. ఒత్తిడినుంచి బయటపడేందుకు యోగా, ధ్యానం వంటివి ఎంచుకోవాలి.

ఆత్మహత్యాయత్నం చేసింది.. కానీ మా తప్పేం లేదు!

■ మా అన్నయ్య ప్రభుత్వోద్యోగి. 2012లో వివాహం అయ్యింది. బాబు పుట్టినప్పటి నుంచీ వాళ్ల మధ్య మనస్పర్థలు మొదలయ్యాయి. ఓ రోజు గొడవ పడి ఆత్మహత్యాయత్నం చేసింది. అడ్డుకుని ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాం. గొడవలు పెరుగుతాయని వాళ్లింట్లో ఈ విషయాన్ని మేం తెలియనివ్వలేదు. తను కోలుకున్నాక మేం హత్యాప్రయత్నం చేశామనీ, వరకట్నం కోసం వేధిస్తున్నామని మా కుటుంబ సభ్యులు అందరిపై కేసు పెట్టింది. నాకింకా పెళ్లి కాలేదు. దీంతో నన్నెవరూ పెళ్లి చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. మేము ఏ తప్పూ చేయలేదు. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలి. నిజాలు చెప్పించడానికి లై డిటెక్టర్‌ని కోర్టు కల్పించగలదా! సలహా ఇవ్వగలరు.
- ఓ సోదరి.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

ఇంకా లై డిటెక్టర్‌లను కుటుంబ వివాదాల్లో ఉపయోగించేంత సాంకేతిక పరిజ్ఞానం మన దగ్గర అభివృద్ధి చెందలేదు. మీ అన్నావదినల మధ్య సయోధ్యలేనప్పుడు విషయం చిన్నదిగా ఉన్నప్పుడే దాన్ని సరిదిద్దాల్సింది. మీ వదిన ఆత్మహత్య ప్రయత్నం చేశారంటున్నారు. గొడవ పెద్దది అయినా అయ్యుండాలి లేదా ఆమె సున్నిత మనస్కురాలు అయినా కావాలి. ఆ తరువాత అయినా సమస్యను దాచిపెట్టకుండా పెద్ద మనుషుల ముందు పెట్టి పరిష్కరించాల్సింది. మీరు చేసిన పొరబాటు వల్ల సమస్య ఇంకా జఠిలం అయ్యింది. ఇప్పుడు కోర్టులో మీరు రుజువు చేసుకోవడం తప్ప వేరే దారిలేదు. ఆమె ఆత్మహత్య చేసుకునేంత పరిస్థితులు ఏమీ లేవని, అలాంటిదేదీ జరగలేదని కోర్టులో మీ వాదనను వినిపించగలగాలి. దీనికి కావలసినవి సాక్ష్యాలు. అవి బలంగా ఉంటే కేసు నుంచి బయటపడొచ్చు. ఇక మీ పెళ్లి విషయానికొస్తే జరిగినవేవీ దాచిపెట్టకుండా సంబంధం కుదుర్చుకోవడం మంచిది. లేదంటే మళ్లీ కొత్త సమస్యల్లో ఇరుక్కోవలసి వస్తుంది. లేదా ఈ కేసులోంచి బయటపడే వరకూ పెళ్లి చేసుకోకుండా ఆగండి. మీ అన్నకి ఇంకా ఆ వివాహబంధంలో ఉండటం ఇష్టం లేకపోతే సెక్షన్ 13 హిందూ వివాహచట్టం ప్రకారం క్రూయాల్టీ గ్రౌండ్ కింద విడాకులు కోరవచ్చు. కానీ మీ వదినకు, బాబుకి విడివిడిగా మీ అన్నయ్య జీతంలో నుంచి భరణం చెల్లించాల్సి ఉంటుంది. అది ఆవిడ వేసే కేసుని బట్టి ఉంటుంది. ఆవిడ మీమీద వేసిన కేసు విత్ డ్రా చేసుకోవడానికి ఏమైనా వీలు ఉంటుందేమో ఫ్యామిలీ కోర్టులో ప్రయత్నించండి. ఒకసారే పెద్ద మొత్తంలో మీ వదిన, పిల్లాడి మీద మీరు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. బాబు చిన్నవాడు కాబట్టి తల్లి సంరక్షణలో పెరగాలని చట్టం చెబుతుంది.

ఆన్‌లైన్ పోటీ విజేతలు వీరే..

వసుంధర.నెట్ నిర్వహించిన 'ముద్దులొలికే బుజ్జి నాయకులకు ముచ్చటైన బహుమతులు..' పోటీకి విశేష ఆదరణ లభించింది. పలువురు పాఠకులు ఈ పోటీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జాతీయ నాయకులు, సంతంత్ర సమరయోధుల ఆహార్యంలో ముస్తాబైన తమ చిన్నారుల ఫొటోలను మాతో పంచుకున్నారు. ఇచ్చిన థీమ్‌కి అనుగుణంగా ఉన్న బుజ్జాయిలను నిపుణులతో కూడిన న్యాయనిర్ణేతల బృందం విజేతలుగా ఎంపిక చేసింది. వారి వివరాలు..


ముద్దులొలికే బుజ్జి నాయకులకు ముచ్చటైన బహుమతులు..



ఎ. అక్షర
వరంగల్



డి. గీతా అనూహ్య
గుంటూరు



ఎన్. హర్షవర్ధన్,
విజయనగరం

విజేతలకు వసుంధర.నెట్ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు.
విజేతల ఫొటోలను www.vasundhara.net లో కూడా చూడచ్చు.

ఇటుకల వ్యాపారంతో అదరగొట్టారు..

చదువుకోని మహిళలు ఉపాధికోసం వెతికితే వారికి దొరికే సమాధానం కూలీ చేసుకోవడం. అందుకే చాలా మంది రోజూ కూలీ చేస్తున్నా కష్టాల్లోంచి బయటికి రాలేకపోతున్నారు. ఈ ఇద్దరు మాత్రం అలాంటివారికి భిన్నంగా కొత్త ఆదాయమార్గాన్ని వెతుక్కున్నారు. ఒప్పుకొన్న పనిని పూర్తి చేసి చూపించారు. అందరిచేతా ఔరా అనిపించారు. ఇంతకీ ఏమిటా పని? అంటారా?! ఆ వివరాలు విజయం సాధించిన నానీ, వెంకటలక్ష్మిల మాటల్లోనే..!!



మాది విశాఖపట్నంలో అనకాపల్లి మండలం కోడూరు. ఉపాధి శిక్షణ కోసం హైదరాబాద్ వెళ్లినప్పుడు..'వామ్మో..అమ్మాయిలై ఉండి వ్యాపారాలు చేస్తామంటూ బయటికి వెళ్తారా?' అంటూ అంతా తిట్టిపోశారు. ఎందుకంటే అప్పటి వరకూ ఊళ్లోనే ఏదో ఒక కూలీ చేసుకుని బతికే అమ్మాయిలే తప్ప కనీసం ఉద్యోగం చేస్తున్నవాళ్లే వరూ కూడా లేరు. కానీ అవన్నీ పట్టించుకోకుండానే మా ఊర్లోని ఇరవై మంది అమ్మాయిలం హైదరాబాద్‌కి బయలుదేరాం. ఏదైనా పని నేర్చుకొని మా జీవితాల్లో మార్పు తెచ్చుకోవాలన్నదే మా కోరిక.

మధ్యలో వెళ్లిపోయారు... ఇక్కడికొచ్చాక మేమంతా కలిసి ఇటుకల తయారీమీద శిక్షణ తీసుకోవాలని అనుకున్నాం. దీనికి శారీరక శ్రమ చాలా అవసరం. దీనికితోడు హైడ్రాలిక్ యంత్రాలు కొనే స్థోమత లేక హ్యాండ్ ప్రెస్ చేయాల్సిన యంత్రాలతో ఇటుకలు తయారుచేయడం మొదలుపెట్టాం. అందరం కలిసే ప్రారంభించాం కానీ మిగతావారు ఆపని చేయలేక మధ్యలోనే వెళ్లిపోయారు. చివరికి మేమిద్దరమే మిగిలాం. అప్పుడే మా ఊర్లో ఓ ఆసుపత్రి కట్టడం మొదలుపెట్టారు. మాలో ఉన్న ఆసక్తిని గమనించి వాళ్లు దానికి అవసరమయ్యే పూర్తి ఇటుకల తయారీ బాధ్యత మాకే అప్పగించారు. రెండంతస్తుల ఆ నిర్మాణానికి సుమారు అరవై వేల ఇటుకలు అవసరమవుతాయని చెప్పారు. ఉన్నదే ఇద్దరం.. అమ్మో..!!..అసలు ఇదంతా పూర్తి చేయగలమా లేదా అనే అనుమానం రోజూ వెంటాడేది. కానీ ఇది పూర్తి చేస్తేనే. భవిష్యత్తులో మమ్మల్ని నమ్మి మాకెవరైనా పనిస్తారు. ఇది మాకు దొరికిన ఒక అవకాశం అనిపించింది. అందుకే రోజుకు 400 నుంచి 500 చొప్పున వారు చెప్పిన గడువులోగా ఇటుకలు తయారు చేసిచ్చాం. వ్యాపారం చేస్తారా అని వెటకారంగా మాట్లాడినవారే ఇప్పుడు మమ్మల్ని ప్రత్యేకంగా చూస్తుంటే ఏదో సాధించామన్న ఆత్మ సంతృప్తి ఉంది.



నాని



వెంకటలక్ష్మి

చదువులేకపోతే ఏంటి..? మాకు సంతకం పెట్టడం తప్ప అంతకు మించి చదువు రాదు. మా కుటుంబాల ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రమే. అందుకే మా పిల్లలు మాలానే కాకూడదని అనుకున్నాం. బాగా చదివించాలనుకున్నాం. మా భర్తల సంపాదనకు చేయూత కావాలని నిర్ణయించుకున్నాం. అప్పుడే హైదరాబాద్‌లో ఎన్ఐఆర్‌డీలో శిక్షణ గురించి తెలిసింది. అక్కడ చాలా రకాల్లో శిక్షణ ఇస్తున్నా... మేం మాత్రం ఇటుకల తయారీనే నేర్చుకున్నాం. వాటికున్న ప్రత్యేకతలు ఒక కారణమైతే, రెండోది మాకు అంతకముందు నుంచే కాస్త శారీరక శ్రమ చేసే అలవాటుండటం. అందుకే కష్టమని తెలిసినా ఆ పని ఎంచుకున్నాం. మేం తయారుచేసే ఇటుకలు కాల్చడానికి అసలు కొలిమి అక్కర్లేదు. ఎలాంటి కాలుష్యమూ ఉండదు. చెరువు దగ్గర నుంచీ తెచ్చిన మట్టిలో కొన్ని రసాయనాలు కలిపి ఆ మిశ్రమాన్ని హ్యాండ్ ప్రెస్ మెషీన్లలో పోసి గట్టిగా నొక్కాలి. ఆ తర్వాత వాటిని 24 గంటల పాటు ఎండలో పెడితే చాలు. పైగా వీటి ఉపరితలం చాలా మృదువుగా ఉండటంతో చాలా మంది మా ఇటుకల్ని చూసి ఆశ్చర్యపోయారు. వీటి ద్వారా ప్లాస్టరింగ్ లాంటి అదనపు ఖర్చులూ తగ్గుతాయి. ఇప్పుడు మేం తయారుచేసిచ్చిన ఇటుకలతో కట్టిన ఆసుపత్రికి పిల్లర్లు లేవు. మామూలు ఇటుకలతో పోలిస్తే మేం తయారు చేసే వాటివల్ల యాభై శాతం కన్నా తక్కువ కాలుష్యం ఉంటుంది.

సిద్ధంగా ఉన్నాం.. మా దగ్గర స్థలం లేకపోవడంతో ఒక చిన్న షెడ్ వేసుకునే పనిచేస్తున్నాం. దాన్నే వర్క్‌షాపులా మార్చేశాం. మాతో పాటు మరో ఎనిమిది మందికి పని కల్పించగలిగాం. రోజుకు 150 రూపాయలు కూలీకి వెళ్లే పరిస్థితి నుంచి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకుంటామని మేమెప్పుడూ అనుకోలేదు. ఆర్డర్లొస్తే వేగంగా పని పూర్తి చేయడానికి బెంగళూరు నుంచి హైడ్రాలిక్ మెషీన్లు కూడా తెప్పించుకున్నాం. ఇంకా మేమంటే ఏంటో నిరూపించుకోగలిగే పనులు వస్తే చేయటానికి సిద్ధంగా ఉన్నాం.

ఎత్తు చెప్పులతో ఇబ్బందా?

కాస్త ట్రెండీగా కనిపించడానికి ఎత్తుచెప్పులు కొనుక్కుంటాం. కానీ వాటిని వేసుకున్నప్పుడు సరిగ్గా నడవలేకపోతే చూసేవాళ్లకూ, మనకూ ఇబ్బందిగా ఉంటుంది. అందుకే కొన్ని జాగ్రత్తలు తీసుకుని చూడండి.



- అడుగు వేసేటప్పుడు చెప్పు ముందుబాగం కాకుండా మొదట హీల్ నేలను తాకేలా చూసుకోవాలి. దీనివల్ల అడుగుల్లో తడబాటు కనిపించదు. కొన్ని రోజులు ప్రయత్నిస్తే తరువాత అలవాటు అవుతుంది.
- ఎత్తుచెప్పులు కొన్న కొత్తలో కాస్త జారిపోతూ ఉంటాయి. అందుకే కిందివైపు శాండ్‌పేపర్‌తో కానీ, నెయిల్ ఫైల్‌తో కానీ రాయాలి. ఇలా చేయడం వల్ల నడుస్తున్నప్పుడు పట్టు ఉంటుంది.
- సాధన చేస్తున్నప్పుడు మొదట్లో ఏదైనా పాటకు అనుగుణంగా నడుస్తూ ఉండండి. దానివల్ల తడబడకుండా నడవడం అలవాటవుతుంది.
- ఆ చెప్పుల వల్ల బరువు మొత్తం మడిమ భాగంలో పడుతుంది. అందుకే మడమ కింద షూ ఇన్సర్ట్స్ లేదంటే ఫుట్ ప్యాడ్స్ ఉపయోగించాలి. వాటివల్ల పాదాలు జారకుండా కూడా ఉంటాయి.
- ముందు భాగం కాస్త దళసరిగా ఉన్న వాటినే ఎంచుకోవాలి. అలాగే వీలైనంత వరకు పాదం ముందు వైపు కప్పి ఉంచే చెప్పుల్ని ఎంచుకుంటే మంచిది.

సాధ్యమైనంత వరకూ రెండు అంగులాలకు మించి ఎత్తున్న చెప్పులను వాడకూడదు. వాటివల్ల పాదం వెనుక భాగంలోనే కాదు, ముందు భాగంలో కూడా నొప్పి వస్తుంది.

- నడుస్తున్నప్పుడు పాదాలు నొప్పి పుడుతున్నాయా.. ముందు వైపు షూ లాగా ఉండే రకాన్ని ఎంచుకున్నప్పుడు..మధ్యవేలు, నాలుగో వేలును కలిపి ప్లాస్టర్ కానీ, బ్యాండ్ ఎయిడ్ కానీ చుట్టుకుని చూడండి. ఒకసారి ఇలా ప్రయత్నిస్తే మార్పు మీకే తెలుస్తుంది.
- కొనుగోలు చేసేముందు ఒక ట్రెండు సార్లు నడవడం మంచిది. మీకు సౌకర్యంగా ఉన్నాయో లేదో గమనించుకోవాలి. కొత్త ఫ్యాషన్ అనుకోకుండా మనకు నప్పేవే ఎంచుకుంటే మంచిది.

దేశవ్యాప్తంగా వివిధ రైల్వే జోన్లలో 26,502 టెక్నికల్, అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలయింది. కొత్త సంవత్సరం ఆరంభంలోనే రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు నిరుద్యోగులకు అందించిన అద్భుతమైన అవకాశం ఇది!



కొలువుల రైలు.. కదిలివచ్చింది!

ఈ రైల్వే ఉద్యోగాలకు ఎంపికైతే.. పోస్టును బట్టి ప్రొడక్షన్ యూనిట్, వర్క్‌షాప్, జనరల్ సర్వీస్, క్యారేజ్ అండ్ వ్యాగన్, ప్రింటింగ్ ప్రెస్, డీజిల్ షెడ్, ట్రాక్ మెషిన్, టెలికమ్యూనికేషన్ సిస్టమ్, సిగ్నల్ సిస్టమ్ వంటి వివిధ డిపార్ట్‌మెంట్లలో ఆపరేటర్, ఫిట్టర్, డ్రైవర్, పెయింటర్ పోస్టులతోపాటు అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టుల్లో విధులు నిర్వర్తించాల్సివుంటుంది. నెల జీతం రూ. 35,000 నుంచి రూ. 40,000 వరకు వస్తుంది.



సుధీర్ చక్రవర్తి చాగంటి
Sreedhar's CCE

ఎవరు అర్హులు?

◆ పదోతరగతి తర్వాత ఐటీఐ పూర్తి చేసినవారు ◆ 3 సంవత్సరాల డిప్లొమా పూర్తి చేసినవారు ◆ పాలిటెక్నిక్ పూర్తిచేసిన తర్వాత 3 సంవత్సరాల ఇంజినీరింగ్ పూర్తి చేసినవారు ◆ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్ పూర్తిచేసినవారు

చివరి సంవత్సరం చదువుతున్నవారు ఈ పోస్టులకు అనర్హులు.

వయః పరిమితులు: జనరల్ కేటగిరీవారు 18-28 సంవత్సరాల మధ్యవారై ఉండాలి. 01-07-2018తో సరిచూసుకొని అభ్యర్థుల వయసు నిర్ణయిస్తారు. రిజర్వేషన్ కేటగిరీలకు మినహాయింపు ఉంటుంది.

ముఖ్యమైన తేదీలు: ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేయడానికి చివరితేది: 05-03-2018.

ప్రథమ కంప్యూటర్ ఆధారిత పరీక్ష: ఏప్రిల్, మే నెలల్లో ఉంటుంది.

అభ్యర్థులు ఏ రైల్వే జోన్‌కు దరఖాస్తు చేయాలో నిర్ణయించుకుని, ఆయా రైల్వే వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు పూర్తిచేసి, ఫీజు చెల్లించాలి. ఏదైనా ఒక రైల్వే జోన్‌కు మాత్రమే అప్లై చేయాలి. ఒక అభ్యర్థి ఒక దరఖాస్తును మాత్రమే పూర్తి చేయాలి.

ఎంపిక ప్రక్రియ: అసిస్టెంట్ లోకో పైలట్ (ఏఎల్‌పీ), టెక్నిషియన్ పోస్టులకు దరఖాస్తు చేసినవారు మొదట కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) రాయాల్సి ఉంటుంది. ఇందులో క్వాలిఫై అయినవారికి రెండో కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహిస్తారు. మొదటి పరీక్షలోని మార్కులు క్వాలిఫయింగ్ మార్కులు మాత్రమే. రెండో పరీక్షలోని మార్కుల ఆధారంగా టెక్నిషియన్ పోస్టులను భర్తీ చేస్తారు.

ఏఎల్‌పీ పోస్టుకు దరఖాస్తు చేసినవారికి రెండో సీబీటీ తర్వాత కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. రెండో సీబీటీలో వచ్చిన మార్కుల్లో 70%, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో వచ్చిన వాటిల్లో 30% మార్కుల ఆధారంగా మెరిట్ లిస్ట్ తయారు చేస్తారు.

కంప్యూటర్ ఆధారిత పరీక్ష (ఏఎల్‌పీ/ టెక్నిషియన్)

అరిథ్‌మెటిక్, మ్యాథమేటిక్స్, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ అంశాల నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. 60 నిమిషాల వ్యవధిలో పూర్తిచేయాలి. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు, తప్పు సమాధానానికి 1/3 రుణాత్మక మార్కులున్నాయి.

జనరల్ కేటగిరీవారు 40%, ఓబీసీ, ఎస్సీవారు 30%, ఎస్టీ వారు 25% కనీస అర్హత మార్కులు పొందాలి.

రెండో సీబీటీ: (ఏఎల్‌పీ/టెక్నిషియన్)

మొదటి సీబీటీలో క్వాలిఫై అయిన వారిలో, పోస్టుల ఆధారంగా 15 రెట్ల మంది అభ్యర్థులను రెండో సీబీటీకి అర్హులుగా నిర్ణయిస్తారు. పార్ట్- ఎ, పార్ట్- బి పరీక్షలుంటాయి. రెండు పరీక్షలను 2.30 గంటల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

పార్ట్- ఎ: మ్యాథమేటిక్స్, అరిథ్‌మెటిక్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, బేసిక్ సైన్స్, ఇంజినీరింగ్ (టెక్నికల్) సబ్జెక్టుల నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. 90 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి.

పార్ట్- బి: డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ వారు నిర్ణయించిన ట్రేడ్ సిలబస్ ఆధారంగా 75 ప్రశ్నలు ఇస్తారు. 60 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి. ఇందులో 35% అర్హత మార్కులు సాధిస్తే చాలు. మొత్తం మెరిట్ మార్కుల్లో పార్ట్- బిని పరిగణించరు.

కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఎల్‌పీ పోస్టులకు మాత్రమే)

రెండో సీబీటీలో క్వాలిఫై అయినవారిలో పోస్టుల సంఖ్య ఆధారంగా 8 రెట్ల మందికి కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రతీ టెస్ట్ బ్యాటరీలో 42 మార్కులు రావాలి. ఈ పరీక్ష సైకాలజీ టెస్ట్ లాంటిది.

ఏది ఎలా చదవాలి?

టెక్నిషియన్ పోస్టులకు రెండు అంచెల్లో, ఏఎల్‌పీ పోస్టుకు మూడు అంచెల్లో జరుగుతున్న పరీక్షలో మొదటిది సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) క్వాలిఫయింగ్ పరీక్ష మాత్రమే. రెండో సీబీటీలోని పార్ట్-ఎ, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ మార్కుల ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెండో సీబీటీలోని పార్ట్-బి కూడా క్వాలిఫయింగ్ మాత్రమే.

అభ్యర్థులు మేథమేటిక్స్, అరిథ్‌మెటిక్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టులు మొదటి సీబీటీ, రెండో సీబీటీ పరీక్షల్లో వస్తున్నాయి. కాబట్టి వీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపితే మొదటి సీబీటీలో క్వాలిఫై అవడంతోపాటు రెండో సీబీటీలో ఎక్కువ మార్కులు పొందవచ్చు.

టెక్నికల్ సబ్జెక్టు అయిన బేసిక్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రెండో సీబీటీలో పార్ట్-ఎలో ఉంటుంది. అభ్యర్థులు వారు పూర్తిచేసిన కోర్సుల్లోని సబ్జెక్టులే కాబట్టి, పునశ్చరణ చేస్తే సరిపోతుంది.

>> **అరిథ్‌మెటిక్:** సింప్లిఫికేషన్‌లో బాడ్‌మాస్, వెడ్‌మాస్ రూల్స్ వినియోగించే విధానం, నంబర్ సిస్టమ్స్, శాతాలు, రేషియో-ప్రపోర్షన్, లాభనష్టాలు, కాలం-పని, కాలం-దూరం, చక్రవడ్డీ, బారువడ్డీ, ఎల్‌సీఎం, హెచ్‌ఎస్‌ఎఫ్, భాగస్వామ్యం, పైప్స్-సిస్టర్న్స్, క్యాలెండర్, గడియారాల నుంచి ప్రశ్నలు వస్తాయి.



> పరీక్ష జరగడానికి 3 నెలల సమయం ఉంది. రోజువారీ వీలైనంత ఎక్కువ సమయం సన్నద్ధత కోసం వెచ్చించటం సముచితం. ఎక్కువ ప్రశ్నలను సాధన చేస్తూ ఆత్మవిశ్వాసంతో ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చు!

డేటా అనాలిసిస్, డేటా సఫిషియన్సీ ప్రశ్నలకు సమాధానాలను గుర్తించడం సాధన చేయాలి. సింప్లిఫికేషన్ తక్కువ సమయంలో పూర్తి చేయడం తెలిసుండాలి. శాతాలను ఆధారంగా తీసుకుని లాభనష్టాలు, చక్రవడ్డీ, బారువడ్డీ, నిష్పత్తి-అనుపాతం ప్రశ్నలను సాధన చేయాలి. ఇవన్నీ ఒకే కోణానికి చెందిన అంశాలు. లాజిక్ ఒకేవిధంగా ఉంటూ ప్రశ్నలో ఉపయోగించే భాష మాత్రమే వేరుగా ఉంటుంది. ఇలా సాధన చేస్తే సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

>> **మేథమేటిక్స్:** త్రికోణమితి, ఎత్తు-దూరం, ఆల్జీబ్రా, జామెట్రీలో ప్లేన్ జామెట్రీ, కోఆర్డినేట్ జామెట్రీ, ఎలిమెంట్రీ స్టాటిస్టిక్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. వీటికి సంబంధించిన ఫార్ములాలన్నింటినీ ఒక దగ్గర రాసుకుని వాటిని ఎలా ఉపయోగించాలో సాధన చేయాలి. షార్ట్ కట్స్ ఉపయోగించి తక్కువ సమయంలో సమాధానాలను గుర్తించడం అలవాటు చేసుకోవాలి.

>> **జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్:** లాజికల్ రీజనింగ్ అంశాలైన నంబర్ సిరీస్, కోడింగ్-డీకోడింగ్, ఆడ్ మాన్ అవుట్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలో ఉన్న సమాచారాన్ని లింక్ చేస్తూ లాజిక్‌ను కనిపెట్టాలి. వెన్ చిత్రాలు, సిమిలారిటీస్, డిఫరెన్సెస్ వంటి క్లరికల్ ఆప్టిట్యూడ్ అంశాలు, రిలేషన్‌షిప్, మేథమేటికల్ ఆపరేషన్స్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.

ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే క్రిటికల్ రీజనింగ్‌లోని ప్రశ్నలు సులువుగా చేయవచ్చు. సమాధానం గుర్తించకపోతే వెంటనే లాజిక్ మార్చి ప్రశ్నను పూర్తిచేయడం అలవాటు చేసుకోవాలి.

>> **జనరల్ సైన్స్:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ అంశాలు పదో తరగతి స్థాయిలో ఉంటాయి.

>> **జనరల్ అవేర్‌నెస్, కరెంట్ అఫైర్స్:** సమాజంలో చుట్టూ జరుగుతున్న శాస్త్రీయ, సాంకేతిక, భౌగోళిక, ఆర్థికవ్యవస్థలపై అవగాహన కలిగివుండాలి. జాతీయ, అంతర్జాతీయ అంశాలు, వార్తల్లోని వ్యక్తులు, దేశాలు-రాజధానులు, కరెన్సీ, ఇటీవలి అంతర్జాతీయ సమావేశాలు మొదలైనవి ముఖ్యం.

>> **బేసిక్ సైన్స్, ఇంజినీరింగ్:** టెక్నికల్ సబ్జెక్టులో ఉండే అంశాల నుంచి సాధారణ ప్రశ్నలు వస్తాయి. బేసిక్ ఎలక్ట్రిసిటీ, యూనిట్ మెజర్‌మెంట్స్, సర్క్యూట్స్, స్పీడ్-వెలాసిటీ, హీట్-టెంపరేచర్, మెషిన్స్, లివర్, సేఫ్టీ-హెల్త్, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్, యూనిట్స్, మాస్ వెయిట్-డెన్సిటీ. ఇంజినీరింగ్ డ్రాయింగ్స్‌లోని ప్రొజెక్షన్స్, డ్రాయింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్, జామెట్రిక్ ఫిగర్స్, సింబాలిక్ రెప్రజెంటేషన్స్ అంశాల్లోని సాధారణ ప్రశ్నలు వస్తాయి. అభ్యర్థులు వారు చదువుతున్న పుస్తకాల్లోని ఈ అంశాలకు రివిజన్ పూర్తిచేసి ఆబ్జెక్టివ్ విధానాల్లో అడగటానికి అవకాశం ఉన్న ప్రశ్నలు గుర్తించి వాటికి సిద్ధమవ్వాలి.

సన్నద్ధత ఒకటే!

తెలంగాణ రాష్ట్రంలోని డీఈడీ, బీఈడీ అర్హత గల నిరుద్యోగ అభ్యర్థులకు శుభవార్త! హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలకు ప్రకటన వెలువడింది. దాదాపు ఒకే ప్రిపరేషన్‌తో ఇటు ఈ పోస్టులకూ, అటు ఉపాధ్యాయ పోస్టులకూ పోటీపడే మంచి అవకాశం ఇది!


తెలంగాణలోని బీసీ సంక్షేమశాఖలో 219, గిరిజన సంక్షేమశాఖలో 91 వసతి గృహాల సంక్షేమాధికారుల ఖాళీలను భర్తీ చేయనున్నారు. మహిళా అభ్యర్థులకు ఇదో మంచి అవకాశం. బీసీ వెల్ఫేర్‌లో 66 పోస్టులు వీరికే కేటాయించారు. అభ్యర్థులు రెండు రకాల పోస్టులకూ విడివిడిగా దరఖాస్తు చేసుకోవాలి. అర్హతలూ, పరీక్ష విధానం అన్నింటికీ ఒకటే. ఆన్‌లైన్లోనే దరఖాస్తు చేసుకోవాలి.



డా. వి. బ్రహ్మం

✦ ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రారంభం: ఫిబ్రవరి 6
✦ ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: మార్చి 6
✦ వెబ్‌సైట్: https://tspsc.gov.in

● హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు 310



భోజన సదుపాయాలు, వసతి కల్పించే బాధ్యతతోపాటు, బోధన, అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు ఉంటుంది. గ్రేడు-1 అధికారిగా ఉద్యోగం పొందేవారు తక్కువకాలంలోనే అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ స్థాయికి చేరుకోగలరు. వసతిగృహాలన్నీ మండల కేంద్రాల్లో/ పెద్దపెద్ద పంచాయతీల్లో, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉంటాయి. జీతభత్యాలు ఎస్‌జీటీ ఉపాధ్యాయుని కంటే ఎక్కువ.

రాతపరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా ఎంపిక చేస్తారు. ఇందులో రెండు పేపరు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటాయి. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో అడుగుతారు.

పేపర్-1కు ఎలా తయారవ్వాలి?

దీనిలో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ అంశాల్లో ప్రశ్నలుంటాయి. ప్రశ్నపత్రం 150 మార్కులకు ఉంటుంది. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు చొప్పున 150 ప్రశ్నలు. పరీక్ష వ్యవధి 150 నిమిషాలు.

13 అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయానికి సంబంధించిన వర్తమానాంశాలు; అంతర్జాతీయ సంబంధాలు, సమావేశాలు; జనరల్ సైన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత ప్రతిభ; పర్యావరణాంశాలు, విపత్తు నిర్వహణ, తెలంగాణ ప్రాధాన్యాంశంగా భారతదేశ భౌగోళికం; భారత రాజ్యాంగం, తెలంగాణ స్థానిక ప్రభుత్వాలు; తెలంగాణ సమాజం, నాగరికత, కళలు, సాహిత్యం, వారసత్వం; తెలంగాణ రాష్ట్ర విధివిధానాలు, భారత స్వాతంత్ర్యోద్యమం ప్రాధాన్యంగా ఆధునిక భారతదేశ చరిత్ర; తెలంగాణ రాష్ట్రోద్యమం ముఖ్యాంశంగా తెలంగాణ రాష్ట్ర చరిత్ర; లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్, బేసిక్ ఇంగ్లిష్.

✦ ఇంగ్లిష్ అంశాల కోసం 10 వ తరగతి స్థాయి ఆంగ్ల వ్యాకరణం అభ్యసించి ప్రణాళిక ప్రకారం సాధన చేయాలి.

పేపరు-2 ఇదీ తీరు

పేపరు-2 గ్రేడు-2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు డీఈడీ స్థాయి సిలబస్‌లోనూ, గ్రేడు-1 అధికారికి బీఈడీ స్థాయి సిలబస్‌లోనూ ప్రశ్నల స్థాయి ఉంటుంది. ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఇప్పటికే సన్నద్ధత కొనసాగిస్తున్నవారికి ఈ సిలబస్ సులభం. ఇందులో 150 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకూ ఒక మార్కు. పరీక్ష వ్యవధి 150 నిమిషాలు.

ప్రధానంగా 4 విభాగాలు చదవాలి. 1. విద్యా ఆధారాలు 2. విద్యా మనోవిజ్ఞానశాస్త్రం 3. విద్యా సాంఖ్యకశాస్త్రం 4. విద్యలో నూతన పోకడలు. విద్యా తత్త్వశాస్త్రంలో తాత్విక దృక్పథాలు, సామాజిక/సాంఘిక దృక్పథాలు, పాఠశాల-సమాజం; విద్యా మనోవిజ్ఞానంలో విద్య- మనోవిజ్ఞాన శాస్త్రం, పెరుగుదల-వికాసం, అభ్యసనం, ప్రేరణ, బోధన, మూర్తిమత్వం-వైయక్తిక/ వ్యక్తిగత భేదాలు ప్రత్యేక విద్య; విద్యా సాంఖ్యకశాస్త్రంలో వివరణాత్మక సంఖ్యాశాస్త్రం, విద్యలో నూతన పోకడలు/ సమకాలీన అంశాల్లో సార్వత్రిక విద్య, పాఠశాల-కమ్యూనిటీ సంబంధాలు, నైతిక విద్య, జీవితకాల విద్య అధ్యయనం చేయాలి.

▌ గ్రేడ్-1 అధికారి పోస్టుకు రాసే అభ్యర్థులు పై వాటికి అదనంగా పాఠశాల నిర్వహణ, పరిపాలన అభ్యసించాలి. ఈ సిలబస్‌లోని అంశాలన్నీ తెలుగు అకాడమీ డీఈడీ, బీఈడీ పుస్తకాల్లో అవసరంమేరకు తయారవ్వాలి. ▌ గ్రేడ్-1 అధికారి ప్రశ్నపత్రం విశ్లేషణ, అన్వయం, నైపుణ్య స్థాయులను పరీక్షించేలా ఉండొచ్చు. గతంలో ఏపీపీఎస్సీ ఇదే ఉద్యోగాలకు నిర్వహించిన ప్రశ్నపత్రాల ప్రశ్నల సరళిని పరిశీలించి సన్నద్ధతను ప్రారంభిస్తే మేలు. ▌ గత ప్రశ్నలను మాదిరిగా తీసుకొని అవగాహనకు వస్తే ప్రధాన విషయాలు, భావనలు అభ్యసించవచ్చు. ▌ ఉపాధ్యాయ శిక్షణలో అధ్యయనం చేసిన ఫిలాసఫీ, సోషియాలజీ, సైకాలజీలను పరీక్షిస్తారు. ▌ గతంలో వ్యాసరూప, సంక్షిప్త ప్రశ్నలకు రాసే సమాధానాలను ఇప్పుడు బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలోకి మార్చుకొని, బాగా సాధన చేయాలి. పునశ్చరణ ప్రధానం.

నిరంతర ప్రేరణ కలగజేసుకుని స్వీయ మూల్యాంకనంతో కృషి కొనసాగిస్తే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగం మీ సొంతం!

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏపీ సాంఘిక సంక్షేమ గురుకులాలు

ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐఐటీ-నీట్ మెడికల్ అకాడమీల్లో కాంట్రాక్టు టీచర్ల భర్తీకి ప్రకటన విడుదలైంది.

పోస్టు: క్యాంపస్ డైరెక్టర్, టీచింగ్ ఫ్యాకల్టీ.

అర్హత: సొసైటీ నిర్దేశించిన అర్హతలతోపాటు టీచింగ్ పోస్టులకు బోధనలో అనుభవం.

ఎంపిక: ఇంటర్వ్యూ, డెమో ద్వారా.
దరఖాస్తు: ఆన్‌లైన్ **చివరితేది:** 10.02.2018

వెబ్‌సైట్: http://apswreis.info/

ఏపీ సీఆర్‌డీఏ

ఏపీ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్‌డీఏ) విజయవాడలో ఉంది.

పోస్టులు: రిసెర్చ్ అసోసియేట్-04, సీనియర్ ఇంజినీర్-03.

అర్హత, వయసు: ప్రకటనలో తెలిపిన విధంగా. **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: ఆన్‌లైన్

చివరితేది: 17.02.2018

వెబ్‌సైట్: https://crda.ap.gov.in/

ప్రవేశాలు

మనూ మోడల్ స్కూల్, హైదరాబాద్

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ-మనూ ఆధ్వర్యంలో ఈ పాఠశాల నడుస్తోంది.

1) 1 నుంచి 9 తరగతులు 2) 11వ తరగతి

బోధనా మాధ్యమం: ఉర్దూ

అర్హత, వయసు, ఎంపిక విధానం: వర్సిటీ నిబంధనల ప్రకారం. **దరఖాస్తు విధానం:** స్కూలు కార్యాలయంలో సంప్రదించాలి.

1-9 తరగతుల దరఖాస్తు ప్రక్రియ: 12.02.2018 నుంచి 13.03.2018 వరకు **11వ తరగతి దరఖాస్తు ప్రక్రియ:** 01.06.2018 నుంచి 15.06.2018 వరకు

చిరునామా: మనూ మోడల్ స్కూల్, వట్టేపల్లి, ఫలక్‌నుమా, హైదరాబాద్.

వెబ్‌సైట్: http://www.manuu.ac.in/

వాక్ఇన్ ఇంటర్వ్యూ

ఎస్‌కే యూనివర్సిటీ, అనంతపురం

పోస్టులు: టీచింగ్ ఫ్యాకల్టీ-20, ల్యాబ్ అసిస్టెంట్-07

అర్హత: ఆయా సబ్జెక్టుల్లో డిగ్రీతోపాటు పీజీ, ఇంజినీరింగ్ డిప్లొమా/ ఐటీఐ.

ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.

ఇంటర్వ్యూ తేది: ఫిబ్రవరి 16, 17

వేదిక: అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఎస్‌కే యూనివర్సిటీ, అనంతపురం.

వెబ్‌సైట్: http://skuniversity.ac.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

విదేశీ భాషలకు చిరునామా... ఇఫ్లూ

ఒకప్పటి సీఫెల్... ఇప్పుడు ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)! విదేశీ భాషలు నేర్చుకోవడానికి హైదరాబాద్‌లోని ఇఫ్లూ తరహా యూనివర్సిటీ దక్షిణాసియాలో మరెక్కడా లేదు. దీనికి లఖ్‌నవూ, షిల్లాంగ్‌లోనూ క్యాంపస్‌లు ఉన్నాయి. యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు ఇక్కడ శాస్త్రీయంగా నేర్చుకోవచ్చు.

ఆధునిక ప్రపంచంలో వస్తోన్న మార్పులు, విస్తరిస్తోన్న పర్యాటక రంగం, విదేశీ కంపెనీలు పలు దేశాలు, ప్రాంతాల్లో శాఖలు ఏర్పరచడం..తదితర కారణాలతో విదేశీ భాషలు వచ్చినవారికి ప్రాముఖ్యం పెరిగింది. సాఫ్ట్‌వేర్, బీపీవో, కేపీవో, ఎల్పీవో, మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్...ఇలా అన్ని రంగాలు, విభాగాల్లో విదేశీ భాషలు వచ్చినవారి సేవలు అనివార్యమయ్యాయి. అందుకే ఆసక్తి ఉంటే ఇంగ్లిష్, ఇంకా జర్మన్, స్పానిష్, ఫ్రెంచ్, ఇటాలియన్, పర్షియన్, చైనీస్...ఇలా ఏదో ఒక భాషలో నైపుణ్యం పెంచుకుని సుస్థిర కొలువును సొంతం చేసుకోవచ్చు.



కోర్సులు... అర్హతల వివరాలు

బీఏ (ఆనర్స్) : ఇంగ్లిష్: హైదరాబాద్ క్యాంపస్‌లో 40, లఖ్‌నవూలో 40, షిల్లాంగ్‌లో 20 సీట్లు ఉన్నాయి.

బీఏ (ఆనర్స్): అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, రష్యన్, స్పానిష్ ఒక్కో కోర్సులో హైదరాబాద్ క్యాంపస్‌లో 20 చొప్పున సీట్లు ఉన్నాయి.

బీఏ: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ కోర్సు షిల్లాంగ్ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నారు. 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: పై కోర్సుల్లో ప్రవేశానికి జనరల్, ఓబీసీ అభ్యర్థులైతే ఇంటర్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీలైతే 45 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం కోర్సులు చదువుతున్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు.

కోర్సు: బీఎడ్ ఇంగ్లిష్ హైదరాబాద్ క్యాంపస్‌లో 50 సీట్లు ఉన్నాయి.

అర్హత: బీఏ ఇంగ్లిష్ లేదా ఎంఏ ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీలైతే 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

పీజీ (ఎంఏ) కోర్సులు

ఇంగ్లిష్: హైదరాబాద్ క్యాంపస్‌లో 90, లఖ్‌నవూలో 40, షిల్లాంగ్‌లో 30 సీట్లు ఉన్నాయి.

ఇంగ్లిష్ లిటరేచర్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20, షిల్లాంగ్‌లో 30 సీట్లు.

లిటరేచర్స్ ఇన్ ఇంగ్లిష్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.

కంపారిటివ్ లిటరేచర్: హైదరాబాద్‌లో 20 సీట్లు ఉన్నాయి.

లింగ్విస్టిక్స్: హైదరాబాద్, లఖ్‌నవూ, షిల్లాంగ్‌ల్లో 20 చొప్పున సీట్లు ఉన్నాయి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్: హైదరాబాద్‌లో 20 సీట్లు ఉన్నాయి.

జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20, షిల్లాంగ్‌లో 20 సీట్లు ఉన్నాయి. హిందీ, కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్, అరబిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, ఫ్రెంచ్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, జర్మన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, హిస్పానిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్, రష్యన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ ఒక్కో సబ్జెక్టులో 20 చొప్పున హైదరాబాద్ క్యాంపస్‌లో ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

పీజీడీటీఈ: హైదరాబాద్‌లో 40, లఖ్‌నవూలో 20 సీట్లు ఉన్నాయి.

పీజీడీటీఏ: హైదరాబాద్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: పీజీ కోర్సుల్లో ప్రవేశానికి బ్యాచిలర్ డిగ్రీలో జనరల్, ఓబీసీ అభ్యర్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. అలాగే సంబంధిత అంశాన్ని డిగ్రీ లేదా ప్రత్యేక డిప్లొమా స్థాయిలో చదివుండాలి.

ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా.

పరీక్ష ఇలా...

కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహిస్తారు. యూజీతోపాటు పలు పీజీ కోర్సుల్లో ప్రవేశానికి ఆబ్జెక్టివ్ పరీక్షను నిర్వహిస్తారు. వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. అయితే కొన్ని పీజీ (అరబిక్, ఫ్రెంచ్, జర్మన్, హిస్పానిక్, రష్యన్), అన్ని పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికీ కంప్యూటర్ బేస్డ్ ఆబ్జెక్టివ్‌లతోపాటు డిస్క్రిప్టివ్ విధానం (పేపర్)లోనూ పరీక్ష ఉంటుంది. ఆబ్జెక్టివ్ పరీక్ష 40 మార్కులకు, డిస్క్రిప్టివ్ పరీక్ష 30, ఓరల్ 30 మార్కులకు నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ ఒక్కో విభాగానికీ గంట చొప్పున కేటాయించారు. ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పీహెచ్‌డీ లింగ్విస్టిక్స్ అండ్ ఫొనెటిక్స్ విభాగాల్లో ప్రవేశానికి ఆబ్జెక్టివ్ పరీక్షకు 70, ఓరల్ 30 మార్కులు కేటాయించారు.

రాతపరీక్షలో అర్హత సాధించినవారికి ఇంటర్వ్యూలు నిర్వహించి కోర్సులకు ఎంపిక చేస్తారు. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు పరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా ప్రవేశం లభిస్తుంది. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచిత వసతి కల్పిస్తారు.

దరఖాస్తులకు చివరితేది: ఫిబ్రవరి 7


ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ. 500; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ. 250.

పరీక్ష తేదీలు: ఫిబ్రవరి 24, 25.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విజయవాడ.
వెబ్‌సైట్: www.efluniversity.ac.in

పార్లమెంటులో పోరాటం: చంద్రబాబు

ఈనాడు అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై పార్లమెంటు వేదికగా పోరాడాలని, రాష్ట్ర ప్రజల్లోని తీవ్ర అసంతృప్తి, ఆగ్రహాలను కేంద్రానికి అర్థమయ్యేలా చెప్పాలని తెలుగుదేశం నిర్ణయించింది. రాష్ట్రానికి రావలసిన ప్రయోజనాలను సాధించుకునేంత వరకు దశలవారీగా కేంద్రంపై ఒత్తిడి పెంచనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఆదివారం ఉండవల్లిలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. సమావేశం జరుగుతున్నప్పుడే కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నుంచి ముఖ్యమంత్రికి ఫోన్ వచ్చింది. భాజపా, కేంద్ర ప్రభుత్వం తరపున కాకుండా వ్యక్తిగత హోదాలోనే మాట్లాడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని, తొందరపాటు నిర్ణయాలేమీ వద్దని తెలిపారు. మరోసారి ప్రధానిని కలవాల్సిందిగా సూచించారు. ఆయనకు ముఖ్యమంత్రి కాస్త గట్టిగానే బదులిచ్చినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధానిని ఎన్నిసార్లు కలిసినా ఏం ప్రయోజనమని, ఇప్పటికే చాలాసార్లు కలిశానని, బడ్జెట్‌కు ముందు కూడా మరోసారి కలిసి రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరినా ప్రయోజనం లేదని ఆయనతో ముఖ్యమంత్రి చెప్పినట్టు సమాచారం. రాజ్‌నాథ్‌సింగ్‌తో మాట్లాడాక ముఖ్యమంత్రి సమావేశాన్ని కొనసాగించారు. ఎన్‌డీఏతో తెగదెంపులు చేసుకోవడం, ఎంపీల రాజీనామాలు వంటి తొందరపాటు నిర్ణయాలేమీ ఇప్పటికిప్పుడు అవసరం లేదని.. ఇదే సమయంలో ప్రజాప్రయోజనాల విషయంలోనూ రాజీ పడరాదని సమావేశంలో నిర్ణయించారు. భవిష్యత్తు కార్యాచరణపై ఎంపీలకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. దీని ప్రకారం.. భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రులు అరుణ్‌జైట్లీ, రాజ్‌నాథ్‌సింగ్ వంటి ముఖ్యుల్ని తెదేపా ఎంపీలంతా సోమవారం కలుస్తారు. కొత్తగా ఏమీ అడగడం లేదని, కేంద్ర హామీలు, రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావలసినవే అడుగుతున్నామని చెబుతారు. విశ్వాసం కుదిరేలా విస్పష్టమైన హామీకి పట్టుబడతారు. వారినుంచి ఆశించిన స్పందన లేని పక్షంలో మంగళవారం నుంచి పార్లమెంటు వేదికగా ఆందోళన చేపడతారు. ఉభయసభల్లోను తెదేపా ఎంపీలు వెల్‌లోకి వెళ్లి గట్టిగా నిరసన తెలియజేస్తారు. చంద్రబాబు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఎంపీలతో మాట్లాడతారు. కేంద్రం నుంచి హామీ వచ్చేంతవరకు గానీ, ఈ నెల 9న పార్లమెంటు వాయిదా పడేంత వరకుగానీ ఈ ఆందోళన కొనసాగుతుంది. అప్పటికీ కేంద్రంలో స్పందన లేకపోతే మళ్లీ సమావేశమై భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తారు.



పెంపుపై మాట్లాడొద్దు..!

మనం సాగించే పోరాటం రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, ఇది భాజపా, తెదేపాల మధ్య పోరాటం కూడా కాదని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రజాసమస్యల పరిష్కారమే అజెండా అని స్పష్టంచేశారు. రాష్ట్రంలో శాసనసభ నియోజకవర్గాల పెంపుపై ఎవరూ మాట్లాడవద్దని, అది అసలు ప్రాధాన్యతాంశమే కాదని తెలిపారు. మనకు నియోజకవర్గాల పెంపు అవసరం లేదని స్పష్టం చేశారు. రైల్వే జోన్, రాజధానికి నిధులు, పోలవరం, రెవెన్యూ లోటు భర్తీ, ప్రత్యేక ప్యాకేజీ అమలు వంటి రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపైనే పట్టుబట్టాలని విస్పష్టంగా తెలిపారు. రాష్ట్రానికి మేలు చేస్తారనే అప్పట్లో భాజపాతో కలిశామన్నారు. మంత్రి పదవులు కూడా తాను డిమాండ్ చేయలేదని, మొదట కేబినెట్ మంత్రి పదవి ఇస్తానంటే అశోక్‌గజపతిరాజుకు ఇవ్వమని చెప్పానని, సహాయ మంత్రి పదవి కూడా ఇస్తామంటే సుజనా చౌదరి పేరు సూచించానని తెలిపారు.

రాష్ట్రమే నాకు ముఖ్యం

తృతీయఫ్రంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, చంద్రబాబును ప్రధాని అభ్యర్థిగా నియమిస్తారని చర్చ జరుగుతోందంటూ ఒక ఎంపీ ప్రస్తావించగా.. ముఖ్యమంత్రి గట్టిగా స్పందించారు. తనకు అలాంటి ఆలోచనే లేదని, రాష్ట్ర ప్రయోజనాలే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. మనకు ఆ ఆలోచన ఉన్నట్టు కూడా సంకేతాలు వెళ్లడానికి వీల్లేదని, పార్టీ నాయకులెవరూ ఆ విషయంపై మాట్లాడనూ వద్దని ఆదేశించారు.

నేను ఎవరికీ భయపడను..

'పార్టీకి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీల రాజీనామాల సమర్పణ నిమిషంలో పని. ఎప్పుడు? ఏమిటి? ఎలా? అనేది ఇకపై రోజువారీ పరిణామాలే నిర్దేశిస్తాయి. నిన్నమొన్నటి వరకు అంతర్గతంగా ఒత్తిడి తెచ్చాం. బడ్జెట్ వరకు గడువిచ్చాం. ఇకపై బహిరంగంగానే ఒత్తిడి తెస్తాం. ప్రజల ఆకాంక్షలే మనకు ముఖ్యం. పరుష పదజాలం వాడాల్సిన పని లేదు. హుందాగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారానికి పోరాడుదాం. నాకెవరిపైనా కోపం లేదు. కేంద్రం, భాజపాపై వ్యతిరేకత లేదు. నన్ను నమ్మిన ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే కర్తవ్యం' అని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగితే తనపై కేసులు పెడతారని కొందరు ప్రచారం చేస్తున్నారని, అసలు అలాంటి వాటికి తానెందుకు భయపడతానని, లక్ష్యపెట్టేవాడిని కాదని ఎంపీలతో ఆయనన్నారు. 'పశ్చిమబెంగాల్ వంటి భాజపాయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు మనుగడ సాగించడం లేదా? ఎన్డీయే నుంచి బయటకు రావలసిన పరిస్థితి వస్తే.. మనమూ అలాగే మన పని మనం చేసుకుంటాం' అని తెలిపారు. 'భాజపాతో విభేదించి శివసేన బయటకు వచ్చేస్తుందన్నా.. మనం మిత్రపక్ష ధర్మానికే కట్టుబడ్డాం. సంయమనంతో, ఒక పద్ధతి ప్రకారం వెళ్లాం. ఇంత గౌరవంగా నడుచుకున్నా కేంద్రం నుంచి స్పందన లేదు. ఇన్నాళ్లూ నా అసంతృప్తిని ఎక్కడా బహిర్గతం చేయలేదు. ఇప్పుడు బడ్జెట్ చూశాక నేనూ మాట్లాడాల్సి వస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు భారీగా కేటాయించి మనల్ని విస్మరించడాన్ని ఏమనుకోవాలి' అని చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు.

అమిత్‌షా ఫోన్ చేయలేదు

సమావేశం జరుగుతున్నప్పుడు టీవీ ఛానళ్లలో వస్తున్న వార్తల వివరాలను కొందరు ముఖ్యమంత్రికి తెలిపారు. సమావేశం ప్రారంభానికి ముందు చంద్రబాబుతో అమిత్‌షా ఫోన్లో మాట్లాడారంటూ కొన్ని టీవీ ఛానళ్లు ప్రసారం చేసిన వార్తల్ని ఆయన ఖండించారు. అమిత్‌షా ఫోన్ చేయలేదని స్పష్టంచేశారు. శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్‌ఠాక్రేతో తాను మంతనాలు సాగించినట్టుగా ఒక పత్రికలో వచ్చిన కథనాన్నీ ఆయన ఖండించారు. తాను ఆయనతో మాట్లాడలేదని తెలిపారు.

సుజనా దూకుడు పెంచాలి

కేంద్ర మంత్రి సుజనాచౌదరి ఇంకా దూకుడుగా, క్రియాశీలంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. కేంద్ర మంత్రిగా ఉంటూతాను మాట్లాడకూడదని కొందరంటున్నారని సుజనా చెప్పగా.. అలాంటి మొహమాటాలేమీ వద్దని స్పష్టంచేశారు. కేంద్రంలోని ఇతర మంత్రుల్ని తరచూ కలుస్తూ ఒత్తిడి తీసుకురావాలని తెలిపారు.

మొట్టికాయ పడాల్సిందే..!

ఇన్నాళ్లూ ఏమీ ఇవ్వనిది ఐదు రోజులు పార్లమెంటులో ఆందోళన చేస్తే మాత్రం కేంద్రంలో మార్పు వస్తుందనుకోలేమని, వాళ్లకు గట్టిగా మొట్టికాయ పడాల్సిందేనని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర మంత్రులతో రాజీనామా చేయించాలని మరో ఎంపీ అవంతి శ్రీనివాస్ సూచించారు. అటోఇటో తేల్చుకుందామని తాను ఇప్పటికే చెప్పానని టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. 'మనం ఒక పద్ధతి ప్రకారం వెళుతున్నాం. ప్రజలకు మనపై నమ్మకముంది. దశలవారీగా ఒత్తిడి పెంచుదాం. ఐదు రోజులూ పార్లమెంటులో దూకుడుగా వ్యవహరించండి. తెగేవరకూ లాగినా రాష్ట్రానికి నష్టమే. పోలవరం, రాజధాని వంటి ప్రాజెక్టులను దృష్టిలో ఉంచుకుని నడుచుకోవాలి. ఆంధ్రప్రదేశ్ పసిపిల్ల వంటిది. జాగ్రత్తగా పెంచి పెద్ద చేయాలి. అలాగని ప్రజల ప్రయోజనాల విషయంలోరాజీలేదు. మరీ తప్పనిసరైతే బయటకు వద్దాం. అప్పుడు ప్రజలే అర్థం చేసుకుంటారు' అని పేర్కొన్నారు.



సుజనా చౌదరికి జ్ఞాపికను అందజేస్తున్న ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరాదత్

సామాజిక మాధ్యమాలతో తెలుగువారు సంఘటితం

ఈనాడు డిజిటల్, చెన్నై : ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని సంఘటితం చేయడానికి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవాలని కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ సహాయమంత్రి సుజనాచౌదరి సూచించారు. ఆదివారం రాత్రి చెన్నైలో జరిగిన ప్రపంచ తెలుగు సమాఖ్య (డబ్ల్యూటీఎఫ్) 11వ ద్వైవార్షిక మహాసభలు, రజతోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు గోరటి వెంకన్నకు 'గుమ్మడి వేంకటేశ్వరరావు' అవార్డు, శ్రీకళాలయ వ్యవస్థాపకురాలు గూడూరు లక్ష్మికి 'యార్లగడ్డ ప్రభావతి' పురస్కారాన్ని ప్రదానం చేశారు.

అవినీతి నిర్మూలనే మా అజెండా

చంద్రబాబుపై భాజపా ఎమ్మెల్యే సోము వీర్రాజు తీవ్ర ఆరోపణలు

కర్నూలు బీక్యాంపు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో రూలింగ్ లేదని.. ట్రేడింగ్ మాత్రమే జరుగుతోందని భాజపా నాయకుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కర్నూలు నగరంలో ఆదివారం జరిగిన కర్నూలు అసెంబ్లీ బూత్ కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. తమకు సొంత అజెండా లేదని.. అవినీతిని నిర్మూలించడమే తమ అజెండా అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు కేంద్రమే నాంది పలికిందన్నది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం 9 వర్సిటీలు ఇస్తే.. ఎన్డీఏ ప్రభుత్వం 16 విశ్వవిద్యాలయాలను మంజూరు చేసిందని గుర్తు చేశారు. **మహానేతను భూస్థాపితం చేసి...:** రాష్ట్రంలో ఓ మహానేతను భూస్థాపితం చేసి రాజ్యమేలుతున్నారని వీర్రాజు ఆరోపించారు. రాష్ట్రంలో భాజపాను అభివృద్ధి చేయడమే తన అజెండా అన్నారు. రెండెకరాల రైతంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.లక్షల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. స్వయంగా ముఖ్యమంత్రి నియోజకవర్గంలో భారీ అవినీతి జరిగింది నిజం కాదా అని అన్నారు. ముఖమంత్రి చంద్రబాబు మళ్లీ చక్రం తిప్పుతారని రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ అంటున్నారని, అంటే కాంగ్రెస్‌తో చేతులు కలపడానికా అంటూ ఎద్దేవా చేశారు.


ప్రత్యేక ప్యాకేజీకి బడ్జెట్‌కు సంబంధం లేదు: అరుణ్ జైట్లీ

దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. ఓ టీవీ ఛానెల్‌తో ఆయన మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ ప్యాకేజీని విడిగా అమలు చేస్తున్నాం. ఆ ప్యాకేజీకి బడ్జెట్‌కు సంబంధం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అన్నింటినీ నెరవేరుస్తామ'ని చెప్పారు. మిత్రపక్షమైన తెలుగుదేశంతో తలెత్తిన విభేదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామన్నారు. ఎన్‌డీఏ కలిసికట్టుగానే ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో కలిసే పోటీ చేస్తామని తెలిపారు. శివసేనను ముఖ్యమైన భాగస్వామిగా గుర్తించి, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు ఇస్తామని చెప్పినా ఆ పార్టీ మొండిగా వ్యవహరించిందని చెప్పారు. ఆ ఎన్నికల్లో విడివిడిగానే పోటీ చేశామని తెలిపారు. ఆ పార్టీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశామని అన్నారు.

ప్రాధాన్యం పెరిగింది.. పర్యవేక్షణా పెరగాలి

- కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, వైద్య రంగాలకు కేటాయింపులపై వక్తలు

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, వైద్య రంగాలకు కేటాయింపుల్లో గతంలోకంటే ప్రాధాన్యం లభించిందని వివిధ రంగాల నిపుణులు అభిప్రాయపడ్డారు. అయితే ఈ ఫలాలు క్షేత్రస్థాయిలో అర్హులకు దక్కాలంటే సరైన పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటుతో పాటు ప్రత్యేక ప్రణాళికలు ఉండాలన్నారు. ఆదివారమిక్కడ 'సెస్'లో సెంటర్‌ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ 2018-19పై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. భాజపా నేతలతోపాటు వ్యవసాయం, బ్యాంకింగ్, ఆర్థిక రంగాల నిపుణులు, మాజీ అధికారులు పాల్గొన్నారు. 'సెస్' డైరెక్టర్ ప్రొఫెసర్ గాలబ్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో చిన్న, సన్నకారు రైతుల సంఖ్య పెరుగుతోందని.. మార్కెట్, ప్రభుత్వం నుంచి తమ ప్రయోజనాల్ని దక్కించుకునేలా వారిని బలోపేతం చేయాల్సిన అవసరముందన్నారు. నాబార్డు మాజీ సీజీఎం మోహనయ్య మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా రైతులకు ఎంతమేర రుణాలు అందుతున్నాయన్నదానిపై పర్యవేక్షణ వ్యవస్థ ఉండాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక శాఖ జేడీ సాయిప్రసాద్ మాట్లాడుతూ.. ఆరోగ్యబీమా పథకంతో ప్రైవేటు ఆసుపత్రులు లబ్ధిపొందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఎన్‌ఓసీ ఇవ్వకపోవడం వల్ల 27 కేంద్ర పథకాల ప్రయోజనాలు దక్కని పరిస్థితి ఉందన్నారు. భాజపా శాసనసభాపక్షనేత కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ విద్య, నైపుణ్య కల్పనకు చర్యలు తీసుకుంటుంటే.. కొన్ని పార్టీలు నిరుద్యోగభృతి కల్పిస్తామని అంటున్నాయని ఎద్దేవా చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చారన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సదస్సులో ఆ పార్టీ సీనియర్ నేతలు ఇంద్రసేనారెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి, వ్యవసాయరంగ నిపుణుడు నరహరి వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌బీఐ మాజీ డైరెక్టర్ సూర్యనారాయణ, ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్ రామకోటేశ్వరరావు, ఫ్యాప్సీ మాజీ ఛైర్మన్ రాజేశ్వరరావు, ఇండో అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు శ్రీకాంత్, హెచ్‌సీయూ ప్రొఫెసర్ మనోహర్‌రావు, స్టాక్‌మార్కెట్ నిపుణుడు శేఖర్, నెహ్రూ యువ కేంద్ర జాతీయ వైస్‌ఛైర్మన్ పేరాల శేఖర్‌రావు, రాజకీయ విశ్లేషకుడు గిరిధర్ మాట్లాడారు.



రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్‌లోనికి మంగళవారం నుంచి సందర్శకులను అనుమతించనున్నారు. ఆదివారం మీడియా ప్రతినిధులకు అనుమతించారు

కళ్లు పడితే.. విగ్రహం మాయం!

- పురాతన ఆలయాల్లో చోరీలు చేసే అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు
- కాకతీయుల కాలం నాటి దేవతా విగ్రహాలు స్వాధీనం
- విలువ రూ.3 కోట్లపైమాటే

నారాయణగూడ, న్యూస్‌టుడే: వీళ్లు సాధారణ కూలీలే. ఎక్కడెక్కడో పనిచేస్తారు. ఆ పరిసరాల్లో పురాతన ఆలయాలున్నట్టు తెలిసిందో..అందులోని దేవతా విగ్రహాలను మాయం చేసేదాకా వదలరు. అలా పదుల కొద్దీ ఆలయాల్లోని పంచలోహ విగ్రహాలను దొంగిలించి సొమ్ము చేసుకుంటున్న ఇద్దరు అంతర రాష్ట్ర దొంగలను హైదరాబాద్ ఉత్తర మండలం పోలీసులు అరెస్టుచేశారు. ఆదివారం హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో కామారెడ్డి ఎస్పీ శ్వేత, టాస్క్‌ఫోర్స్ డీసీపీ పి.రాధాకిషన్‌రావులతో కలిసి నగర పోలీసు కమిషనర్ వి.వి.శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు.

గత నెల 27వ తేదీన కామారెడ్డి పాత పట్టణ పరిధి పురాతన ఆలయంలో వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ దేవతా విగ్రహాలను దొంగలు ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కామారెడ్డి పోలీసులు.. హైదరాబాద్ పోలీసులను అప్రమత్తం చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ పి.రాధాకిషన్‌రావు ఆధ్వర్యంలో ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ బృందాలు నిఘా ఉంచాయి. అఫ్జల్‌గంజ్‌లో పురాతన విగ్రహాలను విక్రయించేందుకు యత్నిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేశాయి. వారి నుంచి ఆలయంలో చోరీకి గురైన మూడు విగ్రహాలను స్వాధీనం చేసుకున్నాయి. 'సదరు విగ్రహాలు కాకతీయుల కాలం నాటివి. వాటి విలువ రూ.3 కోట్లకు పైగా ఉంటుంది. అరెస్టయిన వారిలో షేక్ హైదర్ (25) కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బాల్కీ తాలుకా తుగావ్ గ్రామానికి చెందిన కూలీ. మరొకరు ప్రస్తుతం హైదరాబాద్ కొత్తపేట పండ్ల మార్కెట్‌లో పని చేస్తున్న కర్ణాటకలోని బల్‌యేలి గ్రామానికి చెందిన షేక్ అజీజ్ (24). వీరు గతంలో మహారాష్ట్ర ఔరంగాబాద్ డివిజన్ హింగోలిలోని జైన్ దేవాలయంలోని 24వ జైన తీర్థంకర్ విగ్రహాన్ని, లాతూర్ జిల్లా కిల్లరిలోని కేదార్‌లింగ ఆలయంలోని పంచలోహ శివలింగాన్ని దొంగిలించారు. బగల్‌కోట్ జిల్లా జమఖండి, బీజాపూర్ జిల్లాలోని భన్‌హట్టి, బగల్‌కోట్ ముధోల్ ఠాణాల పరిధిలోనూ చోరీలకు పాల్పడ్డారు. నిందితులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ అక్కడ కూలీ పనులు చేస్తూ పురాతన దేవాలయాలు, అయా ఆలయాల్లోని దేవతామూర్తుల విగ్రహాల విశిష్టతల గురించి ఆరా తీస్తారు. అదునుచూసి విగ్రహాలను మాయం చేస్తారు. దొంగతనం చేసిన వెంటనే స్వరాష్ట్రం కర్ణాటకకు వెళ్లిపోతారు. పురాతన విగ్రహాలు కొనుగోలు చేసే దళారుల ద్వారా వాటిని విక్రయిస్తారు.' అని సీపీ వివరించారు.



అంతర్రాష్ట్ర దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న పురాతన విగ్రహాలను చూపుతున్న పోలీసు కమిషనర్ వీవీ శ్రీనివాసరావు. చిత్రంలో కామారెడ్డి ఎస్పీ శ్వేత, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు

విద్యార్థిని బలిగొన్న నీటి గుంత

నిర్మాణదారుల పాపమేనని కుటుంబ సభ్యుల ఆరోపణ



మృతుడు కార్తీక్

ఎదులాపురం, న్యూస్‌టుడే: ట్యాంకు బండ్ నిర్మాణ పనుల్లో భాగంగా తవ్విన నీటి గుంత ఐదో తరగతి విద్యార్థి నిండు ప్రాణాన్ని బలిగొంది. ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం జరిగిన ఘటన ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఆదిలాబాద్ పట్టణ సమీపంలో ఖానాపూర్ చెరువు వద్ద మినీ ట్యాంక్ బండ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా చెరువు సమీపంలో తవ్విన గుంతలో నీళ్లు నిల్వ చేరాయి. చుట్టుపక్కల పిల్లలు అందులో మునిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో ఆదిలాబాద్ పట్టణం అంబేద్కర్‌నగర్‌కు చెందిన ధూప్‌మాల, శంకర్ దంపతుల చిన్న కుమారుడు కార్తీక్(9), స్నేహితుడు సాయితో కలిసి స్నానం చేసే నిమిత్తం గుంతలో దిగాడు. బురదలో కూరుకుపోయాడు.. స్థానిక జాలర్ల సాయంతో విపత్తు నివారణ శాఖ సిబ్బంది మృతదేహాన్ని వెలికితీశారు. 'పనుల వద్ద సదరు నిర్మాణ సంస్థ భద్రత చర్యలు చేపట్టలేదని, ప్రమాదానికి అదే కారణమని' స్థానికులు, బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. మంత్రి జోగు రామన్న బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వణుకుతున్న ఉత్తరాది

దిల్లీ: కశ్మీరు, హిమాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో చలి గజగజ వణికిస్తూనే ఉంది. హిమాచల్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మైనస్ 8 డిగ్రీల సెల్సియస్‌తో కీలాంగ్ వణికిపోయింది. మనాలి, కల్పాల్లో కూడా కనీసం ఉష్ణోగ్రతలు మైనస్ 2.6 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైనాయి. హిమాచల్‌లోని కొండప్రాంతాల్లో సోమవారం వర్షం, మంచు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ విభాగం తెలిపింది.

ప్రింటింగ్ ప్రెస్ మూత నిర్ణయం తగదు: ఎన్‌ఎంయూ

ఈనాడు, హైదరాబాద్: ఆర్టీసీ ప్రింటింగ్ ప్రెస్ మూసివేత నిర్ణయాన్ని యాజమాన్యం ఉపసంహరించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్‌ఎంయూ) ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. మూసివేత నిర్ణయం కార్మిక వ్యతిరేకమని ఎన్‌ఎంయూ నేతలు నాగేశ్వరరావు, బి.నర్సింగరావు అన్నారు.

బస్సులోనే ఆర్టీసీ డ్రైవర్ మృతి

ప్రయాణికులు సురక్షితం



మృతి చెందిన పీఎస్‌రెడ్డి

రేణిగుంట, న్యూస్‌టుడే: గుండెపోటుతో ఓ డ్రైవర్ ఆర్టీసీ బస్సులోనే ప్రాణాలు కోల్పోయారు. చిత్తూరు జిల్లాలో ఆదివారం జరిగింది. నెల్లూరు జిల్లా రాపూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి రాపూరుకు 14 మంది ప్రయాణికులతో బయల్దేరింది. బస్సు రేణిగుంట చెక్‌పోస్టు సమీపంలోకి చేరుకునేసరికి డ్రైవర్ పీఎస్‌రెడ్డికి ఛాతినొప్పి వచ్చింది. వెంటనే బస్సును రోడ్డు పక్కన ఆపి కండక్టర్‌కు విషయం తెలిపారు. ఆయన 108కు సమాచారం అందించి ప్రయాణికులను మరో బస్సులో పంపించారు. చాలా సేపటి వరకూ 108 అంబులెన్స్ రాకపోవడంతో చోదకుడు పీఎస్ రెడ్డి బస్సులోనే ప్రాణాలు కోల్పోయారు. ఇతను విధులు నిమిత్తం రాపూరు నుంచి ఆదివారం ఉదయం 5.45 గంటలకు బయలుదేరి తిరుపతికి వచ్చారు. తిరిగి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

మహమూద్ అలీని పరామర్శించిన సభాపతి, మంత్రులు

ఈనాడు, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ ఆదివారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. ఉదయం ఆయనను శాసనసభాపతి మధుసూదనాచారి, మంత్రులు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ పరామర్శించారు.

నేటి నుంచి ఓటర్ల జాబితాలపై కాంగ్రెస్ పరిశీలన

సోమవారం నుంచి తెలంగాణలోని 83 గ్రామీణ నియోజకవర్గాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణను మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పర్యవేక్షిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నిరంజన్ పేర్కొన్నారు.

ఓటర్ల గైర్హాజరీ ప్రాంతాలకు ప్రత్యేక దళాలు

- 75 శాతంపైగా ఓట్లు ఒక్కరికే పడితే అది క్లిష్టమైన ప్రాంతం!
- ప్రత్యర్థులకు ఆస్తి, అప్పులు, కేసుల సమాచారం
- తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో అమలు
- ఏర్పాట్లు చేపట్టనున్న రాష్ట్ర ఎన్నికల సంఘం

ఈనాడు, హైదరాబాద్: రానున్న పంచాయతీ ఎన్నికల్లో ఏదైనా గ్రామంలో ఎక్కువ మంది ఓటర్లు పోలింగ్ కేంద్రానికి రాకుంటే అక్కడికి వెంటనే పోలీసు, అధికారగణాలు తరలివెళతాయి. గత పంచాయతీ ఎన్నికల్లో పోలైన ఓట్లలో ఒకే అభ్యర్థికి 75 శాతంపైగా పోలైఉంటే అలాంటి పంచాయతీని క్లిష్టమైనదిగా పరిగణించి ముందస్తు ఏర్పాట్లను చేపడతారు. ఎన్నికలను సజావుగాను, పారదర్శకంగాను నిర్వహించటమే లక్ష్యంగా.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈఏర్పాట్లను చేపట్టదలచింది.

పంచాయతీ ఎన్నికలు అనగానే సుహృద్భావ వాతావరణం, ఏకగ్రీవ ఎన్నికలు.. అలాగే కక్షలు, కార్పణ్యాలూ ఉంటాయి. గొడవలకు ఆస్కారం గల పంచాయతీలను ముందుగా పసిగట్టి అక్కడి ఏర్పాట్లను గత ఎన్నికలకు భిన్నంగా చేపట్టి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఇలా ముందస్తు ఏర్పాట్లు ఉన్నపుడు ఓటర్లు ధైర్యంగా పోలింగ్‌లో పాల్గొంటారని భావిస్తోంది. సమస్యాత్మక గ్రామాలను గుర్తించి వాటిలో ఏవైనా పరిణామాలు చోటుచేసుకొంటే వెంటనే అధికారులు వెళ్లగలిగిలా మార్గనిర్దేశ పటాలు తయారవుతాయి. గత ఎన్నికల్లో 75శాతం, అంతకంటే ఎక్కువ ఓట్లు పడిన పంచాయతీలపై ఇప్పుడు ప్రత్యేక దృష్టి ఉంటుంది. ఒకే అభ్యర్థికి 75 శాతానికి పైగా ఓట్లు పడి ఉంటే అలాంటి వాటిని క్లిష్టమైన(క్రిటికల్) పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి ముందస్తు చర్యలను చేపడతారు. పోలింగ్ రోజున.. సమస్యాత్మక పంచాయతీల్లోని ఓటింగ్ సరళిని పరిశీలిస్తూ.. ఏదైనా వాడ నుంచి ఓటర్లు అధిక సంఖ్యలో రాకుంటే అక్కడికి పోలీసు, సివిల్ అధికారుల కార్యాచరణ దళాలను పంపుతారు. అక్రమాలు చోటుచేసుకోవటం కారణంగా గత ఎన్నికల్లో రీపోలింగ్ జరిగి ఉంటే అలాంటి పంచాయతీల్లోని పోలింగ్ కేంద్రాలనూ క్లిష్టమైన వాటిగా పరిగణిస్తారు. ఇలా సున్నిత, అతి సున్నిత, క్లిష్టమైన పంచాయతీలను ఎంపిక చేసి అక్కడ అదనపు ఏర్పాట్లను చేపడతారు. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో వలే పోలింగ్ కేంద్రాల్లో డిజిటల్ లేదా వీడియో కెమెరాలను ఉంచుతారు. కేంద్ర ప్రభుత్వోద్యోగులు సూక్ష్మ స్థాయి పరిశీలకులుగా వ్యవహరిస్తారు.


అభ్యర్థుల సమాచారం వెల్లడి

పంచాయతీ ఎన్నికల బరిలో నిలవనున్న వారు తమ నామినేషన్ల పత్రాలతో పాటు తమ ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు, తమపై గల కేసుల వివరాలను రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. అవి కచ్చితమైనవేనని పేర్కొంటూ స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని పొందుపరచాలి. ఇలాంటి నిబంధనలతో భారత ఎన్నికల సంఘం రూపొందించిన నమూనా పత్రాన్ని త్వరలో నిర్వహించే పంచాయతీ ఎన్నికల్లోను అమల్లోకి తేవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అయా అభ్యర్థులు అందజేసే వివరాలను అక్కడ పోటీచేసే ఇతర అభ్యర్థులతో పాటు మీడియా ప్రతినిధులూ పొందవచ్చు. అలాంటి సమాచారం సరైనది కాదని ప్రత్యర్థులు ఎవరైనా ఆరోపిస్తే వారి నుంచీ స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని స్వీకరించి దాన్ని అభ్యర్థి ఇచ్చే పత్రాలకు జతచేస్తారు.

సమస్యల ప్రాతిపదికగా పోరాడండి: మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు సుస్మితాదేవ్ అన్నారు. సమస్యల ప్రాతిపదికగా పోరాటాలకు శ్రీకారం చుట్టాలని శ్రేణులకు సూచించారు. ఆదివారం గాంధీభవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ముఖ్యనేతలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా మహిళా కాంగ్రెస్ పార్టీ కృషి చేయాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి మంత్రిగానే ఉండాల్సిన అవసరం లేదని ప్రజలతో ఉండి కూడా సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. పార్లమెంట్‌లో పూర్తి మెజారిటీ ఉన్నా మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టలేకపోయిందన్నారు. భాజపాతోనే పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి తెరాస లెక్కకాదన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు నేరెళ్ల శారద తదితరులు పాల్గొన్నారు.

బలహీనతలు కొనసాగొచ్చు



సమీక్ష : గత వారంలో సాధారణ బడ్జెట్ ప్రతిపాదనల ప్రకంపనలతో మార్కెట్ భారీ నష్టాలు మూటగట్టుకుంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి 7.0- 7.5 శాతానికి పెరగొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేయడంతో వారాన్ని మార్కెట్ లాభాలతోనే మొదలుపెట్టింది. ప్రభుత్వ పన్ను వసూళ్లు పెరగొచ్చన్న అంచనాలు కూడా కలిసొచ్చాయి. కార్పొరేట్ కంపెనీల ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన షేర్లలో కదలికలు కనిపించాయి. బడ్జెట్‌కు ముందు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐ) పెద్ద షేర్లపై సానుకూల వైఖరి కనబరిచారు. అయితే మధ్య, చిన్న షేర్లకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. అయితే ఈక్విటీలపై దీర్ఘకాల మూలధన లాభాల పన్ను, మ్యూచువల్ ఫండ్ పథకాలపై డివిడెండు పన్నులు విధించాలని బడ్జెట్‌లో ప్రతిపాదించడం, బాండు రాబడులు గణనీయంగా పెరగడం దేశీయ మదుపర్ల సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది. ఫలితంగా అమ్మకాలు వెల్లువెత్తాయి. దీంతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 983.69 పాయింట్లు (2.73 శాతం) నష్టపోయి 35,066 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 2.79 శాతం నష్టపోయి 10,760 పాయింట్ల దగ్గర స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు), దేశీయ సంస్థాగత మదుపర్లు (డీఐఐలు) నికరంగా రూ.2,099 కోట్లు, రూ.236 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.

లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:9గా నమోదుకావడం అన్ని రంగ షేర్లలో అమ్మకాలను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } వరుసగా ఎనిమిది వారాల పాటు మార్కెట్లు దూసుకెళ్లిన నేపథ్యంలో మదుపర్ల లాభాల స్వీకరణతో సూచీలు నష్టపోవచ్చు. సెన్సెక్స్‌కు 34,045 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభించే అవకాశం ఉంది. మధ్య స్థాయి దిద్దుబాటు దిశగా మార్కెట్లు వెళ్లొచ్చని, అదే జరిగితే 32,296 పాయింట్ల వద్ద మద్దతు అందుకోవచ్చని అంటున్నారు.

ప్రభావిత అంశాలు } దేశీయ పరిణామాలు, కంపెనీల త్రైమాసిక ఫలితాలు, అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. సూచీలపై సాధారణ బడ్జెట్ ప్రతికూలాంశాల ప్రభావం కొనసాగొచ్చు. రేపు, ఎల్లుండి జరగనున్న రిజర్వు బ్యాంక్ ద్రవ్య, పరపతి విధాన సమీక్షపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. భవిష్యత్ రేట్ల పెంపు విషయంలో రిజర్వు బ్యాంక్ వ్యాఖ్యలను మదుపర్లు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ వారం ఎస్‌బీఐ, టాటా మోటార్స్, హీరో, పీఎన్‌బీ, ఎం అండ్ ఎం, అపోలో టైర్స్, టాటా కెమికల్స్, అరబిందో, ఓఎన్‌జీసీ, టాటా స్టీల్ వంటి దిగ్గజ కంపెనీలు అక్టోబరు- డిసెంబరు త్రైమాసిక ఫలితాలు ప్రకటించనున్నాయి. ఈ ఫలితాల ప్రభావం ఆయా రంగాలు, కంపెనీల షేర్లపై ఉంటుంది. అంతర్జాతీయంగా చూస్తే.. అమెరికా, చైనా మార్కెట్ల నుంచి వార్తలు, 8న వెలువడనున్న బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వడ్డీ రేట్ల నిర్ణయం కీలకం కానున్నాయి. ముడిచమురు ధరల కదలికలు, రూపాయి, ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 34,638, 34,311, 33,800; **తక్షణ నిరోధ స్థాయి:** 35,507, 35,820, 36,256

సమీపకాలంలో సూచీల బలహీనతలు కొనసాగొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

ఈనాడు బిజినెస్



కోడిగుడ్లు


4న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)			
హైదరాబాద్	360	వరంగల్	362
చిల్లరగా (ఒక గుడ్డు)	4.20	విశాఖపట్నం	355
బెంగళూరు	370	చెన్నై	385
5న		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	354	నమక్కల్	370

ఊగిసలాటకే అవకాశం!


● కొనసాగనున్న బడ్జెట్ ప్రభావం ● ఆర్థిక ఫలితాలూ కీలకం ● అంతర్జాతీయ సూచీల కదలికల ప్రభావమూ ● ఐటీ షేర్లకు సానుకూలతలు

స్టాక్ మార్కెట్ ఈ వారం

మన స్టాక్ మార్కెట్లు ఈ వారం ఊగిసలాటకు గురికావొచ్చు. దీర్ఘకాల మూలధన లాభాల పన్ను (ఎల్‌సీజీటీ)ను తిరిగి ప్రవేశపెట్టిన నేపథ్యంలో విక్రయాల ఒత్తిడి కొనసాగొచ్చు. అక్టోబరు-డిసెంబరు ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ మార్కెట్లు ఈ వారం సూచీలకు మార్గనిర్దేశం చేయొచ్చు. నిఫ్టీ-50 ఈ వారం 10,500 స్థాయిని పరీక్షించవచ్చని.. నిఫ్టీ బ్యాంక్‌కు 25,250 వద్ద మద్దతు లభించవచ్చని డీలర్లు అంచనా వేస్తున్నారు. పెద్ద కంపెనీలు తమకు అవసరమైన నిధుల్లో 25 శాతాన్ని బాండ్ల మార్కెట్ ద్వారా సమీకరించుకోడానికి అనుమతిలివ్వాలని సెబీకి బడ్జెట్ సూచించింది. ఇది బాండ్ల మార్కెట్‌కు సానుకూలాంశమేనని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ద్రవ్య లోటు అంచనాలు పెరగడం, దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను వేయడం తదితరాలు స్వల్పకాలంలో మార్కెట్‌పై ఒత్తిడి తీసుకురావొచ్చని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ఈనెల 6, 7 తేదీల్లో జరగనున్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్వైమాసిక ద్రవ్య, పరపతి విధాన సమీక్ష నిర్ణయాలు కూడా కీలకం అవుతాయి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..



లోహ: లోహ, గనుల తవ్వక కంపెనీలు నష్టాలను కొనసాగించవచ్చు. ప్రామాణిక సూచీలతో పోలిస్తే లోహ కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ ఎక్కువగా ఉండొచ్చని అంచనా. ఎందుకంటే ఇటీవలి కాలంలో ఈ కంపెనీల్లో లాభాలు ఎక్కువగా నమోదైన సంగతి తెలిసిందే. ఈ వారం ఫలితాలను వెల్లడించనున్న టాటా స్టీల్, సెయిల్‌ల ఫలితాలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు.




ఔషధ: ఈ వారం వెలువడే లుపిన్, సిప్లా ఫలితాల సరళి ఔషధ కంపెనీ షేర్లకు దిశానిర్దేశం చేయొచ్చు. అయితే మార్కెట్లో బలహీనతల నేపథ్యంలో ఈ షేర్లపై దేశీయ సంస్థాగత మదుపుదార్లు దృష్టి సారించే అవకాశం ఉంది. డాక్టర్ రెడ్డీస్ బలహీన ఫలితాలు కూడా సెంటిమెంటుపై ప్రభావం పడవచ్చు. సిప్లాకు చెందిన టెస్టోస్టీరాన్ ట్రాన్స్‌డెర్మల్ సొల్యూషన్‌కు యూఎస్ఎఫ్‌డీఏ అనుమతి వచ్చిన నేపథ్యంలో ఆ ప్రభావం కూడా ఉండొచ్చు.



యంత్ర పరికరాలు: కేంద్ర బడ్జెట్(2018-19)లో మౌలికాభివృద్ధికి అధిక కేటాయింపులు చేసిన నేపథ్యంలో సానుకూలతలు కనిపించొచ్చు. ఈ రంగ షేర్లు మోస్తరు లాభాలు పొందొచ్చు. అయితే మొత్తం మీద మార్కెట్ బలహీనంగా ఉండడం వల్ల ఈ లాభాలకు కొంత అడ్డుకట్ట పడవచ్చు. రిలయన్స్ ఇన్‌ఫ్రా, ఎల్ అండ్ టీకి వరుసగా రూ.882 కోట్లు; రూ.2275 కోట్లు చొప్పున ఆర్డర్లు దక్కిన నేపథ్యంలో ఆయా షేర్లు వెలుగులోకి రావొచ్చు.



బ్యాంకింగ్: ఈ వారం కూడా బ్యాంకింగ్ షేర్లు ఒత్తిడిలో కొనసాగొచ్చు. బడ్జెట్‌లో ద్రవ్యలోటు లక్ష్యం గత అంచనాలను మించడం ఇందుకు నేపథ్యం. ఈ వారం ఫలితాలు ప్రకటించే ఎస్‌బీఐ, బీఓబీలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పీఎన్‌బీ, సిటీ యూనియన్ బ్యాంక్, ధనలక్ష్మీ బ్యాంక్, ఆంధ్రాబ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సిండికేట్ బ్యాంక్, యూకో బ్యాంకులు సైతం ఈ వారమే ఫలితాలను ప్రకటించనున్నాయి.



టెలికాం: ఈ వారమూ టెలికాం షేర్లపై ఒత్తిడి ఉండొచ్చు. కంపెనీల బలహీన ఆర్థిక ఫలితాలు, టారిఫ్‌పై కొనసాగుతున్న ఒత్తిడి ఈ రంగాన్ని డీలా పడేలా చేయొచ్చు. జియోఫోన్ తరహాలో చౌక స్మార్ట్ ఫోన్ ఆర్‌జియోను తీసుకురావాలని రిలయన్స్ జియో యోచిస్తోందన్న వార్తలపై మదుపర్లు దృష్టి సారించొచ్చు. పరపతి విధాన సమీక్షనూ పరిశీలించొచ్చు.




చమురు: ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ షేర్లు ఈ వారం స్థిరీకరణకు లోనుకావొచ్చు. మూలాలు బలంగా ఉన్నప్పటికీ.. స్వల్పకాలంలో మాత్రం సాంకేతిక చార్టులపై స్తబ్దుగా కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ ముడి చమురు ధరల కదలికలు ప్రభావం చూపించొచ్చు. చమురు ధరలు పెరిగితే అప్‌స్ట్రీమ్ కంపెనీలైన ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాలకు సానుకూలతలు కనిపించొచ్చు.




వాహన: చాలా వరకు వాహన కంపెనీలు ఈ వారం నష్టాల పాలవ్వచ్చు. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్ షేర్లు బలహీనతల పాలవుతాయన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. నేడు విడుదల కాబోయే టాటా మోటార్స్ ఫలితాలను మార్కెట్ వర్గాలు సునిశితంగా గమనించొచ్చు. హీరోమోటోకార్ప్ (మంగళ), ఐషర్ మోటార్స్(బుధ) ఫలితాలపైనా మార్కెట్ కన్ను ఉండొచ్చు.



ఐటీ: ఈ వారం ఐటీ రంగ షేర్లు లాభాలను పొందొచ్చు. ఈ ఏడాది అమెరికాలో కంపెనీలు సాంకేతిక వ్యయాలు పెంచుతాయన్న అంచనాలు ఇందుకు దోహదం చేయవచ్చని విశ్లేషకులు అంటున్నారు. టీసీఎస్, టెక్ మహీంద్రాలను పరిశీలించొచ్చు. టెక్ మహీంద్రా ఫలితాలు అంచనాలను మించి వెలువడినందున, ఆ కంపెనీపై దృష్టి పెట్టవచ్చని సలహానిస్తున్నారు. 2018-19లో ఐటీ కంపెనీలు రాణిస్తాయని.. ఇన్ఫోసిస్‌ను అందరూ పరిశీలించొచ్చని చెబుతున్నారు.



సిమెంట్: వచ్చే వారం సిమెంట్ కంపెనీల షేర్లు ఒక శ్రేణికి పరిమితమై కదలాడవచ్చు. మౌలిక రంగానికి భారీ కేటాయింపులు ప్రకటించిన నేపథ్యంలో సిమెంటుకు గిరాకీ పెరగొచ్చు. ఏసీసీ(ఫిబ్రవరి 8), దాల్మియా భారత్(ఫిబ్రవరి 7) ఫలితాల ప్రభావం ఈ రంగ షేర్లపై కనిపించొచ్చు. జేకే లక్ష్మీ లాభం పెరిగినా.. అంచనాలను అందుకోలేకపోవడం వల్ల ఆ ప్రభావం కనిపించే అవకాశం ఉంది.



2018-19లో వృద్ధి రేటు 8%!

● రుతు పవనాలు, ముడి చమురు ధరలు స్థిరంగా ఉంటే

● ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



ముంబయి: రాబడి స్థాయి-ఖర్చు సామర్థ్యం పెరిగి, ప్రపంచ వ్యాప్తంగా స్థిర వృద్ధి కొనసాగితే భారత్ రెండంకెల వృద్ధి నమోదు చేయగలదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ఆశాభావం వ్యక్తం చేశారు. ముడి చమురు ధరలు స్థిరంగా ఉండి, రుతుపవనాలు సహకరించి సరైన వర్షపాతం నమోదైతే వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 8 శాతానికి చేరవచ్చని మంత్రి పేర్కొన్నారు. గత వారం ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో 2018-19కు వృద్ధిరేటు 7-7.5 శాతం ఉంటుందని అంచనా వేసిన సంగతి తెలిసిందే. పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ప్రభావం నుంచి బయటపడి, వేగంగా వృద్ధి వైపు దేశం అడుగులు వేస్తోందని జైట్లీ తెలిపారు. వ్యాపార విశ్వాసం, కీలక రంగాల్లో వృద్ధి వంటివి ఇందుకు నిదర్శనాలని వివరించారు. రుతుపవనాలతో సమయానుకూల వర్షాలు పడి, ముడిచమురు ధరలు ప్రస్తుత స్థాయిలో ఉంటే భారత్ 8 శాతం వృద్ధి రేటు నమోదు చేయగలదని పేర్కొన్నారు.

2019-20లో 40,000 కోట్లు!

● దీర్ఘకాల మూలధన లాభాల పన్నుతో సాకారం

● ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా



దిల్లీ: ఈక్విటీలపై దీర్ఘకాల మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) విధించడం ద్వారా 2019-20లో రూ.40,000 కోట్లు సమకూరుతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. 14 ఏళ్ల తరవాత ఎల్‌టీసీజీని ఎందుకు ప్రవేశ పెట్టారనే విషయాన్ని ఆర్థిక కార్యదర్శి హస్ముఖ్ అధియా వెల్లడించారు. దేశంలో వసూలవుతున్న ఆదాయపు పన్నులో 30 శాతాన్ని వేతన జీవులే చెల్లిస్తున్నారని, అందువల్లే స్టాక్‌మార్కెట్ ద్వారా అధిక ప్రతిఫలం పొందుతున్న వారినీ పన్ను పరిధిలోకి తెచ్చినట్లు వివరించారు. 2017-18 మదింపు సంవత్సరానికి సంబంధించి, నమోదిత కంపెనీల షేర్ల విక్రయం ద్వారా లభించిన ప్రతిఫలాలపై ఎల్‌టీసీజీ కింద రూ.3.67 లక్షల కోట్లకు పన్ను మినహాయింపు లభించిందని అధియా తెలిపారు. అందుకే 10 శాతం పన్ను విధించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. 2018-19లో రూ.20,000 కోట్లు, తదుపరి ఆర్థిక సంవత్సరంలో రూ.40,000 కోట్ల ఆదాయం ఈ రూపేణ ఖజానాకు సమకూరుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఏడాది కంటే తక్కువ కాలం అట్టేపెట్టుకుని, విక్రయించే షేర్లపై లభించే లాభాలపై 15 శాతం పన్ను విధిస్తున్నారు. ఏడాది కంటే ఎక్కువకాలం ఉంచుకుని, విక్రయిస్తే ప్రస్తుతం పన్ను లేదు.

సెబీ నుంచి ప్రభుత్వానికి రూ.4,000 కోట్లు!

మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద ఉన్న మిగులు నిధులు రూ.3-4 వేల కోట్లు ఖజానాకు చేరతాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఈ ఏడాది ద్రవ్యలోటును భర్తీ చేసుకోవడానికి ఈ నిధులను కూడా వినియోగించుకోవాలని చూస్తున్నట్లు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ వెల్లడించారు. సెబీకి రెండు రకాలుగా ఆదాయం వస్తోంది. వివిధ కంపెనీలు, ఆర్థిక సంస్థలకు విధించే జరిమానాల ద్వారా లభించే మొత్తాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి సెబీ చెల్లిస్తుంటుంది. ఇది కాకుండా ఫీజుల రూపంలో వచ్చే మొత్తం కూడా ఉంటుంది. ఈ రూపేణ సెబీ వద్ద రూ.3-4 వేల కోట్ల వరకు ఉన్నాయని అంచనా. ద్రవ్యలోటును పూడ్చుకోవడానికి ఈ నిధులను ప్రభుత్వం తాజాగా ఆశిస్తోంది. ఇదే విధంగా ఆర్‌బీఐ (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) నుంచి 2016-17కు రూ.13,000 కోట్ల డివిడెండ్‌ను ప్రభుత్వం ఆశిస్తోంది. మార్చి 31వ తేదీలోపు ఆ మొత్తాన్ని చెల్లించాలని కోరింది.

వడ్డీ రేట్లు పెంచొద్దు: అసోచామ్

దిల్లీ: ఆర్‌బీఐ ఈనెల 7న వెల్లడించే ద్రవ్య పరపతి విధాన సమీక్షలో, కీలక రేట్లను పెంచవద్దని అసోచామ్ కోరింది. ద్రవ్యలోటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3.5 శాతం, 2018-19కు 3.3 శాతం ఉండొచ్చని బడ్జెట్‌లో పేర్కొన్న సంగతి విదితమే. పంటలకు కనీస మద్దతు ధర పెంచడంతో రిటైల్ ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉండటం, ఇదే సమయంలో కూరగాయలకు కనీస మద్దతు ధర లేకపోవడం కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని అసోచామ్ పేర్కొంది. బడ్జెట్‌లో 'ఆపరేషన్ గ్రీన్స్' పేరుతో ఉల్లి, ఆలుగడ్డల ధరల స్థిరీకరణపై నీతిఆయోగ్, రాష్ట్రాలతో కలిపి ఓ ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసి, ఆ దిశగా కృషి చేస్తే ఇప్పటికిప్పుడు రిటైల్ ధరలపై ప్రభావం అంతగా ఉండకపోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేసింది. అందుకే ఈసారి సమీక్షలో వడ్డీరేట్ల పెంపు దిశగా నిర్ణయం వద్దని కోరింది. గత డిసెంబరు 6న జరిపిన సమీక్షలోనూ ఆర్‌బీఐ రేట్లలో ఎలాంటి మార్పు చేయలేదన్న సంగతి తెలిసిందే.

భూషణ్ స్టీల్ కొనుగోలుకు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ బిడ్

దిల్లీ: దివాలా స్మృతి కింద చర్యలు ఎదుర్కొంటున్న భూషణ్ స్టీల్ కొనుగోలుకు బిడ్ దాఖలు చేసినట్లు జేఎస్‌డబ్ల్యూ స్టీల్ వెల్లడించింది. ఉక్కు దిగ్గజం టాటా స్టీల్ సైతం బిడ్ దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. దీనిపై స్పందించేందుకు టాటా స్టీల్ నిరాకరించింది. ఇక భూషణ్ స్టీల్ కొనుగోలుకు తాము ఎటువంటి ప్రణాళిక సమర్పించలేదని ఆర్సెలార్ మిత్తల్ ప్రకటించింది. అయితే భారత్‌లో భవిష్యత్ అవకాశాలపై ఆసక్తిగా చూస్తున్నామని ఆర్సెలార్ తెలిపింది. భూషణ్ స్టీల్‌ను కొనుగోలు చేయడానికి బిడ్‌ల దాఖలుకు గడువు శనివారంతో ముగిసింది. అధిక మొత్తానికి బిడ్ దాఖలు చేసిన సంస్థను మంగళవారం ప్రకటించనున్నట్లు సమాచారం.

ఈ వారం బోర్డు సమావేశాలు

నేడు (5న): టాటా మోటార్స్, బాష్, కోల్గేట్ పామోలివ్, ఆస్ట్రాజెనెకా ఫార్మా, అవధ్ షుగర్, కొచ్చిన్ షిప్‌యార్డ్, బీఏఎస్ఎఫ్ ఇండియా, జేఎస్‌డబ్ల్యూ హోల్డింగ్స్, సెంచరీ ప్లైబోర్డ్స్, కాస్మో ఫిల్మ్స్, ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్, ఎవరెడీ ఇండస్ట్రీస్, గ్రీవ్స్ కాటన్, హడ్కో, ఐఎఫ్‌సీఐ, కాకతీయ సిమెంట్, మెక్‌లాయిడ్ రసెల్, మోల్డ్-టెక్ ప్యాకేజింగ్, పెనిన్సులా ల్యాండ్, షీలా ఫోమ్, ఎస్ఎంఎస్ లైఫ్‌సైన్సెస్, టీబీజెడ్, ఉజ్జీవన్ ఫైనాన్షియల్, యునికెమ్ ల్యాబ్స్,

రేపు (6న): హీరో మోటోకార్ప్, లుపిన్, హెరిటేజ్ ఫుడ్స్, సీమెన్స్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, నాట్కో ఫార్మా, అపోలో టైర్స్, బెర్జర్ పెయింట్స్, స్పైస్‌జెట్, ఆర్‌ఈసీ, రామ్‌కో సిమెంట్, బ్లూస్టార్, క్యాస్ట్రోల్ ఇండియా, కేఈసీ ఇంటర్నేషనల్, అడ్వాన్స్‌డ్ ఎంజైమ్, క్లారిస్ లైఫ్‌సైన్సెస్, డిష్ టీవీ, ఫ్యూచర్ రిటైల్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, కామత్ హోటల్స్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, మోన్‌శాంటో ఇండియా, ప్రజ్ ఇండస్ట్రీస్, టాటా కెమికల్స్, థెర్మాక్స్

7న (బుధ): అరబిందో ఫార్మా, సిప్లా, ఐషర్ మోటార్స్, బీఈఎంఎల్, ఆల్ఫా జియో, ఆప్‌టెక్, కేప్లిన్ పాయింట్ ల్యాబ్స్, బీజీఆర్ ఎనర్జీ, సిటీ యూనియన్ బ్యాంక్, దాల్మియా భారత్, డిక్సన్ టెక్నాలజీస్, ఈఐడీ ప్యారీ, గతీ, గాయత్రీ ప్రాజెక్ట్స్, జీఈ టీ అండ్ డీ, గోద్రేజ్ ఆగ్రోవెట్, గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్, హెక్సావేర్ టెక్నాలజీస్, ఇక్రా, ఇన్‌సెక్టిసైడ్స్, ఇప్కా ల్యాబ్స్, జేఎంసీ ప్రాజెక్ట్స్, కల్పతరు పవర్, కేడీడీఎల్, మెజెస్కో, మాంటె కార్లో ఫ్యాషన్స్, పొలారీస్ కన్సల్టింగ్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్, క్విక్‌హీల్, రామ్‌కో సిస్టమ్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, సలాసర్ టెక్నో, సొనాటా సాఫ్ట్‌వేర్, ఎస్ఆర్ఎఫ్, టొరెంట్ పవర్, యుఫ్లెక్స్, వెంకీస్, వోల్టాస్, జైడస్ వెల్‌నెస్

8న (గురు): ఏసీసీ, టాటా కమ్యూనికేషన్స్, రిలయన్స్ కేపిటల్, భారత్ ఫోర్జ్, భెల్, బాంబే డైయింగ్, కేడిలా హెల్త్‌కేర్, సీఈఎస్‌సీ, పెట్రోనెట్, సెయిల్, గ్లెన్‌మార్క్, గ్రాన్యూల్స్ ఇండియా, ఏబీబీ, యాడ్‌ల్యాబ్స్, ఆంధ్రా బ్యాంక్, బజాజ్ ఎలక్ట్రికల్స్, బలరామ్‌పూర్ చీనీ, మణప్పురం ఫైనాన్స్, ముత్తూట్ ఫైనాన్స్, టొరెంట్ ఫార్మా, టీవీ టుడే, ట్రెంట్, కాఫీ డే, దీపక్ ఫెర్టిలైజర్స్, ధనలక్ష్మీ బ్యాంక్, ఇరోస్ మీడియా, ఎక్సెల్ క్రాప్ కేర్, ఫ్యూచర్ కన్స్యూమర్, హెచ్‌సీజీ, హీడెల్‌బర్గ్ సిమెంట్, డాక్టర్ లాల్‌పాథ్ ల్యాబ్స్, పేజ్ ఇండస్ట్రీస్, పరాగ్ మిల్క్, పీఎస్‌పీ ప్రాజెక్ట్స్, రెలిగేర్, ఎస్ఎంఎస్ ఫార్మా, వామా ఇండస్ట్రీస్

9న (శుక్ర): మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, టాటా స్టీల్, ఓఎన్‌జీసీ, బ్యాంక్ ఆఫ్ బరోడా, హెచ్‌పీసీఎల్, బాటా, ఆల్కెమ్ ల్యాబ్స్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, ఆయిల్ ఇండియా, అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్, అవంతీ ఫీడ్స్, సన్ టీవీ, సుజ్లాన్, సిండికేట్ బ్యాంక్, కెపాసిటీ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్, సెంట్రల్ బ్యాంక్, ఆదిత్య బిర్లా కేపిటల్, ఆంధ్రా పెట్రో, గ్రేట్ ఈస్ట్రన్ షిప్పింగ్, జిలెట్, గోల్డెన్ టొబాకో, హెచ్ఎఫ్‌సీఎల్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ ట్రాన్స్‌పోర్టేషన్, ఇండియా సిమెంట్స్, జేబీ కెమికల్స్, మారికో, మోయిల్, మోల్డ్-టెక్ టెక్నాలజీస్, నాల్కో, రామ్‌కీ ఇన్‌ఫ్రా, ఆర్‌సీఎఫ్, ఎస్‌జేవీఎన్, ఎస్ఎంఎల్ ఇసుజు, శోభా, వీఎస్‌టీ టిల్లర్స్

10న (శని): కోల్ ఇండియా, అమరరాజా బ్యాటరీస్, బిర్లా కార్పొరేషన్, అతుల్ ఆటో, పీటీసీ ఇండియా, వండర్‌లా హాలీడేస్.

ఆశీర్వాద్ గోధుమపిండిలో ప్లాస్టిక్ లేదు: ఐటీసీ

హైదరాబాద్: ఆశీర్వాద్ గోధుమపిండిలో ప్లాస్టిక్ ఉందనే ఆరోపణలతో, సామాజిక మాధ్యమాల్లో పంపిణీ అవుతున్న వీడియోలను నిలిపి వేయాలని కోర్టు ఆదేశించిందని ఐటీసీ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. గూగుల్, యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విటర్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో ఈ వీడియోలు ప్రసారమవుతూ, పంపిణీ అవుతున్నందున, కంపెనీ ప్రతిష్ఠ దెబ్బతింటోందని, వీటిని నిరోధించాలని కోరుతూ కంపెనీ బెంగళూరు సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టులో ఫిర్యాదు చేసింది. తమకు అనుకూలంగా కోర్టు గత డిసెంబరు 16నే ఉత్తర్వులు జారీ చేసిందని సంస్థ గుర్తు చేసింది. ఆశీర్వాద్ గోధుమపిండిలో ప్లాస్టిక్ ఉందనడం అవాస్తవమని, కేవలం ఆ బ్రాండ్‌పై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని నాశనం చేసేందుకే ఆ వీడియోలు రూపొందించారని సంస్థ పేర్కొంది. 100 శాతం గోధుమలతో రూపొందుతున్న గోధుమ పిండిలో ఉన్న గోధుమ ప్రోటీన్ (గ్లూటెన్)ను ప్లాస్టిక్‌గా ఆ వీడియోల్లో చూపారని ఐటీసీ తెలిపింది. గ్లూటెన్ అనేది గోధుమ గింజల్లో సహజంగా ఉండే ఎలాస్టిక్ వంటి పదార్థమని, పిండిని ముద్దగా చేసేందుకు ఇది తోడ్పడుతుందని పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం అన్నిరకాల గోధుమ పిండిల్లో గోధుమ ప్రోటీన్ 6 శాతం కచ్చితంగా ఉండాలని వివరించింది. రుచి, ఆరోగ్యం, భద్రత కలిగించే నాణ్యమైన ఉత్పత్తులనే తమ సంస్థ అందిస్తుందని పేర్కొంది.

సెనగలు కొనొచ్చు!


కమొడిటీస్ ఈ వారం

● **బంగారం, వెండి**



పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు గత వారం రూ.30,051 వద్ద ప్రారంభమైంది. ఆ తర్వాత దిద్దుబాటుకు లోనై రూ.29,883 కు దిగివచ్చింది. అనంతరం తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు కారణంగా రూ.30,639 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. అయితే ఈ స్థాయి వద్ద ట్రేడర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. దీంతో ఆఖరుకు లాభం 0.95 శాతానికి పరిమితమై రూ.30,312 వద్ద కాంట్రాక్టు ముగిసింది. ఈవారం కాంట్రాక్టు రూ.30,444 ఎగువన నిలదొక్కుకోకుంటే రూ.29,444 వరకు దిగిరావచ్చు. అయితే ఈ దిద్దుబాటు రావడం మంచిదే. అందువల్ల దీనిని చూసి కాంట్రాక్టు మరింత పడిపోతుందేమోనని భావించకూడదు. వెండి మార్చి కాంట్రాక్టుకు గత వారం ప్రారంభ ధర రూ.39,460. అనంతరం సానుకూలంగా చలించి రూ.39,615 వరకు పెరిగినా ఈ స్థాయిని నిలబెట్టుకోలేక, రూ.38,475 వరకు దిద్దుబాటు అయ్యింది. చివరకు 2.10% నష్టపోయి రూ.38,630 వద్ద ముగిసింది. ఈవారం రూ.39,338 కంటే పైన కాంట్రాక్టు కదలాడకుంటే ప్రతికూలంగా చలించొచ్చు. రూ.37,987 వరకు పడిపోయే అవకాశం ఉంది. ఈ రోజు ఎక్కువ నష్టంతో ప్రారంభమైనా కూడా కాంట్రాక్టు మరింత డీలాపడొచ్చని భావించవచ్చు. అందువల్ల ఆచితూచి వ్యవహరించడం మంచిది.

● **ప్రాథమిక లోహాలు**



రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం రూ.465.50 కంటే పైన కదలాడకుంటే.. బలహీన ధోరణి కొనసాగొచ్చు. అందువల్ల రూ.464.80 ఎగువన స్టాప్ లాస్‌ను పరిగణిస్తూ రూ.456- 460 మధ్య కాంట్రాక్టును షార్ట్ సెల్ చేయడం మంచిది. సీసం ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.167.79 దిగువన చలిస్తే.. రూ.164.60; ఆ తర్వాత రూ.162 స్థాయిలకు పడిపోవచ్చు. జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టు ఈవారం సానుకూలంగా కనిపిస్తోంది. ఇప్పటికే బాగా పెరిగినట్లు కనిపిస్తున్నందున, రూ.228 దరిదాపులో లాంగ్ పొజిషన్లు వదిలించుకోవడం మంచిది. అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టుకు అధిక స్థాయిల వద్ద అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. నికెల్ ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.898.90 ఎగువన కదలాడకుంటే.. రూ.785 లక్ష్యంతో షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. ఒకవేళ రూ.908.90 ఎగువకు వెళ్తే.. కాంట్రాక్టు రూ.922 వరకు వెళ్లే అవకాశమూ లేకపోలేదు.

● **ఇంధన రంగం**



ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టు గతవారం రూ.4000 ఎగువన ముగిసినప్పటికీ.. సాంకేతికంగా మోతాదుకు మించి పెరిగినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టును పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లడం మంచిది. ఈ క్రమంలో రూ.4,338 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పరిగణించాలి. సహజ వాయువు ఫిబ్రవరి కాంట్రాక్టుకు రూ.194 ఎగువన అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఈ స్థాయికి దరిదాపుల్లో కాంట్రాక్టుకు షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే అధిక ఒడుదొడుకులకు ఆస్కారం ఉన్నందున స్టాప్‌లాస్ పెట్టుకోవడం మంచిది.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (నవంబరు కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఫిబ్రవరి)	456.50	452.90	(0.79)
సీసం (ఫిబ్రవరి)	166.30	171.80	3.31
జింక్ (ఫిబ్రవరి)	223	226.25	1.46
అల్యూమినియం(ఫిబ్రవరి)	141.65	141.80	0.11
నికెల్ (ఫిబ్రవరి)	870.30	867.40	(0.33)
ముడి చమురు(ఫిబ్రవరి)	4,210	4,197	(0.31)
సహజ వాయువు(ఫిబ్రవరి)	199.50	184.80	(7.37)
సెనగలు (మార్చి)	3,743	3,806	1.68
ధనియాలు (ఏప్రిల్)	5,950	5,815	(2.27)
గోరు చిక్కుడు (మార్చి)	4,680	4,671	(0.19)

● **వ్యవసాయ ఉత్పత్తులు**



సెనగలు మార్చి కాంట్రాక్టును రూ.3,654- 3,754 మధ్య కొనుగోలు చేయొచ్చు. ధనియాలు ఏప్రిల్ కాంట్రాక్టు రూ.5,408 వరకు పడిపోయే అవకాశం ఉంది. అయితే అంతకంటే ముందు రూ.6,089 వరకు వెళ్లొచ్చు. అందువల్ల ఈ స్థాయికి వెళ్లాక షార్ట్ పొజిషన్లు తీసుకోవడాన్ని ప్రారంభించాలి. గోరు చిక్కుడు మార్చి కాంట్రాక్టును రూ.4,760- 4,848 మధ్య షార్ట్ సెల్ చేయడం మంచిదే.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

దీర్ఘకాలిక మూలధన రాబడి పన్ను

చిన్న మదుపరికి.. చింత లేదు!

కొత్త బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో వచ్చిన దీర్ఘకాలిక మూలధన రాబడులపై పన్ను అంటూ ఓ ప్రతిపాదన తీసుకొచ్చారు. దీంతో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టే చిన్న మదుపరులకు అనేక సందేహాలు వస్తున్నాయి. వచ్చిన రాబడిపై పన్ను పడితే.. మనకు మిగిలేదేమిటి? అని ఆందోళన చెందుతున్నారు.. మరి, ఈ దీర్ఘకాలిక మూలధన రాబడిపై పన్ను (ఎల్‌టీసీజీ) ప్రభావం మన పెట్టుబడులపై ఎలా ఉండబోతోందో తెలుసుకుందామా!



వచ్చిన రాబడిపై పన్ను భారం ఉండకూడదు అనుకునేవారు చాలామంది ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లనే ఎంచుకునేందుకు ఆసక్తి చూపిస్తారు. ఇతర పెట్టుబడి పథకాలతో పోలిస్తే.. ఇందులో ఉన్న ప్రధాన ఆకర్షణ ఇదే. కొత్త నిబంధనతో ఇది కాస్త మసకబారనుందా అనే సందేహం రాకపోదు.



సాయి కృష్ణ పత్రి
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

అయితే, దీన్ని నిర్ధారించేముందు అసలు ఈ నిబంధనను పూర్తిగా అర్థం చేసుకోవాలి.

దీర్ఘకాలం అంటే..: ఒక వ్యక్తి ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టి.. దాన్ని 365 రోజులకు మించి కొనసాగించినప్పుడు ఈ పెట్టుబడులను దీర్ఘకాలిక పెట్టుబడులు అంటారు. ఈ పెట్టుబడుల ద్వారా ఆర్జించిన లాభాలన్నీ దీర్ఘకాలిక మూలధన లాభాలుగా పరిగణిస్తారు.

ఒకవేళ పెట్టుబడులను 365 రోజులకు ముందుగానే వెనక్కి తీసుకుంటే.. అప్పుడు వాటిని స్వల్పకాలిక మూలధన రాబడిగా పేర్కొంటారు.

ఉదాహరణకు..: మీరు జనవరి, 2, 2017నాడు రూ.100ను ఈక్విటీ/మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేశారనుకుందాం. జనవరి 3, 2018న ఆ పెట్టుబడుల విలువ రూ.190 అయ్యింది. ఇప్పుడు మీరు ఆ షేర్లు/మ్యూచువల్ ఫండ్ యూనిట్లను విక్రయిస్తే.. వచ్చిన దీర్ఘకాలిక మూలధన లాభం రూ.90.

ఒకవేళ మీరు మీ పెట్టుబడిని డిసెంబరు 4, 2017నే వెనక్కి తీసుకున్నారనుకుందాం. అప్పుడు రూ.180 వచ్చాయనుకోండి.. మీ పెట్టుబడి పోను మిగిలిన రూ.80 మీ స్వల్పకాలిక మూలధన లాభం అవుతుంది.

పన్ను లెక్క ఎలా?

దీర్ఘకాలానికి: జనవరి 31, 2018 వరకూ ఉన్న నిబంధనల ప్రకారం చూస్తే.. ఈక్విటీల్లో దీర్ఘకాలిక మూలధన లాభాలపై ఎలాంటి పన్ను ఉండేది కాదు. అంటే పై ఉదాహరణలో పేర్కొన్న రూ.90కు ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు.

బడ్జెట్‌లో ప్రతిపాదించిన ప్రకారం.. ఈ దీర్ఘకాలిక మూలధన రాబడిపై 10శాతం పన్ను చెల్లించాలి. అయితే, ఇక్కడ ముఖ్యంగా గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఒక ఆర్థిక సంవత్సరంలో వచ్చిన రాబడి రూ.లక్ష దాటినప్పుడు మాత్రమే.. ఆ పైన వచ్చిన మొత్తానికి ఈ 10 శాతం పన్ను చెల్లించాలి. దీనికి ఎలాంటి ద్రవ్యోల్బణ సూచీ సర్దుబాట్లూ ఉండవు.

స్వల్పకాలానికి: స్వల్పకాలిక మూలధన రాబడిపై ఎలాంటి కొత్త మార్పులూ ప్రతిపాదించలేదు. గతంలో ఉన్న నిబంధనలే వర్తిస్తాయి. అంటే... స్వల్పకాలిక పెట్టుబడులపై వచ్చిన రాబడిపై 15శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నమాట. పైన పేర్కొన్న ఉదాహరణనే పరిశీలిస్తే.. వచ్చిన రూ.80పై 15శాతం అంటే.. రూ.12 పన్ను చెల్లించాలి.

వివిధ సందర్భాల్లో షేర్లు/మ్యూచువల్ ఫండ్ యూనిట్లు కొని, విక్రయించినప్పుడు దీర్ఘకాలిక మూలధన రాబడి (ఎల్‌టీసీజీ) వివిధ సందర్భాల్లో ఎలా ఉంటుందంటే...

1 షేరు/యూనిట్ కొనుగోలు: జనవరి 2, 2017; ధర రూ.200
జనవరి 31, 2018 నాటికి ధర: రూ.300
మార్చి 3న ధర: **రూ.350 ఎల్‌టీసీజీ: రూ.50**

2 షేరు/యూనిట్ కొనుగోలు: జనవరి 2, 2017; ధర: రూ.200
జనవరి 31, 2018 నాటికి ధర: రూ.150
మార్చి 3న ధర: రూ.250 **ఎల్‌టీసీజీ: రూ.50**

3 షేరు/యూనిట్ కొనుగోలు: జనవరి 2, 2017; ధర రూ.200
జనవరి 31, 2018 నాటికి ధర: రూ.250
మార్చి 3న ధర: రూ.150 **ఎల్‌టీసీజీ: నష్టం రూ.100**

4 షేరు/యూనిట్ కొనుగోలు: జనవరి 2, 2017; ధర: రూ.300
జనవరి 31, 2018 నాటికి ధర: రూ.200
మార్చి 3న ధర: రూ.50 **ఎల్‌టీసీజీ: నష్టం రూ.150**

5 షేరు/యూనిట్ కొనుగోలు: జనవరి 2, 2017; ధర: రూ.200
జనవరి 31, 2018 నాటికి ధర: రూ.100
మార్చి 3న ధర: రూ.200 **ఎల్‌టీసీజీ: సున్నా**

6 షేరు/యూనిట్ కొనుగోలు: జనవరి 2, 2017; ధర: రూ.300
జనవరి 31, 2018 నాటికి ధర: రూ.300
మార్చి 3న ధర: రూ.250 **ఎల్‌టీసీజీ: సున్నా**

పాత పెట్టుబడులు...

ఐదేళ్ల నుంచీ పెట్టుబడులు పెడుతున్నాను. రాబడి రూ.లక్ష దాటిపోయింది.. దీనికి పన్ను చెల్లించాలా? ఇప్పుడు చాలా మందికి వస్తున్న సందేహమిదే.. దీనికి సమాధానం 'అవసరం లేదు'. ప్రభుత్వం ఇక్కడ 'గ్రాండ్‌ఫాదర్' సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది. అంటే.. జనవరి 31, 2018 వరకూ ఉన్న పెట్టుబడులపై వచ్చిన రాబడులన్నీ కూడా దీని పరిధిలోకి వస్తాయి. అంటే.. మీరు ఏ రోజున, ఎంత ధరకు షేర్లు/మ్యూచువల్ ఫండ్ యూనిట్లు కొనుగోలు చేసినా సరే.. జనవరి 31, 2018 నాటికి ఆయా షేర్లు/యూనిట్ల గరిష్ఠ ధరనే మీ కొనుగోలు ధరగా భావిస్తారు.

దీన్ని మరింత విపులీకరిస్తే...: మీరు జనవరి 10, 2017న ఈక్విటీ ఫండ్‌లో రూ.100తో ఒక యూనిట్ కొన్నారనుకుందాం.. జనవరి 31, 2018 నాటికి ఆ యూనిట్ ధర రూ.125 అయ్యింది. దీన్ని మీరు మార్చి 31, 2018 నాడు రూ.150కు విక్రయించబోతున్నారనుకుందాం. అంటే, మీకు వచ్చిన అసలు దీర్ఘకాలిక లాభం రూ.50. కానీ, గ్రాండ్‌పాధర్ సిద్ధాంతం ప్రకారం చూస్తే.. మీకు వచ్చిన వాస్తవ లాభం రూ.25 మాత్రమే. ఎందుకంటే.. మీరు వాస్తవంగా కొనుగోలు చేసిన (జనవరి 10, 2017) విలువ, గ్రాండ్‌ఫాదర్డ్ తేదీ (జనవరి 31, 2018) నాటికి ఉన్న విలువ... ఈ **రెండింటిలో ఏది అధికంగా ఉంటే** దాన్ని పరిగణనలోనికి తీసుకుంటారు.

ఇలాంటప్పుడు మీరు వచ్చిన రూ.25 రాబడిపై 10 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.. మరోసారి ఇక్కడ గుర్తుంచుకోండి.. మీ మొత్తం దీర్ఘకాలిక పెట్టుబడులపై వచ్చిన లాభం ఆర్థిక సంవత్సరంలో రూ.1,00,000 దాటినప్పుడే మీరు ఆ పై మొత్తానికి పన్ను చెల్లించాలి.

జనవరి 10, 2017న మీరు రూ.10లక్షలను ఒక మ్యూచువల్ ఫండ్‌లో మదుపు చేశారు. యూనిట్ ధర రూ.100. అంటే మీకు మొత్తంగా 10,000 యూనిట్లు వచ్చాయి. జనవరి 31, 2018 నాడు యూనిట్ ధర రూ.125 అవడంతో మీ పెట్టుబడి మొత్తం విలువ రూ.12,50,000 అయ్యింది. (ఈ మొత్తానికి గ్రాండ్‌ఫాదర్ సూత్రం వర్తిస్తుంది). మార్చి 15, 2018 నాడు ఈ యూనిట్ విలువ రూ.150 అయ్యిందనుకుందాం. మీ దగ్గరున్న 10,000 యూనిట్లను విక్రయిస్తే.. రూ.15,00,000 వచ్చాయి. ఇక్కడ మూలధన లాభాలపై పన్ను మినహాయింపు (గ్రాండ్‌ఫాదర్)ను పరిగణనలోనికి తీసుకున్న అనంతరం మీకు వచ్చిన వాస్తవ లాభం రూ.2,50,000 (రూ.15,00,000 - రూ.12,50,000).

ఇక్కడ మొదటి రూ.లక్షకు ఎలాంటి పన్ను ఉండదు. అంటే.. రూ.2,50,000ల లాభంలో రూ.లక్ష మినహాయింపు పోను మిగిలేది రూ.1,50,000.

దీనికి 10 శాతం చొప్పున పన్ను చెల్లించాలి. అంటే.. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.15 వేలు చెల్లించాల్సి వస్తుందన్న మాట.

ఇక్కడ మరో విషయం..: మీరు అక్టోబరు 10, 2017 నాడు రూ.110కి ఒక యూనిట్ చొప్పున కొన్నారు. జనవరి, 31, 2018 నాటికి దాని విలువ రూ.125 అయ్యింది. మీరు ఫిబ్రవరి 2, 2018న యూనిట్‌ను రూ.128కు అమ్మేశారనుకుందాం. ఇప్పుడు ఇది స్వల్పకాలిక పెట్టుబడి కిందకు వస్తుంది. కాబట్టి, వచ్చిన రూ.18 లాభాన్ని స్వల్పకాలిక మూలధన రాబడిగా పరిగణిస్తారు. దీనిపై 15శాతం చొప్పున పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ముందే చెప్పినట్లు ఏడాది పూర్తయితేనే అవి దీర్ఘకాలిక పెట్టుబడుల కిందకు వస్తాయి.

డివిడెండ్ సంగతేమిటి?

గతంలో అమల్లో ఉన్న నిబంధనల మేరకు ఈక్విటీ ఫండ్లపై వచ్చిన డివిడెండ్లకు ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. కానీ, కొత్త నిబంధనల ప్రకారం ఈక్విటీ ఫండ్ల నుంచి వచ్చిన డివిడెండ్లపై 10శాతం పన్ను చెల్లించాలి. దీనివల్ల గ్రోత్, డివిడెండ్ ఆప్షన్‌లు రెండింటినీ సమానంగా పరిగణించేందుకు వీలవుతుందని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు.

సిప్.. పెద్ద మొత్తంలో చేస్తేనే...

దీర్ఘకాలిక మూలధన రాబడిపై పన్ను గురించి చిన్న మదుపరులు అసలు ఏమాత్రం ఇబ్బంది పడాల్సిన అవసరం లేదనే చెప్పొచ్చు.

ఉదాహరణకు ఒక వ్యక్తి నెలకు రూ.50వేల వరకూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానం (సిప్)లో మదుపు చేస్తున్నాడనుకుందాం. అంటే.. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.6,00,000. (12నెలలు x రూ.50,000).

- వార్షిక సగటు రాబడి 16శాతం అంచనా వేసుకున్నా.. ఏడాదిలో వచ్చే మొత్తం రాబడి రూ.50,821. (ఒక ఆర్థిక సంవత్సరంలో)
- 24 శాతం రాబడి అంచనా వేసుకుంటే.. రూ.75,438.58 వచ్చేందుకు అవకాశం ఉంది.
- ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.లక్ష లోపు దీర్ఘకాలిక మూలధన రాబడి ఉన్నప్పుడు పన్ను వర్తించదు.
- ఈ లెక్కన చూస్తే.. చిన్న మదుపరులకు ఈ కొత్త పన్ను విధానం వల్ల పెద్దగా ఇబ్బందేమీ లేదు.
- నెలకు రూ.1,00,000 పైన మదుపు చేసే వారికి 16 శాతం మించి వార్షిక రాబడి ఆర్జించినప్పుడు ఏడాదిలో రూ.1,01,642.64 రాబడి వచ్చే అవకాశం ఉంది. అప్పుడు రూ.1,642.64మీద 10శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది.

కాబట్టి, చిన్న మదుపరులు చింత లేకుండా.. ఎప్పటిలాగే ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు కొనసాగించడమే ఉత్తమం.

ఈక్విటీలతో లాభమే...

గత 15 ఏళ్ల చరిత్రను గమనిస్తే.. ఈక్విటీ ఫండ్లలోని లార్జ్ క్యాప్, డైవర్సిఫైడ్, మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్లలో వేటిని తీసుకున్నా సగటున 22.6శాతం వరకూ రాబడినిచ్చిన సందర్భాలను చూడొచ్చు. ఇదే సమయంలో ఫిక్స్‌డ్ డిపాజిట్లను గమనిస్తే.. 9.25శాతానికి మించి రాబడి రాలేదు. ఇక పన్ను ఆదాకు ఉపయోగపడే పీపీఎఫ్‌ను తీసుకున్నా.. ఎప్పటికప్పుడు తగ్గుతూనే వస్తోంది. ప్రస్తుతం 7.6శాతం దగ్గరకు చేరింది. ఈ నేపథ్యంలో దీర్ఘకాలిక పెట్టుబడికి, పన్ను ఆదాకు ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలు (ఈఎల్ఎస్ఎస్) ఎంచుకుంటే.. వచ్చిన రాబడిపై పన్ను చెల్లించినా.. వచ్చే ప్రయోజనం ఇతర ఏ పెట్టుబడి పథకాలకన్నా ఎక్కువేనని భావించొచ్చు.

ఇక పన్ను పరంగా చూసినా.. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ రూ.10వేలు దాటితే (సీనియర్ సిటిజన్లకు రూ.50వేలు (కొత్త బడ్జెట్ ప్రకారం)) ఆదాయంలో కలిపి చూపించి, పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనీస పన్ను శ్లాబు 5శాతం. అంతకుమించి 20, 30శాతం పన్ను శ్లాబులో ఉన్నవారి సంగతి? ఇక 5 శాతం పన్ను పరిధిలోకి వచ్చేవారు.. పెట్టుబడులతో ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.లక్షకు మించి రాబడిని ఆర్జించగలరా? ఆలోచించాలి. 2004-05 వరకూ ఈక్విటీల ద్వారా వచ్చిన రాబడికి ద్రవ్యోల్బణ సూచీకి సర్దుబాటుతో 20 శాతం, సర్దుబాటు చేయకుండా 10శాతం వరకూ పన్ను ఉండేది. ఇప్పుడు ఈ సర్దుబాటు అంశం లేకున్నా.. మున్ముందు వచ్చే అవకాశం లేకపోలేదు. ఇక్కడ మరో విషయం.. దీర్ఘకాలిక మూలధన రాబడిపై పన్ను అనగానే ఆందోళన చెందే మదుపరులు.. ఈక్విటీలకు మించి రాబడి వస్తూ, పన్ను పరంగా భారం పడకుండా ఉన్న పథకాలేమిటి? అని చూసుకోండి.

ఇలా చేయొచ్చు..

అధికాదాయ వర్గాలు.. అధిక మొత్తంలో ఈక్విటీలు, ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడం ద్వారా ఆర్థిక సంవత్సరంలో ఏడాదికి రూ.లక్షకు మించి రాబడిని ఆర్జించారనుకుందాం. పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడే.. దీర్ఘకాలిక మూలధన రాబడి పన్ను చెల్లించాలి. కాబట్టి, ఇలా చేయొచ్చు. దీర్ఘకాలిక పెట్టుబడులను ఒకేసారి కాకుండా.. రెండు ఆర్థిక సంవత్సరాల్లో వెనక్కి తీసుకోవాలి. ఉదాహరణకు మీ దీర్ఘకాలిక పెట్టుబడులను ఒకే ఏడాదిలో మార్చి, ఏప్రిల్ నెలల్లో అమ్ముకోవచ్చు. అంటే, మార్చి 31న, ఏప్రిల్ 1న అమ్ముకోవడం ద్వారా వేర్వేరు ఆర్థిక సంవత్సరాలుగా పరిగణిస్తారు. అంటే, ఈ లెక్కన రూ.2లక్షల వరకూ రాబడికీ ఒక్క రూపాయి కూడా పన్ను వర్తించదు. (దీని లక్ష్యం మీరు పన్నును కట్టకుండా తప్పించుకోమని కాదు.. కేవలం పన్ను భారం తగ్గించుకోవడానికి చట్టబద్ధంగా ఉన్న మార్గాన్ని మాత్రమే సూచిస్తున్నాం) మీరు అనుకున్న ఆర్థిక లక్ష్యానికి చేరువగా వచ్చినప్పుడు మీ పెట్టుబడులను ఈక్విటీల నుంచి వెనక్కి తీసుకునే దశలో ఈ సూత్రాన్ని పాటించవచ్చు.

- www.FundsIndia.com

కొత్త పథకం

కొత్త కంపెనీల్లో మదుపు...

ఇప్పుడిప్పుడే కొత్తగా మార్కెట్లోకి ప్రవేశించి, వృద్ధి దశలో ఉన్న కంపెనీల్లో మదుపు చేసే వ్యూహంతో వచ్చిన పథకం.. ఎడెల్‌వైజ్ మైడెన్ ఆపర్చునిటీస్ ఫండ్, సిరీస్-1. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ సంస్థల్లో పెట్టుబడి పెట్టే క్లోజ్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. కాస్త అధిక నష్టభయం భరించగలిగి, పెట్టుబడులను దీర్ఘకాలం కొనసాగించాలనుకునే వారికి ఇది సరిపోతుంది. పెట్టుబడిని జూన్ 28, 2021 వరకూ కొనసాగించాలి. గ్రోత్, డివిడెండ్ ఆప్షన్లతో అందుబాటులో ఉంది. కనీస పెట్టుబడి రూ.5వేలు. ఎన్ఎఫ్ఓ చివరి తేదీ ఫిబ్రవరి 16.

స్థిరాదాయ పథకాల్లో..

తక్కువ నష్టభయం ఉన్న స్థిరాదాయ పథకాల్లో మదుపు చేయాలని భావించే వారికి ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఫిక్స్‌డ్ టర్మ్ ప్లాన్, సిరీస్ పీడీ అందుబాటులో ఉంది. ఇది క్లోజ్ ఎండెడ్, ఇన్‌కం స్కీం. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. మదుపు చేసేందుకు ఫిబ్రవరి 7 వరకూ అవకాశం ఉంది. పెట్టుబడిని 1177 రోజులు కొనసాగించాలి.

◆ డెట్ పథకాలతోపాటు, కొంత మొత్తాన్ని ఈక్విటీలకు కూడా కేటాయించి, పెట్టుబడి వృద్ధికి దోహదం చేసే వ్యూహంతో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టిపుల్ ఈల్డ్ ఫండ్, సిరీస్ 14 మార్కెట్లోకి వచ్చింది. క్లోజ్ ఎండెడ్, ఇన్‌కం ఫండ్ ఇది. ఫిబ్రవరి 15 వరకూ మదుపు చేసేందుకు వీలున్న ఈ పథకంలో 1288 రోజులు కొనసాగాలి. కనీస పెట్టుబడి రూ.5వేలు.

ప్రమాదంలో.. పరిహారం ఇచ్చేలా...

ప్రమాదం.. ఎప్పుడు, ఏ రూపంలో కాటేస్తుందో ఊహించడం కష్టమే. దురదృష్టవశాత్తూ.. ఒక వ్యక్తి ప్రమాదం బారిన పడితే.. అతని కుటుంబం పడే బాధ అంతాఇంతా కాదు.. ఆర్థికంగా ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలని అనుకున్నప్పుడు.. జీవిత, ఆరోగ్య బీమా పాలసీలతో పాటు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని ఎంచుకోవడమే మార్గం.

మన దేశంలో సగటున గంటకు 55 రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ప్రమాదంలో మరణించినప్పుడు జీవిత బీమా పాలసీ పరిహారం చెల్లిస్తుంది. గాయపడి చికిత్స పొందుతున్నప్పుడు ఆరోగ్య బీమా ఆదుకుంటుంది. కానీ, కొన్నిసార్లు ప్రమాదం తర్వాత గత స్థాయిలో పనిచేసేందుకు అవకాశం ఉండకపోవచ్చు. ఇలాంటప్పుడు ఆదాయంలో కోత పడొచ్చు. ఇలాంటప్పుడే వ్యక్తిగత ప్రమాద బీమా సాయపడుతుంది. ప్రమాదవశాత్తూ మరణించినా.. కాళ్లు, చేతులు కోల్పోయినా, లేదా శరీరంలోని ఇతర అవయవాలు దెబ్బతిన్నా ఇది పరిహారం ఇస్తుంది. శాశ్వత పూర్తి వైకల్యం ఏర్పడినప్పుడు ఈ పాలసీ ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంటుంది.





విజయ్ ఒక ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతని కుటుంబంలో అతనే ఆర్జనపరుడు. ఒకరోజు కార్యాలయం నుంచి ఇంటికి వస్తుండగా.. రోడ్డు ప్రమాదం జరిగింది. ఫలితంగా అతని కుడిచేయి కోల్పోవాల్సి వచ్చింది. అంతే, అతనికి పాక్షిక శాశ్వత వైకల్యం ఏర్పడింది. విజయ్ ఆరోగ్య, జీవిత బీమా పాలసీలు తీసుకున్నాడు. కానీ, వ్యక్తిగత ప్రమాద బీమా విషయాన్ని పట్టించుకోలేదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఒంటి చేత్తో ఉద్యోగం చేయలేకపోయాడు. దీంతో ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చింది. ఫలితం కుటుంబ ఆర్థిక పరిస్థితి తారుమారయ్యింది. ఒకవేళ అతనికి వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ ఉంటే.. జరిగిన నష్టానికి పరిహారం అందేది. అతను కొన్నాళ్లపాటు ఆదాయాన్ని ఆర్జించకపోయినా ఎలాంటి ఇబ్బందీ ఉండేది కాదు.. వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీల్లో ఉండే.. శాశ్వత వైకల్యానికి పరిహారం అందించే వీలు ఉండటమే ఇక్కడ ప్రయోజనం.

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఒక వ్యక్తికి తప్పనిసరిగా వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ ఉండాల్సిన అవసరం ఉంది. నిజానికి ఇది అతి తక్కువ ఖర్చుతో అందే బీమా. రూ.10లక్షల విలువైన వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీకి రోజుకు రూ.5కు మించి ఖర్చవ్వదు. ఇంత మొత్తం ఖర్చు చేయడం ఎవరికైనా పెద్ద కష్టమేమీ కాదనే అనుకోవచ్చు. వ్యక్తిగత ప్రమాద బీమా ప్రాధాన్యాన్ని భారత ప్రభుత్వం కూడా గుర్తించింది. అందుకే, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద రూ.12తోనే రూ.రెండు లక్షల బీమాను అందిస్తోంది. పాలసీ తీసుకున్న వ్యక్తికి ప్రమాదవశాత్తూ అనుకోనిదేదైనా జరిగితే.. రూ.2లక్షల పరిహారం అందిస్తుంది. శాశ్వత వైకల్యం ఏర్పడితే.. రూ.లక్ష పరిహారం అందుతుంది.

సాధారణంగా వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీలు మరణం, శాశ్వత పూర్తి వైకల్యం, శాశ్వత పాక్షిక వైకల్యం, పాక్షిక వైకల్యంలాంటి వాటికి పరిహారం ఇస్తుంది. అయితే, ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. గతంలో సాహస క్రీడల్లో పాల్గొని, ప్రమాదాల బారిన పడితే పరిహారం అందేది కాదు. కానీ, ఇప్పుడు ఇలాంటి సందర్భాల్లోనూ పరిహారం ఇచ్చే పాలసీలు అందుబాటులోకి వచ్చాయి. పర్యటక మంత్రిత్వ శాఖ కూడా అడ్వెంచర్ టూరిజం చేసే వారికి వ్యక్తిగత ప్రమాద పాలసీ ఉండాలని సూచిస్తోంది.

◆ అవసరమైతే ఎయిర్ అంబులెన్స్ సదుపాయాన్ని వినియోగించుకునే వీలూ ఈ పాలసీలు కల్పిస్తున్నాయి. ప్రమాదంబారిన పడి, ఆదాయం ఆగిపోయినప్పుడు రుణ వాయిదాలను చెల్లించే ఏర్పాటుతోనూ పాలసీలు అందుబాటులోకి వచ్చాయి.

◆ కుటుంబ సభ్యులందరికీ కలిపి ఒకే పాలసీని ఎంచుకొని, అందులో ప్రతి వ్యక్తికీ అవసరమైన రక్షణ ఉండేలా చూసుకోవచ్చు.

ఒకే పాలసీ అందరికీ అన్న ధోరణి నుంచి బీమా కంపెనీలు కూడా ఇప్పుడు బయటకు వస్తున్నాయి. పాలసీదారుల అవసరాన్ని బట్టి, వారికి అవసరమైన పాలసీని ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నాయి. అందుబాటులో ఉన్న వాటి నుంచి తమకు కావాల్సినవి ఎంచుకొని, పాలసీని తీసుకునే అవకాశం ఇప్పుడు పాలసీదారులకు దొరుకుతుంది. ఒక్కో అంశానికి సంబంధించి, ఒక్కో మొత్తాన్ని కూడా నిర్ణయించుకోవచ్చు. అవసరమైతే పాలసీ వ్యవధి మధ్యలో కూడా కావాల్సిన రక్షణలను చేర్చుకోవచ్చు.

ప్రమాదం బారినపడినప్పుడు.. ఇప్పటి వరకూ మనం దాచుకున్న డబ్బంతా ఊడ్చుకుపోతుంది. మనం సాధించాల్సిన ఆర్థిక లక్ష్యాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలంటే.. ముందుగానే మేల్కోవాలి. అవసరమైనంత మేరకు వ్యక్తిగత ప్రమాద బీమా తీసుకొని, ధీమాగా ఉండాలి.

- భాస్కర్ నేరుకార్, హెడ్, హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ టీం, బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్.

డిపాజిట్‌పై అప్పు.. మంచిదేనా?

>>> నేను ఒక జీవిత బీమా పాలసీ తీసుకోవాలనుకుంటున్నాను.. వచ్చే ఆదాయంలో ఎంత శాతం వరకూ ప్రీమియం కోసం కేటాయించాలి? - నళిని



బాధ్యతలు ఉన్న ప్రతి వ్యక్తీ వార్షిక ఆదాయానికి 10-12 రెట్ల బీమా కవరేజీ ఉండాలి. బీమాతో పాటు జీవిత అవసరాలు చాలా ఉంటాయి. కాబట్టి, దీర్ఘకాలం కట్టాల్సిన బీమా ప్రీమియం మాత్రం మన ఆదాయంలో 5శాతం మించకుండా ఉంటే సౌకర్యంగా ఉంటుంది. ఇది బీమాను బీమా కోసమే తీసుకునే టర్మ్ పాలసీలతోనే సాధ్యం అవుతుంది. వయసు పెరుగుతున్న కొద్దీ టర్మ్ పాలసీల్లో కూడా ప్రీమియం ఎక్కువ కట్టాల్సి ఉంటుంది. బీమాతోపాటు పొదుపు, పెట్టుబడులను కలిపి తీసుకోవాలి అనుకుంటే పరిమిత కాలం ప్రీమియం కట్టి, దీర్ఘకాలం బీమా కవరేజీ ఉండే పాలసీలను ఎంచుకోవాలి.

>>> బ్యాంకులో రూ.10లక్షల డిపాజిట్ ఉంది. గడవు తేదీ కంటే ముందు డబ్బు అవసరం అయితే అప్పు తీసుకోవడం మంచిదా? డిపాజిట్‌ను రద్దు చేసుకోవాలా? - వినోద్

డిపాజిట్‌ని గడువు కంటే ముందే రద్దు చేసుకుంటే, డిపాజిట్ చేసినప్పటి నుంచి రద్దు చేసిన కాలానికి వర్తించే వడ్డీలో కొంత పెనాల్టీగా తగ్గించి చెల్లిస్తారు. ఉదాహరణకు రెండేళ్ల కాలానికి డిపాజిట్ వడ్డీ 6.75శాతం ఏడాదికి వడ్డీ 6శాతం ఉందనుకుందాం. రెండేళ్ల కాలానికి మీరు చేసిన డిపాజిట్‌ను ఏడాదిలో రద్దు చేసుకుంటే ఏడాదికి వర్తించే వడ్డీ 6%లో 0.5-1.5% తగ్గించి 4%-5.5% వడ్డీని బ్యాంకు చెల్లిస్తుంది. బ్యాంకును బట్టి ఈ పెనాల్టీ మారుతుంది. మీకు అవసరం అయిన మొత్తాన్ని స్వల్పకాలంలో తిరిగి చెల్లించేటట్లయితే డిపాజిట్‌పై అప్పు తీసుకోవడం మంచిది. డిపాజిట్ కాలం కంటే ఇంకా గడువు తేదీ కాలం తక్కువ ఉన్నప్పుడూ డిపాజిట్‌పై అప్పు తీసుకోవడమే మంచిది.

- వంగా రాజేంద్ర ప్రసాద్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఆ మెమోతోనే నిర్దోషినని తేలిపోయింది: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం వ్యవహారానికి సంబంధించి.. రిపబ్లికన్లు తాజాగా విడుదల చేసిన మెమో తాను నిర్దోషినని రుజువుచేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఈ వ్యవహారంపై ఎఫ్‌బీఐ విచారణ చేపట్టడం.. 'అమెరికాకే అవమానం' అని ఆయన వ్యాఖ్యానించారు. ఇటీవల విడుదలైన ఈ మెమో.. విచారణలో ఎఫ్‌బీఐ తమ నిఘా వ్యవస్థను దుర్వినియోగం చేసినట్లు ఆరోపించింది. ట్రంప్ ప్రచార సిబ్బందిలో ఒకరిపై నిఘా పెట్టేందుకు కోర్టును తప్పుదోవ పట్టించినట్లు పేర్కొంది. పూర్తి పక్షపాతంతోనే ఈ విచారణ మొదలైనట్లు నిందించింది. "నేను పూర్తిగా నిర్దోషినని ఈ మెమోతో తేలిపోయింది. అయితే దుష్ప్రచారం కొనసాగుతోంది. అసలు కుట్రే లేదు. ఏడాది పాటు అన్వేషించి.. వారు ఏదీ కనుక్కోలేకపోయారు. అమెరికాకే ఇది అవమానం" అని ట్రంప్ ట్విటర్‌లో వ్యాఖ్యలు చేశారు.

చిదంబరం త్వరలో జైలుకెళ్తారు

భాజపా నేత సుబ్రహ్మణ్యస్వామి వ్యాఖ్య

చెన్నై, న్యూస్‌టుడే: బడ్జెట్‌పై కేంద్ర ఆర్థికశాఖ మాజీ మంత్రి చిదంబరం చేసిన ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, త్వరలో ఆయన జైలుకెళ్తారని భాజపా సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి వ్యాఖ్యానించారు. తూత్తుకుడి విమానాశ్రయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2జీ స్పెక్ట్రం కేసులో మరో పది రోజుల్లో తాను అప్పీలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆర్కే నగర్ ఉప ఎన్నికలో టీటీవీ దినకరన్ ఒంటరిగా పోటీచేసి గెలవడం తనకు సంతోషం కలిగించిందని తెలిపారు. ఇప్పటికే సినీరంగానికి చెందిన వారు రాజకీయాల్లోకి రావడంతో తమిళనాడు నాశనమైందని ఆరోపించారు. రజనీకాంత్, కమల్ హాసన్‌లు రాజకీయాల్లోకి వస్తే రాష్ట్రం తిరోగమన దిశగా పయనిస్తుందని విమర్శించారు.

సీబీఐ సోదాల్లో బయటపడిన దిల్లీ మంత్రి జైన్ ఆస్తుల పత్రాలు!

దిల్లీ: అవినీతి కేసులో చిక్కిన దిల్లీ దంతవైద్య మండలి రిజిస్ట్రార్ ఇంటిలో చేపట్టిన సోదాల్లో.. దిల్లీ మంత్రి సత్యేంద్ర జైన్‌కు సంబంధించి రూ. 2కోట్ల నగదు జమ, ఆస్తులకు సంబంధించిన పత్రాలు వెలుగుచూసినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వర్గాలు తెలిపాయి. అయితే రిజిస్ట్రార్‌తో జైన్‌కు ఎలాంటి సంబంధాలూలేవని, ఆయన ప్రతిష్ఠతను దెబ్బతీసేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని దిల్లీ ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. రిజిస్ట్రార్ రిషీరాజ్‌తో పాటు దంతవైద్య మండలి న్యాయవాది ఎన్ ప్రదీప్‌ను శనివారం రాత్రి అరెస్టుచేశారు. వీరు ఓ వైద్యుడి నుంచి రూ. 4.75 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. 'దంత వైద్య మండలి నుంచి అనుకూలంగా తీర్పురావాలంటే లంచం ఇవ్వాలని వీరిద్దరూ డిమాండ్‌చేసినట్లు కేసు నమోదుచేశాం'అని సీబీఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాల్ తెలిపారు. అయితే రిషీరాజ్ ఇంటిలో సోదాలు చేపడుతుండగా జైన్‌కు సంబంధించి కొన్ని ఆస్తుల పత్రాలు బయటపడ్డాయని సీబీఐ వర్గాలు తెలిపాయి. కేరళలో జైన్ పేరిటవున్న ఆస్తులు, ఆయనతోపాటు ఆయన భార్య పూనమ్ పేరిట వున్న చెక్‌బుక్‌లు, వీరి కంపెనీలకు సంబంధించిన రూ. 2 కోట్ల నగదు జమ పత్రాలు బయటపడినట్లు పేర్కొన్నాయి. మరోవైపు సోదాల్లో 500 గ్రాముల బంగారం, రూ. 24 లక్షల నగదు కూడా లభించాయని, అయితే వీటితో జైన్‌కు సంబంధముందా? అనే అంశంపై స్పష్టతలేదని వివరించాయి. ఈ విషయంపై వివరణ కోరేందుకు త్వరలో జైన్‌ను విచారించే అవకాశముందని తెలిపాయి.

సీఆర్‌పీఎఫ్ జవానుకు దిల్లీ హైకోర్టులో ఊరట

ఏసీపీ పథకం కింద ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు

దిల్లీ: పంజాబ్‌లో 29 ఏళ్ల క్రితం ఉగ్రదాడిలో తీవ్రంగా గాయపడ్డ కేంద్ర రిజర్వు పోలీసు దళం(సీఆర్‌పీఎఫ్) జవానుకు దిల్లీ హైకోర్టు తాజాగా ఊరటనిచ్చింది. 'అష్యూర్డ్ కెరీర్ ప్రోగ్రెషన్(ఏసీపీ)' పథకం కింద ఆయనకు అన్నిరకాల ఆర్థిక ప్రయోజనాలు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇప్పటివరకు ఆయన్ను పూర్తిస్థాయి ఆర్థిక ప్రయోజనాలకు అన్యాయంగా దూరం చేశారని అభిప్రాయపడింది. బాధిత జవాను ఏసీపీ పథకం కింద లబ్ధి పొందకుండా 2003 జూన్‌లో, 2005 డిసెంబరులో ప్రభుత్వ జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు కొట్టివేసింది. అయితే, కోర్టును ఆశ్రయించడంలో జాప్యం చేసినందుకుగాను.. జవానుకు రావాల్సిన బకాయిలను 2013 నుంచి మాత్రమే లెక్కకట్టి ముట్టజెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 1981 జనవరి 24న సీఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా చేరిన సదరు వ్యక్తి.. పంజాబ్‌లోని తర్న్ తారణ్‌లో 1989 జులై 26న ఉగ్రవాదుల దాడిలో గాయపడ్డారు. ఆయనకు తగిలిన గాయాలు.. నిబంధనల ప్రకారం చేస్తే తీవ్రమైనవేమీ కాదంటూ ఏసీపీ ప్రయోజనాలను ఆయనకు ప్రభుత్వం నిరాకరించింది.

తైవాన్‌లో భూకంపం

తైపీ: తైవాన్ తూర్పు తీరంలో ఆదివారం భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై దీని తీవ్రత 6.1గా నమోదైనట్లు అమెరికా భూకంప అధ్యయన సంస్థ తెలిపింది. హ్యుయాలిన్ ఓడరేవు పట్టణానికి 15 కి.మీ.ల దూరంలో. . 8 కి.మీ.ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. అయితే నష్టానికి సంబంధించి ఎలాంటి నివేదికలూ వెలువడలేదు.

సాంగ్‌పో-బ్రహ్మపుత్ర మళ్లింపుపై ఆందోళన వద్దు

భారత మాజీ సైన్యాధిపతి వ్యాఖ్య

కోల్‌కతా: సాంగ్‌పో-బ్రహ్మపుత్ర నదీ జలాలను చైనా మళ్లిస్తున్నట్లు వచ్చిన వార్తలపై భారత మాజీ సైన్యాధిపతి జనరల్ శంకర్ రాయ్ చౌధురి స్పందించారు. దీనివల్ల భారత్‌కు ఎలాంటి ముప్పు లేదన్నారు. ఒకవేళ ఆ వార్తలు నిజమే అయినా బ్రహ్మపుత్రకు భారత్‌లో అనేక ఉపనదులు ఉన్నాయని చెప్పారు. ఆ పరివాహక ప్రాంతాల్లో మంచి వర్షం ఉంటుందని, అందువల్ల మైదాన ప్రాంతాల్లోకి వచ్చేసరికి నదిలో సరిపడా నీరు లభిస్తుందని భారత్-చైనా సంబంధాలపై జరిగిన ఒక సదస్సులో తెలిపారు.

మాంసం లాగించేస్తున్నారు

- దేశంలో 71 శాతం మంది మాంసాహారులు
- సమస్యలు తలెత్తొచ్చంటున్న ఫోర్బ్స్ కథనం
- ప్రపంచ దేశాలతో పోల్చినపుడు భారత్‌లో వినియోగం తక్కువ

దేశంలో మాంసం వినియోగం బాగా పెరుగుతోంది. మేక/గొర్రె, కోడి మాంసం, పెద్దకూరకు డిమాండు నానాటికీ ఎక్కువవుతోంది. దీనివల్ల పర్యావరణ, నైతిక, ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తొచ్చని 'ఫోర్బ్స్' పత్రిక తాజా కథనం ఒకటి హెచ్చరించింది. వందల ఏళ్లుగా శాకాహారంపై ఎక్కువగా ఆధారపడుతున్న భారత్‌లో మాంసం వినియోగం పెరుగుతుండడం నయా పోకడకు దర్పణం పడుతోంది. నిజానికి ప్రపంచ దేశాలతో పోల్చిచూసినపుడు అతి తక్కువగా మాంసాన్ని వినియోగిస్తున్నది(ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ గణాంకాల ప్రకారం) భారత్‌లోనే!!. ఈ సంఖ్య ఇప్పుడు క్రమేపీ పెరుగుతోంది.



భారత రిజిస్ట్రార్ జనరల్ విడుదల చేసిన శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(ఎస్ఆర్ఎస్) బేస్‌లైన్ సర్వే-2014 ప్రకారం...



దేశ జనాభాలోని 34 కోట్ల మంది మాత్రం శాకాహారులు.

కారణాలు...

- ఆహారపు అలవాట్లు మారడం
- జీవనశైలి తెచ్చిన మార్పులు
- వ్యక్తుల ఆదాయాలు పెరగడం
- మాంసాహారం ఎక్కువ కేలరీల శక్తినిస్తుందని నమ్మడం.

పర్యావరణ విపరిణామాలు

ప్రపంచం ఇప్పటికే వాతావరణ మార్పులు, నీటి సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోంది. మాంసం వినియోగం పెరగడం ఈ సంక్షోభాల్ని మరింత పెంచుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రపంచానికి తిండిపెట్టే సామర్థ్యం దీనివల్ల తగ్గిపోతుందని అంటున్నారు.


- ఒక కేజీ మేక/గొర్రె మాంసం ఉత్పత్తికి దాదాపు 8 వేల లీటర్లు, కేజీ కోడి మాంసం ఉత్పత్తికి 4 వేల లీటర్లు, అరకేజీ గొడ్డుమాంసం ఉత్పత్తికి 9 వేల లీటర్లు నీరు అవసరమని శాస్త్రవేత్తలు తేల్చారు. మొక్కల ఆధార ప్రొటీన్ల తయారీకి అవసరమైన నీటికన్నా ఇది చాలా ఎక్కువ.
- ఒక కేలరీ శక్తినిచ్చే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో వెలువడే కార్బన్‌డైఆక్సైడ్ కంటే దాదాపు 25 రెట్లు ఎక్కువగా చికెన్ ఉత్పత్తిలో వెలువడుతుంది.
- ఆహారం కోసం పశువుల్ని ఎక్కువగా పెంచడం వల్ల మిథేన్ వాయువు ఉత్పత్తి పెరిగి పర్యావరణానికి హాని ఏర్పడుతుంది.
- ప్రస్తుతం ప్రపంచంలో పండే ఆహార ధాన్యాల్లో దాదాపు 50 శాతాన్ని పశుసంపద పోషణకే వినియోగిస్తున్నట్లు ఓ అంచనా. భారత్‌లో మారిన ఆహారపు అలవాట్ల వల్ల ఈ శాతం మరింత పెరగొచ్చని అంటున్నారు.

ఆరోగ్య సమస్యలు



ప్రొటీన్లు, ఇతర పోషకాల కోసం మాంసాహారం మంచిదే కావొచ్చు. కానీ దీనిని ఎక్కువగా వినియోగించడం వల్ల గుండెజబ్బులు, పక్షవాతం, టైప్-2 డయాబెటిస్, ఊబకాయం, కొన్ని రకాల కేన్సర్లు, ముందస్తు మరణాలు సంభవించొచ్చని వైద్య, శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

తెలంగాణలో అత్యధికం



మాంసం వినియోగం తెలంగాణలో చాలా ఎక్కువగా ఉన్నట్లు చాన్నాళ్ల కిందటే భారత రిజిస్ట్రార్ జనరల్ సర్వే నిగ్గుతేల్చింది. దాని ప్రకారం.

- మాంసాహారులు అత్యధిక సంఖ్యలో తెలంగాణలో ఉన్నారు.
- ఆ తర్వాతి స్థానాల్లో ఉన్న రాష్ట్రాలు- పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కేరళ
- ఎక్కువమంది శాకాహారులున్న రాష్ట్రాలు- రాజస్థాన్, పంజాబ్, హరియాణ.

ఐరాస ఆహార, వ్యవసాయ సంస్థ గణాంకాల ప్రకారం కొన్ని దేశాల్లో తలసరి మాంసం వినియోగం ఇలా... (ఏడాదికి కేజీలలో)

అమెరికా	120.2	ఫ్రాన్స్	86.7	రష్యా	62.9	టాంజానియా	9.6
ఆస్ట్రేలియా	111.5	బ్రెజిల్	85.3	చైనా	58.2	నైజీరియా	8.8
అర్జెంటీనా	98.3	బ్రిటన్	84.2	సౌదీ అరేబియా	54.4	రువాండా	5.2
కెనడా	94.3	మంగోలియా	82.1	కెన్యా	16.7	భారత్	4.4
జర్మనీ	88.8	స్వీడన్	80.2	పాకిస్థాన్	14.7		

ఈనాడు ప్రత్యేకవిభాగం

జాతినిర్మాణ బాధ్యత యువతదే

- బాబా రామ్‌దేవ్

హొసపేటె(కర్ణాటక), న్యూస్‌టుడే: జాతి నిర్మాణ బాధ్యత యువతపై ఉందని యోగా గురు బాబా రామ్‌దేవ్ అన్నారు. బళ్లారి జిల్లా హొసపేటె పట్టణంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన జాతినిర్మాణ, యోగాదీక్ష కార్యక్రమంలో రామ్‌దేవ్ మాట్లాడారు. భద్రమైన జాతి నిర్మాణం కావాలంటే ఆరోగ్యవంతమైన సమాజం అవసరమన్నారు. అందుకోసం ప్రతీరోజు యోగా, ప్రాణాయామాలు చేస్తూ మంచి ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు ఆసనాలను చేసి చూపించారు. ఉదయం బళ్లారిలో యోగాసనాలు వేశారు. రెండు చోట్ల పెద్దసంఖ్యలో యోగాభ్యాసకులు పాల్గొన్నారు. మూడురోజులపాటు రామ్‌దేవ్ బాబా బళ్లారి జిల్లాలో యోగాసనాల్లో శిక్షణ ఇస్తారు.



మయూరాసనంలో బాబా రామ్‌దేవ్

వివక్ష వీడితేనే స్వర్ణభారతం సాధ్యం

- గ్రామాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తప్పనిసరి
- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు డిజిటల్, విజయవాడ: సమాజంలో ఇంకా అంటరానితనం, కులవివక్ష పెచ్చుమీరుతున్నాయని, వాటిని వీడితేనే స్వర్ణభారతం సాధ్యమవుతుందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. . సామాజిక, ఆర్థిక అసమానతలను నిర్మూలించడానికి ప్రభుత్వం చట్టాలు తీసుకొస్తోందని, వీటిని సక్రమంగా అమలు చేస్తే ఫలితం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఏర్పడిన స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను ఆదర్శంగా తీసుకొని.. ప్రజలందరూ స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. మారుతున్న వాతావరణం, ఆహారపు అలవాట్లతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, వారికి వైద్య పరీక్షలు చేయడంతో పాటు, రోగాల బారిన పడకుండా ప్రముఖ వైద్యులతో అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న రోజుల్లో పత్రికలు, ప్రసారమాధ్యమాలు ప్రజల్లో చైతన్యం కలిగించి సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రేరణ కల్పించాలని కోరారు. త్వరలో విశాఖపట్నంలోనూ స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రారంభిస్తామని వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా ట్రస్ట్ సేవలందిస్తుందని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఎక్కువ జనాభాకు విద్య, వైద్యం లాంటి మౌలిక సదుపాయాలన్నీ ప్రభుత్వమే కల్పించలేదని.. ఈ క్రమంలో స్వర్ణ భారత్ ట్రస్ట్ సినీనటుడు వెంకటేష్ మాట్లాడుతూ.. ఇక్కడి పరిస్థితులు చూస్తుంటే కొంతకాలం సినిమాలు మానేసి ఇక్కడే శిక్షణ తీసుకోవాలనిపిస్తోందన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తప్పు

దిల్లీ: కులం, మతం, ప్రాంతం, భాష పేరిట ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం తప్పు అని భారత ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చెప్పారు. ఆదివారం దిల్లీలో 'ఇందిరాగాంధీ జాతీయ కళల కేంద్రం'లో తొలి అంతర్జాతీయ కళా మేళాను ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. భిన్నత్వంలో ఏకత్వం అనేది మన దేశ స్ఫూర్తి అయినందున ఇతరుల మనోభావాలను గాయపడకుండా ప్రజలంతా జాగ్రత్త వహించాలని ఆయన హితవు పలికారు. నాగరిక సమాజంలో దేన్నికైనా ఒక వ్యవస్థ ఉంటుందని గుర్తుచేశారు. ప్రతిఒక్కరూ తమ హక్కుల్ని పొందేలా, భావాలను వ్యక్తం చేసుకునేలా చూడాల్సిన ధర్మం ప్రభుత్వానిదేనన్నారు. సంస్కృతే నాగరికతకు గుండె వంటిదన్నారు. ప్రపంచీకరణ విస్తృతమవుతున్న తరుణంలో మన సంస్కృతి- సంప్రదాయాలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని చెప్పారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా భారతదేశమంతా ఒకటేననేది మన ప్రాథమిక తత్వమని పేర్కొన్నారు. 14 రోజుల పాటు జరిగే కళామేళాలో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళారూపాలను దాదాపు వెయ్యి మంది కళాకారులు ప్రదర్శిస్తారు. కేంద్ర సాంస్కృతిక శాఖ దీనిని నిర్వహిస్తోంది.

మాల్దీవుల్లో ముదిరిన సంక్షోభం

- తన ఆదేశాలకు కట్టుబడాల్సిందేనన్న సుప్రీం కోర్టు

మాలె: మాల్దీవుల్లో ఏర్పడ్డ రాజకీయ సంక్షోభం మరింత ముదిరింది. రాజకీయ ఖైదీల విడుదలకు, అనర్హతవేటు పడ్డ ఎంపీల సభ్యత్వాలను పునరుద్ధరించాలంటూ తానిచ్చిన ఆదేశాలకు కట్టుబడాల్సిందేనని దేశాధ్యక్షుడు అబ్దుల్లా యమీన్‌కు సుప్రీం కోర్టు మరోసారి స్పష్టంచేసింది. ఈ విషయంలో ఎలాంటి సాకులకు తావులేదని తేల్చిచెప్పింది. తన ఆదేశాల అమలుకు ప్రభుత్వం నిరాకరిస్తున్న నేపథ్యంలో సుప్రీం కోర్టు తాజాగా ఈ ప్రకటన చేసింది. రాజకీయ ఖైదీల విచారణ రాజకీయ ప్రేరేపితంగా సాగినందువల్ల వారిని విడుదల చేయాలని స్పష్టంచేసింది. ఈ ఆదేశాలను అమలు చేశాక.. వారిపై మరోసారి విచారణ జరిపే అధికారం ప్రాసిక్యూటర్ జనరల్‌కు ఉంటుందని తెలిపింది.

9 మంది రాజకీయ వ్యతిరేకులను జైళ్ల నుంచి విడుదల చేయాలని, యమీన్ పార్టీ నుంచి ఫిరాయించినందుకు వేటు పడ్డ 12 మంది పార్లమెంటు సభ్యుల సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని సుప్రీం కోర్టు గురువారం ప్రభుత్వాన్ని ఆదేశించింది. సదరు ఎంపీల సభ్యత్వాల పునరుద్ధరణ వల్ల పార్లమెంటులో విపక్షానికి మెజార్టీ వస్తుంది. యమీన్‌ను పదవీచ్యుతుడిని చేసేంత బలం సమకూరుతుంది. అయితే కోర్టు ఆదేశాలకు కట్టుబడేందుకు యమీన్ ప్రభుత్వం తిరస్కరించింది. ఈ మేరకు వచ్చిన అంతర్జాతీయ ఒత్తిడికి కూడా తలొగ్గలేదు. యమీన్‌ను పదవీచ్యుతుడు కాకుండా చూసేందుకు శనివారం నుంచి పార్లమెంటును నిరవధికంగా మూసేసింది. దీనిపై విపక్షాలు ఉద్యమిస్తున్నాయి.

మరోవైపు ఆదివారం అటార్నీ జనరల్ మహ్మద్ అనిల్ జాతీయ టీవీలో మాట్లాడుతూ.. అధ్యక్షుడిని అరెస్టు చేసేందుకు సుప్రీం కోర్టు ఆదేశాలిస్తే అవి రాజ్యాంగ విరుద్ధమవుతాయని చెప్పారు. అలాంటి ఉత్తర్వులను అమలు చేయవద్దని పోలీసులు, సైన్యానికి స్పష్టంచేశానన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరిస్తూ పార్లమెంటు వద్ద సమావేశానికి విపక్ష మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండీపీ) ఎంపీలు ప్రయత్నించారు. వారిని భద్రతా దళాలు వెనక్కి నెట్టేశాయి. దేశానికి తిరిగొచ్చిన ఇద్దరు విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకున్నాయి. సుప్రీం కోర్టు ఆదేశాలను తిరస్కరించాలని అటార్నీ జనరల్ ప్రకటనలు చేయడం తిరుగుబాటు కిందకే వస్తాయని విపక్ష నేత, మాజీ అధ్యక్షుడు మహ్మద్ నషీద్ స్పష్టంచేశారు. యమీన్ తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

త్రిపురలో కమలం వికసిస్తుంది

బహిరంగ సభలో రాజ్‌నాథ్

అగర్తలా, చాందీపూర్: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో 'కమలం" వికసిస్తుందని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఇంద్రానగర్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆదివారం ఆయన ప్రసంగించారు. 'విజయ సంకల్ప యాత్రకు తరలివచ్చిన త్రిపురవాసులను చూస్తుంటే విజయం తథ్యమని అనిపిస్తోంది. ఇక్కడి వామపక్షాలను కూకటివేళ్లతో పెకలిస్తారనడంలో ఎలాంటి సందేహములేదు. బురదలోనే కమలం వికసిస్తుంది. గత 25ఏళ్లలో అవినీతి విధానాలు, కుంభకోణాలతో రాష్ట్రాన్ని వామపక్షాలు బురదమయం చేశాయి. కమలం వికసించేందుకు బాటలు పరిచాయి'అని ఆయన వ్యాఖ్యానించారు. 'ఇదివరకు ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్‌లను ఖాయిలాపడ్డ రాష్ట్రాలుగా పిలిచేవారు. కానీ భాజపా ప్రభుత్వాలు కొలువుదీరడంతో అక్కడి పరిస్థితులు మారాయి'అని చెప్పారు. ఈశాన్య భారత ప్రజల అభివృద్ధికి వాజ్‌పేయీ ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసిన సంగతిని ఆయన గుర్తుచేశారు. మరోవైపు చాందీపూర్‌లోని బహిరంగ సభలో కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ మాట్లాడారు. త్రిపురవాసులకు సుపరిపాలన అందించడంలో వామపక్షాలు విఫలమయ్యాయని ఆమె ధ్వజమెత్తారు.

నాగా ఒప్పందంపై రాహుల్ చెణుకులు

దిల్లీ: నాగాలాండ్‌లో శాంతి స్థాపనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కుదిరిన "నాగా ఒప్పందం" పై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చెణుకులు విసిరారు. ఈ అంశంపై ట్విటర్‌లో ఆదివారం ఆయన స్పందించారు. '2015లో నాగా ఒప్పందంతో చరిత్ర సృష్టించామని మోదీ గొప్పలు చెప్పారు. ఇప్పుడు 2018 ఫిబ్రవరిలోకి అడుగుపెట్టాం. అయితే ఇప్పటికీ ఆ ఒప్పందంలో ఏముందో? అది ఎక్కడుందో తెలియట్లేదు. కేవలం మాటలు మాత్రమే చెప్పే భారత ప్రధానుల్లో మోదీ మొదటివారు'అని ఆయన ట్వీట్‌చేశారు. ఈ నెల 27న నాగాలాండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి.

కళాశాల భవనం పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య

- కృష్ణా జిల్లాలో ఘటన

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: కళాశాల భవనం పైనుంచి కిందికి దూకి ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలంలో చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన షేక్ రెహ్మాన్(21) కృష్ణా జిల్లా ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ఐటీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. యాజమాన్యం వెంటనే విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఆత్మహత్యకు ప్రేమ వైఫల్యమే కారణమనే వ్యాఖ్యలు వస్తున్నాయి.



రెహ్మాన్ (పాతచిత్రం)

భారత్-అమెరికా వాయుసేనల మధ్య విస్తృతం కానున్న సహకారం

అమెరికా వైమానిక దళపతి గోల్డ్‌ఫీన్

దిల్లీ: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక ప్రయోజనాల పరిరక్షణకు భారత్, అమెరికా వాయుసేనలు తమ మధ్యనున్న నిర్వహణపరమైన సహకారాన్ని గణనీయంగా పెంచుకోనున్నాయని అమెరికా వైమానిక దళ అధిపతి, జనరల్ డేవిడ్ ఎల్ గోల్డ్‌ఫీన్ చెప్పారు. ప్రపంచంలో పెద్ద వైమానిక దళాలు రెండూ తమ దృష్టిని ఈ ప్రాంతంపై కేంద్రీకరించనున్నాయనీ, సున్నితమైన సముద్ర మార్గాలపై నియమాల ఆధారిత ఉత్తర్వులను పరిరక్షించాలనీ పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో పెరుగుతున్న చైనా సైనిక కార్యకలాపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో గోల్డ్‌ఫీన్ మూడు రోజుల పర్యటన శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పీటీఐ వార్తాసంస్థతో ఆయన మాట్లాడుతూ- అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన చతుర్భుజ సంకీర్ణం... భారత్-అమెరికా సహకారాన్ని మరింత బలపరుస్తుందని చెప్పారు. చైనా ప్రాబల్యానికి గండి కొట్టడానికే ఈ సంకీర్ణాన్ని ఏర్పాటు చేశారా అనే ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... తానూ అలాగే భావిస్తున్నానని చెప్పారు. తన పర్యటన, చర్చలకు అదో ప్రధాన కారణమన్నారు. ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణలో భారతదేశం కీలక వ్యూహాత్మక భాగస్వామిగా నిలుస్తుందని చెప్పారు. దక్షిణ చైనా సముద్రంలో బలగాలను అమెరికా పెంచబోతోందా అనే ప్రశ్నకు ఆయన నేరుగా సమాధానమివ్వలేదు. అలాంటి వ్యూహాలపై తగిన సమయంలో స్పందిస్తామన్నారు.

'హిందుత్వాన్ని' హైజాక్ చేశారు: వెనక్కి తీసుకోవలసిందే!

పుస్తకంలో శశిథరూర్

జైపూర్: 'హిందుత్వం' అనే యోచనను హైజాక్ చేసిన వారి నుంచి దానిని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నేత శశిథరూర్ అభిప్రాయపడ్డారు. సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం 'హిందుత్వాన్ని' దుర్వినియోగం చేస్తున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం హిందువు మాత్రమే అసలుసిసలైన భారతీయుడని పేర్కొనే వారిని చూసి తానేమీ గర్వపడటం లేదని థరూర్ చెప్పారు. హిందూ మతతత్వాన్ని తిరస్కరించిన హిందువులను చూసి గర్వపడుతున్నానన్నారు. 'వై అయాం ఎ హిందూ' అనే పుస్తకాన్ని ఆయన రచించిన విషయం ఈ సందర్భంగా గమనార్హం. హిందూత్వం అనేది ఓ రాజకీయ అజెండాలో భాగమేనన్న విషయం తనకు బాగా అవగతమైందన్నారు. అంతేకాదు, అసలు హిందూత్వం గురించి వ్యతిరేకంగా మాట్లాడే మార్గాన్ని అన్వేషించాలని అభిప్రాయపడ్డారు. ఈ అంశాలే తన పుస్తకానికి మూలమని థరూర్ వెల్లడించారు.

పాక్ కాల్పుల్లో ముగ్గురు జవాన్ల మృతి

జమ్ము: పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణను ఉల్లంఘించింది. జమ్ముకశ్మీర్‌లోని నియంత్రణరేఖ వెంబడి ఉన్న సైనిక శిబిరాలు, జనావాసాలపై ఆదివారం ఆ దేశ సైన్యం కాల్పులకు తెగబడటంతో.. ముగ్గురు భారత జవాన్లు అమరులయ్యారు. మరో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. రాజౌరి జిల్లాలోని భింబెర్ గలి సెక్టార్‌లో ఆదివారం సాయంత్రం పాక్ సైన్యం స్వయంచాలిత ఆయుధాలు, మోర్టార్లతో కాల్పులు జరిపిందని సైనిక అధికారులు తెలిపారు. ఈ ఘటనలోనే ముగ్గురు సైనికులు మృతిచెందినట్లు పేర్కొన్నారు. అయితే పాక్ సేనలకు.. భారత సైన్యం కూడా దీటుగా బదులిచ్చిందని తెలిపారు. మధ్యాహ్నం కూడా పూంచ్, రాజౌరిల్లో పాక్ కాల్పులకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

భారతీయ తల్లీకుమారుల హంతకుల వివరాలు చెబితే బహుమతి

వాషింగ్టన్: వాషింగ్టన్ శివారులో ఇండియన్-అమెరికన్ తల్లీకుమారులను హత్య చేసిన వారి వివరాలు చెప్పేవారికి బహుమతి ఇస్తామని అమెరికా పోలీసులు ప్రకటించారు. ఓ సంస్థలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్న మాలా మన్వానీ (65), ఆమె కుమారుడు రిషి మన్వానీ (32) తమ ఇంట్లోనే హత్యకు గురయ్యారు. సోమవారం నుంచి ఆమె విధులు రావడం లేదని బుధవారం తోటిఉద్యోగులు చెప్పడంతో, పోలీసులు వెళ్లి చూడగా వారి శవాలు కనిపించాయి.

బోఫోర్స్ నివేదికను బడ్జెట్ సమావేశాల్లో ఖరారు చేయనున్న పీఏసీ!

దిల్లీ: బోఫోర్స్ శతఘ్ని ఒప్పందం వ్యవహారాన్ని దాదాపు 27 ఏళ్లుగా పరిశీలిస్తున్న పార్లమెంటరీ సంఘం తన నివేదికను ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ఖరారు చేసే అవకాశం ఉందని సంఘం సభ్యులు వెల్లడించారు. బోఫోర్స్‌పై కాగ్ రూపొందించిన నివేదికే.. ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) పరిశీలనలో ఉన్న అత్యంత పాత నివేదిక. 1989-90లో కాగ్ రూపొందించిన ఈ నివేదికను పీఏసీలో రక్షణ వ్యవహారాల ఉపసంఘం పరిశీలిస్తోంది. సంబంధిత మంత్రిత్వశాఖ, సంబంధిత ప్రభుత్వ సంస్థలు పీఏసీకి చర్యానివేదికలను సమర్పించనందున జాప్యం జరిగింది. పీఏసీ ఉపసంఘం తన నివేదికను ఖరారు చేసిన తర్వాత ప్రధాన సంఘం ఆమోదానికి పంపిస్తుంది. ప్రధాన సంఘానికి కాంగ్రెస్‌కు చెందిన మల్లికార్జున ఖర్గే నేతృత్వం వహిస్తున్నారు. నివేదికలోని కొన్ని భాగాలను కాంగ్రెస్ ఎంపీలు వ్యతిరేకించే అవకాశాలున్నాయి.

వెబ్‌సైట్ నిర్వాహకుని వివరాలు ఇవ్వండి

పాక్‌ను కోరనున్న భారత్

దిల్లీ: భారత్ వ్యతిరేక ప్రచారం కోసం వెబ్‌సైట్ నడుపుతున్న నిర్వాహకుని వివరాలు ఇవ్వాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) పాకిస్థాన్‌ను కోరనుంది. పాక్‌కు అనుకూలంగా వ్యవహరించే హురియత్ కాన్ఫరెన్స్ (సయ్యద్ ఆలీషా గిలానీ వర్గం), ఉగ్రవాద సంస్థ హిజ్బుల్ ముజాహదీన్ మద్దతుగా జకీర్ ఉల్లా అనే వ్యక్తి ఈ వెబ్‌సైట్‌ను నడుపుతున్నాడు. అతడి సమాచారం పంపాలంటూ న్యాయస్థానం ద్వారా లెటర్ రాగేటరీ పంపాలని భావిస్తోంది.

అమెరికాలో రైలు ప్రమాదం.. ఇద్దరి మృతి

వాషింగ్టన్: అమెరికాలోని దక్షిణ కరోలినా రాష్ట్రంలోని సైసే వద్ద ఆదివారం రెండు రైళ్లు ఢీకొని ఇద్దరు మృతి చెందారు. మరో 70 మంది గాయపడ్డారు. ప్రయాణికులతో వెళ్తున్న రైలు, గూడ్సును ఢీకొనడంతో ఈ దుర్ఘటన సంభవించింది. ఈ ప్రమాదం అనంతరం ప్రయాణికుల రైలు ఇంజను, కొన్ని బోగీలు పట్టాలు తప్పి బోల్తా పడ్డాయి.

మొరాకో వద్ద 20 మంది వలసదారుల మృతదేహాలు

మ్యాడ్రిడ్: మధ్యధరా సముద్రంలో జలసమాధి అయిన వలసదారుల్లో 20 మంది మృతదేహాలను మొరాకో సహాయ సిబ్బంది వెలికి తీశారు. మొరాకో ప్రాదేశిక జలాల్లో ఈ మృతదేహాలను స్పెయిన్‌కు చెందిన ఒక నౌక గుర్తించింది. ఈ వలసదారులు ఐరోపా చేరుకునేందుకు పశ్చిమ మధ్యధరా సముద్రం మార్గంలో పడవల్లో ప్రయాణిస్తున్నారు. అవి బోల్తాపడి జలసమాధి అవుతున్నారు. ఈ ఏడాది 243 మంది మరణించడమో, గల్లంతు కావడమో జరిగిందని అంతర్జాతీయ వలస సంస్థ పేర్కొంది.



కటక్ బాదంబాడి ప్రాంతంలో ఆదివారం ఉదయం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఒక షాపింగ్‌మాల్‌తో పాటు హోటల్, మరికొన్ని షాపులు దగ్ధమయ్యాయి. రూ. కోట్లలో ఆస్తి నష్టం సంభవించినట్లు సమాచారం. బాదంబాడిలో ఉన్న సిటీ స్టైల్ షాపింగ్‌మాల్‌లో తొలుత మంటలు లేచాయి. మంటల తీవ్రత పెరిగి మాల్ పక్కనున్న హోటల్, గీతా ఫ్యాషన్ షాపింగ్‌మాల్‌కు విస్తరించాయి. హోటల్ పూర్తిగా మంటల్లో చిక్కుకుంది. 8 అగ్నిమాపక వాహనాలు, 100 మంది సిబ్బంది 4 గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.

– న్యూస్‌టుడే కటక్(ఒడిశా)



ఆ రెండు పరుగుల కోసం

భారత్ విజయానికి ఇంకో రెండు పరుగులే చేయాలి. ఇంకొక్క బంతి పడినా మ్యాచ్ ముగిసిపోవచ్చు. మహా అయితే ఒక ఓవర్ పట్టొచ్చు. కానీ అంపైర్లు మాత్రం ఆటను కొనసాగించకుండా భోజన విరామం ప్రకటించారు. అంతే.. మైదానంలో ఉన్న ఆటగాళ్లు, ప్రేక్షకులు, వ్యాఖ్యాతలే కాదు.. టీవీల ముందున్న కోట్లాది మంది అభిమానులూ షాక్ తిన్నారు. అంపైర్లకు మతి పోయిందా అంటూ తిట్టుకున్నారు. ఐతే నిబంధనలా ఉంటే మేమేం చేస్తామన్నది అంపైర్ల మాట! ఐసీసీ నిబంధనల ప్రకారం వన్డే మ్యాచ్‌లో ఒక ఇన్నింగ్స్ పూర్తయ్యాక భోజన విరామం ఉంటుంది. ఇన్నింగ్స్ త్వరగా ముగిస్తే.. 50 ఓవర్లకు పట్టే సమయం తర్వాత విరామం ఇస్తారు. ఆదివారం దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 32.2 ఓవర్లలోనే ముగిసిపోయిన నేపథ్యంలో వెంటనే భారత్ బ్యాటింగ్ మొదలైపోయింది. 15 ఓవర్లు అయ్యేసరికి భోజన విరామ సమయం వచ్చేసింది. అప్పటికి భారత్ స్కోరు 93/1. విజయానికి ఇంకో 26 పరుగులే చేయాల్సి ఉండటంతో అంపైర్లు ఆటను పొడిగించారు. తర్వాతి 4 ఓవర్లలో 24 పరుగులొచ్చాయి. ఇంకో 2 పరుగులు చేస్తే మ్యాచ్ అయిపోతుంది. ఐతే అప్పటికే నిర్ణీత సమయం కంటే అదనంగా 15 నిమిషాలు కావడంతో అంపైర్లు ఆటను ఆపేసి విరామం ప్రకటించారు. అది చూసి కెప్టెన్ కోహ్లి నిర్ఘాంతపోయినట్లు ముఖం పెట్టాడు. దక్షిణాఫ్రికా ఆటగాళ్లూ ఆశ్చర్యపోయారు. నిబంధనలు ఎలా ఉన్నప్పటికీ అంపైర్లు స్వేచ్ఛ తీసుకోవాల్సిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ రెండు పరుగుల లాంఛనం కోసం ఇంకో ముప్పావుగంట ఎదురు చూడాల్సి వచ్చింది.

4

గత ఆరు నెలల్లో మేజర్ టోర్నీ ఫైనల్స్‌లో సింధుకు ఇది నాలుగో ఓటమి. నిరుడు ప్రపంచ ఛాంపియన్‌షిప్, హాంకాంగ్ ఓపెన్, దుబాయ్ సూపర్ సిరీస్ ఫైనల్స్‌లో ఆమె పరాజయం పాలైంది.

గిర్రున తిప్పేశారు

చాహల్, కుల్‌దీప్ మాయలో దక్షిణాఫ్రికా విలవిల



కుల్‌దీప్ 3/20

- 118కే కుప్పకూలిన ఆతిథ్య జట్టు
- రెండో మ్యాచ్‌లో భారత్ ఘనవిజయం
- వన్డేల్లో నం.1 స్థానానికి కోహ్లీసేన

ఎంత మాయ చేశారు.. ఎంత తిప్పేశారు.. ఎంత భయపెట్టారు?

మన స్పిన్ జోడీ అబ్బురపరిచే మణికట్టు మాయాజాలనికి ఎవరైనా వారెవ్వా అనాల్సిందే.

వాళ్లిద్దరు గిర్రున తిప్పేస్తుంటే సఫారీ బ్యాట్స్‌మెన్‌కు పరుగులు చేయడం సరికదా కనీసం క్రీజులో నిలవడమే గగనమైపోయింది. సొంత పిచ్‌పైనే దక్షిణాఫ్రికాకు పీడకల. ఏనాడూ ఎరగని ఘోర పరాభవం.

సెంచూరియన్‌లో ఓ అరుదైన దృశ్యం. స్పిన్ ద్వయం చాహల్, కుల్‌దీప్ మణికట్టుతో విజృంభిస్తుంటే భారత్ సొంతగడ్డపై ఆడుతుందా అనిపించింది. స్పిన్ మాయాజాలానికి అంతలా విలవిల్లాడింది ఆతిథ్య జట్టు. మెలికల బంతుల్ని అర్థం చేసుకోలేక, పిచ్‌ను అంచనా వేయలేక, డిఫెన్స్ ఆడలేక, షాట్లు కొట్టలేక గిలగిలా కొట్టుకున్న దక్షిణాఫ్రికా బ్యాటింగ్ దళం దాసోహమంది. తమ వన్డే చరిత్రలోనే సొంతగడ్డపై అత్యంత చెత్త ప్రదర్శన చేసింది. సిరీస్‌లో భారత్ 2-0.

అన్ని రంగాల్లోనూ తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన టీమ్‌ఇండియా రెండో వన్డేలో ఆతిథ్య దక్షిణాఫ్రికాను 9 వికెట్ల తేడాతో చిత్తు చిత్తుగా ఓడించింది. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరడం బోనస్. సఫారీ గడ్డపై వన్డేల్లో ఐదు వికెట్ల ఘనత సాధించిన తొలి భారత స్పిన్నర్‌గా యుజ్వేంద్ర చాహల్ రికార్డు సృష్టించడం మరో విశేషం.

సెంచూరియన్

మరింత కసిగా చెలరేగిన టీమ్ ఇండియాకు మరో ఘనవిజయం. సూపర్‌ఫామ్‌లో ఉన్న కోహ్లీసేన ఆదివారం అత్యంత ఏకపక్షంగా సాగిన రెండో వన్డేలో 9 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను మట్టికరిపించింది. ఒక్క ఇన్నింగ్స్ సమయానికే మొత్తం మ్యాచ్‌ను ముగించింది. భారత మణికట్టు స్పిన్నర్లు చాహల్ (5/22), కుల్‌దీప్ (3/20) తిప్పుడుకు తిప్పలు పడ్డ ఆతిథ్య జట్టు మొదట 32.3 ఓవర్లలో 118 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై వన్డే క్రికెట్లో దక్షిణాఫ్రికాకు ఇదే అత్యల్ప స్కోరు. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 20.3 ఓవర్లలో ఒకే వికెట్ చేజార్చుకుని అలవోకగా ఛేదించింది. శిఖర్ ధావన్ (51 నాటౌట్; 56 బంతుల్లో 9×4), విరాట్ కోహ్లి (46 నాటౌట్; 50 బంతుల్లో 4×4, 1×6) బ్యాట్ ఝుళిపించారు.

గిర గిర బంతులతో..: ఈ మ్యాచ్‌ను ఇక దక్షిణాఫ్రికా ఇప్పట్లో మరిచిపోలేదు. తమ స్పిన్ బలహీనతలను భారత స్పిన్నర్లు బట్టబయలు చేసిన తీరును జీర్ణించుకోవడం ఆ జట్టుకు కష్టమే. కీలక బ్యాట్స్‌మెన్ డివిలియర్స్, డుప్లెసిస్ గాయాల కారణంగా మ్యాచ్‌కు దూరం కావడం కూడా ఆ జట్టును దెబ్బతీసింది. కోహ్లి టాస్ గెలిచి దక్షిణాఫ్రికాకు బ్యాటింగ్ అప్పగించగా.. అచ్చం భారత వికెట్లను తలపించిన సెంచూరియన్ పిచ్‌పై చాహల్, కుల్‌దీప్‌ల స్పిన్ జోడీ చెలరేగిపోయింది. 14.2 ఓవర్లలో 42 పరుగులిచ్చి 8 వికెట్లు పడగొట్టింది. కెరీర్‌లో తొలిసారి ఐదు వికెట్లు పడగొట్టిన చాహల్.. ఆశిష్ నెహ్రా (6/23, ఇంగ్లాండ్‌పై) తర్వాత దక్షిణాఫ్రికా గడ్డపై ఆ ఘనత సాధించిన రెండో భారత బౌలర్‌గా నిలిచాడు. అంతేకాదు.. దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికాపై ఐదు వికెట్ల ఘనత సాధించిన తొలి స్పిన్నర్ కూడా అతడే. నిజానికి ఆతిథ్య జట్టు ఆరంభం ఘోరంగా ఏమీ లేదు. ఇన్నింగ్స్ ఆరంభించిన ఆమ్లా (23) డికాక్ (20).. 9 ఓవర్లు పూర్తయ్యేసరికి వికెట్ పడనివ్వకుండా 35 పరుగులు చేశారు. కానీ పదో ఓవర్లో ఆమ్లాను భువనేశ్వర్ ఔట్ చేయడంతో మొదలైంది పతనం. ఆ తర్వాత జోరంతా స్పిన్నర్లదే. స్లో టర్న్‌తో సహకరిస్తున్న పిచ్‌పై చాహల్, కుల్‌దీప్ విజృంభిస్తుంటే పతనం ఏ దశలోనూ ఆగలేదు. ఆమ్లా నిష్క్రమణ తర్వాత డికాక్ ఎంతోసేపు నిలువలేకపోయాడు. డికాక్ (20)ను ఔట్ చేయడం ద్వారా చాహల్ తన రెండో ఓవర్లోనే దక్షిణాఫ్రికాను దెబ్బతీశాడు. అప్పటికి స్కోరు 51. తర్వాతి ఓవర్లోనే బౌలింగ్‌కు దిగిన కుల్‌దీప్ యాదవ్ రెండు కీలక వికెట్లతో దక్షిణాఫ్రికాను మరింత కష్టాల్లోకి నెట్టాడు. అతడు తన తొలి బంతికే వికెట్ పడగొట్టాడు. డుప్లెసిస్ గైర్హాజరీలో కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న మార్‌క్రమ్ (8).. భారీ షాట్ ఆడబోయి డీప్ మిడ్‌వికెట్లో భువనేశ్వర్‌కు చిక్కాడు. తర్వాత ముందుకొచ్చి డ్రైవ్ చేయబోయిన మిల్లర్ (0) స్లిప్‌లో రహానె చేతికి చిక్కాడు. 12 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా 51/4కు చేరుకుంది. ఒకే స్కోరు వద్ద మూడు వికెట్లు చేజార్చుకున్న జట్టును డుమిని (25), జొండొ (25) కాస్త ఆదుకున్నారు. వికెట్ల పతనాన్ని ఆపి, ఇన్నింగ్స్‌ను కాస్త కుదుటపరిచారు. కానీ బలపడుతున్న ఈ భాగస్వామ్యాన్ని (48) చాహల్ విడదీయడంతో పతనం తిరిగి మొదలై.. ఇన్నింగ్స్ ముగిసే వరకు ఆగలేదు. చాహల్ విజృంభించడంతో 19 పరుగులకే దక్షిణాఫ్రికా చివరి ఆరు వికెట్లు చేజార్చుకుంది. చాహల్ వరుస ఓవర్లలో జొండొ, డుమినిలను వెనక్కి పంపాడు. తర్వాత ఇన్నింగ్స్ ముగియడానికి ఎంతో సమయం పట్టలేదు. తేలికైన లక్ష్యాన్ని భారత్ అత్యంత తేలిగ్గా ఛేదించింది. రబాడ పదునైన బౌన్సర్‌కు రోహిత్ శర్మ (15) త్వరగానే ఔటైనా.. ధావన్, కోహ్లి ధాటిగా బ్యాటింగ్ చేశారు. అభేద్యమైన రెండో వికెట్‌కు 93 పరుగులు జోడించి, లాంఛనాన్ని ముగించారు.



5/22

చాహల్ గణాంకాలు. దక్షిణాఫ్రికాలో దక్షిణాఫ్రికాపై ఓ స్పిన్నర్‌కు ఇదే అత్యుత్తమ ప్రదర్శన

'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' చాహల్

"పిచ్ కొంచెం పొడిగా, గట్టిగా ఉంటే చాలు, మా మణికట్టు స్పిన్నర్లు ఏ వేదికలో అయినా బంతిని తిప్పగలరు. దక్షిణాఫ్రికాకు వాళ్లు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. మొదట బ్యాటింగ్ చేయడం కంటే ఛేదన మాకు సౌకర్యంగా ఉంటుంది" – కోహ్లి

118

సొంతగడ్డపై దక్షిణాఫ్రికాకు ఇదే అత్యల్ప స్కోరు. ఇంతకుముందు 119. 2009లో ఇంగ్లాండ్‌పై ఈ స్కోరు చేసింది

"నేనెప్పుడూ వికెట్ల కోసమే ప్రయత్నిస్తా. అందుకే బంతిని గాల్లోంచి దింపుతా. దాని వల్ల సిక్స్ కొట్టే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అయినా పర్వాలేదు. కెప్టెన్, జట్టు యాజమాన్యం మనపై నమ్మకముంచినపుడు అలా చేయడానికి ఆత్మవిశ్వాసం వస్తుంది. బ్యాట్స్‌మెన్ షాట్లు ఆడతారని భయపడితే మన బలానికి తగ్గట్లు ఆడలేం. వికెట్లు తీయడమే నా బలం. అందుకే జట్టులో ఉన్నా" – చాహల్

1

వన్డేల్లో ప్రస్తుతం టీమ్ ఇండియా ర్యాంకు. సిరీస్‌ను గెలిస్తే నంబర్‌వన్ ర్యాంక్ నిలుస్తుంది.

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: ఆమ్లా (సి) ధోని (బి) భువనేశ్వర్ 23; డికాక్ (సి) పాండ్య (బి) చాహల్ 20; మార్‌క్రమ్ (సి) భువనేశ్వర్ (బి) కుల్‌దీప్ 8; డుమిని ఎల్బీ (బి) చాహల్ 25; మిల్లర్ (సి) రహానె (బి) కుల్‌దీప్ 0; జొండొ (సి) పాండ్య (బి) చాహల్ 25; మోరిస్ (సి) భువనేశ్వర్ (బి) చాహల్ 14; రబాడ ఎల్బీ (బి) కుల్‌దీప్ 1; మోర్నీ ఎల్బీ (బి) చాహల్ 1; తాహిర్ (బి) బుమ్రా 0; శంసి నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 1 **మొత్తం:** (32.2 ఓవర్లలో ఆలౌట్) **118; వికెట్ల పతనం:** 1-39, 2-51, 3-51, 4-51, 5-99, 6-107, 7-110, 8-117, 9-118; **బౌలింగ్:** భువనేశ్వర్ 5-1-19-1; బుమ్రా 5-1-12-1; పాండ్య 5-0-34-0; చాహల్ 8.2-1-22-5; కుల్‌దీప్ 6-0-20-3; కేదార్ 3-0-11-0

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) మోర్కెల్ (బి) రబాడ 15; ధావన్ నాటౌట్ 51; కోహ్లి నాటౌట్ 46; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (20.3 ఓవర్లలో వికెట్ నష్టానికి) **119; వికెట్ల పతనం:** 1-26; **బౌలింగ్:** మోర్నీ మోర్కెల్ 4-0-30-0; రబాడ 5-0-24-1; మోరిస్ 3-0-16-0; ఇమ్రాన్ తాహిర్ 5.3-0-30-0; శంసి 3-1-18-0



సింధుకు చుక్కెదురు

- హోరాహోరీ ఫైనల్లో ఓటమి
- ఇండియా ఓపెన్ విజేత బీవెన్

దిల్లీ

మరో పాయింటు గెలిస్తే ఇండియా ఓపెన్ మళ్లీ సింధుదే..! ఇలాంటి ఉత్కంఠభరిత మ్యాచ్‌లు గెలిచిన అనుభవం ఆమెది. కానీ ఈసారి మాత్రం నిరాశ తప్పలేదు. ఇండియా ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పి.వి.సింధుకు చుక్కెదురైంది. సొంతగడ్డపై ఇండియా ఓపెన్ టైటిల్ నిలబెట్టుకోవాలనుకున్న ఆమె ఆశలపై అమెరికా క్రీడాకారిణి బీవెన్ జాంగ్ నీళ్లు చల్లింది. ఆదివారం హోరాహోరీ సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సింధు 18-21, 21-11, 20-22తో బీవెన్ చేతిలో పోరాడి ఓడింది.

గంటా 9 నిమిషాల పోరులో సింధు, జాంగ్ నువ్వానేనా అన్నట్లు తలపడ్డారు. కిక్కిరిసిన స్టేడియంలో భారీ అంచనాల మధ్య ఫేవరెట్‌గా బరిలో దిగిన సింధు స్థాయికి తగ్గట్లు ఆడటంలో విఫలమైంది! తీరిక లేని షెడ్యూల్ లేదా మరో కారణమో గానీ సింధు తొందరగా అలసిపోయినట్లు కనిపించింది. సుదీర్ఘ ర్యాలీలు ఎక్కువగా ఉండటం కూడా అందుకు కారణమే. తొలుత వెనకబడినా ఆ తర్వాత సింధు పుంజుకోవడంతో మ్యాచ్‌లో ఆధిపత్యం చేతులు మారుతూ వచ్చింది. తొలి గేమ్‌లో ఒకదశలో 15-14తో సింధు ముందంజలో ఉంది. ఐతే వరుసగా 3 పాయింట్లతో ప్రత్యర్థి 17-15తో ముందుకెళ్ళింది. ఒక పాయింటుతో సింధు ప్రత్యర్థి ఆధిక్యాన్ని 16-17కు తగ్గించింది. ఈ సమయంలో తొలుత జాంగ్.. తర్వాత సింధు రెండేసి పాయింట్లు సాధించారు. అయినా 19-18తో గేమ్ ప్రత్యర్థి పక్షం వైపే ఉంది. చివరికి 21-18తో తొలి గేమ్ ప్రత్యర్థి సొంతమైంది. రెండో గేమ్‌లో సింధు చెలరేగింది. దూకుడుగా ఆడుతూ జాంగ్‌ను ఆత్మరక్షణలోకి నెట్టింది. వరుసగా పాయింట్లు రాబడుతూ 11-4తో ఆధిక్యంలోకి దూసుకెళ్ళింది. జాంగ్ అడపాదడపా పాయింట్లు గెలిచినా సింధును సమీపించలేకపోయింది. మరింత దూకుడుగా ఆడిన సింధు 21-11తో రెండో గేమ్ దక్కించుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఇద్దరూ సమానంగా తలపడ్డారు. మొదట్లో ప్రత్యర్థే కాస్త ఆధిపత్యం కనబరిచింది. బాగా అలసిపోయిన సింధు శక్తినంత కూడదీసుకుని ఆడింది. 15 పాయింట్ల వరకు స్కోర్లు సమమవుతూ వచ్చాయి. స్మాష్‌లతో విజృంభించిన జాంగ్ 19-17తో ముందంజ వేసింది. సింధు కూడా స్మాష్‌లతో చెలరేగి 19-19తో పాయింట్లను సమం చేసింది. ప్రత్యర్థి షటిల్‌ను బయటకు ఆడటంతో 20-19తో సింధు మ్యాచ్ పాయింటుకు చేరువైంది. ఐతే సింధు అనవసర తప్పిదంతో 20-20తో పాయింట్లు సమమయ్యాయి. తర్వాతి షాట్‌ను స్మాష్‌గా మలిచిన జాంగ్ 21-20తో మ్యాచ్ పాయింటుకు దగ్గరైంది. ఏకాగ్రత కోల్పోయిన సింధు షటిల్‌ను బయటకు ఆడటంతో 22-20తో మూడో గేమ్, మ్యాచ్ ప్రత్యర్థి సొంతమయ్యాయి. నిరుడు విజేతగా నిలిచిన సింధు.. ఈసారి రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.



బీవెన్ జాంగ్

ఐసీసీ అండర్-19 జట్టులో ఐదుగురు భారత కుర్రాళ్లు



దుబాయ్: అండర్-19 ప్రపంచకప్‌లో అదరగొట్టిన ఐదుగురు భారత కుర్రాళ్లకు ఐసీసీ జట్టులోనూ ప్రాధాన్యం దక్కింది. ఆదివారం ఐసీసీ ప్రకటించిన అండర్-19 ప్రపంచకప్ జట్టులో భారత కుర్రాళ్లు ఐదుగురు చోటు దక్కించుకున్నారు. 5 ఇన్నింగ్స్‌ల్లో 261 పరుగులు చేసిన కెప్టెన్ పృథ్వీ షాతో పాటు అతడి ఓపెనింగ్ భాగస్వామి, ఫైనల్లో 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అందుకున్న మన్‌జోత్ కల్రా (252 పరుగులు).. 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' శుభ్‌మన్ గిల్ (372 పరుగులు) ఈ జట్టుకు ఎంపికయ్యారు. బౌలర్లలో స్పిన్నర్ అనుకుల్ రాయ్ (14 వికెట్లు), పేసర్ కమ్లేష్ నాగర్‌కోటి (9 వికెట్లు)లకు చోటు దక్కింది. రేనార్డ్ (దక్షిణాఫ్రికా) కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. మాజీ క్రికెటర్లు బిషప్, అంజుమ్ చోప్రా, జెఫ్ క్రో, టామ్ మూడీలతో పాటు పాత్రికేయుడు శశాంక్ కిశోర్ ఈ జట్టును ఎంపిక చేసిన బృందంలో ఉన్నారు.

బంగ్లా-లంక తొలి టెస్టు డ్రా

చిట్టగాంగ్: పరుగుల వరద పారిన బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య తొలి టెస్టు డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో భారీ శతకం (176) సాధించిన మొమినుల్ హక్ రెండో ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ (105; 174 బంతుల్లో 5×4, 2×6)తో సత్తాచాటడంతో బంగ్లా డ్రాతో బయటపడింది. 119 పరుగులు వెనకబడి ఓవర్‌నైట్ స్కోరు 81/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా మ్యాచ్ ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 307 (5 వికెట్లకు) పరుగులు చేసింది. లిటన్ దాస్ (94; 182 బంతుల్లో 11×4), తమీమ్ ఇక్బాల్ (41) రాణించారు. లంక స్పిన్నర్ హెరాత్ రెండు వికెట్లు తీశాడు. మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లా 513 పరుగులు చేయగా.. లంక 713/9 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

ఇక అమ్మాయిల సవాల్

నేడే దక్షిణాఫ్రికాతో భారత్ తొలి వన్డే

కింబర్లీ (దక్షిణాఫ్రికా): అటు భారత పురుషుల జట్టు సఫారీ పర్యటనలో అదరగొడుతుంటే ఇటు మహిళల జట్టు కూడా సమరానికి సిద్ధమైంది. దక్షిణాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో మిథాలీ సేన పోటీపడనుంది. సోమవారమే తొలి వన్డే. ఐసీసీ మహిళల ఛాంపియన్‌షిప్ తొలి రౌండ్ పోరులో భాగంగా ఈ సిరీస్ జరుగుతుంది. భారత్-దక్షిణాఫ్రికా మధ్య తొలి వన్డేకు కింబర్లీ వేదికగా నిలువనుంది. ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన ఏడు నెలల విరామం తర్వాత భారత అమ్మాయిల జట్టు తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్ ఆడబోతోంది. ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాతో ఆడిన మ్యాచ్‌లో భారత్ 115 పరుగుల తేడాతో ఓడిపోయింది.

బీసీసీఐ వెబ్‌సైట్ ఆగింది!



ముంబయి: ప్రపంచంలోనే ధనిక బోర్డు అయిన బీసీసీఐ వెబ్‌సైట్ తాత్కాలికంగా ఆగిపోయింది. ఆదివారం 12 గంటలు పైగా ఈ సైట్ పని చేయలేదు. దీనికి కారణం బీసీసీఐ.టీవీ వెబ్‌సైట్ డొమైన్‌ను పునరుద్ధరించుకోవడంలో బోర్డు విఫలం కావడమే. 2006 ఫిబ్రవరి 2 నుంచి 2018 ఫిబ్రవరి 2 వరకు డొమైన్ చెల్లుబాటులో ఉంది. ఫిబ్రవరి 3లోగా దీన్ని పునరుద్ధరించివుంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనసాగేది. అయితే వెబ్‌సైట్ పునరుద్ధరణ గురించి, ఆగిపోయిన సంగతిని బీసీసీఐ ఆలస్యంగా గుర్తించింది. అసలు విషయం ఏమిటంటే ఈ సైట్ ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీకి చెందిన మోదీ ఎంటర్‌ప్రైజెస్ పేరిట ఉంది. డొమైన్ పునరుద్ధరణను ఎవరూ పట్టించుకోకపోవడంతో కొన్ని గంటల పాటు ఇది వేలానికి కూడా వెళ్లింది. వెంటనే తేరుకున్న బీసీసీఐ డొమైన్‌ను పునరుద్ధరించింది.

తడోది అటవీప్రాంతంలో పులి మృతి

- **పది రోజుల్లో రెండు పులులు..**
- **పరస్పర ఘర్షణే కారణమని అనుమానం**

బల్లార్ష – న్యూస్‌టుడే: రెండు పులులు పరస్పరం ఘర్షణ పడి తీవ్ర గాయాలపాలైన నేపథ్యంలో శనివారం మరో పులి మృతదేహం మహారాష్ట్రలోని తడోది అటవీ ప్రాంతంలో కనిపించింది. ఇది ఆడపులి. చంద్రపూర్ జిల్లాలోని బ్రహ్మపురి అటవీ విభాగపు పరిధిలోని తడోది బాలాపూర్ అటవీ ఉపక్షేత్రంలోని గంగాపూర్ హోటి ప్రాంతంలో శనివారం దుర్గంధం రావడంతో గస్తీ తిరుగుతున్న వనరక్షకులు వి.ఎన్.బండేకర్, రాత్రి కాపలాదారు ఆనంద్‌రావు కామ్డే పరిసరాలనుపరిశీలించగా పులి మృతదేహం కనిపించింది. బహ్మపురి ఉప వన సంరక్షకులు హెచ్.ఇ.వాకడే, నాగపూర్ విభాగపు ఉప వనసంరక్షకులు హేమంత్ కామ్డే, తడోది బాలాపూర్ వన సంరక్షకులు అభిలాష్ సోన్‌టక్కే, పశు వైద్యాధికారి పులి కళేబరం ఉన్న స్థలానికి చేరుకొన్నారు. దాని దేహంపై గాయాలను గుర్తించారు. ఇది 8 రోజుల క్రితమే మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. గత నెల 23న మహారాష్ట్ర సిందేవాహ వనపరిక్షేత్రంలోని డోంగర్‌గావ్ బీట్‌లోని చార్‌గావ్‌కు 2కిలోమీటర్ల దూరంలో రెండు పులుల మధ్య జరిగిన దాడిలో ఓ పులి మృతి చెందిన విషయం తెలిసిందే. నాడు ఘర్షణ పడ్డ పులులు ఇవే అయి ఉంటాయని, ఘర్షణలో గాయాలపాలై ఈ రెండో పులి రెండు, మూడు రోజుల అనంతరం మృతిచెంది ఉంటుందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షల అనంతరం మృతికి గల కారణాలువెలుగులోకి రానున్నాయని తెలిపారు. పరిశీలన అనంతరం పులి కళేబరాన్ని గంగాపూర్ హోటీలోని ఉద్యానవనానికి తరలించారు.



అడవిలో కనిపించిన పులి కళేబరం

గ్రామీణ జీవన అవలోకన!

ఐఐటీ-గాంధీనగర్ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం

అహ్మదాబాద్: గాంధీనగర్‌లోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'(ఐఐటీ-జీఎన్) విద్యార్థులకు గ్రామీణ భారతావని జీవనశైలిని తెలియచేసేందుకు సరికొత్త కార్యక్రమాన్ని ఇటీవలే ప్రారంభించారు. ఇప్పటికే 'గ్రామ్ ఫెలోషిప్' అనే ఈ కార్యక్రమం కింద అర్హులైన ఐఐటీ విద్యార్థులు కొందరు గ్రామాల్లో మూడు నుంచి ఎనిమిది వారాలపాటు నివసించి సరికొత్త అనుభవాలను మూటగట్టుకున్నారు. గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య ఉన్న అంతరాన్ని తొలగించాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఐఐటీ-జీఎన్ విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్. జైసన్ మాన్‌జాలే తెలిపారు.

ఒక్కమాటలో చెప్పాలంటే విద్యార్థులంతా కూడా గ్రామీణ జీవన సౌందర్యాన్ని ఆస్వాదించాలనీ... అక్కడి సాధకబాధకాలను స్వయంగా చూడాలన్నదే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఇదో ప్రాజెక్టు కాదు...ఓ అనుభవం అని వివరించారు. ఈ కార్యక్రమం కింద విద్యార్థులంతా కూడా నాన్-ఏసీ రైలు...లేదా బస్సుల్లో తమకు నిర్దేశించిన గ్రామానికి వెళ్లాలి. ఎంపికైన ప్రతివిద్యార్థి రూ. 36వేలతో కనీసం ఆరురాష్ట్రాల్లో పల్లెల్లో గడపాలి. ఇది జీవితంపై తమ దృక్పథాన్నే మార్చేసిందని పలువురు విద్యార్థులు తెలిపారు.

జవాన్ అపహరణ.. హత్య

- **ఛత్తీస్‌గఢ్‌లో పేట్రేగిన మావోయిస్టులు**

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టులు పేట్రేగిపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు విధానాలను నిరసిస్తూ దండకారణ్యంతోపాటు మావోయిస్టులు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చారు. ఈనేపథ్యంలో శనివారం రాత్రి బీజాపూర్ జిల్లాలో భూపాలపట్నం నుంచి వస్తున్న బస్సును గోట్ల అటవీ ప్రాంతంలో తగులబెట్టారు. అందులో ప్రయాణిస్తున్న జవాన్ సీతారాంను అపహరించుకుపోయారు. ఆదివారం తెల్లవారుజామున జవాన్‌ను హత్య చేసి..అపహరించిన చోటే మృతదేహాన్ని పడేశారు. ఇదే జిల్లాలోని మద్దేడు పోలీసుస్టేషన్ పరిధిలోని కోగుపల్లి అటవీ ప్రాంతంలో రహదారి పనులకు సంబంధించిన వాహనాలను దహనం చేశారు. పర్సెగూడా నుంచి బీజాపూర్ వరకు నిర్మిస్తున్న రహదారి పనుల్లో వినియోగిస్తున్న వాహనాలకు నిప్పుపెట్టారు. దంతెవాడ జిల్లాలోనూ ఓ జీపును తగలబెట్టారు. మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లో పెద్దఎత్తున పోలీసు బలగాలు కూంబింగ్ చేపడుతున్నాయి.



మావోయిస్టులు దహనం చేసిన బస్సు

'నో-డిటెన్షన్' వల్ల అంతగా నష్టమేమీ జరగలేదు

ఐఐఎమ్ అధ్యయనం వెల్లడి

దిల్లీ: పాఠశాలల్లో ఎనిమిదో తరగతి వరకూ చదువుతున్న విద్యార్థులను.. ఉత్తీర్ణతతో నిమిత్తం లేకుండా పైతరగతికి పంపించే (నో-డిటెన్షన్) విధానంతో పెద్దగా నష్టమేమీ జరగలేదని ఐఐఎమ్-అహ్మదాబాద్ పరిశోధకుల అధ్యయనం తేల్చింది. ఈ విధానాన్ని రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైన నేపథ్యంలో.. నూతన విద్యావిధానం రూపొందిస్తున్న పార్లమెంటు సంఘం, స్థాయీసంఘాలకు ఈ అధ్యయన నివేదికను పరిశోధకులు సమర్పించారు. నో-డిటెన్షన్ విధానంతో విద్యార్థుల ప్రతిభపై ప్రతికూల ప్రభావం పడుతోందని కొన్ని పరిశోధనలు తేల్చాయి. ఒక వేళ డిటెన్షన్ అమలుచేస్తే విద్యార్థుల ప్రతిభ అదే స్థాయిలో ఉండటం గానీ, మరింత మెరుగవడం గానీ జరగొచ్చని.. అయితే డిటెన్షన్ లేకపోవడం వల్ల మాత్రం వారి అభ్యాస స్థాయిలు పడిపోవట్లేదని ఐఐఎమ్ అధ్యయనం పేర్కొంది. 5, 8వ తరగతుల విద్యార్థులను డిటెన్షన్ చేసేందుకు రాష్ట్రాలను అనుమతించే సవరణ బిల్లును గతేడాది కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. నో-డిటెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే ఇదివరకే ప్రకటించారు.

సైనిక పాఠాలను అర్థం చేసుకునే రోబోలు

కృత్రిమ మేధస్సును అభివృద్ధి చేస్తున్న పరిశోధకులు

వాషింగ్టన్: సైనికపరమైన విధుల నిర్వర్తనపై శిక్షకుడు పాఠాలు చెబుతుంటే.. అర్థం చేసుకుని, నేర్చేసుకునే రోబోలు, కంప్యూటర్ ప్రోగ్రామ్‌లు రాబోతున్నాయి. ఇందుకోసం అవసరమైన కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)ను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేస్తున్నారు. దీంతో మనుషులు చెప్పే అభిప్రాయాలు, విమర్శలను రోబోలు అర్థం చేసుకుని.. మరింత మెరుగ్గా పనులను చేయడమెలాగో నేర్చుకుంటాయి. అమెరికా సైన్యం, టెక్సాస్ విశ్వవిద్యాలయాల్లోని పరిశోధకులు కలిసి ఈ సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం డీప్‌టేమర్ అనే అల్గారిథమ్‌ను వారు రూపొందించారు. ఓ వీడియో గేమ్‌ను ఆడటంపై.. డీప్‌టేమర్ ద్వారా రోబోకు శిక్షణనిచ్చారు. దానికి 15 నిమిషాలపాటు శిక్ష కుడి అభిప్రాయాలను వినిపించారు. అనంతరం రోబో మనుషుల కన్నా మెరుగ్గా ఆ వీడియో గేమ్‌ను ఆడగలిగింది. వచ్చే రెండేళ్లలో వాస్తవిక ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లకు సంబంధించిన వాతావరణంలో ఈ సాంకేతికత పనితీరును పరిశీలిస్తామని పరిశోధకులు చెప్పారు.

ప్రచ్ఛన్న యుద్ధతత్వాన్ని వీడండి

- **అణ్వస్త్రాలపై పెంటగాన్ నివేదికను తప్పుపట్టిన చైనా**

బీజింగ్: ప్రచ్ఛన్న యుద్ధ తత్వాన్ని అమెరికా విడనాడాలని చైనా హితవు పలికింది. తమ సైనిక అభివృద్ధిపై నిష్పాక్షిక దృష్టితో చూడాలని సూచించింది. ఆసియాలో అమెరికా ప్రయోజనాలకు చైనా ప్రధాన సవాల్‌గా నిలుస్తోందంటూ పెంటగాన్ రెండ్రోజుల క్రితం వెలువరించిన నివేదికను చైనా ఆదివారం తప్పుపట్టింది. అణ్వాయుధాలపై సమీక్షిస్తూ అమెరికా చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. చైనా అభివృద్ధిపై లేనిపోనివి ఊహించుకుని అహంకారపూరితంగా అమెరికా ఈ పత్రాన్ని రూపొందించిందని చైనా రక్షణ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రెన్ గుయోఖియాంగ్ ఆక్షేపించారు. అణు నిరాయుధీకరణపై అమెరికా తనకున్న ప్రత్యేక, ప్రాథమిక బాధ్యతను నిర్వర్తించాలనీ, చైనా వ్యూహాత్మక ఉద్దేశాలను తగిన రీతిలో అర్థం చేసుకోవాలనీ చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ, ఏ సమయంలోనూ ముందుగా అణ్వాయుధాలను ఉపయోగించరాదనే విధానానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రపంచ శాంతి, సుస్థిరత, సుసంపన్నతలను పరిరక్షించడంలో తమతో కలిసి పనిచేయాలని అమెరికాను కోరారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00